రావిపూడి రచనలు - సంపుటం - 9

# ఆదిశంకరాచార్య

## వ్యక్తిత్వం - తత్వం

AADI SANKARACHARYA : VYAKTITVAM - TATVAM

Cat-2074



హేమా పబ్లికేషన్స్

చీరాల - 523 155

# ఆదిశంకరాచార్య : వ్యక్తిత్వం - తత్వం

Most propositions and questions that have been written about philosophical matters are not false, but nonsensical. We cannot therefore answer questions of this kind at all, but only state their senselessness.

*__Wittgenstein : 'Tractus Logico-Philosophicus'*

## రావిపూడి రచనలు

1946 విశ్వాన్వేషణ
1949 జీవమంటే ఏమిటి ?
1951 శాస్త్రం-పురాణం
1953 మానవుడు-సమాజం-ప్రకృతి
1955 మార్క్సిస్టు భౌతికవాదం
1960 హ్యూమనిస్టు అర్థిక విధానం (అను.)
1964 భారతదేశం-గోపూజ (అను.)
1976 రాడికల్ హ్యూమనిజం
1977 నాస్తికత్వం-నాస్తితత్వం
1977 నాస్తికులున్నారు, జాగ్రత్త
1978 హేతువాదం
1978 హేతుత్వం-మతతత్వం
1979 ఇస్లాం-ఒక అంచనా
1979 భావవిప్లవం-వర్గచైతన్యం
1979 Life and Soul
1980 మార్క్సిస్టు వాస్తవికత
1980 ఎం.ఎన్. రాయ్-భారత కమ్యూనిజం
1980 ఫాసిజం (అను.)
1980 శాస్త్రం-మతం
1983 జ్యోతిష్యం శాస్త్రమా ?
1983 శంకరాచార్యుడి హత్య
1983 మార్క్సిస్టు గతి తర్కం(సం.)
1984 విశ్వతత్వం
1984 ఐన్‌స్టీన్ : మతం-దైవం
1985 హేతువాద వైఖరి
1985 హేతువాదం-అజ్ఞేయవాదం
1986 చార్వాకుల కథలు
1986 జ్యోతిష్యం శాస్త్రం కాదు(సం.)
1987 హేతువాద యుగకర్త-కవిరాజు
1987 గతితర్కం శాస్త్రీయమా ?
1987 ఎం.ఎన్.రాయ్ దర్శనం(సం.)
1987 భావవిప్లవ వైతాళికుడు-కవిరాజు(సం.)
1987 చార్వాకుల చర్చ(సం.)
1987 డార్వినిజం-హేతువాదం(సం.)
1989 భౌతిక వాస్తవికవాదం
1989 Reason and Unreason
1990 తెలుగు సాహిత్యంలో హేతువాదం
1990 మానవవాదం-శాస్త్రీయదృక్పథం
1990 Rationalism
1990 Why Rationalism ?
1990 Why Diamat is Unscientific
1991 అయోధ్యలో ఆలయమా ?
1991 ఆదిశంకరాచార్య : వ్యక్తిత్వం- తత్వం
1991 హేతువాదం-మానవవాదం
1991 రినైజాన్స్
1991 హేతువాదమార్గం
1992 జీవం-ఆత్మ
1992 వివేకం-అవివేకం
1992 గతి తార్కిక భౌతిక వాదం శాస్త్రీయమా ?
1992 వైమనస్యత
1992 సత్తు-చిత్తు
1992 కళ-శాస్త్రం-తత్వం-హేతువాదం
1992 వైదికఛాందసం-మత పునరుజ్జీవన ప్రమాదం
1992 సెక్యులరిజం-శాస్త్ర ప్రపంచం
1993 శాస్త్రం - అశాస్త్రం
1994 సత్యాన్వేషణ
1994 స్వామినేని హితసూచని
1994 సెక్యులరిజం-హ్యూమనిజం
1994 అడుగుజాడలు
1995 బైబిలు గణాచారం
1995 అయోధ్యలో ఆలయరాజకీయం
1995 మతజాడ్యాల మచ్చుతునకలు
1996 కార్యకారణత-నియతివాదం-మానవవాదం
1996 హేతువాదం-నైతిక విప్లవం
1996 కవిరాజు పీఠికలు( అనువర్తన)
1997 బైబిలు సృష్టివాదం
1997 కమింటరన్‌లో ఎం.ఎన్. రాయ్
1997 కర్మవాదం-నియతివాదం-స్వేచ్ఛావాదం
1998 మనం ఏమి చేయాలి ?
1999 వాస్తువు శాస్త్రమా ?(ప్రఫుల్లతో)
2000 మనుధర్మశాస్త్రం మానవ ధర్మశాస్త్రమా ?
2001 లయ-అవలయ
2001 మార్క్సిజం-హ్యూమనిజం
2002 నియతివాదం-అనిశ్చయసూత్రం
2002 మనదేశంలో పూర్వం విమానాలుండేవా?
2003 ఎం.ఎన్ రాయ్- రాడికల్ హ్యూమనిజం
2003 ఆం.ప్ర.లో హేతువాద మానవవాద ఉద్యమాల చరిత్ర(పియస్సార్‌తోకలిసి)
2004 మనుస్మృతి మైనస్ అశుద్ధం

రావిపూడి రచనలు : సంపుటం-9

# ఆదిశంకరాచార్య: వ్యక్తిత్వం - తత్త్వం


## రావిపూడి వెంకటాద్రి






**హేమా పబ్లికేషన్స్**

చీరాల - 523 155.

# AADISANKARACHARYA : VYAKTITVAM - TATVAM

by : Ravipudi Venkatadri

9393
Cat-2079

తొలిముద్రణ : ఏప్రిల్, 1991

మలిముద్రణ : డిసెంబర్, 2004

294.36
వెంక - ఆదిశం

© రచయితవి

సాదాప్రతి వెల : రూ. 100/-

మేలుప్రతి వెల : రూ. 125/-

కాపీలకు : **రావిపూడి వెంకటాద్రి**

ఎడిటర్, హేతువాది

చీరాల-523 155.

ఫోన్ : 08594-233403

టైప్ సెట్టింగ్ : మహేష్ ట్రేడర్స్, చీరాల. ఫోన్ : 234158

ముద్రణ : వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ. ఫోన్ : 2438324

ప్రచురణ : హేమా పబ్లికేషన్స్, చీరాల-523 155.

సుందరయ్య గ్రంథాలయ విజ్ఞాన కేంద్రం
A/C.No. 3446
గుజ్జరి, హైదరాబాద్-500032

# -: మా మాట :-

మత సాహిత్యం ఎంత ఉందో మన అంచనాకు అందదు. ఒకప్పుడు సాహిత్యమంతా అదే. అంతగా కాకపోయినా, కొంతగానయినా, ఇప్పటికీ ఆ వరవడి సాగుతోంది. దానితో పోల్చుకుంటే, హేతువాద - అభ్యుదయ సాహిత్యం అందులో బహుశతసహస్రాంశమైనా ఉండదు. హిందూ మతమౌలిక సాహిత్యమంతా సంస్కృత భాషలో ఉంది. దానికి లేనిపోని అర్థాలు కల్పించి మత పునరుజ్జీవన వాదాన్ని పోషించుకోవడం మతవాదుల వృత్తయింది. ఆధునిక విజ్ఞానంతో ఎంతో కొంత పరిచయమున్న ఛాందసులు మతవాఙ్మయంలో ఆధునిక విజ్ఞానాన్ని వెదకులాడు తున్నారు. ఆధునిక విజ్ఞానానికి సనాతన మత భావాలను పులుము తున్నారు. మరోప్రక్క రాజకీయనాయకులు అధికారం కోసం మతాన్ని సమర్థించే దుర్వ్యసనానికి పాల్పడుతున్నారు. మతాన్ని ఎదుర్కోవడానికి భయపడి దొంగ సెక్యులరిస్టు జపం చేస్తున్నారు. మతానికి రాజకీయం తోడుకావడంవల్ల, శాస్త్రీయదృక్పథానికి బదులు మత దృక్పదం ఎల్లెడలా మన్నన పొందుతోంది. మున్ముందు రానున్న ప్రమాదానికి ఇది సంకేతం.

సాహిత్యం భావప్రసారానికి చిరంతనమైన సాధనం. ఈ వాస్తవాన్ని హేతువాద, నాస్తిక, మానవవాద సంఘాలు సరిగా గుర్తించినట్లు కనిపించడంలేదు. గత శతాబ్దిలో ఎందరో ప్రముఖ రచయితలు తమ కలాలకు పదును పెట్టి, మతం పైన, సాంఘిక తారతమ్యాలపైన, మూఢనమ్మకాలపైన, మూఢాచార సంప్రదాయాలపైన ఘాటైన విమర్శలు గుప్పించారు. గ్రంథాలు ప్రచురించారు. పత్రికలు సైతం గతంలో ఆ వైఖరినే ప్రదర్శించాయి. మతవాదం వెనకడుగు వేసినట్లు భ్రమలు కల్పించింది. క్రమక్రమంగా ఆ పరిస్థితి మారింది.

కాగా, ఇప్పుడు గ్రంథాల సంగతి అటుంచి, పత్రికలను సైతం సమర్థవంతంగా నడుపుకోలేని దశ హేతువాద, నాస్తిక, మానవవాద సంఘాలను ఆవహించింది. అయినా, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం రెండు దశాబ్దాలపైకాలం నుండి "హేతువాది" మాస పత్రికను క్రమం తప్పకుండా నడుపుకొంటున్నది. సాహిత్య ప్రచురణకోసం "హేమా పబ్లికేషన్స్" స్థాపించుకుంది. క్రమక్రమంగా ఉత్తమ హేతువాద సాహిత్యాన్ని ప్రచురిస్తున్నది.

వివిధ కోణాలలో రావిపూడి వెలువరించిన సాహిత్యంలో చాల గ్రంథాలు ఇప్పుడు దొరకడం లేదు. అప్రచురితాలింకా చాలా ఉన్నాయి. వాటినన్నింటినీ విషయాల క్రమంలో 15 సంపుటాలుగా తీసుకురావడం హేతువాద ఉద్యమాభివృద్ధికి అవశ్యకమని మేము భావిస్తున్నాము. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడిన కార్యక్రమం. అయినా, హేతువాద, హ్యూమనిస్టు మిత్రుల, అభిమానుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని సాధించగలమని విశ్వసిస్తున్నాము. ఆ క్రమంలో సిద్ధాంత చర్చచేసిన రావిపూడి రచనలు: సంపుటం - 1 "హేతువాదం" వెలువరించాము. అనంతరం రా॥ర॥ సంపుటం - 10గా "మనుధర్మాల కౌటిల్యం", రా॥ర॥సంపుటం-9గా "ఆదిశంకరాచార్య:వ్యక్తిత్వతం-తత్వం" వెలువరిస్తున్నాము. ఆర్థిక వెసులుబాటు లభించిన తరువాత ముందుగా సిద్ధాంత చర్చ చేసిన "మానవవాదం" "నాస్తికవాదం", "మార్క్సిజం" పై మూడు సంపుటాలను తీసుకురావడానికి సంకల్పించాము.

- హేమా పబ్లికేషన్స్

# రావిపూడి రనలు - వెలువడిన సంపుటాలు

1. హేతువాదం - సంపటం నెం. 1
2. మనుధర్మాల కౌటిల్యం - సంపుటం నెం. 10
3. ఆదిశంకరాచార్య - వ్యక్తిత్వం - తత్వం - సంపుటం నెం. 9

# విషయసూచిక



| | | |
|---|---|---|
| | బ్రహ్మ కషాయం | 1 |
| | మామాట | 3 |
| | ఎందుకీ రచన ? | 5 |
| 1. | కథా - క్రమామిషు | 9 |
| | శంకరుడేమేమి చేశాడంటున్నారు ? | 10 |
| | శంకరుడేమిగా మనకు తేలతాడు ? | 13 |
| | వ్యక్తిగత విమర్శ–వ్యక్తిత్వ విమర్శ | 14 |
| 2. | బ్రహ్మకషాయం | 16 |
| | బ్రహ్మలింగం | 18 |
| | గోసాయి వేషం | 20 |
| | భజగోవిందసారం | 24 |
| | భజన కవిత్వం | 26 |
| 3. | సర్వం ఖల్విదం బ్రహ్మ | 29 |
| | ఇదేనా సర్వం బ్రహ్మమయం ? | 30 |
| | శంకరుడి కులతత్వం | 32 |
| | మాజీ రాష్ట్రపతి వర్ణచిత్రాలు | 33 |
| | స్త్రీ జాతిపై విద్వేషం | 35 |
| 4. | పరకాయ ప్రవేశం | 38 |
| | పరకాయ శంకరం | 41 |
| | శంకరుడికే విశ్వాసం వుంది | 43 |
| | శంకరమతాధిపతి చెప్పిన కథ | 44 |
| | ఈ కథ ఏమి చెపుతోంది ? | 46 |
| 5. | బౌద్ధంతో ప్రత్యక్ష వైరం | 50 |
| | ప్రణాళికాబద్ధమైన దాడి | 52 |
| | బౌద్ధ నిర్మూలన ఎలా జరిగింది ? | 54 |
| | శంకరుడి గానుగాయణం | 60 |
| 6. | స్వప్నమాయే యథాదృష్టే.... | 63 |
| | సంకరాద్వైతం | 67 |
| | శంకరుడి కాపీలు | 68 |
| | విపరీతార్థాలు | 71 |
| 7. | ఇప్పుడు బ్రహ్మన్ని ఎక్కడ పెడదాం ? | 75 |
| | కల–వాస్తవం | 79 |

| | |
|---|---|
| బ్రహ్మం లేదు | 81 |
| శ్రుతత్వాశ్చ అంటే ఖండన అవుతుందా ? | 84 |
| సాంఖ్య భౌతికవాదం పైన అస్త్రాలు | 85 |
| వైశేషికంపై విద్వేషం | 89 |
| చార్వాకంపై కుతర్కం | 90 |
| 8. అద్వైతం శంకరుడిదా, గౌడపాదుడిదా ? | 92 |
| ప్రచ్ఛన్న బౌద్ధం ? | 102 |
| తాత్విక క్షయ | 108 |
| 9. చరిత్రలో మొదటి భావవిప్లవం | 110 |
| రివైవలిస్టు పన్నాగాలు | 111 |
| అభినయ శాంకరం | 113 |
| ప్రపంచంలో తొలి ఫాసిస్టు వ్యవస్థ | 116 |
| వదలని పీడ | 119 |
| వీడని నీడలు | 120 |
| 10. రినైజాన్స్ | 127 |
| రెండవ రినైజాన్స్ | 130 |
| శంకరైజాన్స్ | 131 |
| రినైజాన్స్ అంటే..... | 136 |
| అనుబంధాలు : | 138 |
| ఒక్కమాట | 138 |
| శంకరాచార్యుడి హత్య | 139 |
| జనన సమాచారం | 140 |
| మరణ సమాచారం | 144 |
| శంకరుడేమైనట్లు ? | 146 |
| మనీషా పంచకం కథ | 147 |
| చెప్పేవాడికే అర్థం కాని అద్వైతం | 150 |
| శంకరాచార్యుడి శీలం | 153 |
| వీరేశలింగం చెప్పిన కథ | 154 |
| సామూహిక హత్యలు | 157 |
| శంకరుడి దండయాత్రలు | 158 |
| అజీర్ణం చేసిన అరువు సిద్ధాంతం | 159 |
| అభూత కల్పనలు | 161 |
| వ్రాతలు-చేతలు | 163 |

మాది పెద్ద రైత్వారీ ఉమ్మడి కుటుంబం. మా కుటుంబీకులు పండగలకు పబ్బాలకు ఆచార సంప్రదాయాలు పాటించేవారయినా, వారికి మతమంటే ఏమిటో, తామే మతానికి చెందినవారమో తెలియదు. వారంతా–ఆడ, మగా తేడాలేకుండా అందరూ–కృషీవలులే. మా పొలాల పనుల్లో బీదవర్గాలవారు–ముఖ్యంగా అంటరానివారుగా పరిగణించబడే మాల, మాదిగలు–కూలీలుగా పని చేస్తుండేవారు. అందరినీ అక్క, అన్న, బావ, మామ, బాబాయి, పిన్నిలాంటి వరసలతో పిలిచే అలవాటున్న మా కుటుంబీకులెవ్వరూ అస్పృశ్యత పాటించేవారు కాదు. ఆ నేపథ్యంలో ఆ బహు కుటుంబంలో పెరిగినవాడే మా పెద్దన్నయ్య

**రావిపూడి తిరుపతిరాయుడు.**

మతాచార సంప్రదాయాలన్నా, మూఢ నమ్మకాలన్నా ఆయనకు గిట్టేదికాదు. క్రమంగా నాస్తికుడుగా పరిణతి చెందాడు కాని, ఆయన నిశ్శబ్ద నాస్తికుడు. హేతువాద, మానవవాద ఉద్యమాలంటే ప్రీతి. ఆ ఉద్యమాల్లో నేను చేస్తున్న కృషికి ఆయన ఎంతో ఆనందించేవాడు. నానుంచి మరెంతో హేతువాద, మానవవాద సాహిత్యాన్ని ఆశించేవాడు. ఎంతో కుతూహలంతో నా రచనలన్నీ చదువుకునేవాడు. దాదాపు 88 సంవత్సరాలు జీవించి, చివరి క్షణందాకా కృషి చేస్తూనే 1998 అక్టోబరు 31న కాలధర్మం చెందాడు. ఆయన స్మృతికి ఈ రచన మరణానంతర జ్ఞాపిక.



**రావిపూడి తిరుపతిరాయుడు**

# బ్రహ్మ కషాయం

శంకరాచార్యుడి తర్వాత ఈ 1200 సంవత్సరాల నుంచి బహు జనశాంకరులు తీసిన బ్రహ్మకషాయం పులిసి పోయిందని భావించి, నయాశాంకరులు కొందరు ఈ మధ్య సరికొత్త బ్రహ్మకషాయం దించడానికి గోచులు బిగించారు. దాన్ని వాళ్లు తాజా రినైజాన్స్ పానీయంగా అంగట్లోకి దించాలని చూస్తున్నారు.

*　　　*　　　*　　　*

అసలు బ్రహ్మకషాయం దించడం శంకరుడితో ప్రారంభమైందనీ, ఆ పని పూర్తిచేయడానికి ఆయనకు కాలం చాలనందువల్ల శంకరుడు మిగిల్చిపోయిన పనిని పూర్తిచేయడానికిప్పుడు తాము రంగంలోకి దిగామనీ ఈ నయాశాంకరుల వాదం. శంకరుడి తర్వాత 12 శాతాబ్దుల్లోనూ వీరు గోదాలోకి దిగేదాక మరెవ్వరూ నికాళౌసైన బ్రహ్మకషాయాన్ని దించలేకపోయారనే అహంకారధ్వని వీరి పలుకులో వుంది.

*　　　*　　　*　　　*

శంకరుడి ' అహంబ్రహ్మోఽస్మి ' భజన విన్న బైరాగులు ' నేనే బ్రహ్మమురా, పామరులార ' అని బజారున పడడంతో అహంకారం బలిసిపోయిందని అనుమానించిన రామానుజాచార్యుడు విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించాడని రామానుజ మతస్థులు చెపుతారు. బ్రహ్మంలో పవరున్నా లేకపోయినా, అది బ్రహ్మవాదుల్లో పొగరు నింపిందనే అంశం వారి పలుకుల్లో ధ్వనిస్తుంది.

## 2

ఈ బ్రహ్మం పిచ్చవాళ్లలో కొందరికి 'నోటి వాపోటం' హెచ్చు. తమకు తాము దశావతారాలెత్తడంతోపాటు, బ్రహ్మాన్ని శతావతారాలెత్తిస్తారు. ఆ శతావతారబ్రహ్మం హేతువాదులకు అర్థం కాలేదనీ, బ్రహ్మ సత్యం అన్న వాక్యం వింటే హేతువాదులకూ, భౌతికవాదులకూ నాలుగుముఖాల బ్రహ్మ కట్టెదుట కన్పిస్తాడనీ, దానితో భయవిహ్వాలురై గట్టిగా కళ్ళు మూసుకొని 'బ్రహ్మ లేడు, బ్రహ్మలేడు' అని జపం ప్రారంభిస్తారనీ పరాచికాలాడతారు. బ్రహ్మ బురదలో అంత సీరియస్‌గా కూరుకుపోయిన బ్రహ్మీశాబకాలు హాస్యమాడగలరంటే ఆశ్చర్యం కల్గుతుంది. రికగ్నిషన్ కాంప్లెక్స్ ఎన్ని వేషాలైనా వేయిస్తుంది. ఏమి కూతలయినా కూయిస్తుంది.

*    *    *    *

ఘటంబింద్యాత్, పటంచింద్యాత్ కుర్యాద్వా
గార్ధభస్వరం ఏనకేన ప్రకారేణ ప్రసిద్ధః పురుషోభవేత్

— అన్నట్లు ప్రసిద్ధులు కావడం కోసం కొందరు కుండలు పగలగొడతారు, బట్టలు చింపుకుంటారు, గాడిదల్లా కూస్తారు. ఎలాగైతేనేమి, పదుగురి దృష్టిలో పడడమే వారి ధ్యేయం.

# మా మాట

భావవిప్లవంకోసం, ఎచ్చులొచ్చులులేని సాంఘికన్యాయంకోసం తన జీవితాన్ని ధారవోసిన మేటి సంఘసంస్కర్త కవిరాజు త్రిపురనేని పేరిట ఒక ట్రస్టును క్రింది ఆశయాలతో నెలకొల్పాం.

1. మేధావి, హేతువాది, రచయిత, సంఘ సంస్కర్త కవిరాజు త్రిపురనేని రామస్వామిగారు మానవాళికి అందించిన సేవను సదా గుర్తునందుంచుకొనటం.

2. ఆయన భావాలనూ, తత్వాన్నీ విస్తరింపజేయటం.

3. భావవ్యాప్తికి అవసరమైన అవగాహనకొరకు పరిశోధన కొనసాగించేందుకువలసినచర్యలు గైకొనటం.

4. శాస్త్రీయ దృక్పథంతో సమకాలీన విజ్ఞానాన్ని పెంపొందించే మతాతీతమైన,హేతుబద్ధమైన, మానవీయ సిద్ధాంతాల పురోగతికి వలసిన పరిశోధనా సంపత్తిని ప్రోదిచేయటం.

5. వ్యక్తులకు తమపైతమకు విశ్వాసం నిలిచేటట్లు చూడటం ; వ్యక్తి గౌరవానికి భంగంవాటిల్లకుండా చూడటం ; స్వయం పోషకత్వాన్ని పెంపొందించి వ్యక్తి ఔన్నత్యాన్ని నిలబెట్టటానికి కృషిసల్పటం.

6. నిర్మాణాత్మక పునరుజ్జీవ తత్వాన్ని పెంపొందించి మానవ మనుగడకు,పెరుగుదలకు,కావలసిన సాంస్కృతిక వాతావరణాన్ని నెలకొల్పటం.

7. మతాతీత, మానవతావాద, హేతువాద సూత్రాలపై మనుగడ సాగించడంద్వారాచితికిపోయిన వారికి చేయూతనివ్వటం.

8. మతాతీత, మానవతావాద, హేతువాద సూత్రాలపై మనుగడ సాగించే సంఘసేవకులకు, పండితులకు సహాయసహకారాలనందించటం.

9. సక్రమమైన విద్యను అందించటం.

10. కవిరాజు వెలిగించిన జ్ఞానజ్యోతిని, ఆ వెలుగుబాటలో పయనిస్తున్న, పయనించిన వారి భావాలలోని సత్యాన్వేషణకు సంసిద్ధులయ్యే వారికి పారితోషికాలు, ఉపకార వేతనాలు అందించటం.

11. మతాతీత, మానవీయ, హేతువాద కృషిలో తమదైన ఒక చెరగని ముద్రవేసినవారిని గుర్తించి సత్కరించటం.

12. కవిరాజు రచనలు తెలుగులో పునర్ముద్రించటమేగాకుండా ఇతర భాషలలోకి అనువదింపజేయటం, వాటిని ప్రచురించి పంపిణీచేయటం.

13. ఆలోచనను పెంపొందించే సాహితీమూర్తి ఏ భాషకు చెందినవాడైనా ఆయన రచనలు ముద్రించి, ప్రచురించి పంపిణీచేయటం.

14. మతాతీత, మానవీయ, హేతువాద దృక్పథాన్ని పెంపొందించే ఏ రకమైన కృషినైనా విస్తరింప జేసేందుకు వలసిన చర్యలు గైకొనటం.

"శాస్త్రములనెల్లజదివి, విజ్ఞానమెఱిగి
సంశయింపక సర్వదా చర్చజేసి
నిజమెఱుంగ వలయు నిదినేర్వకున్న
మూఢవిశ్వాసమునజేటు మూడుచుండు"

సంఘశ్రేయస్సును కాంక్షించి కవిరాజు చెప్పిన మాట యిది. నాగండ్ల గ్రామంలో 1943 లో కవిరాజాశ్రమం నెలకొల్పి కవిరాజు భావవిప్లవతత్వ ప్రచారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్న ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రిగారి రచన "ఆది శంకరాచార్య: వ్యక్తిత్వం–తత్వం" వెలుగు చూసేందుకు మా వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాం.

ఈ రచనలో వెంకటాద్రిగారి హేతువాద పటిమ, శాస్త్రీయ దృక్పథం అడుగడుగునా దర్శనమిస్తాయి.

మత మౌఢ్యాన్ని నిర్మూలించ నడుం బిగించిన వెంకటాద్రిగారికి అందరూ చేయూత నీయవలసిన అవసరం ఎంతైనా వుంది.

కోటపాటి మురహరిరావు
మేనేజింగ్‌ట్రస్టీ
కవిరాజు త్రిపురనేని ట్రస్టు

హైదరాబాదు,
24-3-91.

# ఎందుకీ రచన ?

ఈ దేశంలో ఒక వర్గం మేధావుల్లో విచిత్రమైన ప్రకృతి వుంది. నందిని పందిగా, పందిని నందిగా వర్ణించడం వారి ప్రవృత్తి. అది జ్ఞానాంధత్వంవల్ల చేస్తున్నారో, లేక దురుద్దేశంతో చేస్తున్నారో మనం చెప్పలేము కాని, ఆస్తికులు–నాస్తికులు, మిధ్యావాదులు–పదార్థవాదులు, భావవాదులు–భౌతికవాదులు, జాతివిచక్షణవాదులు –సమతావాదులు, అభ్యుదయనిరోధకులు–అభ్యుదయసాధకులుగా రెండు వర్గాలుగా ద్వివిభజన చేయబడినవారిలో మొదటివారి లక్షణాలను రెండవవారికీ, రెండవవారి లక్షణాలను మొదటివారికీ అపాదిస్తారు; ఇందులో మొదటివర్గంవారి లక్షణాలన్నీ ఆదిశంకరాచార్యుడిలో వున్నాయి. కాని, కొందరు నయాశాంకరులు రెండోవర్గం వారి లక్షణాలన్నీ శంకరుడిలో వున్నట్లు తలక్రిందులుగా ప్రచారం చేస్తున్నారు.

1983 నవంబరులో హేతువాది వ్యాసవాణి సిరీస్‌లో "శంకరాచార్యుడి హత్య" అనే 40 పేజీల చిన్నపుస్తకం ఒకటి నేను వెలువరించాను. (చూడు: అనుబంధం) అందులో"శంకరాచార్యుడి హత్య", "శంకరాచార్యుడి శీలం" అనే రెండు వ్యాసాలున్నాయి. ఆ వ్యాసాల్లో నేను వెల్లడించిన భావాలపై 1987లో ప్రచురించబడ్డ "జగత్‌సత్యం - బ్రహ్మమిథ్య"* అనే గ్రంథంలో కొన్ని అసందర్భ వ్యాఖ్యలున్నాయి. వాటికి సమాధానంగా 1987 డిశంబరు నుండి 1988 జూన్ వరకు "హేతువాది"లో ధారావాహికంగా "శంకరుడి బ్రహ్మకషాయం" పేరుతో ఒక సుదీర్ఘవ్యాసం వెలువడింది. అనంతరం అద్వైతంమీద 1989 అక్టోబరులో, ప్రచ్ఛన్నబౌద్ధంపై 1990 జనవరిలో మరో రెండు వ్యాసాలుకూడా అదే పత్రికలో వెలుడినై. 1989 జులైలో శంకరాచార్యుడి కథాకమామిషు వెలువడింది. అవి అన్నీ కలిసి కొద్ది సవరణలతో ఈ పుస్తకరూపం ధరిస్తున్నది.

పైన పేర్కొన్న "జగత్‌సత్యం–బ్రహ్మమిథ్య"లోని అనుచిత వ్యాఖ్యల్ని కొన్నిటిని క్రింద పొందుపరుస్తున్నాను గమనించండి :

బ్రహ్మసత్యం అన్న వాక్యం వినగానే చాలమంది హేతువాదులకూ, భౌతికవాదులకూ చతుర్ముఖ బ్రహ్మ కట్టెదుట నిలుస్తాడు.

దానితో వాళ్లు భయవిహ్వలులై గట్టిగా కళ్లుమూసుకొని 'బ్రహ్మలేదు,బ్రహ్మలేదు' అన్న జపం ప్రారంభిస్తారు.

అద్వైతంలోని బ్రహ్మకూ, భౌతికవాదంలోని మూలపదార్థానికీ తేడా లేదు.

కనుకనే బ్రహ్మన్ని బ్రహ్మపదార్థమంటారు.

---

*గుత్తా రాధాకృష్ణ : జగత్‌సత్యం–బ్రహ్మమిథ్య ; భౌతికవాద ప్రచురణలు, పుష్పగిరి

తెలిసీ తెలియని హేతువాదులు బ్రహ్మశబ్దాన్ని తప్పుదారి పట్టించారు.

పదార్థ, వస్తువుల సంబంధం ఎలాంటిదో బ్రహ్మ-జగత్తుల సంబంధం అలాంటిదే.

వాటి నియతార్థంలో 'బ్రహ్మసత్యం-జగన్మిథ్యా' అన్న వాక్యం యదార్థం కాకపోదు. మూలమైన బ్రహ్మపదార్థం పంచేంద్రియాలద్వారా మనస్సుకు యీ జగత్తుగా ఎలా, ఎందుకు కన్పిస్తున్నదో భౌతికశాస్త్రవేత్తలకు కూడా అంతుపట్టని విషయం.

మా-యా అంటే అది అదికాదని అర్థం. కాన, దానికి కల్పితార్థాలను అంటగట్టి ఆధునికులమనుకునేవారు అద్వైతాన్ని అపహాస్యం చేయబూనటం వెకిలితనమవుతుంది.
అగోచరమైన భౌతికపదార్థం నానారూప జగత్తుగా దర్శనమిచ్చేట్లు చేస్తున్న ఉపకరణాన్నిగూర్చి భౌతికవాదులు ఆలోచించినట్లు కన్పించదు.

దానికి అద్వైతం 'మాయ' అని పేరు తగిలిస్తే, అందులో ప్రమాదమేమిటో అర్థం కావటం లేదు.

మాయావాదం ఎంతో హేతుబద్ధమైన ప్రతిపాదన.

ఈశావాస్యం మనోదేహాల మధ్య అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నది. అలాంటి అద్వైతాన్నే ఆధునికతత్వశాస్త్రం నెలకొల్పుతున్నది.

మనకు వికాసం కావాలంటే, పూర్వం యీ దేశంలో వున్న వికాసస్థాయికి మనం పోవాలి. అదే పునర్వికాసానికి అర్థం.

శంకరుడు ఆయా భావాలను క్రమబద్ధం చేసి, ఒక సమన్వయ సిద్ధాంతాన్ని రూపొందించిన ఘనుడు.

అది బౌద్ధాన్ని పోలి వుండడంతో దానిని ప్రచ్ఛన్నబౌద్ధమన్నారు.
బౌద్ధంపట్ల ప్రేమ ఒలకబోసేవాళ్ళు అద్వైతంపట్ల ఎందుకంత ద్వేషం ప్రదర్శిస్తారో అర్థంకాదు.

శంకరుడు సర్వసమతావాదాన్ని రూపొందించాడు.

అలాంటి వాడికి సర్వసమతావాదులైన బౌద్ధుల్ని గానుగల్లో వేసి రుబ్బించేటంతటి క్రూరత్వాన్ని అంటగట్టడం దుష్టబుద్ధుల కుట్ర.
శంకరుడు సాంఘిక విప్లవకారుడు.

అలాంటి శంకరుడు ఈ కాయమే లేదన్నాడు.

శంకరుడు పరకాయప్రవేశం చేయటాన్ని ఖండించాలన్న బుద్ధి హేతువాదులకు లేదు. శంకరుడు నృసింహ స్తోత్రం చేశాడనటాన్ని ఖండించని హేతువాదులకు కనీసంగానైనా బుద్ధిలేదు.

ఆధునిక జిజ్ఞాసువులు కొందరు సంప్రదాయ విశ్వాసాలు కల్పించిన మాయాజాలంలో చిక్కుకొని బాధ్యతారహితంగా ప్రవచించడం, రచించడం హేతువాదం కాదు, భౌతికవాదం కాదు, మానవవాదం అంతకన్నా కాదు.

శంకరుని వేషాన్ని గూర్చి విసుర్లు విసిరేవారంతా ఇంచుమించు హేతువాదులమని అనుకొంటున్నవారే.

శంకరుడి వేషం, గౌతమ బుద్ధుడి వేషం ఒక్కటే.

మాధ్వులు శంకరుడి ముఖం మీద బొట్టు ప్రవేశపెట్టారు.

శంకరుడు జ్ఞానికాన, ఆయన మీద శైవ, వైష్ణవాల ప్రభావం లేదు.

శంకరుడు బోడినెత్తి, కాషాయాంబరాలు బౌద్ధుల నుంచి గ్రహించాడు.

కపిలుని సాంఖ్య దర్శనాన్ని తీసుకొని శంకరుడు తన అద్వైతబోధను అభివృద్ధి చేసుకున్నాడు.

ఆధ్యాత్మికవాదంలోని తప్పులను శంకరుడు గుర్తించాడు కనుకనే, అతడిని ప్రచ్ఛన్నబౌద్ధుడన్నారు.

శంకరుడు మరికొంతకాలం బ్రతికివుంటే, పూర్తి బౌద్ధ భౌతికవాదిగా మారివుండేవాడు.

శంకరుడు ఆస్తికుణ్ణని చెప్పుకుంటూనే ఆస్తికవాదంపై తిరుగుబాటు చేసాడు.

అభినయశాంకరులు, నయాశాంకరులు వ్రాసిన వ్యర్థవాక్యాలను మరికొన్నిటిని కూడా కోట్ చేయవచ్చు. హేతువాదులపై, మానవవాదులపై వారు వేసిన అపనిందలమీద, కూసే అబద్ధాలమీద, చేసే ప్రచ్ఛన్న రివైవలిస్టు ప్రచారంమీద, విమర్శ ఘాటుగా వుండక తప్పదనే అంశాన్ని పాఠకులదృష్టికి తేవడానికే పైవాక్యాలను కోట్ చేయవలసివచ్చింది.

శంకరుడికి ఏయే బిరుదులు తగిలిస్తే లోకాన్ని తేలికగా మోసంచేయవచ్చునో వాటన్నిటినీ అయనకు తగిలిస్తూ శంకరుడు పదార్థవాది, భౌతికవాది, హేతువాది, నాస్తికుడు, సర్వసమతావాది, సాంఘిక విప్లవకారుడు అని కొనియాడారు. అయన బౌద్ధుడు మాత్రమే కాదు, సాంఖ్యుడుకూడా అన్నారు. అంతటితో ఆగక, చివరకు శంకరాద్వైతం, మార్క్సిస్టు తత్వశాస్త్రం రెండూ ఒక్కటేనన్నారు. అలా అనడంతో సరిపుచ్చుకోక ఈనాటి హేతువాదులు, భౌతికవాదులు, మానవవాదులు అజ్ఞానులనీ,వారికి శంకరుణ్ణి అర్థంచేసుకొనే సత్తాలేక 'వెకిలి చేష్టలు' చేస్తుంటారనీ,అవహేళనచేసారు. ఇది ఆది శంకరుడిమీది ప్రేమో, లేక అధునాతన హేతువాదులమీది ద్వేషమో అర్థం కావడంలేదు. అందువల్ల వారి వాచాలతకు సమాధానంగా ఆది శంకరాచార్యుడి వ్యక్తిత్వాన్నీ, తత్వాన్నీ పరిశీలించక తప్పటంలేదు.

రినైజాన్స్ అంటే పునర్వికాసమనీ, పునర్వికాసమంటే పాతను పునరుద్ధరించడమేననీ, ఉపనిషదాదుల్ని సమర్థించడమేననీ, నయాశాంకరులు జల్పించడంవల్ల ఈ వ్యాసాన్ని రినైజాన్స్‌తోనే ముగిస్తున్నాను. (10వ అధ్యాయం)

విమర్శకు ప్రతి విమర్శగా వ్రాసిన యీ వ్యాస పరివ్యాప్తి పరిమితమైనది. కాబట్టి, శంకరుడి తత్వాన్ని సాకల్యంగా పరిశీలించడానికి ఈ రచనను ఉద్దేశించలేదని చదువరులు గమనించగోరుతున్నాను.

ఈ నా పరిశీలనలో ఏమైనా పొరపాట్లు దొర్లివుంటే, నా దృష్టికి తీసుకురావలసినదిగా మనవిచేస్తున్నాను.

కాగా, ఈ పుస్తక ముద్రణను స్వయంగా చేపట్టిన “కవిరాజు త్రిపురనేని ట్రస్టు” వారికీ, ముద్రణ వ్యవహారాన్ని సమీక్షించిన ఉద్యమ మిత్రులు ప్రఫుల్ల చంద్రగారికీ కృతజ్ఞతలు, సెలవు.

రావిపూడి వెంకటాద్రి
అధ్యక్షులు
భారత హేతువాద సంఘం,
(ఎడిటర్ : హేతువాది)

కవిరాజాశ్రమం, నాగండ్ల
25 ఫిబ్రవరి 1991

# ఆది శంకరాచార్య : వ్యక్తిత్వం-తత్వం

## 1. కథా-కమామిషు

శంకరాచార్యుడి తల్లిదండ్రులెవరు ?
అతనెప్పుడు పుట్టాడు ? ఎక్కడ పుట్టాడు ?
ఏమేమి చేశాడు ? ఏమి వ్రాశాడు ?
ఎప్పుడు మరణించాడు ? ఎక్కడ మరణించాడు ? ఎలా మరణించాడు ?
అతని శవాన్ని ఏమి చేశారు ? పూడ్చిపెట్టారా ? దహనం చేశారా ? ఎక్కడ ?
అంత్యక్రియలు ఎక్కడ జరిపారు ? సమక్షంలో ఎవరున్నారు?
శ్రాద్ధం ఎవరు, ఎలా, ఎక్కడ పెట్టారు ? లేక శ్రాద్ధం జరగనేలేదా ?

ఇలాంటి ప్రశ్నలకు శంకర చరిత్రలుగా చెప్పబడే గ్రంధాలు ఏకముఖంగా సమాధానాలు చెప్పడంలేదు. ఇప్పటికీ ఆ ప్రశ్నలకు రూఢి అయిన సమాధానాలు లేవు. పురాణంగా తప్ప. చరిత్రను చరిత్రగా వ్రాయడానికి అలవాటు పడని భారతీయులు శంకరుడి చరిత్రను కూడా అభూత కల్పనలతో నింపివేశారు. దాన్ని చరిత్ర అనుకోవడానికే వీలు లేకుండా అలికివేశారు.

కాగా, శంకరుడు క్రీ॥శ॥ 788 లో పుట్టి, 820లో మరణించి వుండవచ్చునని కొందరు పాశ్చాత్య, భారతీయ చరిత్రకారులు, పరిశోధకులు తేల్చారు. వైదిక వాఙ్మయం మొదలు కావ్యాదులదాక అందినంతవరకు భారతీయ సాహిత్యాన్ని సేకరించి, చీకటినుంచి వెలుగులోకి తీసి పరిష్కరించి, తమ భాషల్లోకి అనువాదం చేసి, ఆ రచనల కాలాలను. రచయితల చరిత్రలను ఆరాతీసి, భారతీయులకు తొలిసారిగా పరిచయంచేసినవారు నిజానికి పాశ్చాత్యులే. వారి చారిత్రక పరిశోధనలో సాధ్యమైనంత సత్యనిష్ఠ, నిష్పాక్షికత కన్పిస్తుంది. మన చారిత్రకుల్లో చాలామందికింకా పురాణం గబ్బుపోలేదు. చరిత్రను నిష్పాక్షికంగా చూడటానికి మన వారికి కుల మత శాఖల దురభిమానాలు, సంకుచిత మానసిక సంస్కారం అడ్డువస్తాయి. అందువల్ల మన చారిత్రకులిప్పటికీ తెలుపును నలుపుగా, నలుపును తెలుపుగా చూపుతున్నారు. అలా తెలుపుగా ప్రదర్శితమైన నలుపుల్లో శంకరాచార్యుడి చరిత్రకూడా వుంది. దాన్ని జాగ్రత్తగా విశ్లేషించి చూస్తేకాని శంకరుడి కథా-కమామిషు బోధపడదు. అతని శీలం, కృషి, వ్యక్తిత్వం, స్వకీయ తత్వం వగైరాల నిజస్వరూపాన్ని అంచనా వేయబోయేముందు, ఈ దేశంలో భావతిరోగమన చరిత్రలో అతను నిర్వహించిన పాత్ర ఎంత కుత్సితమైనదో పరిశీలించబోయేముందు, అతని

జీవితాన్ని గురించి స్థూలంగానైనా తెలుసుకోవాలి. అందుకు ముఖ్యాధారం శంకరవిజయాల పేరుతో వెలసిన పురాణాలే. వాటి ప్రకారం శంకరుడి జీవిత ఘట్టాలు ఇలా వున్నాయి:

## శంకరుడేమేమి చేశాడంటున్నారు ?

శంకరుడు కేరళ రాష్ట్రంలో నంబూద్రి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. తల్లి గర్భంనుంచి ఆయన బయటపడకముందో, పడిన తరవాత కొద్దికాలానికో తండ్రి మరణించాడు.

ఐదోయేట శంకరుడికి ఉపనయనం జరిగింది. పిన్ననాడే గురుకులవాసంలో వేదవేదాంగపురాణేతిహాసాలను అధ్యయనం చేసాడు. ఆకాలంలోనే శంకరుడొక బ్రాహ్మణి యింటికి భిక్షకోసం పోగా, ఇంటిలో మరేమీ లేనందువల్ల ఆ గృహిణి ఒక ఉసిరికాయను భిక్షవేసింది. ఆమె పేదరికాన్ని గ్రహించిన శంకరుడు "కనకధారాస్తోత్రం" చేయగా ఆ యింటి ముంగిట బంగారు ఉసిరికాయల వర్షం కురిసింది. ఇది బాల శంకరుడి మహత్యం నంబర్–1.

శంకరుడి తల్లి ఒకరోజు పూర్ణానదికి స్నానంకోసం వెళ్ళివస్తూ దారిలో పడిపోయింది. అది గమనించిన శంకరుడు తన యోగ మహిమతో పూర్ణానదిని తన యింటి ముందుగా ప్రవహించేటట్లుగా చేసాడు. ఇది మహత్యం నెంబరు–2.

శంకరుడు తన యెనిమిదోయేట నదిలో స్నానం చేస్తుంటే, మొసలి ఒకటి ఆయన కాలు పట్టుకొన్నది. సన్యసించడానికి తనకు అనుమతిస్తే మొసలి వదలిపెడుతుందని శంకరుడు తల్లితో అన్నాడు. ఆమె అలానే అనుమతించింది. వెంటనే మొసలి శంకరుణ్ణి వదలి వెళ్లింది. ఇది మహత్యం నంబర్–3.

సన్యసించిన శంకరుడు గోవిందపాదుని వద్దకుపోయి, శిష్యరికం చేసి, అద్వైత వేదాంతవిద్యలో పండితుడైనాడు. ఒకనాడు గురువు ధ్యానముద్రలోవుండగా, కుంభవృష్టివల్ల రేవానది పొంగి పొర్లుతుంటే, శంకరుడు తన మంత్ర శక్తితో ఆ నదిలోని నీటిని మొత్తాన్నీ మట్టి ముంతలో పట్టివేశాడు. ఇది మహత్యం నంబర్–4.

అనంతరం గోవిందుని ఆదేశం ప్రకారం శంకరుడు కాశీ నగరం చేరాడు. దక్షిణాది నుండి వచ్చిన సనందనుణ్ణి శిష్యుడిగా స్వీకరించాడు. ఒకనాడు శంకరుడు గంగానది అవతలి ఒడ్డునవున్న సనందనుణ్ని ఇవతలి ఒడ్డుకు రమ్మని పిలిచాడు. అతను వెనకా ముందు చూడకుండా నదిలో నడక సాగించాడు. అద్భుతంగా అతని

పాదాల క్రింద పద్మాలుచేరి, అతను నీటిలో మునగకుండా ఈ దరికి నీటిపై నడిపించేందుకు తోడుపడినై. ఆ కారణంగా అతను పద్మపాదుడైనాడు. ఇది మహత్యం నంబర్–5.

కాశీలో వుండగా శంకరుడొకనాడు గంగాస్నానం చేసి తిరిగి వస్తుండగా శివుడు నాల్గువేదాలను వేటకుక్కలుగా మార్చుకొని చండాల వేషంలో యెదురైనాడు. శంకరుడతన్ని తొలగిపొమ్మన్నాడు. "అంతా బ్రహ్మమేనంటున్నావుకదా, ఈ శరీరాన్ని తొలగమంటావా, లోపలి చైతన్యాన్ని తొలగమంటావా!" అని చండాలుడు ప్రశ్నించాడు. దానితో తనకు అజ్ఞానం నశించి అద్వైత బ్రహ్మతత్వం అర్థమైందని "మనీషాపంచకం" పేరుతో శంకరుడు ఐదు శ్లోకాలు చెప్పాడు. ఆ వెంటనే "మాయాపంచకం" కూడా చెప్పాడు. ఇందులోశంకరుడు తానుగా చేసిన మహత్యం ఏమీలేకపోయినా, ఆయన జీవితంలో జరిగిన మహత్యంగా దాన్ని అద్వైతులు కొనియాడతారు. ఇంతకుముందు తనకు అర్థంకాకుండానే తాను ఇతరులకు బోధించిన అద్వైతం శంకరుడికిప్పుడు అర్థంకావడమే అద్భుతం. ఇందులో శివుడు చండాలుడిగా, వేదాలు కుక్కలుగా మారడం మరో అద్భుతం.

కాశీలో వుండగా శంకరుడు ప్రస్థానత్రయానికి భాష్యాలు వ్రాశాడు.ఆ తర్వాత కాశీ విడిచి విగ్రహాలు ప్రతిష్టించుకుంటూ హరిద్వారం, హృషీకేశం, బదరి, కేదారం మొదలైన హిమవత్ప్రాంతమంతా తిరిగాడు. అనంతరం వైదిక కర్మనిష్టుడైన కుమారిలభట్టును ఓడించడానికి బయలుదేరాడు. తాను ముసలివాణ్ణనీ, మండనమిశ్రుని ఓడిస్తే తనను ఓడించినట్లేననీ, కాబట్టి మండనుడి వద్దకు వెళ్ళి వాదించమనీ కుమారిలుడు సలహాయిచ్చాడు.

మండనమిశ్రుడి యింటికి వెళ్ళిన శంకరునిచూచి ఆ యింటి గుమ్మంలోని ఎనిమిది చిలుకలు శాస్త్రచర్చ ప్రారంభించడం శంకరుని ఆశ్చర్యచకితుని చేసింది. మండనుడు గృహద్వారాలన్నీ మూసివేసి, లోపల శ్రాద్ధక్రతువులో వున్నాడు. గోడలు దూకితేతప్ప, లోపలికి వెళ్ళడానికి వీలులేదు. ఇంతలో ఈడిగవాడొకడు మంత్ర ప్రభావంతో తాటిచెట్టును వంచి, కల్లు గీయడం కన్పించింది. ఈడిగవానికి బంగారం చేసే విద్యనేర్పి అతనివద్ద నుంచి శంకరుడు చెట్లనువంచే విద్య నేర్చుకొన్నాడు. మండనుడి దొడ్డిలోని కొబ్బరిచెట్టును వంచి, దానిమీదుగా యింటిలోనికి ప్రవేశించాడు.

మండనుణ్ణి శాస్త్రార్థంలో వాదానికి పిలిచి, అతని భార్య ఉదయభారతిని మధ్యవర్తిగా వుంచుకొని శంకరుడు శాస్త్రచర్చ చేశాడు. మండనుడి మెడలోని పూలదండ వాడిపోవడాన్నిబట్టి చర్చలో అతను ఓడిపోయాడని తేలింది. ఒప్పందం ప్రకారం మండనుడు ముండనం చేయించుకొని సన్యాసం స్వీకరించాలి. అందుకు ఉదయభారతి

అడ్డువచ్చి తనను కూడా కామశాస్త్ర చర్చలో గెలవమని కోరగా, శంకరుడు గడువడిగి, అమరుకుడనే రాజుశవంలో పరకాయ ప్రవేశం చేసి, అతని భార్యలు నూరు మందితో కామకేళిలో తేలి, ఆ అనుభవ జ్ఞానంతో ఉదయభారతిని కామచర్చలో ఓడించాడు. ఇందులోని విడ్డూరాలు చిలుకల శాస్త్రచర్చ, చెట్టును వంచే మంత్రాలు, బంగారం చేసే విద్య, వాదంలో వోటమికి పూలదండ వాడడం, పరకాయ ప్రవేశం. అంతేకాదు, ఓడిపోయిన ఉదయభారతి బ్రహ్మలోకానికి వెళ్ళబోతుంటే, శంకరుడామెను వనదుర్గా మంత్రంచేత బంధించాడు. ఆమె భూలోకంలో వుండిపోవడానికి ఒక షరతు విధించింది. దాని ప్రకారం, అతను వెనక్కి తిరిగి చూడకుండా వున్నంత కాలం ఆమె అతని వెంటబడి వస్తుంది. శృంగేరి ప్రాంతం చేరుకునేటప్పటికి ఆమె గజ్జెలరవళి విన్పించలేదు, ఆపై శంకరుడు వెనక్కు తిరిగి చూడగా అక్కడే ఆమె శిల అయిపోయింది. ఇదొక మహత్యం. ఇదే గాధలో మరొక మహత్యం కూడా వుంది. అమరుకుడి భార్యలు శవాలను దహింపజేయిస్తూ, శంకరుడి కళేబరాన్ని కూడా దహింపజేయించడం ప్రారంభించారు. అంతలో శంకరుడు అమరుకుడి కాయాన్ని వదలి నిజకళేబరంలో దూరాడు. అప్పటికే సగంకాలిపోయిన అతని కాళ్ళు లక్ష్మీనృసింహ స్తోత్రం చేయగా తిరిగి మొలిచాయి.

ఒకనాడు నాస్తికుడొకడు కరిగించిన సీసాన్ని తెచ్చి "అంతా బ్రహ్మమయం అంటున్నావు కదా, దీన్ని త్రాగండి" అన్నాడు. శంకరుడా సీసాన్ని గటగట త్రాగివేశాడు.

మరోసారి కాపాలికుడొకడు భైరవుడికి బలి యివ్వడంకోసం శంకరుడి శిరస్సు కావాలని కోరాడు. శిష్యులెవ్వరూ లేనప్పుడు అలానే తీసుకుపొమ్మన్నాడు శంకరుడు. శంకరుడు ఒంటరిగా ఉన్నప్పుడు అతని శిరస్సు ఖండించడానికి కాపాలికుడు రాగా, పద్మపాదుడీ విషయాన్ని దివ్యదృష్టి ద్వారా తెలుసుకుని, నరశింహావతారంలో ప్రత్యక్షమై కాపాలికుణ్ని సంహరించాడు.

శాక్తుడొకడు చేతబడిచేసి శంకరుడికి భగందర రోగం రప్పించాడు. పద్మపాదుడు ఎదురుచేతబడి చేసి, శాక్తుణ్ని సంహరించి శంకరుడి రోగాన్ని కుదిర్చాడు.

శంకరుడి తల్లి అవసాన దశలో వుండి శంకరుణ్ని స్మరించింది. అతను యోగ శక్తితో తల్లివద్దకు చేరి శివ భుజంగ స్తోత్రం విన్పించాడు. ఆమెను కైలాసానికి తీసుకుపోవడానికి శివభటులు వచ్చారు. వారితో పోవడానికి ఆమె ఇష్టపడలేదు. తరవాత శంకరుడు విష్ణుస్తోత్రం చేశాడు. విష్ణుదూతలు వచ్చి ఆమెను వైకుంఠానికి తీసుకుపోయారు. తల్లికి వైష్ణవంమీద, కొడుకుకు శైవంమీద భక్తి అని దీన్నిబట్టి అర్థంచేసుకోవలసి వస్తుంది.

సన్యాసి శ్రాద్ధం చేయడం శాస్త్ర సమ్మతంకాదు. అందువల్ల అక్కడి బ్రాహ్మలు శంకరుడి తల్లి శవాన్ని దహించడానికి స్మశానంలో చోటివ్వలేదు, నిప్పు యివ్వలేదు. శంకరుడు తన భుజాలు మథించి, నిప్పు పుట్టించి తన యింటి పెరట్లోనే శవదహనం చేశాడు. ఛాందసుల సహాయనిరాకరణకు కోపించి "ఇకపై నంబూద్రి బ్రాహ్మలు తమ పెరళ్ళలోనే దహనం చేసుకోవాలి, వారి యిళ్ళలో సన్యాసులు భిక్షచేయరు" అని శంకరుడు శపించాడు. నంబూద్రి బ్రాహ్మల్లో ఆ ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది.

పసితనంనుంచి మందమతిగా, మూగగా వున్న ఒక బిడ్డను ఆ బిడ్డ తండ్రి శంకరుడి వద్దకు తీసుకుపోయాడు. శంకరుడా బిడ్డను "నీవెవరవు" ? అని ప్రశ్నించాడు, వెంటనే ఆ బిడ్డడు తాను చిదానందజ్యోతిని అంటూ డజను శ్లోకాలు చెప్పాడు. అలా చెప్పినవాడే శంకరుడి శిష్యుడై, హస్తామలకుడైనాడు.

గిరి అనే మందమతి శిష్యుణ్ని అతని సహాధ్యాయులంతా హేళనచేస్తుండేవాళ్ళు. శంకరుడతనికి తోటకవృత్తం నేర్పి జ్ఞానిని చేశాడు. అతడే శంకరుడి శిష్యుడైన తోటకాచార్యుడు.

సుధన్వుడనే ఉజ్జయిని రాజు తోడురాగా, శంకరుడు శిష్యులతో కలసి అద్వైత సిద్ధాంత ప్రచారం కోసం దిగ్విజయ యాత్రలు చేశాడు. శాక్తుల్ని ఓడించాడు. భైరవుల్ని ఓడించాడు. కాపాలికుల్ని తుడిచిపెట్టాడు. గోకర్ణంలో శైవాచార్యుడైన నీలకంఠుణ్నీ, ద్వారకలో వైష్ణవుల్నీ, ఉజ్జయినిలో భట్టభాస్కరుణ్నీ ఓడించాడు. తూర్పున పూరీజగన్నాథంలో, దక్షిణాన శృంగేరిలో, పడమర ద్వారకలో, ఉత్తరాన బదరీలో పీఠాలను స్థాపించి వాటికి వరుసగా హస్తామలకుణ్ణి, సురేశ్వరుణ్ణి(మండనుడు), పద్మపాదుణ్ణి, తోటకాచార్యుణ్ణి పీఠాధిపతులుగా నియమించి- వర్ణాశ్రమాచార ధర్మాలను కాపాడడానికి వారికి బాసటగా, ధర్మరక్షకుడిగా సుధన్వుణ్ణి నియమించాడు.

చివరకు కాశ్మీరు వెళ్ళి సర్వజ్ఞపీఠం అధిష్ఠించాడు. ఆ తరవాత శంకరుడేమైందీ చెప్పడానికి వీలులేనన్ని కట్టుకథలు వ్యాపించినై.

ఇదీ స్థూలంగా శంకరుడి కథ. శంకర విజయాల కథనం.

## శంకరుడేమిగా మనకు తేలతాడు ?

ఇందులో కల్లబొల్లి కథలన్నిటినీ తీసివేస్తే ఇక శంకరుడి చరిత్రగా చెప్పుకోడానికి మిగిలేదేమీ లేదు. మిగిలినదైనా యథాతథంగా నిజమనుకోడానికి వీలులేదు.

శంకరుడు కరుణామయుడనికానీ, సజ్జనుడనికానీ, నీతివంతుడనికానీ రుజువు

చేయగల సంఘటన ఒక్కటీ అతని కథలో కన్పించదు. అహింసాపరుడనడానికిగానీ, శీలవంతుడనడానికికానీ ఒక్క తార్కాణం అతని చరిత్రలో కన్పించదు. అందుకే అతని చప్పటి కథను మహత్యాలతో నింపేశారు. చివరకు గోడలు దూకి యింట్లో జొరబడాన్ని కూడా మహత్యంగా చిత్రీకరించారు. వాగ్వివాదంలో శంకరుడు ఓడించినట్లు చెప్పబడిన వారిలో వైదికకర్మనిష్ఠులు తప్ప, ప్రసిద్ధ దార్శనికులెవ్వరూలేరు. ఆయన ఢీకొన్నట్లు పేర్కొనబడ్డ దార్శనికుల్లో కొందరు ఆయన సమకాలీనులనడానికి కూడా నిర్ధారణపూర్వకమైన ఆధారాలు లేవు.

శంకరుడి చేష్టలు అతన్ని అద్వైతి అని రుజువు చేయజాలవు. ఆయన అనేక దేవాలయాలు దర్శించాడు, విగ్రహాలను పూజించాడు, కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించాడు, పాత విగ్రహాలకు పునః ప్రతిష్ఠలు చేశాడు. మఠాలన్నింటిలోను శివలింగాలను ప్రతిష్ఠించాడు, అనేక మంది దేవతలకు స్తోత్రాలు, స్తవాలు చెల్లించాడు. ఆయన రచనలుగా చెప్పబడే స్తోత్రాలు వందలాదిగా వున్నాయి. ఇవేవీ అతను చేయకపోతే, ఇంకా అతను చేసిందేమిటి?

బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు, దశోపనిషత్తులకు భాష్యాలు రాశాడని గొప్పలు చెప్పుకొన్నందువల్ల ప్రయోజనం లేదు. ఎందుకంటే శంకరుడి కథను, అతని పేరవున్న గ్రంథాలను పరిశీలిస్తే అతను అభ్యుదయ భావాలను దెబ్బకొట్టాడని తేలుతుంది. భావ వాదాన్ని ప్రచారం చేసి, వర్ణవ్యవస్థను పునరుద్ధరించి, తద్వారా భారత సమాజానికి తీరని ద్రోహం చేశాడని తేలుతుంది.

## వ్యక్తిగత విమర్శ-వ్యక్తిత్వ విమర్శ

శంకరుడు మహామేధావి అనే కల్లబొల్లి ప్రచారం జోరుగా జరిగింది. కాని, అందుకు రుజువు ఆయన రచనల్లో కన్పించదు. ఆయన్ని చదివినవారికంటే చదవనివారే ఆ ప్రచారం ముమ్మరంగా ఇప్పటికీ చేస్తున్నట్లు కన్పిస్తుంది. హిందూ మతాన్ని ఉద్ధరించిన వారినందరినీ మహా పురుషులుగా వర్ణించడమే ఈ దేశ చరిత్ర రచనలో వరవడి అయింది. అందువల్ల విప్లవ ప్రతీఘాతక శక్తులకు సైద్ధాంతిక నాయకత్వంవహించిన శంకరుడికి అనుచిత ప్రచారం లభించడంలో మనం ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఇక్కడి భావ తిరోగమన చరిత్రకు అది మరో సాక్ష్యమవుతుంది.

శంకరుడి కథలో మనం పేర్కొన్న ఘట్టాలన్నీ శంకరాద్వైతులు వ్రాసిన గ్రంథాలలోనివే. శంకరుడి వ్యక్తిత్వాన్ని గొప్పచేయాలనే ఉద్దేశమే వాటి గ్రంథీకరణలో

వారిలక్ష్యం. ఆ ఘట్టాలనే మనం పేర్కొని, వాటిలోని ఔచిత్యాన్ని ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శ అని వ్రేలెత్తిచూపే ప్రబుద్ధులున్నారు. అంతగా ఖండనీయమైన అపభ్రంశ చరిత్రను శంకర శిష్యులు ఎందుకు క్రోడీకరించారబ్బా అనే ప్రశ్న అలాంటి వారికి రాదు. మనం శంకరుడి అద్వైత తత్వాన్ని, ప్రస్థానత్రయభాష్య పాండితీవైభవాన్ని పరిశీలించాలికానీ, పరకాయ ప్రవేశకథలాంటి వ్యక్తిగత విషయాలు మాట్లాడటం మంచిది కాదనీ, అవి ఈ సమాజానికి ఏ విధంగానూ ఉపయోగపడవనీ సెలవిచ్చే శుద్ధతాత్వికులు, పరిశుద్ధ చరిత్రకారులు ఎక్కువైనారు. శంకరుడి ఘనకార్యాలుగా, మహత్యాలుగా ఆయన చరిత్రకారులు వుటంకించిన అంశాలను ప్రశ్నించడం ఎలా వ్యక్తిగతమవుతుంది ?

పరకాయ ప్రవేశాన్నే తీసుకుందాం : అందులో ఏది వ్యక్తిగతం ? పరకాయ ప్రవేశం శంకరుడి సిద్ధాంతంలో భాగంకావడం వ్యక్తిగతమా ? ఆ ప్రక్రియ చేయడం చాలా సులువని సాక్షాత్తు బ్రహ్మసూత్రభాష్యంలో శంకరుడు వ్రాయడం వ్యక్తిగతమా ? ఆ పని ఆయన చేసినట్లు ఆయన అనుయాయులు ఆయన జీవిత చరిత్రల్లో వ్రాయడం వ్యక్తిగతం కాదా ? వారు చరిత్రగా వ్రాసినదాన్ని మనం ప్రశ్నించడం వ్యక్తిగతమవుతుందా? రాజు వేషం వేసుకొని, అతని భార్యల్ని మోసంచేసి, హిప్నటైజు చేసి, వారియిష్టాలకు వ్యతిరేకంగా శంకరుడు మానభంగంచేశాడనడం వ్యక్తిగతమవుతుందా ? దాన్ని మహత్యంగా వర్ణిస్తే వ్యక్తిగతం కాదా ? శంకరుడి అంతవాడు అలాంటి అత్యాచారం చేయగాలేనిది తాము చేస్తే మాత్రం తప్పేముంది అనే దుర్భావం ప్రజల్లో వ్యాపించదా ? అలాంటి ఉదాహరణల్ని స్వయంగా శంకరుడే కోట్‌చేశాడు కదా ? వాటిప్రభావం సమాజం మీద పడదా ? దాన్ని ఖండించడం సామాజిక న్యాయంలో భాగంకాదా ? శంకరమహత్యాల్లో భాగంగా ఆ గాధను శంకరులిప్పటికీ ప్రచారం చేయడంలేదా ? దాన్ని కొనియాడితే కాని వ్యక్తిగతం, విమర్శిస్తే అవుతుందా ? అందువల్ల అమాయకుల్ని మోసంచేయడానికి పనికివచ్చే శంకరకథల్ని ఖండించి ఎండగట్టడం అవశ్యకమే అవుతుంది. దుర్మార్గాలను ప్రశ్నించడం వ్యక్తిగతమైతే, ఇక కానిదేమిటి ?

చేసిన ఘోరాలనుంచి శంకరుడి వ్యక్తిత్వాన్ని కాపాడడంకోసం అద్వైతజపం చేయడం, శ్రీరంగనీతులు వల్లించడం, దార్శనికత పేరుతో దగుల్బాజీ సమర్థనలు సాగించడం సరైన పద్ధతి కాదు. కొత్త భావాలను పాత పద్ధతిలో చెప్పడం, పాత భావాలకు కొత్త తాత్విక రంగు పూయడం మన సంప్రదాయంలో సాగుతూ వచ్చిన పురాణరోగం. హానికరమైన ఆ రోగం కుదిరితేగాని, ప్రగతి సాధనకు మార్గం సుగమంకాదు.

# 2. బ్రహ్మ కషాయం

శంకరాచార్యుడు వేదాలను చదువుకొని వుండవచ్చు. కానీ,ప్రస్థానత్రయభాష్యాల్లో ఆయన ప్రధానంగా ప్రమాణించింది ఉపనిషత్తులనే.

ప్రస్థానత్రయమంటే ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు.

శంకరుడి భావంలో శ్రుతులంటే ఉపనిషత్తులే. వేదాలపట్ల ఆయనకు నిజమైన భక్తిప్రపత్తులుంటే, పూర్వమీమాంసను తిరస్కరించేవాడుకాదు.

వేదాలను పూర్వమీమాంసగా సూత్రీకరించినవాడు జైమిని. అది వైదికం.

ఇప్పుడు మనకు బ్రహ్మసూత్రాల పేరుతో ప్రచారమవుతున్న ఉత్తరమీమాంస ఉపనిషత్తుల సూత్రీకరణ. దాని కర్త బాదరాయణుడు. ఇది వేదాంతం.

శ్రుతులంటే 'వినబడినవి' అనే అర్థమేకాని, రుజువుచేయబడినవి అనే అర్థంలేదు. రుజువు అవసరం లేనివి కాబట్టే వేదాలను స్వతః ప్రమాణాలన్నారు. దాన్నే మనం భావనియంతృత్వమంటాం. ఆ భావ నియంతృత్వానికి శంకరుడు ఉపనిషత్తుల్ని ఆలంబనం చేసుకున్నాడు. వేదాలలో బ్రహ్మానికి ప్రాధాన్యంలేదు కానీ, ఉపనిషత్తుల ఊపిరి బ్రహ్మమే. బ్రహ్మచర్చను ప్రధానంగా చేయని ఉపనిషత్తులేదు. బ్రహ్మసాధన ఉపనిషత్కారుల లక్ష్యం. బ్రహ్మమే వారి సత్యం. బ్రహ్మసాధనే వారి సత్యసాధన.

శంకరుడు బ్రహ్మవాది అని బహుళ ప్రచారం జరిగింది. నిజానికి, శంకరుడికి కానీ, శంకరవాదులకుకానీ బ్రహ్మవాదం కేవలం ముసుగే. అది వారికి హిందూమతోద్ధరణకి సాధనమేకాని, లక్ష్యంకాదు. వారి లక్ష్యం హిందూ వర్ణ వ్యవస్థను సమర్థించడం.

అందువల్ల,సమతావాదుల్ని వారు ద్వేషిస్తారు. దూషిస్తారు.

బ్రహ్మసత్యం అన్నవాక్యం వినపడగానే చాలామంది హేతువాదులకూ, భౌతిక వాదులకూ చతుర్ముఖబ్రహ్మ కట్టెదుట కన్పిస్తాడనీ, దానితో వారు భయవిహ్వలులై గట్టిగా కళ్లు మూసుకుని 'బ్రహ్మలేదు, బ్రహ్మలేదు' అని జపం ప్రారంభిస్తారనీ, వేదాంతం బ్రహ్మను లింగరహితంగానే భావించిందనీ, అద్వైతంలోని బ్రహ్మకూ భౌతికవాదంలోని మూల పదార్థానికీ తేడాలేదనీ, అందుకే దానిని బ్రహ్మపదార్థమంటారనీ, తెలిసీ తెలియని భౌతికవాదులు బ్రహ్మశబ్దాన్ని తప్పుదారి పట్టించారనీ హేళన చేస్తారు.

నిజానికి బ్రహ్మమంటే ఏమిటో బ్రహ్మవాదులకు తెలియవలసినంతగా

హేతువాదులకు తెలియనవసరంలేదు, కానీ, తమాషా యేమంటే, అదంటే ఏమిటో తెలిసింది హేతువాద-భౌతికవాదులకే, తెలియనిది బ్రహ్మవాదులకే.

తెలియకనే బ్రహ్మవాదులు కనీసం రెండువేల సంవత్సరాల పై కాలంనుంచి క్రిందుమీదులవుతున్నారు.

అది అర్ధంకాకనే ఉపనిషత్కారులు తమలోతాము తన్నుకుచచ్చారు. లింగాలు మార్చారు, పంగాలు దూర్చారు. జపతపాలు చేసారు. అయినా,వారికది అర్ధంకాలేదు. చివరకు,'అది ఆడకాదు, మగకాదు, రెండూ అయినదీకాదు, కానిదీకాదు' పొమ్మన్నారు.

నైవస్త్రీ నపుమానేష నచైవాయం నపుంసకః (శ్వేతాశ్వతరోపనిషత్తు 5-10)

బ్రహ్మలింగమే అర్ధంకాని 'బ్రహ్మపదార్ధాలు' దాన్ని ఎలా గుర్తిస్తారో మనకు అర్థం కాదు.

ఉపనిషత్సారాన్నంతా సూత్రీకరిస్తే బ్రహ్మం చిక్కుతుందేమోనని సూత్రకారులు ప్రయత్నించారు. వారికి చిక్కలేదు.

సూత్రాలను పగలగొడితే దొరుకుతుందేమోనని భాష్యకారులు ప్రయత్నంచేసారు, వారికీ చిక్కలేదు. అసలు బ్రహ్మమనేది వుంటేకదా దొరకటానికైనా, చిక్కకపోడానికైనా? లేనిదాన్ని పట్టుకొని వారు పీకులాడి, పీకులాడి వదిలారు. ఆ పీకులాటను ఇప్పటికీ కొనసాగిస్తున్న బ్రహ్మం భ్రమరాలకు, బ్రహ్మం పరిపరి విధాలుగా తోస్తుంది. ఆ తోచడంలో ఒక్క చతుర్ముఖ బ్రహ్మమేమి"ఖర్మ", స్త్రీ పుం నపుంసక లింగాలు మొదలు లింగరాహిత్యందాకా బ్రహ్మస్వరూపం మారింది. పెడితే అతుక్కుని, పెరికితే వూడిపోయే లింగం బ్రహ్మనిది. దానికి సొంత లింగమంటూలేదు. బ్రహ్మవాదులకు లింగపరంగాతప్ప, వస్తువులు అర్ధంకావు. అందుకే లింగంలేని బ్రహ్మం వారికి అర్ధంకాలేదు.

తైత్తరీయోపనిషత్తు ప్రకారం తండ్రి వరుణుడు చెప్పినట్లల్లా భృగువు విన్నాడు. బ్రహ్మమంటే అన్నమని ఒకసారి, ప్రాణమని మరోసారి, మనస్సని ఇంకొకసారి, విజ్ఞానమని వేరొకసారి అనుకుంటూవెళ్ళి, చివరకు"ఆనందోబ్రహ్మ" అని తెలుసుకున్నాడు. (తై. భృగువల్లి-2 నుంచి 6 వరకు). అంతేకాని, నయాశాంకరులు వాదిస్తున్నట్లు పదార్థమే బ్రహ్మమని వర్ణించలేదు. ఏ ఉపనిషత్తూ పదార్థాన్ని బ్రహ్మంగా చెప్పలేదు. అందువల్ల, ఇప్పుడెవరైనా బ్రహ్మమంటే పదార్థమే అన్న అర్థాన్ని తీయడానికి ప్రయత్నిస్తే, అలాంటివారిని మతిభ్రమించినవారుగా మనం గుర్తించక తప్పదు. భౌతికవాదుల దృష్టిలో బ్రహ్మమనేది ఏనాడూ రుజువుకాని పరికల్పన-హైపోథీసిస్.

బ్రహ్మసూత్రభాష్యంలో 147సార్లు తైత్తరీయోపనిషత్తును ఉదహరించిన శంకరుడుకూడా "ఎవనివల్ల ఈ భూతాలన్నీ పుడుతున్నవో, పుట్టినవి ఎవనివల్ల జీవిస్తున్నవో, చివరకు ఎవనియందు లయమవుతున్నవో అదేబ్రహ్మ" (భృగువల్లి,1) అన్నతైత్తరీయ నిర్వచనాన్ని వివరిస్తూ "చైతన్యంలేని పదార్థం (ప్రధానం) నుంచికాని, పరమాణువులనుంచికాని, శూన్యంనుంచికాని విశ్వం స్వచ్ఛందంగా రావడానికి వీలులేదు" అని వ్యాఖ్యానించాడు. కాబట్టి శంకరుడు పదార్థాన్నే బ్రహ్మమన్నాడని వాదించబూనడం శుద్ధ అవివేకం.

నిజానికి, ఏదిలేదో దాన్నే శంకరుడు బ్రహ్మమన్నాడు. అదేమిటోచెప్పలేక పోయాడు. ఉన్న జగత్తును మిధ్య అన్నాడు. అదెలాగో చెప్పలేకపోయాడు. "బ్రహ్మసత్యం జగన్మిధ్యే" (వివేక చూడామణి-20) అంటూ పాడిందే పాడాడు. ఈనాడు నయాశంకరులు బయలుదేరి "సత్యమైన బ్రహ్మ, మిధ్య అయిన జగత్తు (పదార్థం)- రెండూ ఒకటే" నని వ్యాఖ్యానం చేయడం మతిమాలినతనమవుతుంది.

ప్రపంచ చరిత్రను తిరగవేయండి -స్వేచ్ఛాయోచనను, మానవవాద వైఖరిని అణగద్రొక్కడమే మొదటినుంచీ బ్రహ్మవాదులు చేసినఘనకార్యం. వారి భావ నియంతృత్వాన్ని తట్టుకొని, తరతరాల వైజ్ఞానిక వారసత్వాన్ని సంక్రమింపజేసుకొని, పెంపొందినవే హేతువాదం, మానవవాదం.

హేతువాదులు, మానవవాదులు చేసింది బ్రహ్మాన్వేషణకాదు - సత్యాన్వేషణ. సత్యం బ్రహ్మం దగ్గర వుండదు- వాస్తవికతవద్ద వుంటుంది. అది శ్రుతుల్లో దొరకదు- ఇంగితజ్ఞానంలో దొరుకుతుంది. భారతీయులలో శ్రుతులను ప్రమాణంగా అంగీకరించని బ్రహ్మవాది లేడు- ఇంగితానికి దొరికే బ్రహ్మం లేదు.

తరతరాల తాత్విక శాస్త్రీయచరిత్రను పరిశీలిస్తే, అది ఏ ముఖంగా కదలుతూవచ్చిందో అర్థమవుతుంది. ప్రగతి ఏవైపు ముఖం పెట్టిందో తెలుస్తుంది. ఇంకా వెనక్కువెళ్ళి బ్రహ్మలింగాన్ని తడవిచూస్తే, లింగమే దొరుకుతుందికానీ, బ్రహ్మంకాదు.

## బ్రహ్మలింగం

బ్రహ్మశబ్దం నపుంసక లింగమా, లేక లింగరాహిత్యమా అని లింగచర్చ చేయడం వల్ల ప్రయోజనం వుండదు. ఏ లింగమైతే ఏమిటట? బ్రహ్మనికి వేదాల్లో లింగం వుంది. ఋగ్వేదంలో బ్రహ్మ పుంలింగమే. బ్రహ్మనికి లింగం వూడిపోయింది

ఉపనిషత్తుల్లోనే. సలింగ బ్రహ్మకూ, అలింగ బ్రహ్మకూ తేడా ఏమిటట? లింగం తగ్గితే బ్రహ్మం పెరుగుతుందా?

బ్రహ్మానికి అర్థం ఉపనిషత్తులు చెప్పలేకపోయినై. శంకరుడు చెప్పలేకపోయాడు. ఆ తరవాతివారూ చెప్పలేకపోయారు. వారుచెప్పలేకపోయినదికాక బ్రహ్మానికి అన్నం, అన్నదానం, సామగీతం, మహామంత్రం, యజ్ఞపూరణ, దానదక్షిణ, మంత్రపాఠంవంటి అర్థాలు చాలావున్నాయి. ఒకే పదానికి అనేక అర్థాలు సాధ్యమయ్యే 'మూగసైగ' విధానమేకదా సంస్కృత భాషలోని ప్రత్యేకత!

వేదాన్ని (శబ్దాన్ని) అన్నిటికీ మూలంగా, ప్రమాణంగా చెప్పిన శంకరుడు బ్రహ్మశబ్దాన్ని వాడింది వేదార్థంలోకాదు-వేదాంతార్థంలో. వేదాంతం బ్రహ్మాన్ని ఇహసంబంధమైనదిగా భావించలేదు. శంకరుడు దాన్ని ఇహ (పదార్థ) సంబంధమైనదిగావాడివుంటే, సాంఖ్యుల ప్రధానాన్ని (పదార్థ మూలాన్ని) ఖండించవలసిన పనిలేదు. బ్రహ్మసూత్రభాష్యంలో శంకరుడు తొలినుంచి తుదిదాక చేసిన పని సాంఖ్యుల ప్రధానవాదఖండనే. బ్రహ్మం పేరుతో "అద్వైతం, అద్వైతం" అని పలవరిస్తే, అది పదార్థవాదం కాజాలదు. అది ఏకత్వవాదం అంతకన్నాకాదు. లింగాలు, విగ్రహాలు, సంధులు, సమాసాలు,వ్యుత్పత్తి అర్థాలు వగైరా శంకరుడు పదార్థవాది అనడానికి చాలవు. మిథ్యావాది కాదనడానికీ చాలవు.

'మాయ' శబ్దాన్ని 'గారడీ' అనే అర్థంలో ఋగ్వేదం అనేకసార్లు వాడింది.(1-11-7, 1-51-5, 5-63-7, 8-14-4). ఉపనిషత్తుల్లో రకరకాలుగా వాడబడ్డ ఆ 'మాయ' గౌడపాదుడి చేతుల్లో భ్రమ,భ్రాంతి అనే అర్థాలు సంతరించుకొంది. మాండూక్యకారికలకు భాష్యం వ్రాసేటపుడు శంకరుడామాయలోపడ్డాడు. మాయనే తాత్వీకరించి మాయావాదాన్ని ప్రసిద్ధం చేశాడు. ఇప్పుడు, దాన్ని భౌతికవాదుల వస్తు పరిణామవాదంతో పోల్చడం తిక్క అవుతుంది. మరొక భ్రమను కల్పించడమవుతుంది. శంకరుడి మాయకు ఇప్పుడు కొత్త అర్థాలు చెప్పవలసిన పనిలేదు. శంకరుడి రచనగా చెప్పబడుతున్న 'ప్రశ్నోత్తర మణిమాలిక' లో,

కోమాయీ పరమేశః క ఇంద్రజాలయతే పంచో-యం ।
కః స్వప్ననిభో జాగ్రద్వ్యవహారః సత్యమపిచకిం బ్రహ్మ ॥

అనడాన్నిబట్టి శంకరుడు వాడిన పారిభాషిక పదాలకు మనం కొత్తగా అర్థాలు చెప్పుకో నవసరం లేదు.

మాయావి ఎవరు ? - పరమేశ్వరుడు

ఇంద్రజాల సదృశమైనది ఏది ? - ఈ ప్రపంచం
స్వప్నతుల్యమైనది ఏది ? - జాగ్రత్ప్రపంచ వ్యవహారం
సత్యవస్తువేది ? - బ్రహ్మం

ఇలా బ్రహ్మసత్యం, ప్రపంచం మాయ అని తప్ప, బ్రహ్మమంటే ఏమిటో శంకరుడు చెప్పలేకపోయాడు. కాగా, బ్రహ్మమంటే పదార్థమేనని చెప్పడానికిప్పుడు అభినయ శాంకరులు బయలుదేరారు.

స్తోత్రాలు, స్తవాలు తప్ప - శంకరుడు సొంతంగా ప్రతిపాదించిన తత్వం లేదు. పాతమాటలకు కొత్త అర్థాలు చెప్పే ప్రక్రియకు మాత్రమే అతను మూలపురుషుడేమో! అంతకు ముందు అలాంటి పనిని అంత సమర్థవంతంగా చేసిన వాళ్ళున్నట్లు లేదు. అర్థాలు తీయడంలోనే అతను పూర్వమీమాంసికులతో తగాదా పడింది. అర్థాంతరాలు సాధించే అయుక్తీకరణ ధోరణినే ఈనాడు మత పునరుజ్జీవన వాదులు అనుసరిస్తున్నారు.

పదార్థవాదానికి సంబంధించిన మౌలికాంశాలు కొన్ని సాంఖ్య, వైశేషికాదుల్లో వున్నాయి. బ్రహ్మసూత్ర భాష్యంలో శంకరుడు ముఖ్యంగా ఖండించింది వాటినేనని మున్ముందు చూడబోతాం. అందులో సాంఖ్య వైశేషికాల్లో భౌతికవాదానికీ, పదార్థవాదానికీ సంబంధించిన దార్శనిక సూత్రాలేవైతే వున్నవో, వాటిని పూర్వపక్షం చేయడమే శంకరుడు పనిగా పెట్టుకున్నాడు. 555 బ్రహ్మసూత్రాల్లో 68 సూత్రాలకు వ్రాసిన భాష్యం సాంఖ్యవాదఖండనకే సరిపోయింది. అలానే ప్రాచీన భౌతికవాదులైన లోకాయతచార్వాకులనూ ఖండించాడు. ఆ ఖండనలు ఎంత నేలబారుగా వున్నవో మరొకచోట చూద్దాం.

ఈ విషయాలన్నీ విస్మరించి, బ్రహ్మం నపుంసకం కాబట్టి, దానిని పదార్థం అనే అర్థంలో శంకరుడు ప్రయోగించాడని చూపబూనడం తాత్విక నపుంసకత్వమనిపించుకుంటుంది.

నపుంసక లింగాలన్నీ 'బ్రహ్మ' 'పదార్థాలే' ననుకుందామా ?

శంకరుడు పదార్థాన్నే బ్రహ్మమన్నాడని కాసేపూ, అసలు పదార్థమే (కాయమే) లేదన్నాడని కాసేపూ, ఎటువాటంగా వుంటే అటు మొగ్గి వాదించే మనశ్చాంచల్యం శంకరుడి వారసత్వమే.

## గోసాయి వేషం

'శంకరాచార్యుడి శీలాన్ని' పరిశీలించేటపుడు పరకాయప్రవేశంపై వ్యాఖ్యానం

చేస్తూ నేను కొన్ని మాటలన్నాను:

"శంకరుడు కామకళ నేర్చుకున్నది ముండమోపులవద్దనే అయినా, ముండమోపులు తల వెంట్రుకలు తీయకపోతే కులంనుంచి వెలివేస్తాయి శంకర పీఠాలు. మొగుడు లేనివాళ్ళ గుండ్లుచూస్తేతప్ప, వారికి తృప్తికల్గదేమో ! పెళ్ళాలు మాత్రంలేని ఈ అద్వైతులు కూడా గుండ్లుచేయించుకుంటారెందుకో!"

ఇది కేవలం శంకరుడి వేషాన్ని గురించి నేను విసురుతున్న విసురుగా నయాశాంకరులు భ్రాంతిచెందుతున్నారు. అది అవివేకం. ఆ వేషం గౌతమ బుద్ధుడిదేనని హేతువాదులకు స్ఫురించకపోవచ్చుననికూడా వారు ఎత్తిపొడుస్తున్నారు. బుద్ధుడివేషం, శంకరుడివేషం ఒక్కటికావని గుర్తించకపోవడం వారి అజ్ఞానానికి చిహ్నం. ఐనా, బుద్ధుడు వేసుకున్నాడుకాబట్టి శంకరుడూ అదేవేషం వేసుకున్నాడనే వాదం అర్థరహితమైన వైతండికం. ఇక్కడ బుద్ధుడి ప్రస్తావనే అసందర్భం.

'శంకరుడు పైపై వేషాలకు బానిసకాడ'ని సమర్థించబోయేముందు, అసలావేషం ఆయన ఎందుకు వేసుకున్నాడో వివరిస్తే బాగుండేది. పైగా ఊరికే వేషం వేసుకొని ప్రయోజనం ఏముంది? ఆ వేషంలో బుద్ధుదేమిచేశాడు, శంకరుదేమిచేశాడు అనేది ముఖ్యం.

బుద్ధుడు వేదప్రామాణ్యాన్ని నిరాకరించగా, శంకరుడు వేదప్రామాణ్యాన్ని అనుల్లంఘనీయమన్నాడు. బుద్ధుడు వర్ణవ్యవస్థపై దెబ్బకొట్టగా, బీటలువారిన ఆ వ్యవస్థను శంకరుడు మరమ్మత్తుచేసి సముద్ధరించాడు. బుద్ధుడు బ్రహ్మాన్ని (ఆత్మను) తిరస్కరించగా, శంకరుడు బ్రహ్మాన్ని ఆమోదించి అయోమయం చేసాడు. బుద్ధుడు ప్రపంచానికి పుట్టుక, చావు లేవనే అజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించగా, అవిలేనిది బ్రహ్మానికేననీ, ప్రపంచం మిథ్య అనీ శంకరుడన్నాడు. బుద్ధుడు అహింసావ్రతం అవలంబించగా, శంకరుడు హింసతో తన మతవ్యాప్తికి పాల్పడ్డాడు. బుద్ధుడి సామాజిక నీతిలో సమ్యక్ దృక్పథం ప్రతిబింబించగా, బ్రహ్మానికేమీ అంటుకోవనే నైతిక నాస్తి వాదాన్ని శంకరుడు అవలంబించాడు. బుద్ధుడి సంఘారామాల్లో దళితులు, స్త్రీలు సైతం భిక్షువులుకాగా, శంకరమఠాల్లో బ్రాహ్మణ పురుషులకు మాత్రమే ప్రవేశం పరిమితమైంది.

బుద్ధుడి వేషాన్ని శంకరుడు కాపీ కొట్టాడనే నయాశాంకరుల వాదాన్ని అంగీకరించినా, అంతమాత్రానే శంకరుడు బుద్ధుడైనాడా? తర్కంకోసం విజ్ఞానవాద, శూన్యవాదాల భ్రష్టరూపాన్ని కాపీ కొట్టినంతమాత్రాన బౌద్ధుడైనాడా? నేషనల్

సోషలిస్టనని పేరు పెట్టుకున్నంతమాత్రాన ఫాసిస్టుహిట్లరు సోషలిస్టయినాడా? శంకరుడి కాపీ బౌద్ధాన్ని (ప్రచ్ఛన్నం కాదు, కాపీ) పరిశీలించడానికి ఇది తావుకాదు కాని, అతనికి ప్రచ్ఛన్న బౌద్ధుడని పేరు పెట్టినవారు సనాతన వైదికులనే విషయం మనం విస్మరించరాదు; మౌలికంగా వారంతా శంకరుడితో సహా ఒక్క గూటిలోనివారే.

"మాహాయానిక బౌద్ధ గాధికం మాయావాదం" అని తన బ్రహ్మసూత్రభాష్యంలో (1-4-25) భాస్కరుడు పేర్కొనగా, "మాయావాదమసచ్ఛాస్త్రం ప్రచ్ఛన్నం బౌద్ధమేవచ" అని పద్మపురాణకర్త అన్నాడు. కాని, ప్రత్యక్ష హిందువుగా బౌద్ధానికి తలకొరివి పెట్టినవాడు శంకరుడేనన్న వాస్తవాన్ని మనం మరువరాదు. భాష్యాల్లో తదన్యంగా అతనేమి వ్రాసినా, అచరణలో అతను ఉద్ధరించింది హైందవాన్నే.

అయినా నా వ్యాసం (శంకరాచార్యుడి శీలం) లో నేను ఆక్షేపించింది శంకరుడి వేషాన్నికాదు. హిందూ విధవలకు బలవంతంగా ముండనం చేయడంపై సైతం శంకరపీఠాలవారి ఆసక్తిని,ఆధిపత్యాన్ని ఆ వ్యాసంలో వ్యంగ్యంగా, అయినా ఘాటుగా నేను నిరసించాను. అది కేవలం ముండనంపై వ్యాఖ్యకాదు. శంకరుడు తలవెంట్రుకలేకాదు, తలచర్మం వొలుచుకున్నా నేను ఆక్షేపించను.

" జటిలోముండీ లుంఛితకేశః కాషాయాంబర బహుకృత వేషః " అని శంకరాచార్యుడు శ్లోకం అల్లడానికైతే అల్లాడుకాని, అందులోని భావం అతని సొంతం కాదు. అదీ బుద్ధుడిదే. బుద్ధుడి కాలంనాటికి స్వర్గానికనండి, మోక్షానికనండి-రెండే రెండు మార్గాలను అనుసరించేవారు. ఒకటి యజ్ఞయాగాది కర్మకాండల్లో మృష్టాన్నం మెక్కి బలియడం. రెండవది శరీరాన్ని శుష్కింపజేసుకొని ప్రాణ త్యాగం చేయడం.

ఆరు సంవత్సరాలు శరీరాన్ని శుష్కింపజేసుకొన్నతర్వాత బుద్ధుడికి జ్ఞానోదయమై, వాటి రెంటికి భిన్నంగా మాధ్యమిక మార్గాన్ని ప్రతిపాదించాడు. దాన్ని తొలిసారిగా కాశీ భిక్షువులైదుగురికి సారనాథ్ వద్ద హరిణవనంలో వివరించే సందర్భంలో 2500 ఏళ్ళ క్రితం బుద్ధుడిలా అన్నాడు : "కేవలం మాంసాహార విసర్జనం, దిగంబరత్వం, ముండనం, జడలు పెంచుకోవడం, నారగుడ్డలు ధరించడం, బూడిద పూసుకోవడం, అగ్నికి ఆహుతి కావడం ఏ వ్యక్తినీ పునీతుణ్ణి చేయజాలవు." ఈ అభిప్రాయాన్నికూడా శంకరుడు కాపీచేశాడు.

కాగా, శంకరుడు తగిలించుకున్నది బుద్ధుడు త్యజించిన వేషం.
బౌద్ధులవి కాషాయ బట్టలుకాదు - పసుపు బట్టలు.
శాంకరులవి కాషాయ బట్టలు.

ఏ వేషంలో వున్నా, ఏ సూత్రాలు ఏ వైఖరిలో చెప్పినా, బౌద్ధాన్ని లక్ష్యంగా పెట్టుకొనేవారే ప్రచ్ఛన్న బౌద్ధులు కాని – బౌద్ధుల వేషాలవంటి వేషాలు వేసుకొని, వారిసూత్రాలను పుక్కిటబట్టి, బౌద్ధ నిర్మూలన లక్ష్యంగా పెట్టుకొనేవారు ప్రచ్ఛన్నంగానైనా బౌద్ధులుకారు.

అది బౌద్ధం భౌతికవాదమో, లేక నాస్తికవాదమో కాకపోయినా, అది అజ్ఞేయ వాదమన్నంత వరకు నిర్వివాదం. అనంతర బౌద్ధాన్ని కొంతమంది బౌద్ధ దార్శనికులు పూర్తి భౌతికవాదం వేపు లాక్కెళ్ళినా, మరికొందరు భావవాదం వైపుకు లాక్కువెళ్ళిన మాట కూడా నిజం. అంతమాత్రాన, దాన్ని ఆస్తికమనడానికి వీలులేదు. ఐనా, అది ఆధునికస్థాయి భౌతికవాదమనీ, నాస్తికవాదమనీ హేతువాదులకు భ్రమలులేవు.

అయితే, బౌద్ధుల ధర్మంలో సామాజిక దృష్టి, సమతాదృష్టి, నైతికదృష్టి, మానవతాభావం వున్నాయి. ఆనాడు బౌద్ధం సామాజిక విప్లవానికి, నైతికవిప్లవానికి తోడ్పడిందన్న భావంతో హేతువాదులు దాని చారిత్రక పాత్రను శ్లాఘిస్తారు. అభిమానిస్తారు. అంతమాత్రంచేత హేతువాదులు బౌద్ధులు కారు.

శంకరాద్వైతంలో సామాజిక దృష్టి లేదు, సమతాదృష్టి లేదు, నైతికదృష్టి లేదు. నూరు హత్యలు చేసినా పాపం అంటదనే నైతికనాస్తివాదం దానిసొత్తు. అది ఐహిక జీవితాన్ని, జుగుప్సాకరమైన భాషలో వర్ణిస్తుంది. అయినా, ఎందుకోమరి, అద్వైతులెవ్వరూ దేహాభిమానాన్ని వదలుకున్నట్లులేదు–నిజానికి శంకరుడిలో ఆ దేహాభిమానం నగ్నంగా వ్యక్తమైంది. తన దేహంతో చేస్తే అది మలినమవుతుందని ఇతరుల దేహంతో తాను వ్యభిచారానికి పాల్పడ్డానని శంకరుడే చెప్పుకొన్నాడు. అంతా బ్రహ్మమయమనే దొంగవేదాంతం అలా వుంటుంది. అంతేకాదు, స్త్రీ–శూద్రులయెడ శాంకరులు న్యూనతాభావాన్ని ప్రదర్శించారు. అద్వైతంలోని తాత్విక అయోమయత్వం వల్లనే వారీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారు. సర్వసమతావాదానికి శాంకరం ఎంతగా చుక్కెదురో దీన్ని బట్టి గ్రహించవచ్చు. సామాజికంగా అది అత్యంత అభ్యుదయ నిరోధకమైనది. ఏ రూపంలోనూ హేతువాదులు దాన్ని ఆదరించే ప్రసక్తే లేదు.

బౌద్ధుల భావవాదఛాయలనూ, సన్యాసీకరణనూ హేతువాదులు ఆమోదించరు. వారి వాదనారీతికి కాలం చెల్లిపోయిందని హేతువాదులకు తెలుసు. కాని, దాని చారిత్రకపాత్ర ప్రగతిశీలమనేది హేతువాదులు గుర్తించిన సత్యం. కాగా, బౌద్ధాన్ని అభిమానించే హేతువాదులు అద్వైతాన్ని ఎందుకు అభిమానించరు అనేది అర్థంలేని ప్రశ్న. ఎందుకంటే అభిమానానికి మూలం వేషం కాదు.

జటిలోముండీ లుంఛితకేశః కాషాయాంబర బహుకృత వేషః
పశ్యన్నపి చ న పశ్యతి మూఢః ఉదరనిమిత్తం బహుకృత వేషః

అంటూ "జడలు పెంచుకున్నా, గుండుచేయించుకున్నా, వెంట్రుకలు పెరుక్కున్నా, కాషాయాంబరాలు ధరించినా, ఈ వేషాలన్నీ పొట్టకూటి కోసం వేసేవే" అని శంకరుడు సంస్కృతంలో శ్లోకం అల్లాడు కాబట్టి, శంకరుడు వేషాలకు బానిసకాడని తీర్పు చెప్పడంలో అర్థంలేదు.

## భజగోవిందసారం

పొట్ట కూటికోసం కాకపోయినా, శంకరుడు గోసాయి వేషం వేసుకున్నాడు. మరొకప్పుడు రాజు వేషం వేసుకుని "అమరుకమ్" వ్రాశాడు. ఇంకా ఎప్పుడెప్పుడు ఏయే వేషాలు వేశాడో మనకెందుకు ? 'జటిలోముండీ' అనే శ్లోకం "భజగోవిందం" లోని 18 శ్లోకాల్లో ఒకానొక్కటి మాత్రమే. అందులోని మరికొన్ని శ్లోకాలుకూడా చూస్తే శంకరుడి తాత్వికనేపథ్యం అర్థమవుతుంది.

భగవద్గీతా కించిదధీతా, గంగాజల లవ కణికా పీతా
సకృదపియస్య మురారిసమర్చా, తస్యయమః కిం కురుతేచర్చామ్ ॥
పునరపిజననం పునరపిమరణం; పునరపిజననీ జఠరేశయనమ్
ఇహసంసారే ఖలుదుస్తారే, కృపయా-పారేపాహిమురారే ॥
నారీస్తనభర నాభినివేశం, మిథ్యామాయా మోహావేశమ్
ఏతన్మాంస వసాదివికారం, మనసి విచారయ వారంవారమ్ ॥
కస్త్వం కో-హం కుత ఆయాతః, కామేజననీ కోమేతాతః
ఇతిపరిభావయ సర్వమసారం, విశ్వంత్యక్త్వా స్వప్నవిచారమ్ ॥
గేయంగీతానామసహస్రం, ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్ ॥

'జటిలోముండీ' ని కోట్‌చేసే భజగోవిందాలు వీటికేమంటారు?

భగవద్గీతను కొంచెంగా చదివినా, గంగాజలం నాల్గుబొట్లు త్రాగినా, విష్ణుపాదాలను పూజించినా, అలాంటివారిని యముడు ఏమీ చేయలేడని ప్రబోధించేవాడు పదార్థవాదా ?

జనన మరణాలతో మాటిమాటికీ తల్లిగర్భంలోప్రవేశించడంవల్ల బాధపడుతున్నాను కాబట్టి, అపారమైన, దుస్తరమైన జనన మరణ భవసాగరాన్ని దాటించమని విష్ణువును వుద్దేశించి శోకాలు పెట్టినవాడు నాస్తికుడా ?

మాంసపంకిలాలైన స్త్రీల స్తనాలపైన, నాభిపైన మనసులో కలిగే అనురాగం మిథ్యావ్యామోహమని జుగుప్సను ప్రేరేపించేవాడు భౌతికవాదా? సర్వసమతావాదా ? పురుషుల దేహాలు మాంసపంకిలాలుకావా ? స్త్రీ స్తనాల్లో మాంసం తప్ప, శంకరుడికి పాలు కన్పడలేదా ?

నీవెవరు ? నేనెవరు ? తల్లెవరు ? తండ్రెవరు ? స్వప్న సదృశ్యమైన ఈ విశ్వమంతా అపారమని మిథ్యావాదాన్ని బోధించేవాడు సాంఘిక విప్లవకారుడా ? అంతా మిథ్య అనేవాడికి స్త్రీ దేహం మాంసవసాదివికారమైందా ?

భగవద్గీతను, విష్ణుసహస్రనామాలను పఠించి, సర్వదా విష్ణుపాదాలను ధ్యానించడమే జీవిత ధ్యేయమని వర్ణించేవాడు హేతువాదా ?

బ్రహ్మమంటే పదార్థమేనన్న అర్థాన్ని సాధించే పండితులకు "భజగోవిందం"లో కూడా పదార్థవాదం, భౌతికవాదం, నాస్తికత్వం, హేతువాదం, సాంఘికవిప్లవతత్వం, మానవవాదం కన్పిస్తున్నవా ? అందులో బౌద్ధధర్మ ప్రభావం కూడా కన్పిసున్నదా ?

భజగోవిందంలోని శ్లోకాలు చెప్పినవాడు వేషానికి సన్యాసా ? ప్రవృత్తి రీత్యా సన్యాసా ?

నయాశాంకరులు "జటిలోముండీ" శ్లోకాన్ని కోట్‌చేయడంలోని రహస్యమేమిటి?

'బోడినెత్తితోపాటు కాషాయాంబరాలు ధరించడం బౌద్ధులే కనిపెట్టా'రని అనడం అజ్ఞానంవల్లనా ? లేక పొరపాటువల్లనా ?

ఎందుకంటే బౌద్ధులవి కాషాయ బట్టలు కాదు కదా ? జ్ఞానాంధత్వంవల్ల శంకరాచార్యుడు భౌతికవాదిగా తోచినట్లే, వర్ణాంధత్వంవల్ల పసుపు రంగు కాషాయంగా కన్పిస్తున్నదేమో ! ఐనా, ఆనాటి యతిరాజులందరూ కాషాయాంబరాలో, నారచీరలో ధరించి వుండవచ్చు. కాని, వారి శిష్యులకు గోచులైనా వున్నవో, లేవో, చెప్పలేము. ఇంతకూ శంకరుడు బోడినెత్తి మీద ముసుగువేసుకున్న విషయాన్ని నయాశాంకరులు మరచిపోయారు. చివరకు శంకరుడికి బొట్టుపెట్టు కోవడంకూడా చేతకాకపోతే మాధ్వులు పెట్టారని అనేదాక నయాశాంకరులు దిగజారిపోయారు. ఇలా అందరూ తలా ఒక అలంకారాన్ని శంకరుడికి తగిలిస్తుంటే, అతని శిష్యులేమి చేస్తున్నారట! వైజ్ఞానిక నిజాయితీ బొత్తిగా దిగజారి పోయినప్పుడే ఇలాంటి విపరీత వార్తలు పుట్టించడం సాధ్యమవుతుంది.

బౌద్ధులశూన్యవాదం తత్వభేదంకాగా,శంకరుడి అద్వైతమాయావాదం దొంగ వేదాంతం. అది హైందవాన్ని ఉద్ధరించడానికి శంకరుడికి బాగా వుపయోగపడింది.

శంకరుణ్ణి హేతువాదులు ఆక్షేపించేది బోడినెత్తి, కాషాయాంబరాల గురించి కాదు. ఆ వేషంలో అతడేమి చేశాడో, దాన్ని ఎంచుతారు. సన్యాసి వేషంలో, పరకాయ ప్రవేశం పేరుతో రాజు భార్యల్ని రేప్ చేశాడని చెపుతున్నారే, అందుకూ శంకరుణ్ణి నిరసించడం.

రేప్ శబ్దం వినగానే ఉలిక్కిపడి భుజాలు తడవుకొంటే ఎలా ?

## భజన కవిత్వం

పాండిత్యాన్ని, కవిత్వాన్ని, తర్కాన్ని దుర్వ్యయం చేసినవారిలో శంకరుడు అగ్రగామి.

శంకరుడి భజగోవిందకవిత్వం విప్లవకమ్యూనిస్టు శ్రీశ్రీని సైతం ఆకర్షించినట్లుంది. ఆ బాణిలోనే తన "మరో ప్రపంచం" గేయం వున్నట్లు స్ఫురించిందని "అనంతం" (పేజి 184)లో ఆయన చెప్పుకున్నాడు. కాబట్టి కవిత్వంగా శంకరుడి "భజగోవిందం" కూడా జయ దేవుడి 'గీత గోవిందం'లాగా భేషుగ్గా వుండవచ్చు. కాని, అందులోని భావాలు అద్వైత వేదాంతి వెల్లడించదగినవేనా అనే సంశయం బుద్ధిగలవారికి రావాలి. గీతగోవిందంలో పండితుడైన రసికశ్రేష్ఠుడు దర్శనమీయగా, భజగోవిందంలోని రసభంగంలో దారి తెలియని నిరాశావాది, జుగుప్సావంతుడు, అజ్ఞుడు, మూఢుడు మనకు కన్పిస్తాడు. ఎదుటివాణ్ని మూఢమతీ అని సంబోధించిన శంకరుడే మూఢమతి అని స్పష్టమవుతుంది. శంకరుడిలో అడుగడుగునా ద్వంద్వ వ్యక్తిత్వం దర్శనమిస్తుంది. వివేకం, విచక్షణా శక్తి లేనివారికి అది ద్వంద్వ స్వభావంగా స్ఫురించదు.

శంకరాచార్యుడి పేర వెలసిన స్తోత్రాలు, స్తవాలు, చిల్లర రచనలను బట్టిచూస్తే, ఆయన ప్రముఖంగా శైవుడు, ఆ తరవాత దేవీభక్తుడు, ఆ తరవాత వైష్ణవుడు, విగ్రహారాధకుడిగా రకరకాల విగ్రహాలను, నదులను స్తోత్రం చేసిన భట్రాజుగా తేలతాడు. శంకరుడు కనపడ్డ రాతికల్లా మ్రొక్కాడనీ, తటస్థించిన దేవాలయాలన్నీ దర్శించాడనీ, అక్కడి దేవతా విగ్రహాలకు స్తోత్రాలు, స్తవాలు చెల్లించాడనీ తేలుతుంది. అవన్నీ పెళ్ళిళ్ళకూ, శ్రాద్ధాలకూ సంభావన కవిత్వం వ్రాస్తారే, ఆ బాపతు. అవి కాక, శంకరుడి పేర కొన్ని ఖండికలు, ప్రకరణాలు కూడా వున్నాయి. అందులో కొన్ని వేదాంత ప్రధానమైనవి. వెరశి మొత్తం ఆయన కృతులు 1128 అని కందుకూరి భోగట్టా. అందులో అధికభాగం శివుణ్ణి, శక్తిని స్తుతించినవే.

ఈ స్తుతులు శంకరుడివి కావనే వారి వాదాన్ని అంగీకరించడానికి మనకు అభ్యంతరం లేదు. కాని, అలా అనేవారే తప్పుడు సమర్థనల కోసం వాటినుంచి "జటిలో

ముండీ"లాంటి ఏదో ఒక శ్లోకాన్ని ఉదహరిస్తూ వుంటారు. కాగా, శంకరుడి పేరుతో ప్రచారంలో వున్న రచనల్లో ఏవి అతనివో, ఏవి అతనివికావో, తేల్చవలసిన బాధ్యత మనది కాదు. అలా తేల్చడానికి లోగా కుస్తీలు పట్టినవారున్నారు. ఆ కుస్తీల సారాంశం చూస్తే, చివరకు ఏదీ శంకరుడిదిగా మిగలదేమో ! "బ్రహ్మసూత్ర భాష్యం", "ఉపనిషద్భాష్యం", "గీతాభాష్యం" శంకరుడివనీ, మిగతావేవీ అతనివి కావనీ ఒక వాదం వుంది. బ్రహ్మసూత్రభాష్యం తప్ప, మరేవీ అతనివి కావనే వాదమూవుంది. అదీ అతనిదవునో, కాదో, ఎలా నిర్ణయించడం ? ఎందుకంటే, కొందరు నయాశంకర పదార్థవాదుల అభిప్రాయాలకు విరుద్ధంగా 'బ్రహ్మసూత్ర భాష్యం'లో శంకరుడు పరకాయ ప్రవేశాన్ని సమర్థించాడు. అద్వైతభావానికి విరుద్ధంగా వర్ణాశ్రమాచార ధర్మాలను సమర్థించాడు. బ్రహ్మవాదానికి విరుద్ధంగా విగ్రహారాధన చేశాడు. అందువల్ల వేర్వేరు శాఖల శంకరానుయాయులు "అద్వైతనామసిద్ధి" పొందడానికి అనువుగా ఆ రచనలన్నీ శంకరుడివేనన్న సంప్రదాయం నెలకొన్నది. లేక, అవి శంకరుడి జీవితంలో వేర్వేరు దశలకు చెందే రచనలనుకునే అవకాశమూ వుంది. అంతేకాక, అందులో కొన్ని(లేక, అన్నీనా ?) ఆయా తరాల్లో ఆయాపీఠాలను అధిష్ఠించిన వివిధ శంకరాస్వాముల వారివయ్యే అవకాశమూ వుంది. ఇక శంకరుడేమి చెప్పాడో, ఇదమిద్ధమని తెలుసుకొనేదెలా ?

"శంకరుడి కథకు ఇంతగతి పట్టడానికి" రామానుజ మతస్థులు, మాధ్వులు కారణమని కొందరు శాంకరులు వాపోతున్నారు. శంకరుడి కథను ప్రముఖంగా వ్రాసిన వారంతా అద్వైతులేనన్న విషయాన్ని వారు మరచిపోతున్నారు. ఇతరులు తమ గ్రంథాల్లో శంకరుడి ప్రస్తావన తెచ్చారు తప్ప, అతని జీవితకథను వ్రాయలేదు. వ్రాయబడినంత వరకు ఆ జీవిత కథలన్నీ ఆయన విపరీత చేష్టల చిత్రణలో ఏకీభవిస్తున్నాయి. కాబట్టి, ఏదైనా లోపం వుంటే శంకరుడి జీవితంలోనే వుండాలి కాని, అతని జీవితకథల్లో కాదు.

శంకరచరిత్రల్లో ముఖ్యమైనవిగా పరిగణించబడే వాటిని వ్రాసిన చిత్సుకుడు (బృహచ్ఛంకర విజయం), ఆనందగిరి (శంకర విజయం), విద్యాశంకరుడు (వ్యాసాచలీయం), గోవిందనాథుడు (కేరళీయశంకర విజయం), రాజచూడామణి దీక్షితుడు (శంకరాభ్యుదయం), అనంతానందగిరి(శంకర విజయం), సదానందుడు (శంకరదిగ్విజయసారం), చిద్విలాసుడు (శంకర విజయవిలాసం), మాధవాచార్యుడు (శంకరదిగ్విజయం), వల్లీసహాయ (ఆచార్యదిగ్విజయం),–అందరూ అద్వైతులే. అందులో కొందరు అద్వైతపీఠాధిపతులు కాగా, అందరూ శంకరుణ్ణి కీర్తించినవారే. కాబట్టి,

చరిత్రలో వెయ్యేళ్ల పైకాలం జరిగిన తర్వాత శంకర చరిత్రను సమన్వయం చేయవలసి వస్తే, పూర్వ రచనలను విస్మరించడానికి వీలులేదు. ఆ రచనల్లో శంకరుడి మహత్యాలు, భ్రష్టుపనులు-అన్నీ చిత్రితమైనాయి. శిష్యులు అంటగడితే, మహత్యాలు అంటగడతారుకాని, భ్రష్టుపనులు అంటగట్టరు. కాబట్టి, భ్రష్టుపనులు శంకరుడు చేసే అవకాశం వుంది. మహత్యాలు లేవు కాబట్టి, శంకరుడు చేయలేదని తేలుతుంది. తప్పుడు పనులను సమర్థించడానికే మహత్యాలు అంటగట్టారని తేలుతుంది.

అందువల్ల, శంకరుడి అధ్యాన్నచరిత్రను సమన్వయం చేయవలసిన అవసరం మనకు లేదు. అందుకు భావగమన చరిత్రను పరిశీలించనూ అవసరం లేదు. భావగమన చరిత్రను నిష్పాక్షికంగా పరిశీలిస్తే, శంకరుడు భావవిప్లవవిరోధిగా, సామాజిక విప్లవ విరోధిగా కన్పిస్తాడు. తనకు ముందు వెయ్యి సంవత్సరాలకు పూర్వం బయలుదేరిన ఉపనిషత్తుల్ని ఎవరో సూత్రీకరిస్తే, వాటిని సుత్తిగొట్టి సాగదీసి, తరతరాలవారికి ఆ సుత్తినే అందించడాన్ని భావగమన చరిత్రతో సమన్వయంచేసే పని మనదికాదు. అతని దుష్టపాత్రను నగ్నంగా బయటపెట్టడమే మన కర్తవ్యం.

# 3. సర్వం ఖల్విదం బ్రహ్మ

"సర్వం ఖల్విదం బ్రహ్మ" అంటే అంతా బ్రహ్మమయమని అర్థం, ఈ వాక్యం చాందోగ్యోపనిషత్తులోనిది. (3-4-1)

శంకరాచార్యుడు బాగా ప్రచారంచేసిన నినాదాలు కొన్నివున్నాయి. వాటిలో ఉపనిషత్తులనుంచి ఆయన ఎన్నుకున్న 'మహావాక్యాలు' ముఖ్యమైనవి.

ప్రజ్ఞానం బ్రహ్మ (శుద్ధ చైతన్యమేబ్రహ్మ) - ఐత. 3-3
అహం బ్రహ్మోస్మి (నేనే బ్రహ్మ) - బృహ. 1-4-10
తత్వమసి (అది నీవే) - చాందో. 6-8-7
అయమాత్మా బ్రహ్మ (ఈ ఆత్మే బ్రహ్మ) - మాండూ. 1

వేదాంతఫక్కీలో మాట్లాడాలనుకొనేవారు ఈ లిస్టును వల్లిస్తూవుంటారు, ఈ మహావాక్యాలే కొందరు సన్యాసులకు మహావరాలు.

శంకరుడు సైతం ఈ నినాదాలను అడ్డం పెట్టుకొని వర్ణ వ్యవస్థను పునరుద్ధరించాడు. అతని లక్ష్యం వర్ణవ్యవస్థ సముద్ధరణే కాని, బ్రహ్మావాదమూకాదు, అద్వైతమూకాదు. అందునిమిత్తం అతను దేశాన్ని మొత్తాన్ని నాలుగు భాగాలు చేశాడు. భాగానికొక పీఠం స్థాపించాడు. పీఠానికొక ఆచార్యుణ్ణి నియమించాడు. ఎవరి భాగంలోని వర్ణాశ్రమాచార ధర్మాలను వారు కాపాడేటట్లు కట్టడి చేశాడు. వారికి సహకరించే ధర్మాధికారిగా సుధన్వుడనే రాజుకు పట్టంకట్టిపోయాడు. ఆ కట్టడిని "మహానుశాసనం" అన్నారు. 26 శ్లోకాలుగా వున్న ఆ మహానుశాసనంలో ఈ క్రింది అంశాలను గమనించండి:

**5.** వర్ణాశ్రమ సదాచారా అస్మాభిర్యే ప్రసాధితః
రక్షణీయాస్తు ఏవైతే స్వేస్వేభాగే యథావిధిః ॥

**17.** సుధన్వాహి మహారాజస్త దన్యేచ నరేశ్వరాః
ధర్మపారంపరీమేతాం పాలయంతు నిరంతరమ్ ॥

**18.** చాతుర్వ ర్ణ్యం యథాయోగ్యం వాఙ్మనః కాయకర్మభిః
గురోఃపీఠం సమర్చేత విభాగానుక్రమేణవై ॥

**21.** ఆచారాక్షిప్త దండాస్తు సంతః సుకృతినో యథా
నిర్మలాః స్వర్గమాయాంతి కృత్వాపాపాని మానవాః ॥

**25. ధర్మస్య పద్ధతిర్హ్యేషా జగతః స్థితిహేతవే**
**సర్వవర్ణాశ్రమాణాంహి యథాశాస్త్రం విధీయతే ॥**

అంటే "ఆయా మఠాచార్యులు తమ తమ రాజ్యభాగాల్లో వర్ణాశ్రమాచార ధర్మాలు చక్కగా రక్షణ పొందేట్లు చూడాలి. సుధన్వుడు, ఇతరరాజులు ఆ ధర్మరక్షణలో పాల్గొనాలి. నాల్గువర్ణాల ప్రజలు త్రికరణశుద్ధిగా గురుపీఠాన్ని అర్చించాలి. ఆచార్యుడు విధించే దండనలను అనుభవించిన పాపికూడా పరిశుద్ధుడవుతాడు. కాన, ధర్మ నిర్వహణలో అతన్ని ఎవరూ అడ్డుకొనరాదు. సర్వవర్ణాలకూ శాస్త్రం నిర్దేశించిన ఆచార ధర్మాలు ఆచరణలో వుండేట్లు చూచే బాధ్యత రాజుపైన, ఆచార్యుడిపైన వుంది."

ఇది శంకరుడి అద్వైత మహానుశాసనం.

కేవలం వర్ణాశ్రమాచారధర్మాలను కట్టుదిట్టం చేయడమే ఆ శాసన లక్ష్యమని పై శ్లోకాలనుబట్టి స్పష్టమవుతుంది. శంకరుడి జీవిత లక్ష్యం కూడా అదే.

వర్ణాశ్రమాచారాల అసలురంగు తెలుసుకోవాలంటే, స్మృతుల్లోకిపోవాలి. వాటిలో శూద్రాదుల జీవనానికి విధించబడిన షరతులను పరిశీలిస్తే, హిందూధర్మ జీవనం ఎంత కుత్సితంతో, కాపట్యంతో అల్లిక వేయబడిందో అర్థమవుతుంది. నాలుగు వర్ణాలలో శూద్రులు అధములు కాగా, వారికంటే అధములు (వర్ణాల్లో కూడా లెక్కకురాని) అంటరాని వారున్నారు. ఇలాంటి వ్యవస్థను కట్టుదిట్టంచేయడానికే శంకరుడు బ్రహ్మవాదాన్ని అడ్డంపెట్టుకున్నాడు.

## ఇదేనా సర్వం బ్రహ్మమయం?

'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే సూత్రం శంకరుడి నరనరాల్లో జీర్ణించిందని బ్రహ్మవాదుల ప్రచారం. ఆ విషయానికివస్తే, శంకరుడిలో జీర్ణంకానిదే అది అని శంకర-చండాల కథ చెపుతుంది. ఆ కథ అబద్ధమనుకుంటే, మనీషా పంచకం చెప్పాడన్న వార్త కూడా అబద్ధం కావాలి. మనీషా పంచకం నిజమనుకుంటే, ఆ కథలోని నిజమెంతో మనం తేల్చుకోవచ్చు.

ఆ కథ ప్రకారం చండాలుడు తటస్థపడి నిలదీసిందాకా శంకరుడికి తాను చెప్పే అద్వైతం తనకే అర్థం కాలేదు. అర్థమేకాని వాడికిక నరనరాల్లో జీర్ణమయ్యేదెక్కడ? ఎదురు వచ్చిన చండాలుడ్ని శంకరుడు తొలగమంటే, "నీవు తొలగమనేది నన్నా, నా లోపలివాడ్నా ?" అని చండాలుడు ప్రశ్నించాడుట. ఆ ప్రశ్నతో శంకరుడిలో చావుతెలివి పుట్టిందట. అందుకే చంపేశారుట. చావబోయేదాకా శంకరుడు వర్ణాశ్రమాచార

ధర్మాలను పోషించాడు. పంచములనబడే వారిపట్ల అస్పృశ్యతను పాటించాడు. అదే ఆయన అద్వైతం. చండాల కథలోని సారాంశమూ అదే. ఏ కులస్థుడి బ్రహ్మం ఆ కులస్థుడిదే. కూలిపోతున్న వర్ణవ్యవస్థను నిలదొక్కడమే శంకరుడు చేసిన ఘనకార్యం.మనీషా పంచకమే అతని హత్యకు కారణమని జనశ్రుతి వున్నప్పటికీ, అతను మరొకందుకైనా చంపబడే అవకాశం వుంది. ఎందుకు చంపబడ్డా, కారణం చూపబడింది మాత్రం మనీషా పంచకం కథ. ఆయన రంకు చేష్టలన్నిటినీ పరకాయ ప్రవేశాది మహత్యాల పేరుతో సమర్థించడం జరిగిందనే అంశాన్ని మనం విస్మరించలేము. ఏది యేమైనా, ఈ హత్యోదంతం 'బ్రాహ్మణేతర' అద్వైతులంతా అంగీకరించే గాథే.

చండాలుడు నిలదీసిందాక శంకరుడికి "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనేది ఉపనిషద్వాక్య భజన పల్లవేగాని, అవగాహన కాదు. ఆ భావం జీర్ణమైవుంటే, చండాలుడ్ని తొలగమనే సమస్యేరాదు. ఇప్పుడందరూ సామాజిక స్పృహ కవిత్వం వ్రాస్తున్నట్లుగా, అప్పుడు శంకరుడు వేదాంతస్పృహ కవిత్వం వ్రాస్తున్నాడేమో ! కవిత్వం వరకే ఆ స్పృహ పరిమితమైందికాని, జీవితం దాక సాగలేదు. చండాలుడి ప్రశ్నతో నిజంగానే స్పృహ వచ్చి మనీషా పంచకం పేరుతో ఐదు శ్లోకాలు ఆశువుగా చెప్పాడంటారు. ఫలితంగా, శంకర పీఠాల్లోని, మఠాల్లోని ఫస్ట్‌సర్కిల్ వారే అతడ్ని హత్యచేశారని జనశ్రుతి.

ఐతే, ఇలా హత్యకావడానికి వెనుదీయలేదు కాబట్టి, శంకరుడు సాంఘిక విప్లవకారుడై పోయాడనీ, హత్య కాబోయే ముందు మనీషాపంచకం చెప్పాడు కాబట్టి, సర్వసమతావాది కూడా అయిపోయాడనీ నయాలు సర్టిఫైచేయడం అల్పజ్ఞతకు నిదర్శనం. ఆనాటి పీఠాల అధికార రాజకీయాలేమిటో మనకు దురూహ్యాలు. కాని, ఏకులం వాడు జ్ఞాని అయినా, వాడికి తాను నమస్కరిస్తానని ఐదు శ్లోకాల్లో శంకరుడనడం సర్వసమతావాదమున్నా, సాంఘిక విప్లమున్నూనా ? చండాలుడికైనా నమస్కరిస్తానంటే, చండాలకులం చండాలకులంగా నిలచిపోవడానికి అంగీకరించినట్లే కదా ? జన్మతః ఉచ్చనీచ తారతమ్యాలు ఆపాదించే వర్ణవ్యవస్థను గుర్తించడం సర్వసమతావాది లక్షణమేనా ? అంతటి మహా అద్వైతి వర్ణాశ్రమాచారాలను ఎందుకు ఖండించలేదు? పైగా ఎందుకు బలపరిచాడు? "ఓం వర్ణాశ్రమ ప్రతిష్టాత్రేనమః" అని అష్టోత్తర శతనామావళిలో కీర్తించబడే శంకరుడు సర్వసమతావాది అనీ, సాంఘిక విప్లవకారుడనీ అంటే, ఎవ్వరైనా నవ్విపోతారు.

అంతేకాదు, శూద్రుడికే జ్ఞానానికి అర్హత లేదని వాదించిన శంకరుడు చండాలుడెలా

జ్ఞాని కాగలడని "చండాలోస్తు సతుద్విజోస్తు గరురిత్యేషా మనీషామమ" అన్నట్లు ?

## శంకరుడి కులతత్వం

"శ్రవణాధ్యయనార్థ ప్రతిషేధాత్ స్మృతేశ్చ" (I-iii--38)
అనే బ్రహ్మసూత్రానికి భాష్యం వ్రాస్తూ శంకరుడేమన్నాడో చూడండి :

**"శూద్రుడికి జ్ఞానానికి హక్కు లేదనడానికి కారణం వుంది. వేదాలు వినడం, అధ్యయనం చేయడం, అర్థం చేసుకోవడం స్మృతులు శూద్రులకు నిషేధించినై. శూద్రుడికి వేదాలు వినే హక్కులేదనీ, వేదార్థం గ్రహించే హక్కులేదనీ, క్రతువులు చేసే హక్కు లేదనీ స్మృతి పేర్కొంటున్నది. వినడాన్ని నిషేధించడానికి సంబంధించి మనకు ప్రమాణమున్నది: 'శూద్రుడు వేదాలు వింటే అతని చెవుల్లో కరిగించిన సీసంకాని, లక్కకాని పోయాలి'. (గౌతమ ధర్మసూత్రం 2-12-4). 'శూద్రుడు నడుస్తూ వున్న స్మశానం, అందువల్ల శూద్రుడికి సమీపంలో ఎవ్వరూ వేదాలు చదువరాదు' (ప్రద్యువాహవా ఏతచ్ఛ్మశానం యచ్ఛూద్ర స్తస్మాచ్ఛూద్ర సమీపే నాద్యేతవ్యం - వశిష్టస్మృతి -18). దీన్ని బట్టి శూద్రుడికి చదువు నిషిద్ధమని తేలుతుంది. తాము వినేటట్లువల్లించడానికి వీలులేని వేదాలను ఎవరైనా ఎలా అధ్యయనం చేయగలరు ? అంతేకాక, శూద్రుడు వేదాలను పలికితే, అతని నాలుక కోసివేయాలి. అతను వాటిని వల్లించితే, అతని దేహాన్ని ముక్కలు ముక్కలుగా నరకాలి. (అథహాస్యవేదము పశృణ్వతస్త్ర పుజితుభ్యాం శ్రోత్ర ప్రతిపూరణ ముదాహరణే జిహ్వాచ్ఛేదోధారణే శరీర భేదః - (గౌ.ధ. 2-12-4) కాబట్టి వేదార్థాన్ని గ్రహించడం, ఆ ప్రకారం ఆచరించడం అతనికి నిషిద్ధం. 'వేదవిజ్ఞానం శూద్రుడికి చెప్పకూడదు', (మనుస్మృతి 4-80), 'అధ్యయనం, క్రతునిర్వహణ, దానధర్మాలు ద్విజులకొరకే' (గౌ. ధ. 9-1) 'బ్రాహ్మణ్ణి ముందుంచుకొని నాల్గు వర్ణాలవారికి పురాణాలలోని పుక్కిటి కథలను చెప్పవచ్చు' (భారతం, శాంతి. 321-49) అని వర్ణించడంవల్ల శూద్రులకు వేదాధ్యయనంద్వారా విజ్ఞానానికి హక్కు లేదని తేలుతుంది".**

ఇవి మన మాటలు కావు - శంకరుడివి. ఒకానొక బ్రహ్మసూత్రానికి భాష్యం వ్రాస్తూ స్వయంగా శంకరుడన్న మాటలు. ఇలా శ్రుతుల్ని, స్మృతుల్ని, ప్రమాణిస్తూ శూద్రులను జ్ఞానానికి అనర్హులుగా ప్రకటిస్తూ, శూద్రులపై విధించే కఠోర శిక్షలను సమర్థిస్తూ ఎంగిలికూతలు కూసిన 'శాస్త్ర దాసు'నిలో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' నరనరాల్లో జీర్ణించిందని వర్ణించే బ్రహ్మబంధువులను(నీచులను) చూచి మనం సిగ్గుపడాలి. దొంగ వేదాంతులకు, కపటసన్యాసులకు 'మానవవాదులు', 'సర్వసమతావాదులు' అని

బిరుదులిచ్చి భాషను రేప్ చేసే పండిత శిఖండులకు మానవసహజమైన ఇంగితజ్ఞానమైనా అడ్డురాదు. ఎవరి పట్ల ఎలాంటి అసూయాద్వేషాలు ఎంతగా కుళ్లి కంపు కొట్టినా, అమానుషమైన శాసనాలను సమర్థించి, పోషించి, ప్రచారంచేసిన శంకరుడి లాంటి వారిని మానవవాదులుగా ప్రదర్శించే దుస్సాహసానికి ఒడిగట్టడం ఆరోగ్యప్రదంకాదు. "శూద్రులు తాత్విక విషయ విచారణకు అర్హులు కారనే దుర్మార్గపు ఆలోచన ఆంధ్రవాల్మీకిలో మూర్తీభవించింది" అని వర్ణించగలిగిన తాత్విక వేషగాళ్ళు అంతకుముందు వెయ్యి సంవత్సరాలకు పూర్వం, అదే దుర్మార్గపు ఆలోచన శంకరుడిలో మూర్తీభవించి వుందని గుర్తించకపోవడం ఎంత అవివేకం !

వేదాంత సూత్రాలనబడే బ్రహ్మసూత్రాలను రూపొందించిన బాదరాయణుడు పచ్చి కులతత్వవాది. కాగా, అతని సూత్రాలకు భాష్యాలు వ్రాసిన వారిలో శంకరుడు అంతకంటె తక్కువ కులతత్వవాది కాదని పై సూత్రభాష్యం తెలియజేస్తున్నది. అతగాడూ, ఇతగాడూ ఇద్దరూ ప్రతీపగామి శక్తులే. ఇద్దరూ సాంఘిక విప్లవ విరోధులే, విధ్వంసకులే. వారిని అద్వైతులనడం–'వ్యాసభగవానులు', 'శంకరభగవత్పాదులు' అని శ్లాఘించడం పచ్చిమోసం. వాళ్లు తాత్విక వంచకులు.

## మాజీ రాష్ట్రపతి వర్ణచిత్రాలు !

మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారికి Philosopher of Untouchabilty అనే బిరుదుంది. దాన్ని సార్థకంచేస్తూ వర్ణవ్యవస్థపై శంకరుడిలోవున్న నమ్మకాన్ని సమర్థించడానికి అసత్యాలకు ఆయన పాల్పడ్డాడు.

Though the efficacy of caste institutions has ceased to be vital for Sankara, he allows room for belief in it. The traditional theory that birth in a particular caste is not a matter of chance, but is the necessary consequence of conduct in a former existence, inclines Sankara to accept the claim of the upper classes, gods & rishis, for the exclusive right to study Vedas. While Sankara holds that any man of any caste can attain the highest knowledge, he allows that those who follow the Brahminical rule of life should observe the obligations of caste. (Indian Philosophy, Vol, II, P. 616.)

The rules of Varnasrama are binding on the Hindu, since they express the higher mind of the community. (Ibid, P. 618.)

పూర్వజన్మ కర్మఫలం వల్ల మనుషులు ఆయా వర్ణాల్లో పుడతారనే సంప్రదాయ సిద్ధాంతంమీది నమ్మకం వల్ల శంకరుడు వర్ణాశ్రమాచార ధర్మాలను నామమాత్రంగా

విశ్వసించాడట ! ఏ వర్ణం వాడైనా, జ్ఞానం ఆర్జించవచ్చునని శంకరుడి అభిప్రాయమట! వర్ణాశ్రమాచార వ్యవస్థ హిందూజాతి ఉన్నత మానసిక స్థితికి చిహ్నమట !

బ్రాహ్మణులుమాత్రమే జ్ఞానాన్ని ఎలా ఆర్జించాలో శంకరుడు నిర్ద్వంద్వంగా చెప్పాడు. (బ్ర.సూ.భా. III, IV, 38 వగైరా)

బ్రాహ్మణేతరులకు జ్ఞానవిధిని చెప్పినప్పుడుకూడా, గతజన్మలో ఉత్తమ వర్ణసంజాతులైనందువల్ల వారికా యోగ్యత లభించిందని సమర్థించాడు. (Ibid, 34సూ)

జన్మరహస్యం తెలియని సత్యకామ జాబాలికి బ్రహ్మ జ్ఞానార్హత ఎలా లభించిందన్నప్పుడు అతనికి తండ్రి తెలియదనీ, ఆ సత్యం అతను చెప్పాడనీ, అలాంటి సత్యాన్ని బ్రాహ్మణేతరుడు చెప్పజాలడనీ, అందువల్ల ఆ సత్యం చెప్పిన సత్యకాముడు బ్రాహ్మణుడేననీ, ఉపనిషత్ ప్రమాణాలతో సమర్థించాడు. (Ibid, 37సూ)

శూద్రులపై స్మృతులు విధించిన కఠోర శిక్షలను ఎలా సమర్థించాడో లోగా చూచాం. కాబట్టి, శంకరుడికి 'పైన' అంతా బ్రహ్మమయమే కాని, అంతరంగంలో బ్రాహ్మడి బ్రహ్మం బ్రాహ్మడిదే, శూద్రుడి బ్రహ్మం శూద్రుడిదే. వాస్తవం ఇదికాగా, సర్ రాధాకృషన్ దీన్ని తలక్రిందులుచేసి ప్రదర్శించారు.

ఏదియేమైనా, మనీషాపంచకానికి సంబంధించిన కథ తప్ప, శూద్రుల్లో కూడా బ్రహ్మం వుంటుందన్న అభిప్రాయం శంకరుడికి కలదని రుజువు చేసే మరో సంఘటన శంకరుడి తప్పుడు జీవిత చరిత్రల్లో కూడా కన్పించదు. ఆ మనీషాపంచకాన్ని మనీషావంచకంగా వుపయోగించడానికి వీలులేదు. జాతిభేదాలను కాపాడడమే శంకరుడు స్థాపించిన పీఠాల లక్ష్యం. "అలింగక మచక్రాంక మనాసవ మనస్థికం, అనుచ్ఛిష్ట మరక్తార్ఘ్యం మతమే తద్వ్యవస్థితం" అన్నట్లు శైవంలోని లింగధారణనీ, వైష్ణవం లోని చక్రాంకితాల్ని, శాక్తంలోని మద్యసేవనాన్ని, కాపాలికంలోని కపాలమాలికల్ని, గాణాపత్యంలోని ఉచ్ఛిష్ట భోజనాన్నీ, సౌరంలోని రక్తార్ఘ్యాన్నీ తిరస్కరించి, ఆయా మతాలను కలగాపులగంచేసి, షణ్మతాచార్యుడనిపించుకున్నాడేమో శంకరుడు! అందుకే ఆయన సొంతమేమీ లేదంటున్నాం.

శంకరుడి వ్యక్తిత్వాన్ని అంచనా వేయాలంటే, అద్వైతాచార్యులు వ్రాసిన శంకరచరిత్రలను చూడాలి. ఆ చరిత్రల్లో కొంతయినా నిజం వుండవచ్చు. శంకరుడేమి చెప్పాడో తెలుసుకోవాలంటే అతని పేర ప్రసిద్ధమైన రచనలూ, భాష్యాలూ చూడాలి.అందులో కొన్నయినా అతనివయివుండవచ్చు. వాటి ఆధారంగా అతని జీవితానికీ, తత్వానికీ లభిస్తున్న ప్రచారాన్ని బట్టి, వాటిని ఖండించకుండా వదలడానికి

వీలులేదు. అవి అన్నీ అబద్ధమైతే, అతను ఫలానా వాదంచేశాడని చెప్పడానికి ఆధారం అసలే వుండదు.

"మనీషాపంచకం" శంకరుడు చెప్పాడా, మరొకడు చెప్పాడా అనే అంశం మన పరిశీలనలో భాగంకాదు. అందులో వెల్లడించిన భావాలవంటి వాటినే శంకరుడు తొలినుంచి వెల్లడిస్తూ వుండేవాడని అతని చరిత్రలు పేర్కొన్నాయి. మొసలినుంచి ప్రాణాన్ని కాపాడుకోడానికి శంకరుడు ఎనిమిదోయేట సన్యసించాడని అతని కథలు చెపుతున్నాయి. ఆ తర్వాత గోవిందుడివద్ద శిష్యరికం చేయడానికి వెళ్ళినపుడు అయన "నీవెవరవు?" అని అడిగాడట. అందుకు సమాధానంగా, "నాహందేహో నేంద్రియాణ్యంతరంగః" మొదలుకొని "నాహంకర్తాబంధమోక్షౌ కు తోమే" వరకు శంకరుడు చెప్పాడన్న శ్లోకషట్కంలోనిదంతా వేదాంతవైరాగ్యమే. అందులో అద్వైతం, జగన్మిథ్యావాదం వున్నాయి. అంటే, చావబోయేముందు అతనిలో ఏ తత్వం ప్రవేశించిందంటున్నారో, ఆ తత్వం అతను చదువుకోడానికి వెళ్లబోయేముందే అతనిలో వుందన్నమాట! కాబట్టి ఆ జబ్బు అతనికి పిన్నతనంలోనే అబ్బింది.

## స్త్రీజాతిపై విద్వేషం :

ఆ తర్వాత చెప్పిన ' నిర్వాణషట్కం ', ' నిర్వాణదశకం ', ' నిర్వాణమంజరి', 'నిర్గుణ మానసపూజ' అలాంటివే, 'కౌపీనపంచకం', 'యతిపంచకం' అలాంటివే. అందులో "ప్రశ్నోత్తరమణిమాలలో శంకరుడి వైరాగ్యం స్త్రీని నరకద్వారంగా వర్ణించేదాక పోయింది.

ద్వారంకిమేకం నరకస్యనారీ : నరకద్వారమేది ? స్త్రీ
సమ్మోహయత్యేవ సురేవకాస్త్రీ : మద్యంవలెమత్తెక్కించి సమ్మోహ పరచేది ఏది? స్త్రీ
కాశృంఖలా ప్రాణభృతాంచనారీ : ప్రాణులకు సంకెల వంటిది ఏది ? స్త్రీ
విశ్వాసపాత్రం న కిమస్తినారీ : విశ్వాసపాత్రం కాని ప్రాణి ఏది ? స్త్రీ
కిం తద్విషంభాతి సుధోపమం : విషమై అమృతోపమానం అనిపించేది ఏది? స్త్రీ
జ్ఞానం నశక్యం చ కిమస్తి సర్వైః యోషిన్మనో యచ్చరితం తదీయం : సర్వులకు ఎరుగబడజాలనిది ఏది ? స్త్రీ చిత్తం, శీలం

అంటూ స్త్రీ జాతిపై విషం వెళ్ళగక్కాడు శంకరుడు.

"నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" (స్త్రీలు స్వాతంత్ర్యానికి అర్హులు కారు) అన్న మనువును సహస్రథా మించిపోయాడు. స్త్రీల పట్ల జుగుప్సాకరమైన దురభిమానాన్ని ప్రకటించాడు.

మన సంస్కృతిలో స్త్రీకి అత్యున్నత స్థానం వుందని గార్గి, మైత్రేయి వగైరా పేర్లను దండకంగా చదివే బుద్ధిమంతులు మన సంస్కృతి నేపథ్యాన్ని పరిశీలించడానికి శంకర హృదయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. శంకరుణ్ణి మానవ సమతావాదిగా ప్రదర్శించదలచుకొనేవారు, స్త్రీలు మానవజాతి క్రిందకు వస్తారో, లేదో తేల్చి చెప్పవలసివుంది. స్త్రీలో బ్రహ్మం వుందోలేదో, వుంటే పురుష బ్రహ్మం వంటిదవునో కాదో, అద్వైతంలో ఈ ద్వైతానికి వివరణ యేమిటో చెప్పవలసి వుంది. ఊరకే సమాసాలు దొర్లించి, అతనికి బిరుదులిచ్చినందువల్ల ప్రయోజనం లేదు. గాలికూతలు అతన్ని ఆ బిరుదులకు తగిన వాణ్ణిగా నిరూపించలేవు.

మతాలన్నీ స్త్రీని చాలా చిన్నచూపు చూచినై. ఏమతమూ ఆమెను మానవిగా పరిగణించలేదు. మతాలన్నీ స్వతంత్ర జిజ్ఞాసను కట్టడిచేసి, అశాస్త్రీయ ప్రమాణాలను ప్రజలపై రుద్ది మానవ ప్రగతికి చాలా ద్రోహం చేసినై.

చార్వాకం మతం కాదు. జైన బౌద్ధాలు క్రమేపి మతరూపు సంతరించుకున్నా, అవి హైందవ శాఖలవంటి దుర్మతాలు కావు. హైందవేతర మతాలన్నీ కూడా పరతత్త్వం మీద నమ్మకం కలవే. కాని, సామాజిక వ్యవస్థాపరంగా చూస్తే హైందవం వంటి నికృష్టమైన మతం ప్రపంచంలో లేదు. స్వీయమతస్థుల్లోనే అది ఉచ్చ నీచ తారతమ్యాలను సృష్టించింది. సర్వమానవసమత అనేది హైందవం ఎరుగని భావం. అందుకే, ఇతర దేశాలనుంచి దిగుమతి అయిన ఇస్లాం, క్రైస్తవం లాంటి మతాలను ఆశ్రయించడానికి ఈ దేశంలోని పాటకజనం, దళితులు సిద్ధమయ్యారు. ఆ మతాల్లో ఇతరత్రా ఎన్ని లోపాలున్నా, అవి వారిని మనుషులుగా, తాము స్వీకరించిన మతంలోని మనుషులతో సమానహోదా కలవారుగా గుర్తించాయి.

అంతకుముందు చార్వాక జైన బౌద్ధాలు తమ శాఖల లోపల, వెలుపల కూడా వర్ణవిభేదాలను గుర్తించలేదు. వాటిని నాశనం చేసిన శంకరుడు వర్ణవ్యవస్థను గట్టిపునాదులపై నిలదొక్కాడు. అది చెదరకుండా వుండడానికి పీఠాలను కాపలా పెట్టాడు. చివరకు తామూ మనుషులుగా గుర్తించబడాలనే తపన, సంకల్పం పాటకజనాన్ని ఇస్లాం, క్రైస్తవాలలోకి నెట్టింది. కాగా, ఆ 'విదేశీ' మతాలు ఈ దేశంలో ప్రవేశించడానికి కూడా శంకరుడు పరోక్షంగా కారకుడైనాడు. ఈ విషయాలను మన మాజీ రాష్ట్రపతి నాజూకు భాషలో దాచారు.

బ్రతికినంత కాలం శంకరుడు చేసింది బ్రాహ్మణ మతోద్ధరణే. శంకరుడు చేశాడని చెపుతున్న ఏ ఒక్క సంఘటనకూ విప్లవమనే శబ్దాన్ని వాడడానికి వీలులేదు. శంకరుడు ప్రతిపాదించిన సామాజిక సిద్ధాంతం ఏమైనా వుందా ? ఏమీ లేదు. వర్ణవ్యవస్థ పునరుద్ధరణే ఆయన సిద్ధాంతం. వర్ణవ్యవస్థకు బీటలు కొట్టినవారు చార్వాకబౌద్ధాదులు కాగా, దాన్ని పునః స్థాపించినవాడు శంకరుడు.

నరనరాల్లో శంకరుడికి జీర్ణించిందంటున్న "సర్వం ఖల్విదం బ్రహ్మ" శంకరుడి సొంతంకాదు. అలానే "తత్వమసి"కూడా శంకరుడి సొంతం కాదు. అవి రెండూ చాందోగ్యోపనిషత్తులోనివి. "అహం బ్రహ్మాస్మి" బృహదారణ్యకోపనిషత్తు లోనిది. "అయమాత్మాబ్రహ్మ" మాండూక్యోపనిషత్తులోనిది. "ప్రజ్ఞానం బ్రహ్మ" ఐతరేయోపనిషత్తు లోనిది. వీటన్నిటిని కలిపి శంకరుడి పేరుతో డబ్ చేయడం శాంకరుల అలవాటు. పరమ నికృష్టమైన వర్ణవ్యవస్థను, ఆ నినాదాల చాటున దాచుకోవడం శాంకరుల ప్రవృత్తి. అద్వైతంతో పాటు, పై నినాదాలను కూడా అరువు తెచ్చుకొన్న శంకరుడి జీవిత ధ్యేయం సమతావాదాన్ని నిర్మూలించడం, అసమతావాదాన్ని పునరుద్ధరించడం. ఆ దుర్మార్గాన్ని అతను చాలవరకు సాధించాడనే చెప్పాలి. ఆ ఒరవడిని చేపట్టిన మొదటి ప్రసిద్ధాచార్యుడు శంకరుడు. అదే శంకరవిజయానికి అర్థం.

# 4. పరకాయ ప్రవేశం

"పరకాయ ప్రవేశ విద్య వున్నదని హేతువాదులు అమోదించ"రని నేను వ్రాసింది 1981 లో–శంకరాచార్యుడి శీలం అనే వ్యాసంలో. కాని, "కాయమే లేదనే శంకరుడు పరకాయ ప్రవేశం చేయడాన్నీ, 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని నరనరాల్లో జీర్ణించిన శంకరుడు ఎవడో నృసింహుణ్ణి స్తోత్రం చేశాడనడాన్నీ తప్పుగా ఖండించాలనే బుద్ధి కనీసం హేతువాదులకు కూడా లేకపోతే యేమనాలి," అని 'బ్రహ్మ పదార్ధవాది' ప్రశ్న.

ఇందులో హేతువాదుల ప్రస్తావన తేవడంలో మాత్సర్యం తప్ప, ఔచిత్యం లేశమైనా లేదు. పరకాయ ప్రవేశప్రక్రియ అనేది అబద్ధమని హేతువాదులకు తెలుసు. తెలియడమే కాదు, పరకాయ ప్రవేశమిష మోసమని కూడా వారి అభిప్రాయం. అయితే, శంకరుడు చేసిన ఏ తప్పుడు పనిని దాచడానికి శాంకరులీ అబద్ధాన్ని కల్పించవలసి వచ్చిందో, దాన్ని ఖండించకుండా వదలడం హేతువాదుల పద్ధతి కాదు.

అలానే, శంకరుడి నృసింహస్తోత్రం మీద కూడా హేతువాదులకు ఆసక్తిలేదు. తెగిపోయిన కప్పకాళ్ళు తిరిగి పెరిగినట్లుగా, కాలిపోయిన శంకరుడి కాళ్లు తిరిగి మొలిచాయని హేతువాదులు నమ్మరు. కాని, శంకరుడి కాళ్లపై వాతలు పెట్టబడే అవకాశం ఏ కారణం వల్ల కల్గివుంటుందో దానిపై హేతువాదుల ఆక్షేపణ.

శంకరుడు మంత్రం పెట్టి కొబ్బరిచెట్టును వంగదీసుకొని, దాని మీదుగా మండనుడి ఇంటిలో ప్రవేశించాడనే దానికంటే, గోడదూకి ఇంటిలో ప్రవేశించాడని ఎందుకనలేదో, దానిపై హేతువాదుల ఆసక్తి. తప్పుడు కథల్ని వ్రాసినవారిని వదలి, వాటిని హేతువాదులు సవరించలేదనడానికి సిగ్గుపడాలి.

శంకరుడు కాయమే లేదన్నాడని తప్పుడు సమర్ధనలకు పాల్పడడం వైజ్ఞానిక దివాళాకోరుతనాన్ని సూచిస్తుంది. అసలు కాయమే లేదన్న శంకరుడికి కాయం వుందా, లేదా ? తల్లి కాయం నుంచి అతను కాయంతో బయటకు వచ్చాడా, లేదా? శంకర విజయాల్లో వర్ణించిన విధంగా కాకపోయినా,"మరో అర్ధంలోనైనా" శంకరుడు పరకాయ ప్రవేశం చేశాడా, లేదా ? శంకరుడు ఏ తప్పూ చేయకపోతే, అతన్ని కాష్టం మీదికెక్కించి, బహిరంగంగా తగలబెట్టడానికి సాహసించడం ఎలా జరిగింది ? కాళ్లు కాలినపుడు శంకరుడు నృసింహుణ్ణి తలచుకొని ఏడ్చే అవకాశం వుందా, లేదా ? కాలినపుడు కాకపోయినా, మరొకప్పుడైనా శంకరుడు నృసింహస్తోత్రం చేశాడా, లేదా ? (శంకరుణ్ణి కాపాడడానికి పద్మపాదుడు నృసింహావతార మెత్తినపుడు శంకరుడా స్తోత్రం చెప్పాడని పేర్కొన్న గ్రంథాలుకూడా వున్నాయి.) శంకరుడి రచనలుగా ప్రసిద్ధమైన వందలాది

స్తోత్రాలు, స్తవాలు శంకరుడివవునా, కాదా ? ఈ ప్రశ్నలకు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' వాదులు సమాధానం చెప్పలేక, అసలు కథను మొత్తాన్నీ అబద్ధమని కొట్టివేయమనడంలో అర్థంలేదు.

వాస్తవానికి, అందరివలె శంకరుడికి కూడా కాయం వుంది. కాయంగా దానికి వుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి. అందరివలెనే అతనూ తిన్నాడు, త్రాగాడు. వ్యభిచరించాడు, నిద్రించాడు, మలమూత్రాదులు విసర్జించాడు. మరణించాడు. తినని వాడికి అడుక్కునే పని లేదు, తినేవాడికి అంతా లోపలే [illegible] పోదు. కాగా [illegible] శంకరుడెన్ని విద్యలు నేర్చినా, ఆ వ్యాపారాలు దానికి లేకుండా చేసే విద్యను నేర్పలేదు. ఈ కాయానికి అవేమీ లేకుండా వుంటే బాగుండేదని ఆయన కోరిక కావచ్చు. అలాంటి కోరికలు చాలామంది సన్యాసులకుంటాయి. ఆకలిదప్పులు, జరామరణాలులేని స్వర్గవాసుల్ని కనిపెట్టినవారు అలాంటివారే. తన కోర్కెలకు భిన్నంగా ఆహార నిద్రామైథునాదులున్నాయి కాబట్టి, ఈ బ్రతుకునే చీదరించుకోవడం, లేక చీదరించుకున్నట్లు నటించడం శంకరుడు అలవాటు చేసుకొని వుండవచ్చు. కాని, 'అంతా మాయ' అని పెడబొబ్బలు పెట్టినంత మాత్రాన, కాయం లేకుండాపోదు. ఇవేవీ బ్రహ్మానికి వుండవనుకొని ఆయన బ్రహ్మభజన చేశాడు. ఉన్నది బ్రహ్మమొక్కటే నన్నాడు. అనడంవరకైతే, ఈ కాయం మాయ అనికూడా అన్నాడు. 'మాయ' అనేది మరొకటివుంటే, ఆ తత్వం ద్వైతం ఎలాకాదో, బ్రహ్మానికీ – మాయకూ సంబంధమేమిటో ఎక్కడా చెప్పలేదు.

అయినా, ఈ రకమైన అద్వైతంలో శిక్షణపొందినవారు బ్రహ్మసత్యం, జగత్తు మిధ్య అంటున్నారు. మాయవల్లనే జగత్తు 'ఉన్నట్లు'గా కన్పిస్తున్నదంటున్నారు. మనకు భిన్నంగా అద్దం వున్నట్లే, బ్రహ్మానికి భిన్నంగా మాయ ఎందుకులేదో– అలా రెండూ వుంటే అద్వైతం ఎలా అవుతుందో, చెప్పలేకపోతున్నారు. ఈ ప్రపంచం బ్రహ్మంయొక్క ప్రతిభాస అయితే, బ్రహ్మంకూడా ఈ ప్రపంచం వున్నట్లే వుండాలి. అద్దంలో మన ప్రతిబింబం మనలాగే వుండడంలేదా ? అలాగే. మన బుద్ధి వక్రంగా వుంటే తప్ప, అది వక్రంగా కన్పించదు. ఈ ప్రపంచాన్ని మనం అనుభవిస్తున్నామంటే, బ్రహ్మంయొక్క ఆభాసను అనుభవిస్తున్నామనే వారి అర్థం. ఎలాగూ మనం బ్రహ్మాన్ని అనుభవించలేం కాబట్టి, అనుభవించే ప్రపంచాన్ని వదలి అనుభవానికందని బ్రహ్మాన్ని అనుభవించమనడం వెర్రితనం అవుతుంది. అనుభవానికి అందేదాన్ని ఆభాస అనీ, అందనిదాన్ని సత్యమనీ భ్రమించడం అవివేకం.కేవలం ఉపమానాల వల్ల వాస్తవికతను సాధించే పద్ధతి శాస్త్రీయం కాదు. 'లేని' బ్రహ్మంనుంచి 'ఉన్న' జగత్తును సాధించబూనడం తలతిక్క పద్ధతి.

నున్నగా తళుకుగావున్న ప్రతివస్తువూ మరో వస్తువును ప్రతిబింబిస్తుంది. వస్తువు వుంది, అద్దం వుంది, ప్రతిబింబమూ వుంది. అవి మూడూ వేర్వేరు వస్తువులు. 'ఉన్న' వస్తువు 'ఉన్న' అద్దంలో ప్రతిబింబిస్తుంది. (వస్తువును ఫొటో తీసినట్లే, దాని ప్రతిబింబాన్నీ ఫొటో తీయవచ్చు) బ్రహ్మలేదు, మాయలేదు. లేని వస్తువును ప్రతిబింబించి, ఉన్న వస్తువు (జగత్తు)ను ఉనికిలోకి తీసుకురావడమేమిటి ? ఇదెక్కడి వివేచన, ఇదెక్కడి తర్కం ? ఈ శంకరమార్కు తిక్కను నాస్తికత్వంగా వర్ణించేవారి తిక్కను మనం ఎలా అర్థం చేసుకోవాలి ? నాస్తి, అస్తిని ఉనికిలోకి తీసుకురావడం, ఆ అస్తిని ప్రాతిభాసికమనీ, మిథ్య అనీ వర్ణించడం, అలాంటిదాన్ని నాస్తికత్వమనడం శుద్ధ అవివేకమవుతుంది. లేనిదానినుంచి ఉన్నదాన్ని సాధించేది నాస్తిక పద్ధతి కాదు. ఆస్తిక పద్ధతి అది. అది తర్కంలోనూ అథమ పద్ధతి. ఏమైనా, అది సంప్రదాయ అద్వైత పద్ధతి.

శంకరుడు కాయమే లేదన్నాడని చెప్పే అద్వైతులే శంకరుడు కాయాన్నే (పదార్థాన్నే) బ్రహ్మమన్నాడని కొత్త అర్థాలు చెప్పి నయా అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఇలాంటి వారి బుద్ధికొలత మనకు అందదు. మానసిక వైద్యులకే అలాంటివారి స్థితి అంతు పట్టాలి.

ఎందుకంటే, కాయమే (పదార్థమే) బ్రహ్మమైనప్పుడు, కాయం లేకపోతే బ్రహ్మమూ లేనట్లే కాదా ? అవి రెండూ లేకపోతే, ఇక వుండేది మాయ ఒక్కటేనేమో ! నిజానికి పదార్థమే బ్రహ్మమైతే, శంకరుడికి చార్వాకాదులతో తగాదా కారణమేముంది ? చార్వాకులు వున్నదన్న పదార్థాన్నిలేదనీ, వారు లేదన్న బ్రహ్మాన్ని వున్నదనీ శంకరుడన్నాడు. అదే ముఖ్యమైన తగాదా అంశం.

కాయమేలేని శంకరుడు దేనితో వ్రాశాడు ? దేనితో చర్చించాడు ? అతనికి చేయీ వాయీ లేవా ? తత్త్వమనీ, వ్యావహారికమనీ పులుముడు పెట్టకుండా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత నయా అద్వైతుల మీద వుంది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ అని నరనరాల్లో జీర్ణించిన శంకరుడు ఎవడో నృసింహుణ్ణి స్తోత్రం చేయడమేమిటి ?" అని వంకర ప్రశ్న వేసి ప్రయోజనం లేదు. బ్రతికినన్నాళ్లూ ఆయన ఒకప్రక్క బ్రహ్మ భజన చేశాడు. మరోప్రక్క వందలాది దేవతా స్తోత్రాలతో, స్తవాలతో భట్రాజీయం చేశాడు. స్తోత్రాలూ, స్తవాలూ అతనివి కావనేది పలాయన వాదం. అవేవీ అతనివి కాకపోతే, అతనికిక చరిత్రేలేదు. క్షేత్రాలనూ, దేవాలయాలనూ దర్శించడం, కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించడం, పాతవాటిని పునః ప్రతిష్ఠించడం–స్తోత్రాలూ, స్తవాలూ వల్లించడం అతని నిత్యకార్య వృత్తి. నృసింహాష్టకం అతనిది కాకపోతే – మనీషాపంచకం, మాయాపంచకం, భజగోవిందం లాంటివి మాత్రం అతనివని ఎలా

చెప్పడం ? వీటిని శంకరుడి రచనలుగా ఉదహరించని అద్వైతులేరి ?

శంకరుడు చారిత్రక పురుషుడని అంగీకరిస్తే, అతని కథల్ని మొత్తం మొత్తంగా కొట్టివేయడానికి వీలులేదు. ఆ కథల్లో చాలా భాగం శంకరచరిత్రలన్నింటిలోనూ వున్నాయి. అవి ఇటీవలి వారు వ్రాసినవి కావు. శతాబ్దాల క్రితం వ్రాసినవి. అలాంటి చరిత్రలు 43దాకా వున్నట్లు ఒకరు క్రోడీకరించారు. మరొక 17 గ్రంథాల్లో శంకరుడి ప్రస్తావన వున్నదని కూడా అన్నారు. శంకరచరిత్రల్లో కనీసం 10 ప్రామాణికాలంటున్నారు. ఇవి అన్నీ శంకరుడి 'ఘనకార్యాల్ని' దాదాపు ఒకే విధంగా చిత్రించాయి. అలా, అవి ఏకీభవించే కథల్లో "పరకాయ ప్రవేశ కథ" ఒకటి.

ఆ కథను తొలగించి వేయమని నయా అద్వైతుల గోల. అలా ఎవరికి పనికిరాని కథను వారు తీసివేసుకుంటూ పోతే, ఇక శంకరుడి కథే మిగలదు. అయితే, అతని కథలు వాస్తవికసంఘటనలుగా ప్రచారమైనంతకాలం, అవి మోసుకొచ్చే ఆధ్యాత్మికబురద లోకానికి అంటుకోడానికి అవకాశం వున్నంతకాలం, హేతువాదులు వాటిని వుపేక్షించరు.

నేటి సామాజిక సాంస్కృతిక ప్రమాణాలనుబట్టి చూచినపుడు, ఏవి శంకరుడికి అప్రతిష్టను తెస్తాయో వాటిని తొలగించాలని నయాల వాదం. వాటిని తొలగించి శంకరచరిత్రను తిరగ రాయాలనుకొనేవారు రాసుకోవచ్చు. అలాచేస్తే, శంకరుడికి రాయదగిన చరిత్రే మిగలదు. అందుకే, తరతరాల గోసాయీలు రాసుకొచ్చిన పుచ్చు కథలను సమన్వయం చేయడం చేతకాక, గోసాయీల సంఘాల వారిప్పటకీ తన్నుకుచస్తున్నారు. ఆ పనికిమాలిన పని హేతువాదులు చేయరు.

భారతీయ తత్వంలో రియాక్షన్‌ని ఉధృతం చేసిన శంకరుడి నిజస్వరూపాన్ని బట్టబయలు చేయడం హేతువాదుల కర్తవ్యం. భారతసమాజం లోని అన్యాయానికి, అక్రమానికి, అవినీతికి, అసమానతకి, అమానుషత్వానికి, అసామాజిక స్వభావానికి, దుర్మార్గానికి, దౌర్జన్యానికి మూలమైన వర్ణాశ్రమాచారధర్మాల స్థిరీకరణకు అద్వైతం ముసుగులో శంకరుడు చేసిన కృషిని సమర్థించే సిగ్గుమాలిన పనిని హేతువాదులు చేయరు.

### పరకాయ శంకరం :

పరకాయ ప్రవేశ ప్రక్రియ లేదనే విషయం హేతువాదులకు తెలియకకాదు కాని, శంకరచరిత్రలన్నీ ఆ విషయాన్ని అలాగే ఎందుకు పేర్కొన్నాయి ? అనేది ప్రశ్న. ఒక్క 'శంకర విజయ'మైనా దాన్ని ఎందుకు ఖండించలేకపోయింది ? శంకరమతాలన్నీ

ఆ కథను అలాగే ఎందుకు విశ్వసించి ప్రచారం చేస్తున్నాయి ? శంకరుడి నాటినుంచి పారంపర్యంగా వస్తున్న శంకరమఠాధిపతుల్లో ఎవ్వరూ శంకరుడి వాస్తవ కథను ఎందుకు వ్రాయలేకపోయారు ? అందులోవున్న అవాస్తవాలను కనీసం ఖండించనైనా ఎందుకు ఖండించలేదు ? పైగా 'శంకరాచార్య అష్టోత్తర శతనామావళి'లో "ఓం పరకాయ ప్రవేశకృతే నమః " అని ఈనాటికీ ఎందుకు భజిస్తున్నారు.

అసలు కారణం వేరే వుంది. ఆ కథలేకపోతే, శంకరవిజయాల కథే లేకుండా పోతుంది. అదీ వారి మౌన రహస్యం.

పైగా, శంకరుడు పరకాయ ప్రవేశం చేయకుండా ఉదయ భారతితో కామకళా చర్చకు దిగినట్లయితే, అంతకుముందే అతనికి కామ కళానుభవం వున్నదని అపవాదులు వచ్చే అవకాశం వుంది కాబట్టి, శంకరుడు నిజంగానే పరకాయ ప్రవేశం చేసి, రాజు భార్యల్ని చెరిచాడని శృంగేరి పీఠాధిపతులైన అభినవ విద్యాతీర్థ స్వాములవారే అంగీకరించారుట. (పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి: శ్రీమచ్ఛంకర భగవత్పాదచరిత్ర. పేజి 259)

అంతేకాదు, శంకరుడు కాశ్మీరులోని సర్వజ్ఞపీఠాన్ని అధిష్ఠించడానికి ప్రయత్నిస్తుండగా, "నీవు సన్యాసివై వుండి కూడా లైంగిక సుఖం అనుభవించిన అపవిత్రుడవు కాబట్టి, సర్వజ్ఞపీఠం అధిరోహించే అర్హత నీకు లేదు"అని ఆకాశవాణి అభ్యంతర పెట్టినట్లు మాధవవిద్యారణ్యుడు వ్రాసిన 'శంకర దిగ్విజయంలో' రికార్డయివుంది. (16:8ł6) "మరొకరి శరీరంతో చేసినపని ఫలితం ఈ నా శరీరానికి చెందదు" అని శంకరుడు దబాయించినట్లుకూడా వుంది.

అదే గ్రంథంలో హస్తామలకుడి పూర్వ వృత్తాంతం చెపుతూ అతను బిడ్డగా వున్నప్పుడే మరణించాడనీ, అతని తల్లి దుఃఖాన్ని నివారించడానికి ఒకయోగి ఆ బిడ్డ దేహంలో పరకాయ ప్రవేశ విద్య సహాయంతో ప్రవేశించాడనీ, అందువల్లనే అతను బోధలేకుండానే వేదపండితుడు కాగలిగాడనీ ఒక కథకూడా వుంది.(శం. ది-13:33-40)

కాబట్టి శంకరుడి పరకాయ ప్రవేశ కథను హేతువాదులు కనిపెట్టనూ లేదు, కల్పించనూలేదు. అద్వైతులాకథను అంతగాఢంగా విశ్వసించడాన్ని బట్టి, అందులో మహత్యాలకు సంబంధించిన భాగం తప్ప, మిగతా గాథ జరిగి వుండవచ్చునని హేతువాదుల అంచనా.

## శంకరుడికే విశ్వాసం వుంది :

పరకాయ ప్రవేశ ప్రక్రియమీద శంకరుడికే నమ్మకమున్నట్లు బ్రహ్మసూత్రాలకు ఆయన వ్రాసిన భాష్యంలో చెప్పుకున్నాడు. సులభ అనే ఆవిడ సొంత శరీరాన్ని విడిచి జనకుడి శరీరంలోదూరి బ్రహ్మ జ్ఞాన చర్చచేసి, తిరిగి వచ్చి స్వ శరీరంలో ప్రవేశించినట్లు శంకరుడు వ్రాశాడని చెబుతున్న బ్రహ్మసూత్రభాష్యంలో వుంది. **(III, iii, 32)**

అలాంటి అవకాశం వుందని బ్రహ్మసూత్రభాష్యం 4వ అధ్యాయం, 4వ పాదం, 11-16 సూత్రాలకు చెప్పిన భాష్యంలో శంకరుడు సిద్ధాంతీకరించాడు.

శంకరుడివలె కామాతురులై ఇతరుల శరీరాల్లోదూరి తృప్తి పొందిన సౌభరి వంటివారు పురాణాల్లో మనకు కన్పిస్తారని శంకరుడే పేర్కొన్నాడు. **(IV, iv, 11-16)**

"దైవకార్య నిర్వహణకోసం జ్ఞానులు ఒక శరీరంనుంచి మరో శరీరంలో దూరడమనేది ఒక యింటినుంచి మరో యింటిలోకి పోయినంత తేలికగా చేస్తారని పరకాయ ప్రవేశావకాశాన్ని బ్రహ్మసూత్ర భాష్యంలో శంకరుడు నిర్ద్వంద్వంగా ఉటంకించాడు. **(III, iii, 32)**

స్వయంగా శంకరుడే ఆ మాటలంటుంటే, శంకరుడి పరకాయ ప్రవేశ గాథను ఖండించలేదని హేతువాదుల మీదపడి యేడ్చి ఏమి లాభం ? తాను చేసిన తప్పుడు పనిని సమర్థించుకోడానికి పరకాయ ప్రవేశావకాశాన్ని సిద్ధాంతీకరించిన శంకరుణ్ణి వదలి, ఆ కథ వెనకవున్న వాస్తవాన్ని ప్రశ్నించినందుకు హేతువాదుల్ని 'బుద్ధి' లేని వారని బరితెగించి నిందించడం బుద్ధిమంతుల లక్షణంకాదు. పొరపాటునో, ఉద్రేకంలోనో కాక, ఉద్దిష్టంగా, కామతృప్తి కోసం శవాన్ని ఆశ్రయించానంటున్న శంకరాచార్యుడిపై సానుభూతి చూపే నికృష్టవైఖరి హేతువాదుల్లో వుండదు.

పరకాయ ప్రవేశకథలో శంకరుడు చేశాడని చెపుతున్నది కేవలం వ్యభిచారం కాదు — అత్యాచారం. దానికి సంజాయిషీ చెప్పుకోలేని శాంకరులు దానిచుట్టూ పరకాయ ప్రవేశ మహత్యం అల్లిక వేశారు. అతడా భ్రష్టుపని చేశాడనే దానికి శంకర విజయాలన్నీ ఆధారంకాగా, అది అసలే జరగలేదనే దానికి ఆధారంలేదు. జరగలేదని నిర్ధారణ చేయడానికి వున్న అవకాశంకంటె, అసలు శంకరుడే పుట్టలేదని నిర్ధారణచేయడానికి ఎక్కువ వీలుంది.

## శంకర మఠాధిపతి చెప్పిన కథ :

క్రీ. శ. 1380–86 మధ్య శృంగేరీ శంకర మఠాధిపతి పదవిలోఉన్న మాధవ విద్యారణ్యులు వ్రాసినట్లుగా చెప్పబడుతున్న “శంకర దిగ్విజయం” లో శంకరుడి పరకాయ ప్రవేశ కథ మూడు అధ్యాయాలు (8, 9, 10.) ఆక్రమించిందంటే, ఆయన దృష్టిలో ఆ కథ ఎంత ప్రాముఖ్యం సంతరించుకొన్నదో మనకు అర్థమవుతుంది. మాధవుడు అద్వైత మఠాధిపతేకాని, ద్వైతీ, లేక విశిష్టాద్వైతీకాదు. సంస్కృతంలో ఆయన చెప్పిన కథనరీతిని తెలుగులో మనం టూకీగా చూద్దాం:

“మండనమిశ్రుడు సాక్షాత్తు బ్రహ్మదేవుడు. ఆయన భార్య ఉదయభారతి సాక్షాత్తు సరస్వతీదేవి. అవిడనే సరసవాణి అనికూడా అంటారు. ఆమె మధ్యవర్తిత్వం క్రింద మండనుడికీ, శంకరుడికీ మధ్య వేదాంత చర్చ జరిగింది. మండనుడి మెడలోని పూలదండ వాడిపోవడాన్ని బట్టి, అతను ఓడిపోయాడని ఉదయభారతి తీర్పు చెప్పింది. ఒప్పందం ప్రకారం మండనుడు సన్యాసం స్వీకరించాలి. సరస్వతి సత్యలోకానికి వెళ్ళిపోతానంటే, శంకరుడు ఆమెను పోనీయకుండా వనదుర్గా మంత్రం చేత బంధించాడు. మండనుణ్ణి శిష్యుడుగా స్వీకరించబోయేముందు శంకరుడు తనను గెలవాలని ఆమె పట్టుబట్టింది. స్త్రీలతో శాస్త్రచర్చ అసంగతమని మొదట తలాయించినా, చివరకు శంకరుడు చర్చకు అంగీకరించాడు. ఉదయభారతి ప్రశ్నలు ప్రారంభించింది;“కుసుమాస్త్ర శాస్త్రం’ (కామకళ) ఎన్నిరకాలు? దాని స్వభావం ఏమిటి? దాని కేంద్రాలేమిటి? శుక్ల కృష్ణ పక్షాల్లో అది స్త్రీ పురుషుల్లో ఏరకమైన మార్పు తెస్తుంది? స్త్రీ పురుషుల్లో అదెలా వ్యక్తమవుతుంది?”

శంకరుడు కామకళానుభవం ఎరుగని బాల సన్యాసి కదా? “నేర్చుకొని వచ్చి వాదిస్తాను, ఒక నెల రోజులు గడువి”మ్మని అడిగాడు, ఆమె అంగీకరించింది. శంకరుడు కామ వేటకై శిష్యులతో కలసి సంచారానికి బయలుదేరాడు. ఒకచోట అప్పుడే మరణించిన రాజు శవం వుంది. అతని పేరు అమరుకుడు. అతనికి వందమందికి పైగా అందమైన రాణులున్నారు. రాజు శరీరంలో దూరి అతని రాణులతో కామకలాపం జరపాలనే బుద్ధి శంకరుడిలో కల్గింది. ఆ పని జరిగితే, శంకరుడికిక అదేలోకమై పోతుందని భయపడి, అతని శిష్యుడు పద్మపాదుడు అభ్యంతరం లేవదీశాడు. అప్పుడు శంకరుడిలా అన్నాడు:–

**అనంగినోనప్రభవంతి కామహరేరివా భీరవధూసఖస్య**
**వజ్రోలియోగప్రతిభూస్స ఏష వత్సావకీర్ణత్వవిపర్యయోనః ॥**

సంకల్ప ఏవాఖిల కామమూలం స ఏవమేనాస్తి సమస్యవిష్ణో
తన్మూలహానే భవపాశనాశః కర్తుస్సదాస్యాద్ధ్రువ దోష దృష్టేః ॥
(శంకర ద్విగ్విజయం, 9అ, 90–91 శ్లో)

అంటే, "ఆరూఢయతులమైన మాకు కోరికలు కల్గవు. వజ్రోలియోగ ప్రభావం వల్ల మేము రేతస్సును స్తంభించగలం. మాకు స్త్రీ సంగమ దోషం అంటదు. కోరికలన్నిటికీ సంకల్పమే మూలం. విష్ణువుతో సమానమైన మాకు అలాంటి సంకల్పం లేకపోవడం వల్ల, స్త్రీ సంగమదోషం అంటదు" అని భావం.

అంతటితో వూరుకోక శంకరుడు వేదాంత వివరణ యిచ్చాడు:

"ప్రపంచాన్ని అభాసగా భావించే వాడికి ఏ దోషాలూ అంటవు. నూరు యాగాలు చేసినా అతనికి పుణ్యం రాదు. వేయి హత్యలు చేసినా అతనికి పాపం అంటదు. నిమిత్తమాత్రమైన కర్మలు జ్ఞానిని బాధించవు. అందువల్ల,నేనీ దేహంతో కామకలాపాల్లో మునిగి తేలినా, చెడు నన్ను అంటదు. అయితే, సన్యాసి ఇలా చేశాడని లోకం నన్ను ఉదహరించకుండా వుండగలందులకుగాను, మరణించిన మరో వ్యక్తి శరీరంలో దూరి నేను లైంగిక జీవితాన్ని అనుభవించబోతున్నాను" (శంకరదిగ్విజయం 9అ, 92–100) అని వివరించాడు.

(నైతిక నాస్తివాదం ఇలాకాక మరెలా వుంటుంది.? తప్పుడు పనులు చేసే 'మహానుభావులు' ఇలాంటి వేదాంతంతోనే తమతప్పుడు పనులన్నీ సమర్థించుకుంటారన్నమాట!)

"శంకరుడు తన శరీరాన్ని ఒక గుహలో విడిచి, శిష్యుల్ని కాపలాగా వుంచి, ఆత్మశరీరంతో అమరుకుడి శరీరంలోకి దూరాడు. రాజు బ్రతికాడు. అది చూచి రాణులు, మంత్రులు సంతోషించారు. అమరుకుడి శరీరం ద్వారా శంకరుడు దేవేంద్రుడిలాగా దేశాన్ని సుభిక్షంగా పరిపాలించాడు. అందమైన ఆ రాణులను తనివితీరా అనుభవించాడు. మద్యం త్రాగాడు. రాణుల చేత త్రాగించాడు. అర్థనిమీలిత నేత్రాలతో వారిని ముద్దాడాడు. ఆనందపారవశ్యంలో వారి నగ్న దేహాలను కౌగిలించుకున్నాడు భావప్రాప్తి కేంద్రాలను పరిశీలించాడు, లైంగిక భోగం ఎలాంటి ఆనందాన్నిస్తుందో గ్రహించాడు. వాత్సాయన కామసూత్రాలను అధ్యయనం చేశాడు. (ఇదంతా మాధవ విద్యారణ్యుడు వ్రాసిన శంకర దిగ్విజయంలోని బూతే.) కామభోగోపభోగాల్లో శంకరుడు కాలాన్నే మరచాడు. ఆయన పెట్టిన గడువుదాటి ఆరు రోజులు గడిచింది. శిష్యులు అనుమానంలో పడ్డారు. ఇక శంకరాచార్యుడు అక్కడే సరి అనుకున్నారు. రాజు (శంకరుడు)

చర్యలు మంత్రుల్లో అనుమానాలను రేకెత్తించినై. ఎవడో సిద్ధ పురుషుడు యోగశక్తి ద్వారా రాజు శరీరంలో జొరబడ్డాడని అనుమానించారు. అతడు తిరిగి తన సొంత దేహంలోకి వెళ్ళిపోకుండా చేయడం కోసం దేశంలో దహనంకాకుండావున్న శవాలన్నిటినీ తగలబెట్టమని భటులకు రహస్యంగా ఆజ్ఞలిచ్చారు. ఈలోగా శిష్యులు గాయకబృందంగా బయలుదేరి శంకరుడివద్దకు వెళ్లి, అతని కర్తవ్యాన్ని గుర్తుచేయగా, శంకరుడు రాజు దేహం విడిచి తన సొంత దేహంలో దూరాడు. ఇక్కడ రాజు మరణించాడు. ఈలోగా అక్కడ రాజభటులు శంకరుడి 'శరీరాన్ని' చితి మీదకు చేర్చి నిప్పు అంటించారు. అప్పుడే శరీరంలో ప్రవేశించిన శంకరుడు లక్ష్మీనృసింహ స్తోత్రం చేయగా మంటలు ఆరిపోయినై."

ఇదీ స్థూలంగా మాధవవిద్యారణ్యుడి "శంకర దిగ్విజయం" లోని వేదాంత బూతుకథ. రాణులతో లైంగికానుభవం పొందేటపుడే వారి సౌందర్యానికి ముగ్ధుడైన శంకరుడు "అమరుకమ్" అనే శృంగార శతకాన్నికూడా రచించాడుట.

"శంకరాచార్యుడి శీలం" అనే వ్యాసంలో ఈ కథను "శంకర దిగ్విజయం" నుంచి కాక వీరేశలింగం పంతులుగారి "శంకరాచార్యులు" అనే వ్యాసం నుంచి నేను కోట్ చేయడం జరిగింది. 1862లో అచ్చయిన సామినేని ముద్దునరసింహనాయనిగారి "హితసూచని" అనే గ్రంథంలో కూడా ఈ కథ ఇలానే వుంది. ఇప్పుడీకథను శంకర మఠాధిపతి వ్రాసిన గ్రంథం నుంచే ఉదహరించడం జరిగింది.

## ఈ కథ ఏమి చెపుతోంది ?

హేతువాదుల ఆక్షేపణ శంకరుడి పరకాయ ప్రవేశంపై కాదు, పరకాయ ప్రవేశంచేసి చేశాడన్న మానభంగంపైన, పరకాయ ప్రవేశం అసంభవమని వారి కెలానూ తెలుసు.

శంకరుడు ఏదో ఒక మిషతో అమరుకుడి రాణుల్ని మోసంచేసి చెరిచాడనేది ఆ కథలోని లోగుట్టు.(ఈ సన్యాసి ఏమీ చేయకపోతే, సన్యాసుల కళేబరాలన్నిటినీ తగలబెట్టే కార్యక్రమం ఆ రాజ్యం ఎందుకు చేపట్టినట్లు?)

ఫలితంగా అతని తొడలమీద వాతలు పెట్టివుంటే, ఆ బాధ తాళలేక లక్ష్మీ నృసింహుడికి మొత్తుకోళ్లు అర్పించాడేమో, ఎలా కాదనడం ?

పూర్వం యజ్ఞయాగాదుల పేరుతో రాజపురోహితులు రాజుల భార్యల్ని ఏమేమి చేసిందీ అయా క్రతుకాండల పద్ధతుల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ 20వ శతాబ్దపు స్వాములు, బాబాలు సైతం బడాబడా విద్యావంతుల్ని, నాగరికులనుకున్నవారినే మోసం

పని శంకరుడికి సాధ్యం కాలేదనుకోవడం అమాయకమవుతుంది. అయితే ఆ నిందను కప్పిపుచ్చుకోడానికి ఆయన శిష్యులు పరకాయ ప్రవేశ కథను కల్పనచేసి వుండాలి. శంకరుడు సర్వజ్ఞపీఠం అధిరోహించబోయే ముందే అతని కామకళానుభవం గురించి అభ్యంతరం వచ్చిందనే శంకర దిగ్విజయం వార్తనుబట్టి, శంకరుడి రోజుల్లో అతని బూతు విషయం బహుజన విదితమని నిశ్చయించుకోవలసి వస్తుంది.

ఐనా, లైంగిక ప్రవృత్తికి పాల్పడ్డందుకు శంకరుణ్ణి మనం ఆక్షేపించడంలేదు. ఆ పనికి పాల్పడేవాడికి సన్యాసి వేషమెందుకు? వుత్తుత్తి బోధలెందుకు? అంతా మాయ అనడమెందుకు? చేసిన పనికి పరకాయప్రవేశ మహత్యం అడ్డమెందుకు? అనేది మన ప్రశ్న; అందుకు చచ్చినవాడి పెళ్ళాలే కావలసి వచ్చారా? అనేది ప్రశ్న. ఆరోజుల్లో వేశ్యలున్నారుకదా, వారి కోసం ఎందుకు వెదకలేదని ప్రశ్న.

శంకర విజయాల్లో ఈ కథకు కీలకమైన స్థానంవుంది. ఆతిధ్యమిచ్చిన బ్రాహ్మణగృహస్థుడి భార్యను శంకరుడు బలాత్కారంగా చెరిచాడన్న "మణిమంజరి" కథనాన్ని మనం ఉదహరించుకోవడంలేదు. (నారాయణభట్టు అనే మాధ్వుడు మణిమంజరిని వ్రాశాడు.) శంకర శిష్యపరంపర వ్రాసిన శంకర చరిత్రలన్నిటిలోనూ ప్రసిద్ధంగా వున్న పరకాయ ప్రవేశం అనబడే రేప్ కథనే మనం ఉదహరించాం.

కాబట్టి, హేతువాదులీకథను ఏ కోణంనుంచి అర్ధంచేసుకుంటున్నారో తెలుస్తుంది. అందువల్ల హేతువాదుల్ని నిందించేవారు ఈ కథను కల్పించి గ్రంధస్థంచేసిన పురాశంకరుల మీదపడి యేడ్వాలి కాని, హేతువాదులమీదపడికాదు. ఆ కథలో కల్పన భాగం ఏమిటో హేతువాదులకు తెలుసు. కల్పన కావడానికి అవకాశం లేని భాగానికి నయాశాంకరుల సమాధానమేమిటి?

అసలు శంకరుడు మండనమిశ్రునితో చర్చించాడా? పూలమాలవాడిపోతే వాదంలో ఓడిపోయినట్లేనా? ఉదయభారతి మధ్యవర్తిత్వం వహించినమాట నిజమేనా? అంతకంటె పండితులెవ్వరూ మధ్యవర్తిత్వానికి లభించలేదా? స్త్రీ జాతితో తత్వచర్చచేయడానికి అంగీకరించని శంకరుడు ఉదయభారతిని 'వాదంలో మధ్యవర్తిగా' ఎలా అంగీకరించాడు? స్త్రీలకు విద్యార్హత లేనట్లూ, వారికి పాండిత్యమంటే వంటయింటి పాండిత్యమే అయినట్లూ, (అంటే పురుషబ్రహ్మం,స్త్రీ బ్రహ్మం వేరయినట్లూ) బృహదారణ్యకోపనిషత్తుకు వ్రాసిన భాష్యంలో వెల్లడించిన శంకరుడు (6-1-17), మండనుడితో చర్చలో అతని భార్య అయిన ఉదయభారతిని తీర్పరిగా ఆమోదించడం జరిగిందా, లేదా ? జరిగితే అలా జరగడంలోని రహస్యమేమిటి ? ఇవన్నీ, అబద్ధమైతే ఇక శంకరుడి విజయాల్లో ఏవి

నిజమయినట్టు ? బ్రహ్మపంకిలంలో కూరుకుపోయిన బ్రహ్మీశాబకాలు (బురదమట్ట పిల్లలు) ఆ బురదనుంచి బయటపడితే తప్ప, ఈప్రశ్నలు అర్థంకావు. శంకరుడు పరకాయ ప్రవేశం చేయలేదని లబలబకొట్టుకున్నందువల్ల ప్రయోజనం వుండదు. ఆ మాటకువస్తే, శంకరుడి విజయాలన్నీ అబద్ధాలే.

'శంకరదిగ్విజయాన్ని' ఇంగ్లీషులోకి అనువాదంచేసిన స్వామి తపస్యానంద శంకరుడు స్త్రీలతో కులకడాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ,

' It is King Amaruka and not Sankara who is actually involved in it . (Sakara Digvijayam, P.117.F.N.) అన్నాడు. చూచారా, ఈ స్వామి సైతం అద్వైతాన్ని మరిచాడు. ఏ కాయమైతే ఏమిటట ? బ్రహ్మాన్ని వదలి ఆభాసకు ప్రాధాన్యమిచ్చి, ఆ పని అంతా శవమే చేసిందంటున్నారు స్వామి. దేశపరిపాలన ఇంద్రుడిలాగచేస్తే, అది అమరుకుడు కాక శంకరుడే చేసినట్టా? రాణులతో కామకలాపాలు సాగిస్తే అది శంకరుడు కాక అమరుకుడు చేసినట్లా ? ఏదయినా చచ్చినవాడెలా చేస్తాడు ? శాంకరుల అయోమయం ఇలానే వుంటుంది. అనుభవించేది అమరుకుడైతే, కామకళాజ్ఞానం శంకరుడికెలా లభిస్తుంది ? ఆమాత్రం భాగ్యానికే శంకరుడు అమరుకుడి శరీరంలో దూరడమెందుకు ? ఏ పౌండరీక యజ్ఞంలోనో ప్రేక్షకుడుగా వుంటే సరిపోదా ? అనుభవంతో తప్ప జ్ఞానం సాధ్యంకాదనీ, వూరికే కళ్లుమూసుకుంటే జ్ఞానం లభించదనీ శంకరుడికి కూడా తెలుసునని ఈకథ బోధించడంలేదా ?

శవంలో దూరి వ్యభిచారం చేయబోతున్నాని శంకరుడు స్వయంగా చెప్పినట్లు శంకరదిగ్విజయం ఘోషిస్తున్నది.(9-90,91). కాబట్టి, రాణులతో లైంగిక కార్యకాలాపాల్లో పాల్గొన్నవాడు శంకరుడే కాని, అమరుకుడు కాదు. అలాకాక అంతా అమరుకుడే చేస్తే, అతని శరీరంలో శంకరుడెందుకు దూరినట్లు ? పైగా, భావప్రాప్తి పొందే కేంద్రాలను కూడా శంకరుడు తడవిచూచాడుట! రేతఃపతనం కాకపోతే, భావప్రాప్తి ఎలా కలుగుతుంది? ఆ అనుభూతి ఎలా సిద్ధిస్తుంది ? ఏ అనుభూతితో అమరుకమ్ వ్రాయడం సాధ్యమైంది ?

అయినా, పెళ్ళిపెటాకులు లేని శంకరాచార్యుడు వీర్యస్థంభనవిద్య(వజ్రోలియోగం) అభ్యసించడమేమిటి ? అయనకది ఎందుకు అవసరమైందట ? కామకండూతి తీరని వారికే వీర్యస్థంభన కాంక్ష, తపన వుంటుంది.

అంతేకాదు,శంకరుడన్నాడని చెపుతున్న మాటల్నిబట్టి చూస్తే, వజ్రోలియోగం సాధన చేసిన యోగులు వ్యభిచారం చేసినా, అది వ్యభిచారం కింద లెక్క కాదు. (రేతః పతనమైతేనే వ్యభిచారం క్రింద లెక్కన్నమాట! మనువు ప్రకారమైతే రేతఃపతనమైనా, స్త్రీ గర్భం తాల్చకపోతే, ఆమే వ్యభిచారం చేసినట్లు కాదు.) అయినా, ఆ పని అంతా శవమే చేసిందనే స్వాములవాదం శంకరతత్వానికి సరిపడుతుందా ? అంతా బ్రహ్మ మయం కాబట్టి, అందులో ఎవరు ఎవరిని ఏమి చేసినా, అంతా తనను తాను చేసుకున్నట్లే లెక్క అందులో నీతి లేదు, అవినీతి లేదు. అదంతా నైతికనాస్తి వాదం-ఎథికల్ నిహిలిజం.

పరకాయప్రవేశ కథలో చారిత్రక సత్యం ఎంతవున్నా పురా-నయా అద్వైతుల ధోరణులు వేర్వేరుగా వున్నాయి. రెండూ ఒకటి కాదు. కాని, రెండు కాదనేదే అద్వైతం.

# 5. బౌద్ధంతో ప్రత్యక్ష వైరం

'శంకర విజయా'లన్నీ శంకరుడి వైజ్ఞానిక కసరత్తును ఘనంగా వర్ణించాయి. స్తోత్రాలను, స్తవాలను వదలితే, ఆయన ప్రజ్ఞ కనిపించేది భాష్యాల్లోనే. ప్రస్థానత్రయ భాష్యాలు అతనివేననుకున్నప్పటికీ, వాటిలో వెల్లడించిన తాత్త్వికదృక్పథం ఏక ముఖంగా లేదు, భావసమైక్యత లేదు. కలలోని ప్రపంచంలాగా వాస్తవిక జగత్తుకూడా మిథ్యేనన్న భావాన్ని మాండూక్య కారికల వ్యాఖ్యానంలో ఆయన పోషించాడు. బ్రహ్మసూత్ర భాష్యంలో కొన్ని సందర్భాల్లో ఆ గొంతుమార్చాడు. బౌద్ధులతర్కం ప్రభావం ఆయనవాదంలో కన్పిస్తుంది. కాని, ఆ వాదంలో చిత్త శుద్ధి కన్పించదు. వాదం కోసం వాదం చేసినట్లు అనేకసార్లు పట్టుబడతాడు. వైదికసాంప్రదాయికులతో, పూర్వమీమాంసికులతో వివాదంలో, అర్థవివరణలో ఆయన విభేదించాడు తప్ప, మౌలికంగా వైదిక హైందవగాడిని తప్పలేదు. సాంఖ్య, వైశేషిక, జైన. బౌద్ధ, లోకాయత సూత్రాలవిషయంలో మౌలికంగానే ఆయన విభేదించినట్లు స్పష్టమవుతుంది. ఈ విషయాలన్నీ శంకరాద్వైత తాత్త్విక స్వరూపాన్నీ, ఇతర తత్వాలతో దాని సంబంధాన్నీ పరిశీలించే టప్పుడు చూడగలం.

శంకరుడు అర్థం చెప్పడం మొదలు పెట్టిన తర్వాత బ్రహ్మానికి అర్థంలేకుండా పోయింది. పురాణాల్లోకి వెళ్ళితే "బ్రహ్మపదని" కోసం తన్నులాడుకొని, బ్రహ్మజ్ఞాని, బ్రహ్మర్షి బిరుదులు పొందినవారు కన్పిస్తారు. కాని, పురాణాలకు పూర్వమే శైవవైష్ణ వాలూ–శివాలయాలూ, విష్ణ్వాలయాలూ ఇంకా అనేక పేర్లతో శక్తి ఆలయాలూ వున్నట్లు తెలుస్తుంది. వాటి వెనకవున్న మతాలు తమతమశాఖల్ని సమర్థించుకోడానికి పురాణాల్ని కల్పించినట్లు ఆ రచనల్లో దేవుళ్ళ మధ్య, బ్రహ్మర్షుల మధ్య ప్రజ్వరిల్లిన యుద్ధ వాతావరణాన్ని బట్టి తెలుస్తుంది. ఈ దేశంలో బయలుదేరిన మతాల్లో చిట్టచివరిదీ, బలమైనదీ పౌరాణిక హైందవమే. జైన, బౌద్ధ, లోకాయత. సాంఖ్య, వైశేషికాది భిన్నదార్శనిక పద్ధతులు పురాణాలకు ముందటి వేనని ఆయా పురాణకథాంశాలవల్ల వెల్లడవుతుంది. పురాణాలెన్ని కట్టుకథలు వ్రాసినా, రుషభుణ్ణీ, బుద్ధుణ్ణీ అవతారపురుషులుగా పరిచయం చేసినందువల్ల–శంకరుడికి పూర్వం హైందవం, జైన బౌద్ధాలతో పడిన ఘర్షణస్వరూపం అయోమయంగా తయారైంది. "లోకంలో పాపాన్ని పెంచడం కోసం విష్ణువే ఆ అవతారాలెత్తి జైన బౌద్ధాది మతాలను ప్రచారం చేసినట్లు" కథలల్లారు. కాగా, శంకరుడు వచ్చేనాటికి బౌద్ధంలో శాఖలు పెరిగినా, దార్శనికంగా బౌద్ధం స్థాయి తగ్గలేదు. ప్రసిద్ధ బౌద్ధదార్శనికులున్నారు. పల్లవులు, విష్ణుకుండినులు బౌద్ధవ్యవస్థలపై హింసాత్మకంగా దాడులు చేసినా సాంఘికంగా,

మత వ్యవస్థగా పీఠాల నిర్మాణం పూర్తిగా శిధిలంకాలేదు. బౌద్ధం ప్రాభవం తగ్గడానికీ, చివరకు అది ఈ దేశం నుండి ప్రజోద్యమంగా అంతర్ధానం కావడానికీ ప్రత్యక్షకారకుడు శంకరుడేననటానికి మనకు తగినన్ని చారిత్రకాధారాలున్నాయి.

క్రీస్తుశకం ఒకటో శతాబ్దానికే దక్షిణాదిన జైనబౌద్ధాలు బాగా ప్రచారంలో వున్నట్లు 'మణిమేఘుల', 'శిలప్పతికారం' వంటి గ్రంధాలవల్ల తెలుస్తుంది. కంచిలో, కావేరి పట్టణంలో పెద్ద బౌద్ధవిహారాలుండేవిట. హీనయానబౌద్ధానికి కంచి ప్రధాన కేంద్రం. ఇప్పుడు శివకంచి, విష్ణుకంచి వున్నాయి. వాటిని శంకరుడే నిర్మించినట్లు గురు వంశకావ్యం చెపుతున్నది. ఆనాడు బుద్ధకంచికూడా వుండేది. బుద్ధఘోషుడు (క్రీ॥శ॥ 400) అక్కడవుండి 'మనోరధపూరణి' అనే గ్రంథం వ్రాశాడు. బౌద్ధం తగ్గుముఖం పట్టిందన్నాడన్న యువాంగ్‌చ్వాంగ్ (7వ. శ.) వ్రాత ప్రకారమే ఆనాడు కంచిలో వందకు పైగా బౌద్ధవిహారాలు, 80 దేవమందిరాలు, 10 వేలమంది బౌద్ధభిక్షువులు వుండేవారట. అప్పటి కంచిపాలకులు బౌద్ధాన్ని స్వీకరించారు, గౌరవించారు, ప్రచారం చేశారు. బౌద్ధ ప్రచారంకోసం కంచి రాకుమారి కొరియాకూడా వెళ్ళిందట. బౌద్ధులకు కంచి గొప్ప అధ్యయన కేంద్రం. నలందా మొదలైన విశ్వవిద్యాలయాలకు కూడా అక్కడ నుండి అధ్యాపకులను పంపేవారట. చైనా, కొరియా, జపాన్ మొదలైన ప్రాచ్యదేశాల్లో బౌద్ధమత ప్రచారం కంచినుండి వెళ్ళిన బోధకుల ద్వారానే జరిగిందట.

కంచి గొప్ప బౌద్ధ కేంద్రమనేదానికి నిదర్శనంగా అక్కడ బుద్ధ విగ్రహాలు, విగ్రహ శిధిలాలు అసంఖ్యాకంగా లభించాయి. కామాక్షి దేవాలయానికి అరమైలు లోపలే ఐదు బుద్ధ విగ్రహాలు లభించాయి.

కామాక్షి మందిర ప్రాకారంలో దొరికిన బుద్ధ విగ్రహం దాదాపు ఎనిమిది అడుగుల (7'–8") ఎత్తున్నది. అది ఏడవశతాబ్ది నాటిదని పురావస్తు తత్వ శాస్త్రజ్ఞుల నిర్ణయం. కాబట్టి, అక్కడ ఒక పెద్ద బుద్ధమందిరం వుండేదన్నమాట.

దాని ప్రక్కనేవున్న తోటలో $5^1/_2$ అడుగుల, $3\ ^1/_2$ అడుగుల ఎత్తుగల రెండు బుద్ధ విగ్రహాలు లభించాయి.

విష్ణుకంచిలో మరోరెండు బుద్ధ విగ్రహాలు లభించాయి.

ధ్వజస్తంభం దగ్గరి మండప స్తంభాలపైన బుద్ధుడి మూర్తి, తారాదేవి మూర్తి చెక్కబడి వున్నాయి.

ప్రాకారానికి ఉత్తరం వైపున పద్మాసన బుద్ధ [illegible] విగ్రహాల ముక్కలు

సుందరయ్య A/C.No. 93446 500032

అసంఖ్యాకంగా పడివున్నాయి.

కామాక్షి మందిరంలోని బుద్ధ విగ్రహానికి క్రిందుగా ఆయన ఆర్గురి శిష్యుల ప్రతిమలు చెక్కబడివున్నాయి. అక్కడివారు దాన్ని శంకరుడిదిగా భ్రమించి పూజా పురస్కారాలు చేస్తున్నారు. ఆ విగ్రహం బుద్ధుడిది కాబట్టే పద్మాసనంలో చెక్కబడి వుంది. శంకరుడిది యోగపద్మాసన స్థితి. శంకరుడి శిష్యులు ఐదుగురు (4+1) కాగా, శిల్పంలో బుద్ధుడి ఆర్గురి శిష్యుల ప్రతిమలు చెక్కబడి వున్నాయి.

ఈ స్థితి కంతటికీ కారణమేమిటి? బుద్ధకంచి ఏమైంది? బుద్ధ విగ్రహాలు భూస్థాపితం కావడానికి కారణమేమిటి? అనేక బుద్ధ విగ్రహాలు ముక్కలు ముక్కలైన స్థితిలో, శివకంచిలో, విష్ణుకంచిలో ఎందుకు దర్శన మిస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానం మనకు శంకరుడి చేష్టల్లో లభిస్తుంది. ఆ చేష్టల్లో ముఖ్యమైనదీ, చెరిగి పోనిదీ పీఠాల స్థాపన.

## ప్రణాళికాబద్ధమైన దాడి

భారతదేశంలో నాల్గుదిక్కులా నాల్గు బౌద్ధ పీఠాలుండేవి: జలంధర (పంజాబు) ఒడియాస (ఒరిస్సా), పూర్ణగిరి(ఉత్తరప్రదేశ్), కామరూపం(అస్సాం). శంకరుడి కాలంలో కూడా ఇవి ప్రసిద్ధంగా వున్నాయి. శంకరుడు జలంధరను వదలి కాశ్మీరం లోని సర్వజ్ఞపీఠాన్ని వశపరచుకొన్నాడు. శృంగేరిలో శారదాదేవిని ప్రతిష్టించాడు. పూర్ణగిరిని అలాగేవుంచి, జ్యోతిర్మఠాన్ని నెలకొల్పాడు. ఓడియాస పీఠాన్ని వదలి, బౌద్ధులు బలంగావున్న జగన్నాథంలో పీఠాన్ని నెలకొల్పాడు. కామరూపాన్ని జ్యోతిర్మఠంలో అంతర్భాగం చేశాడు.

కంచి, ధాన్యకటకం, మీరి, నలందా, వల్లభీలలో బౌద్ధుల ప్రధాన విహార కేంద్రాలు, అధ్యయన కేంద్రాలు వుండేవి. వాటిలోనూ, వాటి సమీపంలోనూ శంకరుడు మఠాలను యేర్పరిచాడు; ఉత్తరదేశాన లుంబిని, బోధగయ, సారనాథ్, కుశీనర, శ్రావస్తి, సాంకాశ్య, రాజగృహ, వైశాలి, సాంచి, నలందా, కాశ్మీరం ఖ్యాతిగన్న బౌద్ధకేంద్రాలు. శంకరుడు బౌద్ధుల పూర్ణగిరిని స్వాధీనం చేసికొని, బదరీలో జ్యోతిర్మఠాన్ని నెలకొల్పి, అక్కడ పూర్ణగిరి అనే శక్తిని ప్రతిష్టించాడు. సారనాథ్‌కు పోటీగా కాశీనాథుణ్ణి పునరుద్ధరించాడు. కాశ్మీరంలో సర్వజ్ఞపీఠాన్ని ఆరోహించడంలో అక్కడ శంకరచార్యగిరి వెలసింది. దక్షిణాన కంచిలో శివుడ్ని, విష్ణువును ప్రతిష్టించి, కామాక్షిని పునః ప్రతిష్టించి, పౌరాణిక హైందవానికి దృఢతరమైన పునాదులు వేశాడు.

పడమర జునాఘడ్, థాంక్, సిద్ధస్సార, తెలలాజా, సానాహ్, వల్లభీ, భుజ, కొండనె, అజంతా, నాశిక్, జున్నార్ కార్లె, కన్హేరీలు గొప్ప బౌద్ధ కేంద్రాలు. వీటన్నిటికి మధ్యబిందువుగా ద్వారకలో శంకరుడు శారదాపీఠాన్ని నెలకొల్పాడు. దక్షిణాన నాగార్జున కొండ, ధాన్యకటకం (అమరావతి), శ్రీ శైలం, తిరుమలకంచి ముఖ్యమైన బౌద్ధకేంద్రాలు. వాటికి ప్రతిగా శంకరుడు కంచిలో కామాక్షిని, శృంగేరిలో శారదను ప్రతిష్ఠించాడు. కాగా, శంకరమఠాల్లో జగన్నాథం క్రింద అంగ, వంగ, కళింగ, ఉత్కళప్రాంతాలు; శృంగేరి క్రింద ఆంధ్ర, ద్రావిడ, కర్నాటక, కేరళ ప్రాంతాలు; ద్వారక క్రింద సింధు, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర ప్రాంతాలు; బదరి క్రింద కురు, కాశ్మీర, పాంచాల, కాంభోజప్రాంతాలు ఏలుబడిలో వున్నాయి. అనంతరం శ్రీ విద్యారణ్యుడు కూడలి, సంకేశ్వర, కరవీర, పుష్పగిరి, హవ్యక, శివగంగ, కొప్పాల, శ్రీశైలం, కామేశ్వరి, రామచంద్రపుర, ఆమని, ఘనగిరి, హోనహళ్ళి,భండీగరి, కైవల్యపుర, ముళబాగల, శిరాలి, భద్రాపుర, నృసింహవాడి, తీర్థముత్తూరు, తలకాడ, మొల్లవణ, పైరణ, కారీతీర్థ, రాజపుర, గంగోత్రి, తీర్థహల్ల, మునియూరు, గోకర్ణ, విశ్వేశ్వరారణ్యపుర, సంగమ, నెలమావు, హరిహరపుర మొదలైన మఠాలను స్థాపించి వాటిని శృంగేరి పీఠానికి అనుబంధం చేశాడంటారు. అందులో కొన్ని మఠాలవారు ఏవో ప్రతిష్ఠలుచేసి వాటిని పీఠాలుగా వ్యవహరిస్తున్నారు. అవికాక ఇంకా అనేక పీఠాలున్నాయి. అందులో కంచి పీఠాన్ని స్వయంగా శంకరుడే అధిష్టించాడని కంచి మఠంవారి వాదం.

దీన్నిబట్టి బౌద్ధులకు పోటీవ్యవస్థను శంకరుడెలా పన్నుగడ వేశాడో అర్థమవుతుంది. చరిత్రకారుల సంగతి అటుంచి "శ్రీ మచ్ఛంకర భగవత్పాద చరిత్ర" వ్రాసిన పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి సైతం పై వివరాలను క్రోడీకరించాడు. శంకరుణ్ణి నంగనాచిగా లోకానికి చూపెట్టాలనే నయాశాంకరుల ప్రయత్నం యెంత వ్యర్థమో ఈ వివరాలు స్పష్టం చేస్తాయి.

శంకరుడి తత్వంలో అంతా బ్రహ్మమేకాని, మనిషిలేడు. ఆచరణలో అంతా హైందవమేకాని, అన్యం లేదు. ఏడో శతాబ్దంలో చైనా యాత్రికుడు యువాన్‌చ్వాంగ్ భారతదేశం దర్శించి, ఇక్కడ బౌద్ధం ప్రభావం తగ్గుముఖం పట్టిందని వర్ణించినంత మాత్రాన ప్రజోద్యమంగా "బౌద్ధంపతనమై"ందనుకోవడానికి వీలులేదు. ఆకాలంలోనూ, ఆ తర్వాతనూ కూడా నలందా బౌద్ధ విద్యాలయం అత్యున్నత స్థితిలోవుంది. దక్షిణా దిన ప్రసిద్ధ బౌద్ధ విశ్వవిద్యాలయం వర్ధిల్లిన అమరావతిలో యువాన్‌చ్వాంగ్ దర్శించేనాటికి హిందూమత ప్రాబల్యం పెరిగినా, అక్కడి బౌద్ధభిక్షువుల సహాయంతో ఆయన మహా సాంఘిక " అభిధమ్మ గ్రంథాన్ని" అధ్యయనం చేసి, అక్కడివారికి

మహాయాన గ్రంథాలను బోధించాడు. ప్రజా వుద్యమస్థాయికిచేరే ప్రతి భావోద్యమమూ సిద్ధాంతస్థాయిలో కొంత దిగిపోతుంది. అలాంటి కారణంగానే తంత్రశాక్తేయాలు బౌద్ధంలోకూడా జొరబడినాయి. బుద్ధుణ్ణి విష్ణువు అవతారంగా మార్చి ప్రదర్శించ డంలో పౌరాణిక హైందవం కృతకృత్యమైంది. అవైదికాన్ని ప్రచారం చేయడం ద్వారా పాపాన్ని పెంచడానికి విష్ణువు బుద్ధుడి అవతారమెత్తాడన్నారు. అయినా హిందువులు యజ్ఞాలను, హింసను వదలకతప్పలేదు. అంతమాత్రాన బౌద్ధం పతనమైందను కోడానికి వీలులేదు. దాని ప్రభావం ప్రజల్లో ఎంతోకొంత బలంగా ఉండబట్టే శంకరుడు బౌద్ధపీఠాలకు పోటీగా దేశంలో నాల్గుదిక్కుల అద్వైతపీఠాలు స్థాపించవలసి వచ్చింది. ఆ కృషి లక్ష్యం బౌద్ధాన్ని తుదముట్టించడమే. కామాక్షి ప్రాకారంలో దొరికిన బుద్ధ విగ్రహం 7వ శతాబ్దిదని పురావస్తు తత్వ శాస్త్రజ్ఞులు నిర్ణయించారంటే, ఆ తర్వాతే దాన్ని పూడ్చారనే విషయం స్పష్టమవుతుంది. శంకరుడు 8వ శతాబ్దం లోనూ, 9వ శతాబ్ది ప్రారంభంలోనూ వున్నాడు. కాబట్టి, శంకరుడి కాలంలో బౌద్ధంమీద విధ్వంసక కార్యక్రమం జరగలేదని చెప్పడం సమర్ధనీయం కాదు.

## బౌద్ధనిర్మూలన ఎలా జరిగింది?

అసలు 5వ శతాబ్దానికి బౌద్ధం పతనమైందన్న అభిప్రాయమే అసమంజసం. 5వ శతాబ్దంలో వసుబంధు, 6వ శతాబ్దంలో చంద్రకీర్తి, 7వ శతాబ్దంలో ధర్మకీర్తి, 8వ శతాబ్దంలో శాంతరక్షితుడు, 9వ శతాబ్దంలో ధర్మోత్తరుడు, 10వ శతాబ్దంలో రత్నకీర్తి ప్రసిద్ధ బౌద్ధ దార్శనికులు. భారతదేశాన్ని విడిచి వెళ్ళిన చిట్టచివరి బౌద్ధా చార్యుడు శాక్యశ్రీభద్ర 13వ శతాబ్దివాడు (1127-1225). అంటే, శంకరునికి ముందు 4 శతాబ్దాల క్రిందటే బౌద్ధం పతనం కాకపోగా, శంకరుని తర్వాత 4 శతాబ్దాల వరకు కూడా భారతదేశంలో ప్రముఖ బౌద్ధ దార్శనికులున్నట్లు తేలుతుంది. తాము దర్శించి నప్పుడు కళింగలో 10 సంఘారామాల్లో 500 మంది, ఆంధ్రలో 20 సంఘారామాల్లో 3000 మంది, ధాన్యకటకంలో 20 సంఘారామాల్లో 1000 మంది భిక్షువులున్నట్లు యువాన్‌చ్వాంగ్ (629-645) పేర్కొన్నాడు. అయితే, ముస్లిం రాజ్యాధిపత్యం భారతదేశంలో స్థిరపడే లోపలే దానితో ముస్లింప్రభువుల సంబంధాలు ఎలా వుండేవో చెప్పలేము. కాని, వారి ప్రభుత్వాలు కుదురుకోలేదు. ఆఫ్గన్ సేనాని భక్తయార్‌ఖిల్జీ అధ్వర్యాన పఠాన్ సైనికులు బీహార్ 'ఓదంతపురి' మఠంలోని బౌద్ధభిక్షువులందరిని నిర్దాక్షిణ్యంగా వధించినట్లు పి. లక్ష్మీనరసు The Essence of Buddhism లో పేర్కొన్నాడు. అధిక సంఖ్యాక ముస్లిం ప్రభువులు హిందూమతంపై ప్రత్యక్షంగానో పరోక్షంగానో దాడిచేసిన మాట వాస్తవం. ఇక్కడ ముస్లిం ఆధిపత్యం

కుదురుకోక ముందే శంకరుడితో ప్రారంభించి, తర్వాత వచ్చిన శంకరపీఠాధిపతులు ముఖ్యంగానూ, ఇతర హైందవశాఖలు కొంతగానూ బౌద్ధాన్ని స్వీకరించిన జన సామాన్యాన్ని బాధించి వుండాలి. ఫలితంగా బౌద్ధదార్శనికులకు సైతం ఈ దేశంలో అండలేని స్థితి యేర్పడివుండాలి. గూండాల గుంపులముందు భద్రతలేని బౌద్ధదార్శనికులు విదేశాలకు ప్రవాసం వెళ్ళివుండాలి. అంతేకాని శంకరుడు కానీ, మరెవ్వరైనా కానీ, ప్రసిద్ధ బౌద్ధ దార్శనికుల్ని వాదంలో ఓడించినట్లు యెక్కడా నిదర్శనం లేదు. ఏ బౌద్ధ దార్శనికుడూ తన గ్రంథంలో శంకరుడి పేరు ప్రస్తావించలేదంటే, ఏ బౌద్ధ దార్శనికుడూ అతన్ని తాత్వికుడుగా గుర్తించలేదని అర్థంనవుతుంది.

శంకరుడు మండనుడితో, భట్టభాస్కరుడితో చర్చించి గెలిచినట్లు శంకర విజయాలు చెపుతున్నాయి. అయినా, వారు వైదికులేకాని, బౌద్ధులు కారు. అందులో మండనుడితో చర్చచేసిన విషయాన్ని నిజమని నమ్మడానికి వీలులేదు. మండనుణ్ణి అతను కలిశాడా. అనేదానిలోనూ సంశయాలున్నాయి. అయితే బూతుల్లోకూడా శంకరుడు ప్రజ్ఞావంతుడని చెప్పడానికే ఆ కథ అల్లినట్లు స్పష్టమవుతుంది. చేస్తే శంకరుడు బూతు చేశాడేమోకానీ, వాదం చేయలేదు. కాగా, కాపాలికుల్ని సంహరించడం తప్ప. వాదంలో వారిని ఓడించినట్లు శంకరవిజయాలుకూడా చెప్పడం లేదు. వేద వ్యతిరేకులైన బౌద్ధుల్ని ఓడించాలంటే వారి సిద్ధాంతం నేర్చుకోవాలనే లక్ష్యంతో కుమారిలభట్టు ప్రచ్ఛన్నంగా బౌద్ధకేంద్రంలోకి పోయి బౌద్ధాన్ని అధ్యయనం చేసినట్లు శంకర దిగ్విజయం చెపుతున్నది తప్ప, బౌద్ధులతో వాద వివాదాలను రికార్డు చేయలేదు. పూర్వ మీమాంసా పండితుడైన కుమారిలభట్టు కూడా ఏ బౌద్ధ దార్శనికులనూ గెలిచిన జాడలేదు. గెలిచినట్లు చెప్పుకోలేదు. కాబట్టి శంకరుడు కూడా బౌద్ధుల్ని తాత్వికంగా దెబ్బకొట్టాడనుకోవడం పొరపాటు. పైగా కుమారిలుని మేనల్లుడైన ధర్మకీర్తి శాస్త్రార్థంలో కుమారిలుణ్ణి ఓడించి, బౌద్ధంలోకి మార్చాడని లామా తారానాథుని కథనం. దానికి తగినట్లు ధర్మకీర్తి తన “వాదన్యాయం” అనే గ్రంథంలో కుమారిలుడి (శబరభాష్య) వార్తికాలను ఉదహరించి ఖండించాడు.

శంకరుడి కాలంలోనూ, ఆ తర్వాతనూ పిల్లరాజు లెక్కువగా హైందవం వైపు మొగ్గినట్లు అర్థమవుతుంది. దేశమంతా ముక్కలు చెక్కలై అంతటా పిల్లరాజ్యాలు వెలసిన రోజులవి. చెప్పుకోదగిన వైశాల్యం కల రాజ్యాలు ఆనాడు లేవు. పల్లవులు, విష్ణుకుండినులు చేసిన భీభత్సాన్ని తట్టుకొని కుదురుకొంటున్న బౌద్ధానికి పోటీగా పీఠాల వ్యవస్థను శంకరుడు స్థాపించ గలిగాడంటే, రాజరికం అండతోనే ఆ పని చేశాడు. అంతకుముందు నెలకొనివున్న బౌద్ధపీఠాల వ్యవస్థను నిర్మూలించడం

పోటీవ్యవస్థ స్థాపనలో భాగమే. ఆ పని రాజ్యపాలకుల అండతోనే శంకరుడు నిర్వహించాడు. దానికితోడు శంకరుడు తన యాత్రలో గూండాల గుంపుల్ని వెంటవేసుకున్నాడు. పిల్లరాజుల్ని, సేనానాయకుల్ని తోడు చేసుకున్నాడు. కాకుంటే, దేశ మంతా నెలకొన్న బౌద్ధవిహారాలను, బుద్ధమందిరాలను, బౌద్ధస్థూపాలను నిర్మూలించడం కేవల ప్రచారకులైన ఐదుపదిమంది అద్వైతసన్యాసులకు సాధ్యమయ్యేదికాదు, బౌద్ధదార్శనికుల్ని వాదంలో ఓడించడంద్వారా కాక, బౌద్ధాన్ని స్వీకరించిన సామాన్య ప్రజలను ఒక పద్ధతి ప్రకారం హింసించడం ద్వారా, దౌర్జన్య పద్ధతులను అవలంబించడం ద్వారా మాత్రమే బౌద్ధాన్ని జనస్థాయి నుంచి శంకరుడు తొలగించి వుండాలి. పలుచోట్ల విహారాలపై, స్థూపాలపై దేవాలయాలు నిర్మాణం కావడం యీవిషయాన్ని ధృవపరుస్తుంది. కంచిలో వేలాది బుద్ధవిగ్రహాలు ముక్కలు ముక్కలై పడి వుండడానికి, అక్కడ బౌద్ధవిహారాలు, బుద్ధమందిరాలు నామరూపాలు లేకుండా అదృశ్యం కావడానికి మరే కారణమూ కన్పించదు.

అశోకుడు 84000 స్థూపాల నిర్మాణంతో కీర్తిని అర్జిస్తే, ఆ 84000 స్థూపాల విధ్వంసంతో తాను కీర్తి సంపాదిస్తానన్న పుష్యమిత్రుడు క్రీ.శ. రెండో శతాబ్దంలో బౌద్ధనిర్మూలన కార్యక్రమం చేపట్టాడని చరిత్ర చెపుతుంది. శైవుడైన మిహిర గులుడు ఆ తర్వాత వేలాదిమంది బౌద్ధుల్ని చంపించాడు. శశాంకుడనే వంగరాజు బోధివృక్షాన్ని పెకలించడానికి 7వ శతాబ్ది మధ్యలో అనేకసార్లు ప్రయత్నించాడట.* తమిళ బౌద్ధుల్ని వధిస్తున్నట్లు, హింసిస్తున్నట్లు కంచిలోని వైకుంఠపెరుమాళ్ ఆలయంపైన-దక్షిణాదిన ఇంకా అనేక ఆలయాలపైన వున్న వుబ్బెత్తు కుడ్య చిత్రాలు (basrelief) చాటుతున్నాయని లండన్ హ్యూమనిస్టులో పి. రామనాథన్, ఉల్లేఖించారు. **బౌద్ధులు సామూహికంగా

---

*P. Lakshminarasu, The Essence of Buddhism, P.39

** Quoted by Premnath Bazaaz, The Role of Bhagavadgita in Indian History, P. 147.

"Apologists like Vivekandanda and Dr. Radhakrishnan describe Hinduism as a religion which never presented, nay, never proselytised the impalling of 8000 Tamilian Jains on a single day by the Tamilian Brahmin, Tirignana Sambhanda, at Madurai around 600 A.D. is a matter which is even now celebrated by an annual festival in the Meenakshi temple at Madurai and many other temples. The Vaikuntha Perumal temple in Kanchipuram is only one among numerous containing bas-relief sculptures of the murder and torture of Tamilian Buddhists and Jains."

వధించబడిన ఘట్టాలు భారతదేశ చరిత్రలో ఇంకా చాల దొరుకుతాయి. అయినా, కేవలం హింస ఒక్కటే అహింసావాదులైన బౌద్ధుల్ని ఈ దేశంనుంచి వెలుపలకు తరమలేదు. ఇలాంటి అఘాయిత్యాలు ఎన్నో జరిగినా, హైందవం పుంజుకొంటున్నా, 7వ శతాబ్దిలో భారతదేశాన్ని దర్శించిన యువాన్‌చ్వాంగ్ ఆనాటికింకా రెండు లక్షలమంది బౌద్ధ బిక్షువులున్నట్లు రికార్డుచేశాడు. ఆనాటి భారత జనాభాలో అది గణనీయమైన సంఖ్య కాబట్టి, కేవలం రాజుల దౌష్ట్యాల వల్లనే బౌద్ధం నాశనం కాలేదని తెలుస్తుంది. అట్లని, శంకరుడి కాలంలో బౌద్ధులపై దౌష్ట్యాలు జరగలేదని కాదు. "శంకరుడి ధర్మపాలకుడైన" సుధన్వుడు బౌద్ధులందరినీ ఆబాలవృద్ధులనూ చంపమనీ, అలా చంపనివారిని తాను చంపుతాననీ శాసించాడట.

శంకరుడికి పూర్వం వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, సూత్ర గ్రంథాలు వున్నాయి. అవి అన్నీ హిందూ మత గ్రంధాలే. ప్రజామతమైన బౌద్ధాన్ని అవి యేమీ చేయలేక పోయినై. భౌతికవాద అభ్యుదయవాద సిద్ధాంతాలనూ అవి చెణక లేకపోయినై. కాని, భౌతికవాద సిద్ధాంతాలమీద, బౌద్ధజైనాది అవైదికతత్వాల మీద భాష్యాలద్వారా విస్తృత స్థాయిలో తొలిసారిగా దాడి ప్రారంభించినవాడు శంకరుడు. తాత్విక దృక్పథాన్ని వెనక్కుతిప్పి భారతదేశంలో రినైజాన్స్ రాకుండా రివైవలిస్టు ఉద్యమానికి బీజాలు నాటినవాడుకూడా శంకరుడే. ఆ తర్వాతి మతాచార్యులూ, మత ప్రచారకులూ ఆ రివైవలిస్టు ధోరణినే కొనసాగిస్తూ రకరకాల ద్వైతాద్వైత వాదాలనూ, భక్తి ఉద్యమాలనూ కొనసాగించారు. వాటికి బాసటగా అనేక పురాణాలు రంగంలోకి దిగినై. ఆ పురాణాలన్నీ అభూత కల్పనల ద్వారా వర్ణవ్యవస్థనూ, అసమానతనూ సమర్థించినై. బ్రాహ్మణ్ణి భూదేవుడుగా వర్ణించని పూరాణంలేదు. శూద్రులకు కఠోర శిక్షలు ప్రతిపాదించిన మనుస్మృతిపై మేథాతిథి (825–900) భాష్యం కూడా శంకరుడి తర్వాతనే వచ్చింది. కాబట్టి (1) హింసద్వారా (2) భాష్యాల ద్వారా (3) పీఠాలద్వారా బౌద్ధంపైన చావు దెబ్బ తీసినవాడు శంకరుడేననడానికేమీ సందేహంలేదు. అందుకే.

While studying Shankara's commentaries it should not be forgotten that in his time Buddhism has considerably declined but not altogether disappeared from India; it was still a force to be reckoned with and, therefore, the Brahmins considered it to be a lurking danger which had to be warded off. Shankara's writings were for that reason mainly directed against it .......... Shankaracharya was eminently successful in striking the final blow to vanquish Buddhism from the country of its birth. The

initiative in the reform of Brahminism thus taken (through the four Matts) grew into a powerful movement wh ch continued to spread even after Shankara passed away 'n 820 A.C. and has surv ved to th s day.

*(The Role of Bhagavadgita in Indian History)*

అంటాడు ప్రేమనాధబజాజ్. ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భావవిప్లవ బావుటాను ఎగరవేసిన వాటిలో ఒకటిగా వుండి, విస్తృత ప్రజోద్యమంగా వెయ్యేళ్ళ పాటు భారతదేశంలో ఆసేతు హిమాచల పర్యంతం వ్యాప్తి చెందిన బౌద్ధఉద్యమానికి ఆ విధంగా శంకరుడు చరమగీతం పాడాడు. యుక్తివాదం (rationalisation) తో ఈ వాస్తవాన్ని ఖండించడానికి ప్రయత్నించడం మూర్ఖమవుతుంది.

శంకరుడు స్థాపించిన మఠాలన్నిటిలోనూ శంకరుడే స్వయంగా శివలింగాలను ప్రతిష్టించినట్లు శంకర చరిత్రలు చెపుతున్నాయి. అవి యిప్పటికీ పూజలందుకుంటూనే వున్నాయి. అద్వైతి శివలింగ ప్రతిష్టాపన చేయడంలోని అంతరార్ధమేమిటి? ఎంత ప్రచ్ఛన్నమైనా బౌద్ధుడు శివలింగ ప్రతిష్టాపన చేస్తాడా?

నిజానికి, శంకరుడు శైవుడు కాబట్టే, అనంతరం వచ్చిన రామానుజ, మధ్వాది అనేక వైష్ణవశాఖలవారు ఆయన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నాటినుండి నేటివరకు శంకరమఠాల అధిపతులంతా కులబ్రాహ్మలేకావడం మరోవిశేషం. ప్రాచీనశివాలయాలన్నిటిలోనూ బుద్ధ విగ్రహాలూ, వాటిశిధిలాలూ, బౌద్ధకట్టడాలకు సంబంధించిన అంశాలు చెక్కబడినశిలలూ, ఛత్రాలూ, ఛత్రదండాలూ, ఇతరగండశిలలూ బయట పడ్డాయి, పడుతున్నాయి. దాని అర్ధం బౌద్ధానికి సంబంధించిన కట్టడాలను ధ్వంసం చేసి, వాటిపై హిందూదేవాలయాలు నిర్మించినట్లు స్పష్టమవుతుంది. ఇలా జరిగిందనేందుకు సాక్ష్యం మరెంతైనా చూపవచ్చు, బౌద్ధాన్ని హైందవం నాశనం చేసిందనే విషయాన్ని సర్ రాధాకృష్ణన్ వంటి హిందూమత పక్షపాతులు అంగీకరించరు. ఇతర దేశాల్లో వర్ధిల్లిన బౌద్ధమతం, ఈ దేశంలో స్వాభావిక మరణం చెందిందనే అభిప్రాయాన్ని కల్గించడానికి ఆయన వ్యర్ధప్రయత్నం చేశారు. (Indian Philosophy)

హైందవంతో తేడాలేని విధంగా బౌద్ధం రూపొందడమే బౌద్ధం ఈ దేశంనుండి అంతర్ధానం కావడానికి ప్రధాన కారణమని ఆయన వాదం. (Vol . P. 605)

రెండూ ఒకవిధమైనవిగా రూపొందినపుడు బౌద్ధం నాశనమై, హైందవం వర్ధిల్లడం ఎలా జరిగిందనే ప్రశ్న ఆయనకురాలేదు.

ప్రతి పాతమతమూ ప్రతి కొత్తమతాన్ని నిరోధించినట్లే హైందవం బౌద్ధాన్ని నిరోధించిదంటాడు మరొకచోట (Voll. P. 608). శంకరుడికి ముందు 1300 సంవత్సరాల క్రిందట బయలుదేరిన బౌద్ధం కొత్తమతమెలా అయిందో, బౌద్ధం తరువాత బయలుదేరిన పౌరాణిక హైందవం పాతమతమెలా అయిందో చెప్పడు.

ఇంకొకచోట బౌద్ధాన్ని తనలో జీర్ణించుకోవడం ద్వారానూ, బుద్ధుణ్ణి విష్ణువు అవతారంగా మార్చడం ద్వారానూ బ్రాహ్మణమతం బౌద్ధాన్ని తన సౌహార్ద పరిష్వంగంలో యిముడ్చుకొని చంపివేసిందంటాడు. రామకృష్ణాదులకు ఆలయాలు కట్టించిన హిందువులు బుద్ధ మందిరాలను ఎందుకు విధ్వంసం చేశారో చెప్పడు.

ఇండియాలో బౌద్ధాన్ని బలవంతంగా నిర్మూలించారనే విషయం కట్టుకథ అంటాడు వేరొకచోట. ( The Violent exterm'nat on of Buddh sm in India is legendary, Vo . I.P, 608) బౌద్ధం హింసాత్మకంగా నిర్మూలించబడక పోతే బౌద్ధ స్థూపాలు, విహారాలు, మందిరాలు, విగ్రహాలు ఎలా ధ్వంసమైనాయో ఎక్కడా చెప్పడు.

తత్వశాస్త్రాన్ని, చరిత్రను మనముందుంచడంలో "భారతీయతత్వశాస్త్రం" అనే గ్రంథంలో సర్వేపల్లివారు వాస్తవిక దృక్పథాన్ని అనుసరించలేదు సరికదా, తన రాగద్వేషాల ప్రకారం వాస్తవికాంశాలను విపరీతంగా వక్రీకరించాడు. ఆ వక్రీకరణపైన ఒకగ్రంథమే వ్రాయవచ్చు. నిజానికి శంకరుడికి పూర్వమే హిందూరాజుల పరంగా బౌద్ధంమీద దాడిజరిగింది. పల్లవరాజైన శివస్కంధవర్మ నాగార్జున కొండను, విజయపురిని, బౌద్ధనగరాలను, గుంటూరుజిల్లాలోని యితర బౌద్ధారామాలను ధ్వంసంచేసి బౌద్ధుల్ని తరిమి వేశాడని చరిత్ర చెపుతుంది. అదొక గజనీ దండయాత్రలాంటిది. శైవుడైన విష్ణుకుండినరాజు మాధవవర్మ అమరావతీస్థూపాన్ని ధ్వంసం చేయగా, బౌద్ధ భిక్షువుల స్వాధీనంలోని ఆ స్థూపాన్ని బ్రాహ్మలు దౌర్జన్యంగా ఆక్రమించుకొని అమరేశ్వరాలయాన్ని నిర్మించారని యువాన్‌చ్వాంగ్ రికార్డుచేసినట్లు చారిత్రకుల భోగట్టా. పల్లవ రాజ్యం, విష్ణుకుండినుల రాజ్యం పతనమైపోయిన తర్వాతనే యువాన్‌చ్వాంగ్ ఆంధ్రదేశ పర్యటనచేశాడు. హిందూరాజుల దండయాత్రలకు తట్టుకొని వూగులాడుతున్న బౌద్ధాన్ని తుడిచిపెట్టే కార్యక్రమాలు తదనంతరం వచ్చిన శంకరుడు చేపట్టాడు. ఆ కార్యక్రమాలు నిర్మాణాత్మకమైనవి కూడా. పీఠాలస్థాపన, మఠాల స్థాపన, అద్వైతబోధ, వివిధదేవాలయాల నిర్మాణం, పాత దేవాలయాల్లో కొత్త విగ్రహాల ప్రతిష్టల ద్వారా ఆ పని పూర్తిచేశాడు.

1920 దశకంలో ఆర్కియలాజికల్ సొసైటీ వారు నాగార్జునకొండను కొనుక్కుని, స్వాధీనంచేసుకొని, త్రవ్వకాలు సాగించేదాక అది పుష్పగిరి శంకర పీఠం వారి అధీనంలోనే వుంది. కాబట్టి, హైందవం బౌద్ధం జోలికి పోలేదనడం అబద్ధం. బౌద్ధనిర్మూలనంలో శంకరుడికి ప్రధాన పాత్ర లేదనడం అబద్ధం. శాంకరుల దౌర్జన్య ఫలితంగా బౌద్ధం క్రమంగా భారతదేశం నుంచి అంతర్ధానమైంది. ముస్లిములు, క్రైస్తవులు దాదాపు 900 సంవత్సరాలు పాలించినా ఈ దేశంలో హైందవం చావలేదు. కాబట్టి, శంకరుడి జోక్యం లేకుండా కేవలం పరాయి దేశస్థుల దండయాత్రలతో బౌద్ధం పరారయిందనే అంశం నిజంకాదు.

## *శంకరుడి గానుగాయణం*

"శంకరాచార్యుడి శీలం" అనే వ్యాసంలో నేను కందుకూరివారి "శంకరాచార్యులు" నుండి ఈ క్రింది భాగాన్ని కోట్‌చేశాను.

"శంకరాచార్యులవారు కాంచీపురానికి పోయి, అక్కడ బౌద్ధులతో వాదం **చేసి, వారిని జయించి, వారి రాజైన హిమశీతల మహారాజుగారి యెదుట తమలో అదివరకు ఇరుకక్ష్యలవారు యేర్పరచుకున్న యేర్పాటునుబట్టి బౌద్ధమతస్థులనందరినీ గానుగలలో పెట్టి ఆడించి చంపించాడు. ఈ సంగతి శివకంచిలో స్మశానేశ్వర స్వామివారి ఆలయంలో రాతిమీద చెక్కబడి వున్నది...** అతడు పాదచారియై భరత ఖండమంతా సంచారంచేసి, వెళ్ళినచోటల్లా బౌద్ధులు, జైనులు, చార్వాకులు మొదలైన వారితో వాదాలుచేసి, వారి మతాల్ని ఖండించి తన అద్వైతాన్ని స్థాపిస్తూ, రాజుల్ని స్వాధీన పరచుకొని బౌద్ధుల్ని శిక్షిస్తూ వచ్చాడు. అవరకే కుమారిలభట్టు మొదలైన వారి కృషి చేతను, బలిష్టులైన రాజపుత్రుల హింసల చేతను హిందూదేశంలో క్షీణత పొందుతున్న బౌద్ధమతానికి ఆగర్భ శత్రువై ఆచార్యులవారు దాన్ని రూపు మాపారు".

ఈ విషయం వీరేశలింగంపంతులు వ్రాసి 70 యేళ్ళు దాటింది. ఆ మాటలన్నీ 'నేను నమ్మలేకుండా వున్నా' నని ఊరికే సణిగి ప్రయోజనంలేదు. మనసు తెరచుకొని చరిత్రను పరిశీలిస్తే నిజం అవగాహన అవుతుంది. "సర్వసమతావాదులైన బౌద్ధుల్ని గానుగల్లో వేసి రుబ్బించే టంతటి క్రూరత్వాన్ని శంకరుడికి అంటగట్టడం దుష్టబుద్ధుల కుట్ర" అని తీర్పు చెప్పే భ్రష్టబుద్ధి హేతువాదుల వద్ద వుండదు "మెదడుకు మేత" అనే పుస్తకంలో "అహింస, సత్యం, సంఘసేవ ఆశయాలుగా జీవిస్తూ వచ్చిన బౌద్ధుల్ని నిండు ప్రాణాలతో గానుగలలోవేసి అద్వైత మతాచార్యుడైన ఆదిశంకరుడు మర్దించినట్లు" పేర్కొన్న విమర్శకులకు (ఎన్.వి.బ్రహ్మం:" మెదడుకు మేత, పేజీ1".)

అనంతరం మేతలేక మెదడు చిక్కి పోయిందో యేమో, నయాశాంకరులుగా మారి ఇలాంటి అసందర్భ ప్రలాపాలు ప్రేలారు. దాన్ని సానుభూతితో అర్థం చేసుకోవచ్చుకాని, శంకరుడికి సర్వసమతావాది అని బిరుదివ్వడం, అద్వైతులను, విశిష్టాద్వైతులను దుష్టులని నిందించడం బుద్ధిమంతులు చేయవలసిన పనికాదు. ఎవరు సంభావనలు ముట్టచెప్పితే వారినల్లా పొగడటం, అన్యుల్ని తెగడడం చేస్తే ఎలా? శంకరుడు గారడీ పనులు చేసి తన మతానికి జనాన్ని ఆకర్షించినట్లూ, బౌద్ధుల మఠాలను తగుల బెట్టి, పశువులను నాశనం చేసి, స్త్రీలను, శిశువుల్ని సైతం వధించి, భీభత్స వాతావరణాన్ని సృష్టించి అతని శిష్యులు మతం మార్పించినట్లూ మణిమంజరి పేర్కొన్న అంశాల ఆధారంగా శంకరుడి ఘాతుకకృత్యాలను నేను యెంచలేదు. వీరేశలింగం పేర్కొన్న శాసనంతో పాటు, కావలసినంత ఆధారం వుంది. ఆ ఆధారం బౌద్ధ విహారాల శిధిలాల్లోనూ, వాటిపై నిర్మించిన శివాలయాల్లోనూ దొరుకుతుంది.

వీరేశలింగం పంతులు కూడా "నేను ఇలా అనుకుంటున్నాను" అని కేవలం ప్రకటనలు జారీ చేయలేదు. శివకంచిలో శ్మశానేశ్వరస్వామి ఆలయంలో రాతిమీద శంకరాచార్యుడి ఘనకార్యం గురించి చెక్కబడి వుందని రుజువు చూపాడు. దాన్ని దుష్టబుద్ధుల కుట్ర అని దూషించడానికే రుజువు కావాలి. ఆ శిలా శాసనం తప్పనుకోడానికి శంకరుడి స్వభావమైనా మనకు దారి చూపదు. శంకరుడెన్నడూ తన జీవితంలో ఎవ్వరి పట్లనూ ఔదార్యాన్ని, దయను ఈషణ్మాత్రమైనా చూపినట్లు ఒక్క దాఖలా కూడా లేదు. కాగా, సన్యాసి అయికూడా తల్లికి అంత్యక్రియలు జరపడం శంకరుడి కారుణ్యంగా సర్వేపల్లివారు పేర్కొనడం హాస్యాస్పదం.

బౌద్ధం ప్రజోద్యమంగా పతనమైందని చంకలు కొట్టేవారు అద్వైతం ఎన్నడూ ప్రజోద్యమం స్థాయికి పెరగలేదనే విషయాన్ని గమనించక పోవడం శోచనీయం. ఈ నాటి హిందూ ప్రజామతాలు శైవవైష్ణవాలేకాని, అద్వైతాదులు కాదు. చెప్పాలంటే, అద్వైతాదులు పొద చాటున దాగివున్న పులులు. ప్రతి పరాన్న భుక్కుకూ అవి సాధనాలు. శంకరుడు అద్వైతం పేరుతో, రామానుజుడు విశిష్టాద్వైతం పేరుతో, మధ్వాచార్యుడు ద్వైతం పేరుతో సిద్ధాంతీకరించి ప్రచారం చేసినదంతా నడమంత్రపు వేదాంతం. చివరకు శంకరుడి ద్వారా ప్రచారమైంది శైవం. రామానుజాదుల ద్వారా ప్రచారమైంది వైష్ణవం. అంతా కలిపి హైందవం జంగిలి మతంగా తయారైంది. వారు బౌద్ధాన్ని ప్రవాసం పంపించగలిగారు గాని, వేదాంతాన్ని ఉద్ధరించలేక పోయారు. ఏ పేరుతో చేసినా, చివరకు వారు చేసింది పౌరాణిక హిందూ మతోద్ధరణే.

బలవత్తరమైన బౌద్ధం ఇక్కడ నిరాశ్రయమైనా. అంతకుముందే విదేశాల్లో పాదుకొని వున్నందువల్ల అక్కడ ప్రవర్ధమానమైంది. చార్వాకం అసలే నాశనం కాగా, జైనం, యింకా చిల్లర మతాలూ మారుమూలల్లో నక్కిఉన్నాయి. మరిరెండు మూడు శతాబ్దాలు గడిచాక ఈ దేశంలో విదేశీమతాలు దిగడం ప్రారంభించినై. కాగా, భారతదేశంలో నెలకొన్న తాత్విక అవ్యవస్థకు మూలం ఆనాడు మన దేశంలో బయలుదేరిన అకాల వేదాంతమే. దాని వలననే యిక్కడ నూతన తాత్విక రీతులకు స్వాగతం పలకడం సాధ్యం కాలేదు. వేదాంతం బైరాగుల పరమైంది. అచలం పేరుతో అక్కడక్కడ అబ్రాహ్మణ వేదాంత మతాలు వెలిసినై. "వెనక్కు అంటే వేదాలదాక, ముందుకు అంటే ఉపనిషత్తులవరకు" అనేదే మన తాత్విక పద్ధతిగా నిలిచి పోయింది. తెలియని పాతను కావాలనీ, తెలిసిన కొత్తను వద్దనీ అనేవారు మొదటి దాని పరిమితినీ, రెండోదాని పరివ్యాప్తినీ తెలుసుకోలేక పోతున్నారు.

కాగా, ఇప్పటికీ ఈ దేశంలో జనసామాన్యంలో హైందవంగా నెలకొన్న మతంలో మనం చూడగలిగేవి మౌఢ్యం, మంత్రతంత్రాలు, వర్ణవ్యవస్థ వికారాలు, స్వాములు, బాబాలు, అతీతశక్తులు, అద్భుతాలు, మోసాలు, క్షుద్రవిద్యల ప్రదర్శన, అన్యాయాలు, అక్రమాలు. వీటిలో వేటినీ మన 'తాత్విక' సంప్రదాయం ఖండించ లేదు, పైగా పోషించింది. శంకరాదులంతా మహత్యాలపేరుతో గారడీలు చేసినవారే. ప్రజల అజ్ఞానమే వారికి పెట్టుబడిగా లభించింది. అది మరింత అజ్ఞానాన్ని వుత్పత్తి చేయడానికి జ్ఞాన దోపిడి వర్గాలకు వుపయోగ పడింది. మానవులంతా సమానులనే భావం హిందూమతానికి కొరుకుడు పడని భావమైంది.

# 6. స్వప్నమాయే యథాదృష్టే.....

# తథా విశ్వమిదం దృష్టం

మానవులకూ, వారి జీవితాలకూ సంబంధించని వైతండికం శంకరాద్వైతంలో చాలావున్నదనే దానికంటె, అంతా అదేనంటే సరిపోతుందేమో? అద్వైతం పేరుతో మిథ్యావాదాన్ని సర్వస్వం చేసిన శంకరుడి జీవిత లక్ష్యమేమైనా, "బ్రతుకంతా మిథ్య" అనేదే ఆయన పేరిట ప్రచారం జరిగిన అద్వైత తత్వసారాంశం

శంకరుడిది జగన్మిథ్యావాదం కాదని వాదించేవారున్నారు. ఆ మాటకు వస్తే, శంకరుడి సొంతవాదమంటూ ఏదీలేదు. ఏవాదాన్నయినా, ఆయన కేవలం ప్రచారం మాత్రమే చేశాడు. సిద్ధాంతం పేరు అద్వైతమూ, ప్రచారం చేసింది పౌరాణిక హైందవమూ.

అసలు అద్వైత సూత్రాన్ని కనిపెట్టినవాడు గౌడపాదుడు. ఆయన బౌద్ధుడనీ, లేక బౌద్ధంవల్ల బాగా ప్రభావితుడైన హిందువనీ అంటారు. ఉపనిషత్తుల్ని అద్వైతం పరంగా వ్యాఖ్యానించ వచ్చుననీ, అవి బౌద్ధానికి పూర్తిగా వ్యతిరేకం కాదనీ, ఆయన భావంగా గోచరిస్తుంది. ఏది యేమైనా, ఆయన మాండూక్యోపనిషత్తుకు వ్రాసిన కారికలు అద్వైత తత్వానికి మూలం. 12 శ్లోకాల మూండూక్యానికి గౌడపాదుడు 215 శ్లోకాల కారిక వ్రాశాడు. అందులో 38 శ్లోకాల రెండో అధ్యాయమంతా మిథ్య మీదనే. ఆ ప్రకరణం పేరే వైతథ్యం. వైతథ్యమంటే భ్రమ ( Ilus'on). 48 శ్లోకాల మూడో ప్రకరణం అద్వైతం (non-dualism). వాటికి శంకరుడు వ్రాసిన భాష్యమే శంకరుడిపేర ప్రచార మవుతున్న అద్వైతతత్వానికి ప్రాతిపదిక. మొదటి అధ్యాయం అగమ ప్రకరణంలో 29, చివరిఅధ్యాయం అలాత శాంతి ప్రకరణంలో 100 శ్లోకాలు వున్నాయి. చెప్పవలసిందంతా కారికల్లో గౌడపాదుడే చెప్పాడు. దాన్ని శ్రుతిస్మృతి ప్రమాణాలతో, ఉదాహరణలతో సమర్థించడమే శంకరుడు చేసిన పని.

వైతథ్య ప్రకరణం విశ్వాన్ని మిథ్యగా తేల్చివేసింది.

కలలో కన్పించిన వస్తువులన్నీ మిథ్య అని మొదటి కారికలో ప్రారంభించి, అలాగే మెలకువలో కన్పించే వస్తువులన్నీ మిథ్యే అని నాలుగో కారికలో తేల్చింది.

జాగ్రత్స్వప్నావస్థల్లోని అనుభూతులు రెండూ అబద్ధమేనని ఐదో కారికలో చెప్పి, ఆద్యంతాలలో లేని వస్తువులు మధ్యలో కూడా వుండవనీ, ఆదిమధ్యాంత

రహితాలనీ, కాబట్టి అంతా శూన్యమనీ ఆరవ కారికలో తేల్చింది.

కలలో మనం తిన్నట్లు అనుభూతి పొందినా తినమనీ, మెలకువలో మనం తిన్నందువల్ల ఆకలి తీరుతుందని అంటే తిన్నవాడు తిరిగి తిననట్లు కలగంటే తినని అనుభూతే కలుగుతుందికదా అనీ ఏడవకారికకు వ్రాసిన భాష్యంలో శంకరుడంటాడు. కాబట్టి జాగ్రదవస్థలోని వాస్తవికఅనుభూతి కూడా అబద్ధమేనని తాత్పర్యం. కాబట్టి, జాగ్రత్స్వప్నావస్థలు రెంటిలోని స్థితి అంతా భ్రమేనని 8,9,10 కారికలకు వ్రాసిన భాష్యంలో శంకరుడు వివరిస్తాడు.

జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను కన్పించే వస్తువులన్నీ మిధ్య అయినప్పుడు, అవి వున్నట్లు భ్రమ కల్గించేదెవరు అని 11వ కారికలో ప్రశ్నించి, ఆ విషయాన్ని తన మాయవల్ల ఆత్మే తెలుసుకుంటుందనీ, అదే వేదాంతమనీ 12వ కారికలో తీర్మానం జరిగింది.

ఆత్మ బహిర్ముఖమై తన మనసులోని వస్తువులనే వూహిస్తుందనీ, అంతర్ముఖమై మనసులోని భావాలను వూహిస్తుందనీ 13వ కారిక చెపుతుంది. మనసులో వుండి వ్యక్తం కానివీ, వెలుపల వ్యక్త రూపంలో వుండేవీ, అన్నీ వూహలే నంటుంది 15 వ కారిక.

త్రాటి లక్షణాలు తెలియక చీకటిలో దాన్ని "పాము" అనుకుంటామనీ, లక్షణాలు తెలిసిన తర్వాత భ్రమ తొలగి అది "త్రాడు" తప్ప మరేమీ కాదని తెలుసు కుంటామనీ, కాబట్టి ఆత్మదీ అలాంటి స్వభావమేననీ 17,18 కారికలంటాయి. మాయవల్ల ఆత్మ పరిపరి విధాలుగా తోస్తుందని 19 మొదలు 30వ కారిక వరకు వివరించబండిది.

ఇక 31వ కారికలో మిథ్యావాదం పరాకాష్టకు చేరుకుంది. స్వప్నం, మాయ, గగనసౌధం ఎలామిథ్యలో, అలాగే విజ్ఞుల వేదాంతదృష్టిలో విశ్వం కూడా మిథ్యేనని ఆ కారిక స్పష్టంచేస్తుంది :

**స్వప్నమాయే యథాదృష్టే గంధర్వనగరం యథా**

**తథా విశ్వమిదం దృష్టం వేదాన్తేషు విచక్షణై : ॥**

ఇంత వివరంగా మాండూక్య కారికల నుంచి ఎందుకు వుదహరించు కున్నామంటే, ఇవి లేకపోతే శంకరుడు లేడు, శంకరుడి తత్వంలేదు. ప్రస్థానత్రయ భాష్యంలో శంకరుడు చేసిన వాదానికి మూలం ఇందులోనేవుంది. ఈ వాస్తవిక

ప్రపంచమంతా కేవలం భ్రమ అనీ, స్వప్న సదృశ్యమనీ గౌడపాదుడి కారికలూ, శంకరుడి భాష్యాలూ స్పష్టంచేసినై (1-4). ఆది మధ్యాంత మంతా మిథ్యేననీ, మన జ్ఞానంలోకి వచ్చే ఏ దశా వాస్తవం కాదనీ నొక్కి చెప్పినై(5-6). వాస్తవికతను నిర్ణయించుకొనే సందర్భంలో జాగ్రదవస్థ, స్వప్నావస్థ ఒకదానికొకటి భిన్నంకావని ఉటంకించినై(7-11). మన జ్ఞానంలోకి వచ్చేవస్తువులన్నీ, భావాలన్నీ కేవలం మానసిక చిత్రాలేకాని, వాస్తవాలు కావని వక్కాణించినై (13-15). ఒక వస్తువును మరొక వస్తువుగా ఎలాభ్రాంతి చెందుతున్నామో అలాగే 'లేని' యీ ప్రపంచాన్ని 'ఉన్నట్లు' మనం భ్రాంతి చెందుతున్నామని స్పష్టంచేసినై (17-18). చివరకు ఈ విశ్వమే స్వప్నమనీ, మాయఅనీ, గాలిమేడఅనీ ఉద్ఘాటించినై (31). అంతేకాదు "యథా కాయ స్తథాసర్వం చిత్తదృశ్య మవస్తుకం(4-36) అంటూ అంతా చిత్త దృశ్యం తప్ప, వస్తుప్రపంచం కాదని గౌడపాదుడు నొక్కి చెప్పాడు. దానికి శంకరుడి భాష్యంలోకూడా మనం గుర్తించే వివిధ వస్తువుల్ని మనస్సుయొక్క వివిధ దశలు (mental states) గా వర్ణించి, మనకు కన్పించేదంతా మిథ్య, అవాస్తవం అన్నాడు. ఇలా అంతామాయ అని గురు శిష్యులిద్దరూ ఘోషిస్తుంటే, "మాయ అంటే అర్థం అదికాదు, బ్రహ్మం అంటే అర్థం ఇదికాదు" అంటూ స్వకీయార్థాన్ని సాధించే పండిత శిఖండులను చూస్తే నవ్వు వస్తుంది.

శంకరుడి తత్వానికి కచ్చితంగా వ్యతిరేకమైన అర్థాన్ని చెప్పిన వారిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా ప్రముఖులే. Sankara rejects all attempts to reduce waking experience to the level of dreams అంటాడు సర్వేపల్లి. (Indian Philosophy, Vo .II, P. 582)

శంకరుడు ఆయనకు అర్థం కాలేదా, లేక కావాలనే ఆయన వక్ర భాష్యం చెప్పాడను కుందామా? లేకపోతే, కలలోనిఅనుభవం ఎలాంటిదో, మెలకువలోని అనుభవంకూడా అలాంటిదేనని శంకరుడు నొక్కి చెపుతుంటే, అలా చేయడానికి శంకరుడు నిరాకరిస్తాడని సర్వేపల్లి వారనడమేమిటి? అభిమానాలున్నంత మాత్రాన పచ్చి అబద్ధాలతో తప్పుడు చిత్రణ చేయడం కూడనిపని.

అలానే, అనాత్మవాదులైన బౌద్ధులకు ఆత్మవాదాన్ని అంటగట్టారాయన.

ఆయన "భారతీయ తత్వశాస్త్రం" నిండా ఇలాంటి అవకతవకలు చాలావున్నాయి. తత్వశాస్త్రంలో యిలాంటి తప్పుడు అవగాహనను కల్పించడానికి యత్నించడం వల్లనే భారతీయ తత్వం అలాంటిది, ఇలాంటిది అనే విషయాల్లో

గందరగోళం బయలు దేరుతున్నది. కావాలని ఇలాంటి తప్పులు చేయడం క్షమార్హంకాదు.

అద్వైతం సరయినదవునా, కాదా అనే అంశం ఈ వ్యాసపరిధిలోకి రాదు. అసలు ఆ ప్రశ్నే మనదికాదు. ఎందుకంటే ఆ వాదాన్ని మనం మూలముట్టుగా తిరస్కరిస్తాం. అద్వైతాన్నేకాదు, ద్వైతాన్ని, విశిష్టాద్వైతాన్ని, శుద్ధాద్వైతాన్ని కూడా మూల ముట్టుగా తిరస్కరిస్తాం. పరతత్వ వాసననే మనం అంగీకరించం. ఆస్తికవాద, భావవాదవాసనలుండే వాదాలన్నిటినీ తిరస్కరిస్తాం. బౌద్ధులదైనా, మరెవ్వరిదైనా, శూన్యవాదాన్నీ, ఆ బాపతు వ్యవహారాలనూ, అన్నిటినీ తిరస్కరిస్తాం. చారిత్రక అవగాహనకోసం తప్ప, వాటిని పరిశీలించవలసిన అవసరం మనకు లేదు. భౌతికవాదపరంగా వాటికి విపరీత అన్వయాలు చెప్పే బాడుగోలు చాకిరి హేతువాదులకు లేదు.

గత మూడు, నాలుగు వందల సంవత్సరాలుగా పెంపొందుతూ వచ్చిన అధునిక విజ్ఞానశాస్త్రం మనకు నూతన తాత్విక మార్గం చూపింది. మనకంటే ముందే, మనం గ్రహించకముందే వున్న భౌతిక అస్తిత్వం సత్యమైనది, నిత్యమైనది; మన మనస్సు, దాని భ్రమలు, భ్రాంతులు మాత్రమే వాస్తవిక అస్తిత్వానికి కొలత బద్దలుగావు; మనం చూస్తున్నాం కాబట్టి, ప్రపంచం వుందా, లేక వున్న ప్రపంచాన్ని మనం చూస్తున్నామా అనేది యీనాడు తలతిక్క ప్రశ్న; భౌతిక అస్తిత్వం సత్యమనే విషయమే ఆధునిక విజ్ఞానానికి ప్రాతిపదిక; మనజ్ఞానంతో నిమిత్తం లేకుండానే అది వుంది. కాగా, భౌతిక అస్తిత్వం ఆభాస అనీ, అసలు సత్యం భౌతికతకు భిన్నమైన బ్రహ్మమేననీ, చైతన్యం పదార్ధలక్షణం కాదనీ, పదార్ధమే చైతన్యానికి (బ్రహ్మానికి) ఆభాస అనీ శంకరాద్వైతం వుటంకిస్తుంది. వున్నదాన్ని వున్నదనీ, లేనిదాన్నిలేదనీ అనడం భౌతిక వాస్తవికతత్వం కాగా, లేనిదాన్ని వున్నదనీ, వున్నదాన్ని లేదనీ అనడం బ్రహ్మవాద తత్వం. ఈ తేడా అర్ధంకాని వారికి శంకరాద్వైతంలో ఆధునిక తత్వశాస్త్రం కన్పిస్తుంది.

అజ్ఞాత ప్రపంచాన్ని గురించి కలలు కనేవారు ఆధునికుల్లోనూ వుండవచ్చు కాని, వారి మనస్తత్వమూలాలు సనాతనంలో వుంటాయి. ఆధునిక విజ్ఞానం భౌతిక వాస్తవిక వాదానికి దారి తీస్తుంది. కాకుంటే, ఆధునిక విజ్ఞానాన్ని అధ్యయనం చేయ వలసిన అవసరం మనకు లేదు. సనాతనం పరమసత్యమైతే, దాన్ని సమర్ధించడానికి ఆధునిక విజ్ఞానమవసరంలేదు. ఆధునిక విజ్ఞాన లక్ష్యం సనాతనాన్ని సమర్ధించడం కాదు. దాని లక్ష్యం సత్యావిష్కరణ. అది సనాతనంలో దొరకలేదు కాబట్టే, ఆధునిక విజ్ఞానం పుట్టుకొచ్చింది. తాత్విక విభాగంలోని అన్ని అంగాలనూ, శాఖలనూ ఆధునిక

విజ్ఞానం సహాయంతో మనం పరిపుష్టం చేసుకోగలం. ఈ కృషిలో ప్రాచీనుల నుంచి మనం పొందగల వారసత్వమేమీలేదు. స్ఫూర్తికూడా ప్రాచీనతనుంచి మనకు లభించదు. శంకరాద్వైతం నుండి భౌతికవాదాన్ని రాబట్టే వ్యర్థకసరత్తు హేతువాదులు చేయరు. ఆ విషయం 10వ అధ్యాయంలో రినైజాన్స్ భావాన్ని పరిశీలించేటప్పుడు చూద్దాం.

## సంకరాద్వైతం

శంకారద్వైతం నాస్తికత్వమనీ, పదార్థవాదమనీ, భౌతికవాదమనీ, వాదించబూనే పండిత శిఖండులున్నారు. అదెంతవరకు నిజం అనేదే ఈ వ్యాసంలో మన పరిశీలనా పరిధి. శంకరుడు కనపడ్డ రాళ్ళకల్లా మ్రొక్కాడని చూచాం. అయ్యవార్ల లింగాలూ, అమ్మవార్ల పానవట్టాలూ ప్రతిష్టించాడని చూచాం. పరకాయప్రవేశాది ప్రక్రియల్ని సిద్ధాంతీకరించాడని చూచాం. ఇతర మతస్థుల్ని బాధించి, హింసించి, వధించి, వారి మతాలను విధ్వంసం చేసి, వాటి శిధిలాలమీద శివాలయాలు నిర్మించాడని చూచాం. పుక్కిటి పురాణాల్లోని కట్టుకథల్ని వాస్తవాలుగా ప్రచారంచేశాడని చూచాం. అలాంటి శంకరుణ్ణి హేతువాది అనీ, సర్వసమతావాది అనీ, మానవవాది అనీ, సాంఘికవిప్లవ కారుడనీ బిరుదులిచ్చేవారికి శంకరతిక్క యెంతవరకు యెక్కివుంటుందో మనం వూహించుకోవచ్చు.

“అద్వైతంలోని బ్రహ్మకూ, భౌతికవాదంలోని మూలపదార్థానికీ తేడాలేదనీ, ఆ మూలపదార్థం నానావిధజగత్తుగా ఎలా, ఎందుకు కన్పిస్తున్నదో భౌతిక శాస్త్రవేత్తలకు సైతం అంతుపట్టడంలేదనీ, దాన్నే శంకరుడు ‘మాయ’ అన్నాడని తెలియక, ‘ఆధునికులమనుకొనేవారు’ కల్పితార్థాలను అంటగట్టి ‘వెకిలితనంగా, అపహాస్యం చేస్తు’న్నారనీ,” వాదించే గోసాయి పండిటులు గౌడపాదకారికల్నీ, వాటికి శంకరుడు వ్రాసిన భాష్యాన్నీ ఒక్కసారి చూస్తే తమ సంకరాద్వైత భావాలు మార్చు కొంటారనిపిస్తుంది.

నాకు తెలిసినంతవరకు బ్రహ్మపదార్థమంటే మొద్దబ్బాయి అని అర్థం. ఇంకా జాతీయంగా చెప్పుకోవాలంటే అర్థం కాని అయోమయం అని అర్థం. ఎదుగూ బొదుగూలేని, కదలికామెదలికాలేని బండ అని అర్థం. తామేమి చెపుతున్నారో తమకే తెలియని అద్వైతుల మూలంగానే ఆ పదానికి ఆ అర్థం రూఢి అయ్యింది. అయినా ‘బ్రహ్మపదార్థ,మనే పదాన్ని, శంకరుడెక్కడా వాడలేదు. బ్రహ్మపదార్థమంటే భౌతిక వాదుల మూల పదార్థమేనని అర్థాన్ని తీసే బ్రహ్మ పదార్థాలను నా వరకు నేను కొత్తగా చూస్తున్నాను. బ్రహ్మమంటే పదార్థం కాదని చెప్పడానికే శంకరుడు

బ్రహ్మసూత్ర భాష్యంలో సాంఖ్య, వైశేషికుల ప్రధాన, అణువాదాలను అదే పనిగా ఖండించాడు. ఆధ్యాత్మికవాదులు ఆత్మ అంటున్నదాన్ని దేహలక్షణమన్న చార్వాకులనూ ఖండించాడు. అది పదార్థానికి, భౌతికతకు భిన్నమైనదన్నాడు. కొత్త అర్థాలను కనిపెట్టే జబ్బు మత పునరుజ్జీవన వాదులకు కొత్త కాదు. ఆ జబ్బే బ్రహ్మాన్ని పదార్థానికి పర్యాయపదంగా ఎగేసేవారికి సోకింది. వైజ్ఞానిక నిజాయితీని పాతిపెడితే తప్ప, అలాంటి వికృతార్థ సాధనా ప్రవృత్తి అలవడదు.

బ్రహ్మమంటే ఏమిటో అర్థం కాకనే శంకరాదులు దాన్ని నిర్గుణమన్నారు. గుణం లేనిదేదీ ఎవరికీ, ఎన్నడూ అర్థం కాదు. ఏ వస్తువైనా, దాని గుణాల ద్వారానే మనకు అర్థమవుతుంది. ఇప్పుడా బ్రహ్మాన్ని పదార్థమనే వారు బ్రహ్మాన్ని అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పడానికి ప్రయత్నిస్తున్నారో, లేక అందరికీ అర్థమైన పదార్థాన్ని అర్థంకాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారో అర్థం కావడం లేదు. పదార్థం భౌతికం కాగా, బ్రహ్మం అభౌతికం. భౌతికానికి అస్తిత్వం వుంది, అభౌతికానికి లేదు. అసలు అస్తిత్వమంటే భౌతిక అస్తిత్వమే. అభౌతిక అస్తిత్వమనేది లేనేలేదు.

## శంకరుడి కాపీలు

అసలు బ్రహ్మ సూత్రాలను సంపుటీకరించిన బాదరాయణుడు పచ్చి కుల తత్వ వాది అని చెప్పుకున్నాం. అంతకు ముందు ఉపనిషత్తుల్ని సూత్రీకరించిన వారూ వున్నారు: బాదరి, ఔడులోమి, అశ్మరథ్య, కార్శకృత్స్న, కార్ష్ణాజిని, ఆత్రేయ ప్రభృతులు అంతకుముందే సూత్రగ్రంథాలు వ్రాసినట్లు బ్రహ్మసూత్రాలనుబట్టి, శంకరుడి భాష్యాన్నిబట్టి తెలుస్తుంది.

ఆ సూత్ర గ్రంథాలింతవరకూ బయటపడలేదు. కాబట్టి, వారెలా సూత్రీకరించిందీ మనకు తెలియదు. ఉపనిషత్తుల్లోని భావవాదాన్ని, కులతత్వాన్ని, అజ్ఞానాన్ని, ఆటవికతనూ సంస్కరించి ఆధునీకరించడమంటే గొంగట్లో బొచ్చు ఏరివేసినట్లే. సూత్రకారుల సంక్షిప్తీకరణ లక్ష్యం కూడా వాటిని పునరుద్ధరించడమే కాని, సంస్కరించడం కాదు. అందుకే బ్రహ్మసూత్రాల్లో క్రొత్తగా చెప్పిందేమీలేదు, పాత పంకిలాన్ని కడిగివేసిందీ లేదు. దానికి భాష్యాలు వ్రాసిన వారి లక్ష్యం అంతకంటే భిన్నం కానూలేదు.

శంకరుడికి ముందు వేదాంత సూత్రభాష్యాలు వ్రాసిన వారున్నారుట: బోధాయన, టంక, ఉపవర్ష ద్రమిడాచార్య, భర్తృప్రపంచ, భారుచి,కపర్దీ, బ్రహ్మానంద, గుహదేవాదులు. కాని, వారి గ్రంథాలు దొరకడం లేదు. శంకరుడాదిగా సూత్రభాష్యాలు

వ్రాసినవారంతా (రామానుజ, నింబార్క, మధ్వ, వల్లభాచార్యాదులు) బ్రహ్మం దగ్గర తన్నుకొని, తలకొక రీతిగా వ్యాఖ్యానించారు తప్ప, వైదిక మతంలోని కుళ్ళును ఛీకొట్టిన వారు లేరు.

అనాది వస్తువు వుందా లేదా, వుంటే అదేమిటి, అది ఒకటా రెండా, రెండూ ఒకటవుతాయా కావా, అయితే ఎపుడవుతాయి, ఎలా అవుతాయి అని తన్నుకొని తల కొక దారైనారు. ప్రతి భాష్యకారుడూ తన భాష్యమే సరైనదన్నాడు. కాగా, శంకరుడొక్కడే తనది అద్వైతమన్నాడు. ఆయన భాష్యంలో అద్వైతమూ, ద్వైతమూ, ఆస్తిక్యమూ, సర్వనాస్తివాదమూ అన్నీ కన్పిస్తాయి. ఆయన నాస్తివాదం నాస్తిక వాదం కాదు. నాస్తికత్వపరంగా భాష్యాలు వ్రాసినవారు ఆ రోజుల్లో పుట్టలేదు. అసలు వేదాంత సూత్రాలకు నాస్తికత్వపరంగా భాష్యం వ్రాయాలనే దౌర్భాగ్యపు ఆలోచన వచ్చేవాడు నాస్తికుడెలా కాగలడు? పోగా, మిగతా వారంతా ద్వైతం పరంగానే బ్రహ్మ సూత్రాలకు భాష్యాలు వ్రాశారు. మధ్వాచార్యుని కాలం (1199-1268) నాటికే 21 భాష్యాలున్నాయిట. కాగా, యిప్పుడు ప్రసిద్ధంగా దొరికేవి ఐదారు మాత్రమే. దీన్ని బట్టి బ్రహ్మ సూత్రాలు అద్వైతాన్ని మాత్రమే బోధిస్తున్నాయనడానికి ఆధారంలేదు. బ్రహ్మ సూత్రాలతో నిమిత్తం లేకుండానే అద్వైతాన్ని ప్రప్రథమంగా ప్రతిపాదించినవాడు గౌడపాదుడు. మాండూక్య కారికల్లో అద్వైత ప్రకరణమే ఒకటి వుంది. గౌడపాదుడికి ముందు మరెవ్వరూ అద్వైతాన్ని ప్రతిపాదించినట్లు ఆధారాలు లేవు. **దేవతలకు సైతం అసాధ్యమైన వేదసారాన్ని గౌడపాదుడు సాధించాడనీ, ఆయనే అద్వైతతత్వానికి ఆద్యుడనీ, ఉపనిషద్వాదాన్ని పునరుద్ధరించిన గౌడపాదుడికి పాదాభివందనం చేస్తున్నాననీ, శంకరుడే అన్నాడు. శంకరుడు అద్వైతాన్ని కని పెట్టనూ లేదు, కనిపెట్టినట్లు తానెక్కడా చెప్పుకోనూ లేదు.**

అసలు బ్రహ్మ సూత్రాలకు చాలా విస్తృతమైన భాష్యాన్ని బోధాయనుడు వ్రాశాడని రామానుజుడు పేర్కొన్నాడు. తనకు ముందటి వారంతా (శంకరుడితో సహా) దాన్ని సంక్షిప్తీకరించారని కూడా అన్నాడు. తాను కూడా ఆ మార్గాన్నే అనుసరిస్తున్నా నన్నాడు. రామానుజుడు కంచికిపోయి, అక్కడి అద్వైతపీఠంలోని పండితులను వాగ్వివాదంలో ఓడించి, శారదా పీఠం నుండి బోధాయన భాష్యాన్ని తెచ్చుకున్నాడని రామానుజ మతస్థుల వాదం. రామానుజుడు దాన్ని అధ్యయనం చేశాడనీ, దొంగిలించుకొని వెళ్తుంటేదారిలో పట్టుకొని శారదా పీఠం వారు దాన్ని తిరిగి తెచ్చుకున్నారనీ అద్వైతుల వాదం. ఏది యేమైనా బోధాయన భాష్యం, శంకరుడికి అందికలో కంచి శారదా పీఠంలో వున్న మాట వాస్తవం. అందువల్ల శంకరుడి

భాష్యం కూడా దీని అనుసరణ యేమో ననిపిస్తుంది. ఎందుకంటే, కొన్ని సందర్భాల్లో, ద్వైతా ద్వైత వాదాలకు చేరడంలో శంకర రామానుజు లిద్దరూ పరస్పరం ఢీ కొన్నా, భాష్య రచనలో ఇద్దరివీ ఒక దానికొకటి కాపీగా చాల చోట్ల పట్టిస్తాయి. సూత్ర వివరణ కోసం ఇద్దరూ ఒకే శ్రుతి స్మృత్యాదుల నుంచి, అవే శ్లోకాలను ఉదహరించారు. కాబట్టి, శంకర రామనుజు లిద్దరికీ బోధాయన భాష్యమే దారి చూపిందనవచ్చు. సాంప్రదాయికంగా వచ్చిన సూత్ర వివరణనే వారు తమ భాష్యాల్లో యిరికించారు. కాగా, తాత్విక ధోరణిలో రామానుజుడు బోధాయనుడి ద్వైతాన్ని అనుసరించగా, శంకరుడు గౌడపాదుడి అద్వైతాన్ని తన భాష్యంలో చొప్పించాడు. అందుకే శంకరుడి భాష్యం కృతకంగానూ, అవకతవకగానూ కన్పిస్తుంది. మూలానికిభిన్నంగా అది అద్వైతాన్ని రాబట్టిందని కొందరి అభిప్రాయం.

కాని, శంకరుడు కానీ, మరొకరు కానీ, బ్రహ్మమంటే ఏమిటో చెప్పలేదు సరికదా, అది వున్నదని రుజువు చేయడానికైనా ప్రయత్నంచేయలేదు. గౌడపాదుడి కారికల్లో చెప్పింది చెప్పినట్లు తిరిగి చెప్పడమే శంకరుడు చేసిన పని – టెక్స్ట్ బుక్‌కు గైడ్ వ్రాసినట్లు.

అయితే ప్రపంచ వాస్తవికత యేమిటి అంటే, అదంతా మాయ చేస్తున్న గారడీ అన్నాడు. అలా అన్నాడే కాని, ప్రపంచం మాయ అని రుజువు చేయలేదు.

బ్రహ్మానికి అన్యంగా వుండేదంతా మాయ అనడంవల్ల అటు పూర్వమీమాంసికులతోనూ, ఇటు సాంఖ్యులతోనూ తగాదా తప్పలేదు. ఇందులో మొదటివారు యజ్ఞ యాగాది కర్మాచరణవాదులు, రెండోవారు ప్రధాన పరిణామవాదులు. వేదాల్లోని కర్మకాండ అంతా ద్విజుల్లో తక్కువ తరగతి వారికేననీ, ఆ స్థితి దాటిందాక వారికి ఉపనిషత్తుల ఉన్నత తత్వాన్ని అనుసరించే హక్కులేదనీ, సూత్రభాష్యంలోను, గీతా భాష్యంలోను శంకరుడు వాదించాడు. వేద ప్రమాణాన్ని ఆమోదించిన వారి వద్ద వేదార్థాన్ని వారి వారికి వ్యతిరేకంగానూ, తనకు అనుకూలంగానూ మలుపుకోగల "పాండిత్యం" శంకరుడికుంది. అయితే, ఇతరుల వాదాలు "తప్పు" అని సమర్ధవంతంగా ఆయన రుజువు చేసిన సందర్భాలు లేవు. ఆయావాదాలుశ్రుతిస్మృతులకు అంగీకారయోగ్యం కాదనేదే ఆయన రుజువుకు అర్థం. పేరుకు శ్రుతిస్మృతులన్నాడే కాని, అవసరం వచ్చినప్పుడు పురాణాదుల నుంచి కూడా ప్రమాణించాడు. శ్రుతి స్మృత్యాదులను అంగీకరించనివారితో వాదానికి దిగడానికి అతనికి భూమికే లేదు.

## విపరీతార్థాలు

ఇప్పుడు నయాపండితులు రంగంలోకి దిగి బ్రహ్మానికి లింగం లేదనీ, అందు వల్ల అది భౌతికవాదులు చెప్పే పదార్థమేననీ, అది వున్నది వున్నట్లుగా వుండక నిత్యమూ మారుతూవుంటుంది కాబట్టి, అది "మాయా" అంటే "అది అదికాదు" అని అర్థమనీ, అది భౌతికద్రవ్య పరిణామాన్ని సూచిస్తుందనీ, మనకు కన్పిస్తున్నదేదీ కన్పిస్తునట్లుగా లేదనీ, సర్వవ్యాప్తమైన అగోచరమైన బ్రహ్మపదార్థం పంచేంద్రియాల ద్వారా మనస్సుకు జగత్తురూపంలో దర్శనమిచ్చేటట్లు చేసే అనిర్వచనీయమైన అదృశ్య సాధనాన్నే "మాయ" అన్నారనీ, అది బహు పెద్ద అర్థమనీ, దాన్ని గురించి భౌతిక వాదం ఆలోచించలేదనీ పులుముడు మొదలుపెట్టారు.

అసలు బ్రహ్మాన్ని సత్యమైన, నిత్యమైన వస్తువు (apr or category) గా అంగీకరించడంలోవున్న ప్రమాదాన్ని గుర్తించకపోతే యిలాంటి పిచ్చిపిచ్చి వూహాలు వస్తాయి.

లేనిదేదో బ్రహ్మం, వున్న జగత్తును మాయఅనే అద్దంలో ఆభాసరూపంలో ప్రతిబింబింపజేస్తున్నదన్న అపభ్రంశ వూహే తప్పు; ఆ మాటలు లోగా మతిచెడ్డవాళ్ళు చెప్పగా, మతిచెడ్డవాళ్ళు విన్నారు. ఇప్పుడు నయా మతిచెడ్డవాళ్ళు భౌతికవాదుల మతి చెడగొట్టాలనే దురాశతో దానికి కొత్త అన్వయాలు చెపుతున్నారు. వారి లక్ష్యం నెరవేరదు.

మాయ అనేది రుగ్వేదంలో అతీతశక్తి, అద్భుతనైపుణ్యం అనే అర్థంలో వాడబడింది. అథర్వవేదంలో గారడీ, భ్రమఅనే అర్థంలో వాడబడింది. బృహదారణ్యక, ప్రశ్న, శ్వేతాశ్వతారోపనిషత్తుల్లో గారడీ అనే అర్థంలో వాడబడింది. (వ్యాసవిస్తరభీతి వల్ల అయా మంత్రాలను వుదహరించడం లేదు) " లంకావతారం" అనే గ్రంథంలో భ్రమ అనే అర్థంలో మాయను తొలిసారిగా విరివిగా వాడినవాడు నాగార్జునుడేనని దాస్ గుప్తా అన్నారు. నాగార్జునుడి నుంచి ఈ అర్థాన్ని గౌడపాదుడు గ్రహించివుండాలనికూడా అన్నారు. గౌడపాదుడి కారికల్లో బౌద్ధవాసనలున్నట్లు అనేకమంది పండితు లంగీకరిస్తున్నారు. చివరి 100 శ్లోకాల అలాత శాంతి ప్రకరణమంతా బౌద్ధ మేనని రాహుల్ సాంకృత్యాయన్ అన్నారు. శంకరుడి ప్రత్యేకత యేమంటే, తన భాష్యంలో ఆ బౌద్ధవాసనలను మొత్తమూ తొలగించి, ఉపనిషత్తులపరంగా వైదికార్థం చెప్పడానికి ప్రయత్నించడమే.

అలాతశాంతి ప్రకరణానికి శంకరుడు వ్రాసిన భాష్యంలో కావాలని బుద్ధుడి

పేరును, బౌద్ధానికి సంబంధించిన భావాలను దాచడానికి ఆయన నానాతిప్పలు పడ్డాడు. శ్రీ త్యాగీశానందస్వామి వ్రాసిన "మాండూక్యకారికా సంగ్రహం"లో సైతం యీ విషయాన్ని అంగీకరించడం జరిగింది. గౌడపాదుడు అలాతశాంతి ప్రకరణాన్ని బుద్ధుడి ప్రార్థనతో ప్రారంభించగా, అందులో "ద్విపదాంవర", "నారాయణ" అనే పదాలకు తప్పుడు అన్వయం చెప్పి, అది "నారాయణుడు" అనే మరో గురువుకు సంబంధించిన ప్రార్థన అని శంకరుడు వ్యాఖ్యానించాడు. అలానే రెండో శ్లోకంలోని బౌద్ధుల అస్పర్శయోగాన్ని బ్రహ్మవాదపరంగా వ్యాఖ్యా నించాడు. అలాత శాంతి ప్రకరణంలో 42,90,98,99,100వ శ్లోకాలకు వ్రాసిన భాష్యంలోకూడా అసలు భావానికి ముసుగువేసి, అవి బౌద్ధానికి సంబంధించినవి కానట్లు వ్యాఖ్యానించాడు. అసలు అలాతశాంతి (Quenching of firebrand) పదమే బౌద్ధపారిభాషిక పదం. అందువల్ల ఈ ప్రకరణాన్నే ఆయన కుట్రతో వ్యాఖ్యానించాడు. శంకరుడి వైజ్ఞానిక నిజాయితీ రాహిత్యానికి ఇది సరైన వుదాహరణ. బౌద్ధంపట్ల తనకున్న శత్రుత్వాన్ని శంకరుడీవిధంగా ప్రదర్శించాడు. కాబట్టి, ఆయన వేషానికే సన్యాసి అయ్యాడు తప్ప, రాగద్వేషాలకు అతీతుడు కాలేకపోయాడనేడానికి ఇది మరో ఉదాహరణ.

అయితే సృష్టి, స్రష్ట అనేవాటినికూడా శంకరుడంగీకరించనట్లు బ్రహ్మసూత్ర భాష్యంలో అక్కడక్కడ కన్పిస్తుంది. సృష్టికర్తలేదు అనే ముక్కను పట్టుకొని శంకరుడు నాస్తికుడని వాదించేవారు సృష్టికర్తభావం కంటే ప్రమాదకరమైన బ్రహ్మ భావాన్ని లెక్కలోకి తీసుకోవడం లేదు. నిజానికి సృష్టి సిద్ధాంతాన్ని కాదనడం కూడా శంకరుడు గౌడపాదుడినుంచే గ్రహించాడు. రకరకాల సృష్టిసిద్ధాంతాలను గౌడపాదుడు ఖండించాడు, (అలాత : 3–25). అంతమాత్రాన అది నాస్తికంకాదు. అలా అనుకుంటే, వేదాన్ని ఒకదాన్నే ఆమోదించి, మిగతా మతాలన్నిటినీ, వాటి సృష్టి సిద్ధాంతాలనూ ఖండించిన దయానందుడు నాస్తికుడనాలి. పూర్వం అవైదిక శాఖలన్నిటినీ నాస్తిక వాదాలనేవారు. ఈ నాడు నాస్తికత్వం ఆ అర్థాన్ని అధిగమించింది; భౌతికవాదానికి చాల దగ్గరగా జరిగింది. కాని, శంకరుడు పేర్కొన్న అజ్ఞాతబ్రహ్మం ఈ ప్రపంచానికి ఉపాదానకారణంతోపాటు నిమిత్తకారణంకూడా; శంకరుడి ప్రకారం అంతా కారణమేకాగా కార్యమనేది భ్రమేకాని వాస్తవంకాదు. అంతా బ్రహ్మమనేదే పార మార్థికసత్యం; ప్రపంచం వ్యావహారికసత్యమేకాని, వాస్తవికసత్యంకాదు; 'తత్త్వమసి' (అది నీవే) అని తెలిసిన తర్వాత, అన్యమంతా ఆభాస అవుతుంది – ఇదే అద్వైతం. అదితప్ప, మరేమీ లేదనడమే అద్వైతం.

'బ్రహ్మమంటే పదార్థం', 'అంతా బ్రహ్మమంటే పదార్థవాదం' అనే వికటార్థ

పాండిత్యం శంకరుణ్ణి భౌతిక వాదిని చేయజాలదు. బ్రహ్మం బ్రహ్మమే, పదార్థం పదార్థమే, శక్తి పదార్థంగా పరివర్తన చెందుతుందనే భౌతిక విజ్ఞాన సూత్రాన్ని పట్టుకొని " ఆశక్తినే మేము దేవుడంటున్నాం" అనడం ఎలా వుంటుందో, బ్రహ్మాన్ని పదార్థమనడం రివర్సులో అలాగే వుంటుంది. కుక్కను గాడిద అని ఎవరైనా అంటే, అలా అనుకోవచ్చు కాని, కుక్క కుక్కే, గాడిద గాడిదే. ఆరోగ్యవంతమైన మానసిక స్థితిలో వున్న వారికి అవి రెండూ ఒకటికావు. పదాలకు ఉన్న అర్థాలను వంకరతిప్పి, మన అర్థాలను మనం కల్పించడం, ఒక వస్తువును మరో వస్తువుగా గ్రహించే మానసిక అస్వాస్థ్యానికి సంబంధించిన రుగ్మత; బుద్ధి బుద్ధిగా పని చేయనప్పుడు అలాంటి అర్థాలు, భావాలు సిద్ధిస్తాయి. అందువల్లనే బ్రహ్మ పదార్థం అగోచరమనీ, మాయ అనేది మరో అదృశ్యసాధనమనీ, ఈ రెండవదిమొదటిదాన్ని జగత్తు అనేదానిగా మనస్సు అనే మరో చిన్న అగోచర బ్రహ్మానికి దర్శనం చేయిస్తుందనీ, ఇది శంకరుడు కనిపెట్టిన భౌతికవాద సూత్రంగా తాము కనుగొన్నామనీ, ఈ రహస్యం ఆధునిక భౌతికవాదులకు తెలియదనీ కంగారుపడి ఏమేమో వచిస్తున్నారు నయాలు; అదంతా తాత్విక ఆలోచన అని భ్రమ పడుతున్నారు. అంతగా చిత్తం చలించిన వారి అహం తగ్గితే తప్ప, వారి మెదళ్ళ మరమ్మత్తు సాధ్యం కాదు.

శంకరుడి బ్రహ్మతత్వాన్ని మూడు ముక్కల్లో వివరిస్తానంటూ, మాక్సుముల్లర్ దాదాపు 90 సంవత్సరాలనాడు ఇలా అన్నారు.

In one half verse I sha l tell you what has been taught in thousands of volumes: Brahman s true, the world 's false, the soul is Brahman and noth ng e se'

దాని ఫలితం There s noth ng worth gaining, there is nothing worth enjoying there is nothing worth knowing but Brahman a one, for he who knows Brahman, is Brahman .(The S'x Systems of nd'an Ph losophy, P. 122) అని సూత్రీకరించాడు. నిజానికి ఇదికూడా గౌడపాదుడు చెప్పిందేకాని, శంకరుడు చెప్పిందికాదు.

నాఽఽస్వాదయేత్సుఖం తత్రనిసంగః ప్రజ్ఞయాభవేత్
నిశ్చలం నిశ్చరచ్చిత్తమేకీకుర్యాత్ప్రయత్నతః ॥ గౌ.కా॥ 3.45
యదా న లయతే చిత్తం న చ విక్షిప్యతే పునః
అనిఙ్గన మనాభాసం నిష్పన్నం బ్రహ్మతత్తదా ॥ గౌ.కా॥ 3-46

తత్వంగా శంకరుడిదిగా (?) గుర్తించబడిన తత్వసారం మాక్సుముల్లర్ సూత్రీకరించిందే కాని,

దేహానికి భిన్నంగా అత్మ వుంటుందన్నప్పుడూ,

పూర్వజన్మలూ-పరజన్మలూ వున్నవన్నప్పుడూ,

పూర్వజన్మ సంచితఫలం ఉత్తరజన్మకు సంక్రమిస్తుందన్నప్పుడూ,

పితృలోకాలూ స్వర్గ-నరకాలూ వున్నవన్నప్పుడూ,

జ్ఞానులు కానివారు పశుపక్ష్యాదులుగా పునర్జన్మ యెత్తుతారన్నప్పుడూ,

ఆస్తికులు దేవయానం చేస్తారన్నప్పుడూ,

ఇంకా అనేక సందర్భాల్లోనూ ఈ అద్వైతం, బ్రహ్మావాదం, మిథ్యావాదం లాంటివేమీ శంకరుడి మీద పనిచేయలేదు. ఇలాంటి చెత్త బ్రహ్మసూత్రభాష్యంలో కోకొల్లలుగా వుంది. అదంతా అద్వైతానికి విరుద్ధమే. అది కిచిడీవాదం. అవసరమైనపుడు అద్వైతం. మిగాతా సందర్భాలన్నింటిలోనూ పచ్చి హైందవం. అందుకే శంకరుడు చాల సందర్భాల్లో వాదం కోసం వాదం చేసినట్లు కన్పిస్తుందనడం. ఈనాటి రివైవలిస్టులూ అదే బాణీని అనుసరిస్తున్నారు. చిత్తశుద్ధి పూర్తిగా లోపిస్తే, చెడేదెవరు?

# 7. ఇప్పుడు బ్రహ్మాన్ని ఎక్కడ పెడదాం?

బ్రహ్మ శబ్దాన్ని ఆత్మకు, జీవానికి పర్యాయ పదంగా ప్రయోగించిన సందర్భాలు ఉపనిషత్తుల్లోనూ, శంకర భాష్యాల్లోనూ అనేకానేకం కన్పిస్తాయి. ఆనాటి భావవాదుల కెవ్వరికీ జీవలక్షణానికీ, భావ (జ్ఞాన)లక్షణానికీ కారణం ప్రకృతిలో కన్పించలేదు. ప్రకృతి పరిణామం వారికి అవగాహన కాని విషయం. పరిణామ స్వభావం నుంచి వారు అశాశ్వత భావాన్ని, మిథ్యాభావాన్ని రాబట్టారు. చాలీచాలని ప్రకృతి జ్ఞానంతోనైనా భౌతిక వాద పరంగా చార్వాకులు చెప్పిన వ్యాఖ్యానాన్ని, వివరణను వారు ఆమోదించలేకపోయారు. విశాల ఆకాశాన్ని (మహాకాశాన్ని) బ్రహ్మంగాను, కుండల్లోను, చట్లలోను వుండే ఆకాశాన్ని (ఘటాకాశాన్ని) జీవాత్మగాను పోల్చారు. ఆనాటి ఆ తాత్విక దైన్య స్థితిని అర్థం చేసుకోవచ్చు. కాని, ఈనాడు కూడా అదే వివరణ యిచ్చేవారిని చూస్తే నవ్వు వస్తుంది. ఎందుకంటే ప్రకృతి లోపల యిమడని బ్రహ్మాన్ని ఇప్పుడెక్కడ పెట్టాలి?

మనం లేకపోయినా, ప్రపంచం వుంటుందని ఈ నాడు మనకు తెలుసు. మనతో నిమిత్తం లేకుండా భౌతిక వాస్తవికత వుంటుందనేది వాస్తవిక సత్యం. మా తాత, తండ్రి, నేను వున్నప్పుడీ ప్రపంచం వుంది. మాతాత గతించిన తర్వాత మా తండ్రికీ, నాకూ యీ ప్రపంచం వుంది. మా తండ్రి గతించిన తర్వాత నాకూ యీ ప్రపంచం వుంది. నేను గతించిన తర్వాతకూడా మా సంతానానికి యీ ప్రపచం వుంటుంది. ఈ జగత్తు మిధ్య అన్న శంకరుడు గతించిన తర్వాత కూడా మనకీ ప్రపంచం లేదా? అలాగే. అంటే, వాస్తవిక సత్యం మన మనస్సుల మీద ఆధారపడి లేదు.

మన మనస్సులు త్రాడులో పామును, పాములో త్రాడును చూస్తే, త్రాడులో పామూ–పాములో త్రాడూ జొరబడవు. త్రాడు త్రాడులోనే వుంటుంది, పాము పాము లోనే వుంటుంది. ఈ స్థితి 1200 ఏండ్లనాడు శంకరుడి కాలంలో ఎలా వుందో ఇప్పుడూ అలాగే వుంది. వస్తువులూ ఆనాటి వలెనే ఉన్నాయి, భ్రమలూ ఆనాటివలెనే ఉన్నాయి. కాని, త్రాడును చూచి పామనే యెందు కనుకోవాలి? గుర్రమని ఎందుకనుకోగూడదు? అలా అనుకోదగిన సమానలక్షణాలు గుర్రంలో యెందుకు లేవు? అనేవి ప్రశ్నలు. అది పదార్థ విన్యాసం కాబట్టి, బ్రహ్మవిన్యాసం కాదు కాబట్టి, కేవలం మనం అనుకుంటే ఒక వస్తువు మరో వస్తువుగా మారదు కాబట్టి అనేవి సమాధానాలు. మారక పోవడమే కాదు, అలా భ్రాంతిని కూడా కల్పించచదు.

అప్పుడు కూడా జాగ్రదవస్థలో పామును, త్రాడును గురించిన జ్ఞానం ముందుగా వుంటేనే రజ్జు-సర్ప భ్రాంతి కలుగుతుంది.

ఈ భావించే మనం, భ్రాంతి చెందే మనం ఈ ప్రకృతిలో భాగమే. ప్రకృతి యెంతనిజమో. అందులో భాగంగా మనమూ అంతే నిజం. మనం, మన భావాలు నిజం. అవి వాస్తవికత ఆధారంగా బయలుదేరడం నిజం. మనం భ్రమపడడమూ నిజం. కాని, మన భ్రమ వాస్తవిక సత్యం కావడం కానీ. వాస్తవిక సత్యం మన భ్రమ వంటిది కావడం కానీ జరగదు. భ్రమ భ్రమే, వస్తువు వస్తువే. కలకలే, మెలకువ మెలకువే. అది ఇదీ కాదు, ఇది అదీకాదు, కానీ, కలలో యెలాగో అలాగే మెలకువలోనూ, మనస్సు మాయవల్ల ద్వయాభాసం పొందుతుందని అద్వైతం అంటుంది (గౌడపాద కారికలు :3-29, 4-61,62). మనమెంత నిజమో, మన ఛాయలూ అంతే నిజం. మనం మనుషులుగా నిజం, అవి ఛాయలుగా నిజం. మనుషులు ఛాయలూకారు, ఛాయలు మనుషులూ కావు. అవి అవిగా నిజాలే కాని, అబద్ధాలు కావు. మనిషిని ఛాయ అనడం, ఛాయను మనిషి అనడం అబద్ధాలు. అబద్ధాన్ని, నిజంతోపోల్చి, నిజాన్నికూడా అబద్ధంగా మార్చేదశనుంచి నిజాన్ని నిజంగా, అబద్ధాన్ని అబద్ధంగా గుర్తించగల దశకు మనం చేరాం. ఈ విషయాన్ని గమనించడం మానసికారోగ్యానికి గుర్తు.

ఈ మనస్సు కుండ, చట్టిలోని ఆకాశం (ప్రదేశం) వంటిది కాదు. ఇది, ఒకా నొకరకంగా నిర్మాణమైన పదార్థం (మెదడు) ప్రకటించే లక్షణం. ఈ మనస్సును పని చేయించనూ వచ్చు. చేయకుండా ఆపనూవచ్చు. మనం ఆపితే ఆగే మానసిక ప్రవృత్తినే బ్రహ్మం అంటున్నామంటే, ఆబ్రహ్మం మన అదుపులో వుంటుదన్నదే తప్ప-మనల్ని అదుపు చేయడం లేదని తేలుతుంది. ('అయమాత్మా బ్రహ్మ' అంటే 'ఈ ఆత్మయే బ్రహ్మ' అని అర్థం).

జీవ ప్రకృతిని దేహం నుంచి మనం దూరం చేయవచ్చు. మత్తు పదార్థాలను యివ్వడం ద్వారా, ఇంకా అనేక కృత్రిమ పద్ధతుల ద్వారా మనో వ్యాపారాన్ని మనం నిరోధించవచ్చు. మనిషి మరణంతో మానసికచర్యలన్నీ ఆగిపోతాయి. మనస్సుమరో విశ్వమనస్సులో కలసి పోదు. విశ్వమనస్సు అనేదేమీ లేదు. కుండను పగలగొడితే ఘటాకాశం మహాకాశంలో లీనమవుతుంది. మనిషిని పగలగొట్టకుండానే మనో వ్యాపారాన్ని శాశ్వతంగా మనం ఆపగలిగినప్పుడు జీవాత్మ ఎందులో లీనమవుతుంది? జీవాత్మను చేసినట్లే బ్రహ్మాన్ని కూడా చేయడానికి వీలు లేదా? లేక, దేహ (మెదడు) వ్యాపారాన్ని మార్చటం ద్వారా ఒకరకంగా వున్న ప్రపంచాన్ని మరోరకంగా వున్నట్లు

చూపవచ్చు.ఇవి అశరీర బ్రహ్మం పనులు కావు. శారీరక స్థితిని బట్టి మారే పనులు. మనిషి చేయగల పనులు. బ్రహ్మం 'గడ్డి తింటుందనే భయంతోనే' శాంకరులు మఠాల్లో స్త్రీలకు ప్రవేశం నిషేధించారు.

అనేక భ్రమల్ని భ్రమలుగా మనం తెలుకున్నాం. ఇంకా భ్రమలుంటే, వాటి వెనుక వుండే వాస్తవికత యేమిటో తెలుసుకోడానికి కృషి చేస్తాం. చాలా భ్రమల్ని మనం సృష్టించగలం. ఐనప్పుడు భ్రమల్నీ, వాస్తవికతలనూ పరస్పరం పోల్చి. అవి ఎలాంటివో, ఇవీ అలాంటివేనని తేల్చడం అర్థరహితం. భ్రమ, వాస్తవికత ఒకటి కావు; ఒక లాంటివి కూడా కావు. వాస్తవికతకు భ్రష్టరూపం భ్రమ. వాటిని విడివిడిగా గుర్తించవచ్చు. భ్రమల నుంచి దూరం కావచ్చు.

ఈ మనిషి అమాంతం ఎక్కడనుంచో దిగివచ్చినవాడు కాదు. బ్రహ్మం(మనస్సు) లేని జీవుల నుంచి క్రమంగా పరిణామం చెంది వచ్చాడు. ఈ పరిణామం కోట్లాది సంవత్సరాల కాలంలో ప్రధానం, ప్రకృతి, పదార్థం వగైరా పేర్లతో పిలువబడే సత్తా (అస్తిత్వం) నుంచి జరిగింది. ఆ భౌతిక అస్తిత్వాన్నే బ్రహ్మవాదులు మిథ్య (అసత్తు) అన్నారు.

మనిషికి ముందు జీవం, ఆ జీవానికి (చెట్లు చేమలకు) ముందు నిర్జీవ పదార్థం వున్నాయి. పదార్థం లేకుండా జీవమూ, మనస్సూ ప్రత్యేకంగా వున్నట్లు మనకు రుజువు లేదు. జీవంలేకుండా పదార్థం వున్న దశ వుంది. మనస్సులేకుండా జీవంవున్న దశ వుంది. అనాదిగా వున్న నిర్జీవ పదార్థంలో ఇటీవల మూడు నాలుగువందల కోట్ల యేండ్లనాడు మాత్రమే జీవం ఉత్పన్నమైంది. ఆ తర్వాత చాలాకాలానికి మెదడు ఉత్పన్నమైంది. ఇవి, ఆధునిక విజ్ఞానం ద్వారా మనిషి తెలుసుకున్న విషయాలు. ఈ తెలుసుకొన్న విషయాల్లో బ్రహ్మం లేదు.

అంటే, బ్రహ్మం నుంచి యీ ప్రపంచమంతానూ, దాని వికారాలన్నీనూ అభాసిస్తున్నాయని బ్రహ్మవాదులంటే – భౌతికవాదులు, ఆధునిక విజ్ఞానవాదులు, హేతువాదులు, మానవవాదులు, నాస్తికవాదులు, అందరూ నిర్జీవ పదార్థం నుంచి జీవమూ, జీవం నుంచి మనసూ(బ్రహ్మమూ) పదార్థ పరిణామ ఫలితంగా క్రమంగా అవతరించాయని కనుగొన్నారు. అదీ తిరకాసు. ప్రపంచం, బ్రహ్మ–ఇవి రెండూ ఒకటి కావు. దేని పరిణామ ఫలితంగా జీవం, మనస్సు అవతరించాయని ఆధునిక విజ్ఞానం అంటున్నదో, ఆ ప్రపంచాన్నే అభాస అనడం బ్రహ్మవాదం. అందుకే బ్రహ్మ వాదాన్ని–అందులోనూ శంకరుడి బహ్మవాదాన్ని తిరగదిప్పిన భౌతిక వాదమన్నాడు ఎం.ఎన్.రాయ్ తిరగదిప్పిన భౌతికవాదం భౌతికవాదం కాదు. తలక్రిందులుగా

నడిస్తే, తల కాళ్ళు కావు, కాళ్ళు తలకాదు. అందువల్ల తలక్రిందుల భౌతికవాదాన్ని భౌతికవాదంగా భ్రమింపజేసేపని హేతువాదులకు లేదు. అలాగే, అంతా మిథ్య అనే శూన్యవాదాన్ని, నాస్తివాదాన్ని, నాస్తికత్వంగా భ్రమించే అవసరం మనకు లేదు.

మానసిక వ్యాపారం కూడా అందరి మనుషుల్లోనూ ఒకే స్థాయిలో లేదు; అన్ని జంతువుల్లోనూ ఒకేస్థాయిలో లేదు. మానసిక వ్యాపారమనేది అసలు లేని వృక్షాదులూ వున్నాయి. ఇందులో ఘటాకాశం(జీవాత్మ) వేటిలో వున్నట్లు? జీవాత్మ శరీరంలోవుంటే, శరీరం మిథ్య అయితే, జీవాత్మ మిథ్యను ధరిస్తున్నట్లా? ఈ నాటి శాస్త్రీయవిజ్ఞానం జీవానికి, నిర్జీవానికిమధ్య విభజనరేఖను దాదావు చెరిపివేసింది. జీవాత్మ వుండేచోట్లు ఎక్కడెక్కడ వున్నాయో, అప్పుడు శంకరుడు పూర్తిచేయక వదలిన కార్యాన్నిపూర్తి చేయడానికి ఇప్పుడు అవతరించామంటున్న నయా శాంకరులు చెప్పాలి.

వస్తువులను గుర్తించేది కేవలం మనస్సు ఒక్కటే కాదు; ఆ మనస్సుకు వివిధ జ్ఞానేంద్రియాల (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం) నుండి సందేశాలు అంది నప్పుడే అది పనిచేస్తుంది. కండ్లు లేకుండా, కేవలం మనస్సుతో వస్తువుల్ని చూడలేము. కండ్లతో చూడకపోయినా, చేతికి తగిలే గోడ, చెవికి వినిపించే శబ్దం, ముక్కుకి స్ఫురించే వాసన, నాలుకకు తోచే రుచి అబద్ధాలు కావు. ఒక జ్ఞానేంద్రియానికి అందని దానిని మరో జ్ఞానేంద్రియంతో నిర్ధారణ చేసుకొనే సందర్భాలుకూడా వున్నాయి. అన్నిటికీ స్పర్శ ముఖ్యం. బుద్ధికి కూడా ఆ స్పర్శ అవసరమే. అది లేని దాని ప్రవృత్తి జ్ఞానానికి దారితీయదు. బుద్ధిలేని జ్ఞానేంద్రియాలూ, జ్ఞానేంద్రియాలు లేని బుద్ధీ చేసేపని ఏదయినావుంటే, అది జ్ఞానానికి సంబంధం లేని భౌతిక ప్రవృత్తి. దానివల్ల ఎలాంటి జ్ఞానమూ సాధ్యం కాదు.

పంచేంద్రియాలు పనిచేయనప్పుడు బ్రహ్మం ఏమి చేస్తుందో బ్రహ్మవాదులే చెప్పాలి. చర్మం తప్ప-కన్ను, ముక్కు, చెవి, నాలుకకానీ, మనస్సుకానీ లేని వృక్షాదుల్లో బ్రహ్మ వ్యాపారం ఎలా వుంటుందో కూడా వారే చెప్పాలి. పంచేంద్రియాలు లేకుండా బ్రహ్మ (మనస్సు) వ్యాపారం ఎలా సాధ్యమో వివరణ కావాలి. ప్రపంచం మిథ్య, జీవాదులు మిథ్య అనేటట్లయితే బ్రహ్మం ఏల మిథ్య కాదో, అసలు అనుభవంలో వున్నవాటి కన్నిటికీ భిన్నంగా, అన్యంగా బ్రహ్మమనేది ఒకటి ఉన్నదనే దానికి రుజువేమిటో కూడా బ్రహ్మవాదులు చెప్పాలి. ఎందుకంటే, బ్రహ్మ మంటే ఏమిటో బ్రహ్మవాదులెన్నడూ చెప్పలేదు. అది వున్నట్లు ఎన్నడూ, ఏరుజువులూ చూపలేదు. ఊరకే కల, మెలకువ, నిన్న, నేడు, పుట్టుక, చావులాంటి ద్వంద్వాల ఉపమానాలతో బ్రహ్మం వున్నట్లు కానీ, బ్రహ్మేతరం లేనట్లు కానీ రుజువుకాదు.

## కల - వాస్తవం

కలల్ని మనం ప్రేరేపించవచ్చు, నివారించవచ్చు, ఎలాంటి కలలు కావాలంటే అలాంటి కలలు కనించవచ్చు. వాస్తవికంగావున్న వస్తువులు, వాటి సమ్మేళనాలుతప్ప, లేనివస్తువులేవీ కలల్లో చోటు చేసుకోవు. కాకుంటే, కలల్లో కన్పించే మనిషికి కొమ్ములుండవచ్చు, సింహానికి రెక్కలుండవచ్చు. కాని, ఉన్న వస్తువులు (మనిషి, కొమ్ములు, సింహం, రెక్కలు) మాత్రమే వివిధ రీతుల్లో సంఘటితమై కలల్లో కన్పిస్తాయి. వాస్తవికజగత్తులో మనిషికి కొమ్ములుండవు. సింహానికి రెక్కలుండవు. అలావున్నవని మనం మనసులో సంకల్పించుకొన్నా, మన సంకల్పాలను కవితల్లో యిరికించినా, వాస్తవికంగా అవి వుండవు. పగటి కలలైతే అత్యల్ప కాలంలోనే భ్రమలనుంచి మనం మేలుకుంటాం. కండ్లకు కన్పించేవి చేతికి తాకినా తగులుతాయి. కన్పించనివి చేయిచాచినా తగలవు. కండ్లు లేనివాడికి కన్పించనిగోడ, చేతితో తాకి నప్పుడు వున్నట్లు తేలుతుంది. బంతి ఆటలో పైకెగిరిన బంతి ప్రేక్షకులందరికీ ఎగిరినట్లేకన్పిస్తుంది. ఆ సంఘటనకు బంతి స్థిరంగా ఉన్నట్లూ, ప్రేక్షకులే పైకి ఎగురు తున్నట్లూ అన్వయం చెప్పడం తలతిక్కవద్దతి. బంతి ఆటకాడి ముఖానికి తగిలినట్లు ప్రేక్షకులకు కన్పిస్తే, ఆ బంతి నిజంగానే ఆటకాడికి తగులుతుంది. లేక అది దృశ్యభ్రమ అయితే, దానినీ వివరించుకోవచ్చు.

నిన్న, నేడు, రేపుల అస్తిత్వం పదార్థ పరిణామంతో ముడిపడివుంధి. పరిణామంవల్లనే అస్తిత్వం చింత్యమూ, సార్ధకమూ అవుతున్నది. కేవల అస్తిత్వం, కేవల కాలం లేవు. అస్తిత్వంయొక్క వ్యాపారంవల్ల కాలం ఉనికిలోకి వస్తుంది. పరిణామంలో భౌతిక అస్తిత్వం (పదార్ధం) వివిధ దశలను వ్యక్తం చేస్తుంది. ఒక్కోదశలోని పదార్థం (భౌతిక అస్తిత్వం) ఒక్కొక ధర్మాన్ని కల్గివుంటుంది. ఒక్కొక్క వ్యాపారాన్ని నిర్వహిస్తుంది. ఏ దశలోని ధర్మాలు, వ్యాపారాలు ఆ దశలోని వస్తువుల ధర్మాలుగా, వ్యాపారాలుగా సత్యాలే. ఆ ధర్మాలను ప్రకటించే వస్తువులూ, వస్తుదశలూ సత్యాలే. వస్తువులు లేకుండా ధర్మాలూ, వ్యాపారాలూలేవు. సత్యం నిత్య పరిణతిలో వుంటుంది. మారని సత్యం సత్యంకాదు. పుట్టుక, చావు అనేవికూడా వేర్వేరు దశలలోని పదార్థం ప్రకటించే ధర్మాలూ, వ్యాపారాలేతప్ప-అన్యం కావు. అలాగే ఆలోచనకూడా మెదడుయొక్క వ్యాపారమే. మెదడులేనిచోట ఆలోచన వుండదు. జ్ఞానేంద్రియాల నుంచి మెదడుకు సందేశాలు అందనపుడు జ్ఞానం వుండదు.

ధర్మాలు, వ్యాపారాలు పదార్థం ఆయాదశల్లో వున్నంతకాలం ఆ పదార్థాన్ని ఆశ్రయించి వుంటాయి. వాటికి ప్రత్యేక అస్తిత్వం లేదు. పదార్థ ధర్మాలు, వ్యాపారాలు

అనేవి ఆ పదార్థ దశను గుర్తించడానికి దోహదంచేసే గుణాలు. ఇదంతా ఏకత్వవాదం, భౌతిక వాస్తవికవాదం.

నిర్జీవులనుంచి జీవుల్ని ప్రయోగశాలలో నిర్మించగల స్థితికి ఆధునిక విజ్ఞానం మనల్ని చేర్చింది. జన్యువులను మార్చడం ద్వారా మనుషుల భౌతిక మానసిక ప్రవృత్తులను మార్చగల స్థితికి మనం చేరాం. వైరసులవంటి సూక్ష్మజీవుల్ని నిర్జీవ స్థితికి విడగొట్టి, తిరిగి సంఘటించడంద్వారా వాటిని జీవులుగా మార్చగలమని తేలింది. జీవుల్ని నిర్జీవులుగా మార్చగల శక్తి మనకెప్పుడూ వుంది. జీవుల్ని ప్రత్యుత్పత్తి చేయగల శక్తి, చేసే స్వభావం జీవులన్నిటికీ వుంది. లైంగికవిభజన లేని జీవుల్లో కూడా ప్రత్యుత్పత్తి ప్రక్రియ సాగుతూనే వుంది. పురుషులుకూడా సంతానం కనగలరని తేలింది. కేవలం స్త్రీ దేహాన్ని మాంసపంకిలమని వర్ణించి రసభంగం చేసినంత మాత్రాన, పాలిచ్చే స్తనాలను మాంసవసాగంధిలాలని ఛీత్కరించినంత మాత్రాన, స్త్రీ సంపర్కాన్ని హేయమని జుగుప్సీకరించినంత మాత్రాన, సన్యాసి సంఘాల్లో స్త్రీల ప్రవేశాన్ని నిరోధించినంత మాత్రాన, గోసాయిలకు బ్రహ్మ సాక్షాత్కారం కాదు. ఏది తిన్నా, మలమూత్రాలుగా మారుతుంది కదా అని, తిండి తినకుండా వుండే జడుడుండడు. అక్కడకు వచ్చేటప్పటికి ప్రతి సన్యాసికీ పంచభక్ష్యపరమాన్నాలు కావలసిందే. అవి ఏమిగా మారతాయి అనే ప్రశ్న వారి జిహ్వాచాపల్యానికి రాదు. అన్నం నలుసులు పళ్ళసందున యిరుక్కుని, కుళ్ళి, కంపు కొడతాయని తిండి మానుకొనే మూర్ఖుడుండడు. అన్నం పరబ్రహ్మస్వరూపం కాదు. అది దేహావిర్భావానికి, పరిణామానికి కారణం. ఆ దేహపరిణామమే మెదడు అవతరణకు మూలం. ఆ మెదడు వ్యాపారమే యీ ఆలోచన అంతానూ. విడిగా ఆత్మలేదు, బ్రహ్మమూలేదు.

బ్రహ్మవాదం ఒక విధమైన ఆత్మహత్య. జీవితాన్ని ద్వేషిస్తూ బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నామనుకొనే మతిచెడ్డవారిని చూచి మనం జాలిపడాలి. కాని, అందులో అధికశాతం దొంగసన్యాసులు. ఈ అంటురోగ వ్యాప్తిని మనం నిరోధించక తప్పదు, నివారించకనూ తప్పదు. జీవితంలో ఓడిపోయినవారికి, నిరాశావాదులకు, మానసిక బలహీనులకు ఒక్కోతరుణంలో అది సుఖాన్ని చేకూర్చినట్లు కన్పించవచ్చు. కాని, ఆ తత్వాన్ని వృత్తిగా స్వీకరించిన స్వాములవార్లు చాల ప్రమాదకారులు. తిరుమంత్రోపదేశం పేరుతో గురుపాదం పట్టించడం, అందుకు ఫీజులు వసూలు చేయడం, మానసికంగానూ – ఆర్థికంగానూ దోపిడి చేయడం వారి నిత్యవృత్తి. వారి జీవితాలు మనకు ఆదర్శం కావడమంటే, మనం మానవతనుంచి ఎన్నో మెట్లు క్రిందికి దిగిపోవలసి వస్తుంది.

## బ్రహ్మంలేదు

బ్రహ్మంలేదు, గిహ్మంలేదు. కనపడని పరమాణు శకలాలున్నట్లే కనపడని బ్రహ్మంకూడా ఎందుకుండకూడదు అనేది అసమర్థ ప్రశ్న. కనపడని అయస్కాంత క్షేత్రం గెల్వనో మీటరులోని ముల్లును " అల్లంత" దూరంలో వుండగనే కదిలిస్తుంది. ఎక్కడో, లక్షలాది మైళ్ళదూరంలో దూసుకుపోతున్న రాకెట్‌ను ఇక్కడవున్న రిమోట్‌కంట్రోలరు ద్వారా మన అదుపులో పెట్టుకోగల్గుతున్నాం. కంటికి కనపడడ మొక్కటే ప్రధానంకాదు. కేవలం కనపడనందువల్ల మనం బ్రహ్మాన్ని తిరస్కరించడంలేదు. ఏ ప్రవృత్తిద్వారా బ్రహ్మం రుజువవుతుందో చెప్పగలగాలి. ఉపమానాలవల్ల బ్రహ్మం రుజువుకాదు. తెలియని విషయాన్ని తెలిసేటట్లు చెప్పడానికి తెలిసిన విషయాన్ని ఉపమానంగా చూపవచ్చుకాని, ఉన్న వస్తువుల ప్రవర్తనను వుపమానంగా చూపి, లేని వస్తువుల 'వునికిని' రుజువుచేయడం కుదరదు. అది మతిభ్రమకు నిదర్శనం.

బ్రహ్మవాదుల మరో ఆయుధం నిషేధం (Negat on) . అద్వైతులంతా నిషేధంద్వారా బ్రహ్మ అస్తిత్వాన్ని రుజువుచేయడానికి ప్రయత్నిస్తారు. అది ఏదికాదో చెపుతూపోతారు. దానినే అద్వైతమని నిషేధభాషలో చెపుతారు. అది ఏమైవున్నదో, అది చెప్పరు. అది ద్వైతం కాదంటారు, బహుత్వం కాదంటారు, ఏకత్వమని చెప్పరు. ఎందుకంటే, అది ఏకత్వంకాని బహుత్వం, గర్భితద్వైతం.

సాంఖ్యవైశేషికాదులు సరైనవి కావనడానికి శంకరుడు శ్రుతిస్మృత్యాదులను ప్రమాణించాడు. 'శూద్రులు వేదాలెందుకు చదవకూడదు?, అని అడిగితే, "చదవ కూడదని స్మృతులు శాసించాయి కాబట్టి" అని సమాధానం చెప్పే పరభావోపవర్తి సాంఖ్య వైశేషికాదుల్ని మరోవిధంగా ఎలా విమర్శించగలడు? తనవాదం సరైన దనడానికి కూడా శంకరుడు అర్థభేదంతో, అన్వయభేదంతో ఆ శ్రుతిస్మృత్యాదులనే ప్రమాణించాడు. తనవాదం సహజ అనుభూతికి విరుద్ధమైనది కాబట్టి, అది బుద్ధిశుద్ధి పొందిన సన్యాసులకు మాత్రమే యోగ్యమైనదన్నాడు. పరిణామరహితమైన పరమ అస్తిత్వాన్ని (బ్రహ్మాన్ని) నిలదొక్కాడు. దాన్నే అస్తిత్వ సర్వస్వం చేశాడు. అన్య మంతా మిథ్య అన్నాడు. బాహ్యచోదనలు లేకుండా జాగ్రదవస్థలోని స్పందనలు, స్వప్నావస్థలోని వికారాలు స్వచ్ఛందంగా కల్గగలవని భ్రమపడ్డాడు. స్పందనలు, వికారాలు, అన్నీ కేవలం భావాలని భ్రాంతి చెందాడు. ఇదంతా మనోవిజ్ఞానం శాస్త్రంగా అవతరించడానికి పూర్వదశలోని రజ్జు సర్పభ్రాంతి. కలలోని అనుభవాలను మెలకువలోని అనుభవాలతో తుల్యంగా భావించడం అవాస్తవం అని గుర్తించే మానసిక స్వాస్థ్యం లోపించడం వల్ల యీ ప్రమాదం జరిగింది.

జాగ్రదవస్థలో తినకుండా, సప్నావస్థలో తింటూ పడుకొంటే, మనిషి ఎన్నాళ్ళు బ్రతక గలడు? స్త్రీ పురుషులు జాగ్రవస్థలో లైంగికంగా కలియకుండా, కలిసినట్లు కలగంటే, సంతానోత్పత్తి ఎలా జరుగుతుంది? ఆ సంతానం కూడా కలలోనే కలగాలి. స్వప్నావస్థలో మరణానుభూతి పొందినా, జాగ్రదవస్థలోకి తిరిగి వచ్చినపుడు బ్రతికి వున్నట్లు గ్రహిస్తారు. జాగ్రదవస్థలోని మనిషి మరణించితే, ఇక స్వప్నావస్థవుండనే వుండదు. అవి రెండూ ఒకటెలా అవుతాయి?

జాగ్రదవస్థకు వికృత ప్రతిబింబమే స్వప్నావస్థ. జాగ్రదవస్థలోని లోకానుభవం అందరికీ ఒకే విధంగా వుంటుంది. స్వప్నావస్థలో ఎవరి అనుభూతి వారిదే. ఎవరి భయ సందేహాదుల ప్రభావం వారి స్వప్నానుభూతి మీద వుంటుంది. జాగ్రదవస్థలో మనుషులందరికీ రాయి రాయిగానే కన్పిస్తుంది. స్వప్నావస్థలో అది ఒకరికి వెన్నముద్ద గాను, మరొకరికి పూలగుత్తిగాను, ఇంకొకరికి బొంగు మిఠాయిగాను తోచవచ్చు. అంతేకాదు, జాగ్రదవస్థలోని యితరుల చర్యలు మనకు తెలుస్తాయి. వారి ఆలోచనలు వారు చెప్పగలరు. మనం గ్రహించగలం. స్వప్నం లోని అనుభూతులు ఒకరివి మరొకరికి తెలియవు. మెలకువ వచ్చిన తర్వాత స్వాప్నికుడికే ఆ కలలోని అంశాలు పూర్తిగా గుర్తుకురావు. స్వప్నంలో 5x5=20 కావచ్చు, 30 కావచ్చు, మరేమైనా కావచ్చు. కాని జాగ్రదవస్థలో 5x5 అందరికీ 25 అవుతుంది.

ఎవరి పగటి కలను వారు గ్రంథీకరించడం వల్లనే ఇన్ని పురాణాలు సిద్ధమైనై. కాని, జాగ్రత్స్వప్నావస్థలు రెండూ ఒకటేననుకొనే వారికి ఈ తేడాలు తోచవు. ఎందుకంటే, వారి జీవనం స్వాప్నిక భ్రమ్మంలోనే. ఇదీ చిత్తశుద్ధికల వేదాంతుల విషయంలో మాత్రమే. వృత్తి వేదాంతుల విషయంలో అనుభూతులుండవు. అందువల్ల, "ఏ కారణంవల్ల ఆత్మ తద్భిన్నమైన ప్రపంచంగా దర్శనమిస్తున్నదో చెప్పలేక పోతున్నాము కాబట్టి, ఆచెప్పలేక పోవడాన్నే 'మాయ' అంటున్నాం." అని శ్రీత్యాగీశానందస్వామి రుద్దిన దాన్నే తిరగ రుద్దుతున్నారు నయాలు. ఈ ప్రపంచానికి కారణం అజ్ఞానమనీ, ఉన్న ప్రపంచం అసలు రూపులో కాక మరో రకంగా కన్పిస్తున్నదనీ అంటారు. కానీ, కన్పిస్తున్న రూపు కాక దాని అసలు రూపు యేమిటో చెప్పరు. కన్పించేది ప్రపంచమనీ, దాని పరిణామమనీ, ఆత్మవికారాలు కావనీ వారికి స్ఫురించదు. పైగా, యీ విషయాలు భౌతిక విజ్ఞానులకు కూడా అర్థం కావడంలేదని దంబిస్తారు. ఆత్మలేదనే విషయం వారి ఆలోచనకు రాదు. అది వున్నదని రుజువు పరచరు.

కపిలుడి పదార్థవాదం నుంచీ, కణాదుడి అణువాదం నుంచీ భావచౌర్యం చేసి, వాటిని శంకరుడికి అంటగట్టి. అతన్ని భౌతికవాదిగా ప్రదర్శించడానికి పిచ్చి పిచ్చి వాదాలు చేస్తారు.

వస్తు పరిణామ దశలన్నీ నియమబద్ధమైనవి. కాబట్టి, ప్రతిదశనూ మనం ముందుగా చెప్పగలం. వస్తుస్థితి మార్పులవల్లనే వస్తువులోని వైవిధ్యాన్ని మనం గుర్తిస్తున్నాం. అది బహుత్వంగా దర్శనమిస్తున్నా, పదార్థమూలం దాని ఏకత్వం. వస్తు దశలను, స్థితులను మనం కల్పించవచ్చు. వైద్యం చేస్తున్నామంటే, మనిషి స్థితిని రుజగ్రస్తత నుంచి మారుస్తున్నామనే అర్థం. కత్తితో మెడను నరికివేస్తే "ఘటాకాశం (జీవాత్మ) మహాకాశం (పరమాత్మ) లో కలుస్తుందని" ముందుగానే మనం చెప్పగలం. (కాని, దాన్ని ఆ భాషలో చెప్పం.) దానికి కారణం వస్తుస్థితి మారడం. మనస్సును (బ్రహ్మాన్ని) కూడా మనం మరమ్మత్తు చేయవచ్చు. దశలను స్థితులను కల్పించడంలో మాయలేదు, భ్రాంతి లేదు. ఉన్నది కేవలం కార్యకారణ సంబంధమే. దశల మార్పునే కార్యకారణ సంబంధంగా మనం చెప్పుకొంటాం. ఏమి చేస్తే ఏమి జరుగుతుందో జాగ్రదవస్థలో వున్నంత కాలం మనం తెలుసుకోగలం. ఆ సంబంధం మనకు తెలిసిన మేరకు అన్ని సంఘటనలనూ మనం ముందుగానే చెప్పగలం. తుపాకితో గుండెలో ప్రేలిస్తే, ఘటాకాశం (జీవాత్మ) అంతమవుతుందని ముందుగా చెప్పగలం. ఇందులో మాయలేదు, గారడీ లేదు. మనిషి, గుండె, తుపాకి, తూటా, ట్రిగ్గరు, నొక్కడం, ప్రాణం, అది అంతం కావడం, మనిషి శవంగా మారడం అన్నీ వాస్తవాలే.

జనన మరణాలూ వస్తుదశలే. జీవదశలో మనిషిలో అనుభూతి వుంటుంది. అలాగే మెలకువలోని అనుభూతీ, కలలోని అనుభూతీ ఒకటి కావు. దేని లక్షణం దానిదే. జీవించడం జీవిలక్షణం. మరణానికి వ్యతిరేకంగా పోరాడే జీవ ప్రవృత్తి జీవికి తెలియకుండానే శారీరక లక్షణాల్లో ఇమిడి వుంది. మరణానికేకాదు, రుగ్మతకు వ్యతిరేకంగా పోరాడే లక్షణం కూడా శారీరక లక్షణాల్లో భాగం. మనసువినా, వేరే ఆత్మ లేదు. జగత్తువినా, వేరే బ్రహ్మం లేదు. విశ్రాంతి దేహానికీ, మనస్సుకూ మాత్రమే కాదు. అన్ని వస్తువులకూ వుంటుంది. అదొక దశ. శరీరాన్ని పనిచేయించకుండా కేవలం విశ్రాంతిపాటిస్తే శరీరం యెలా చెడిపోతుందో, అలాగే మనస్సును పనిచేయనీయకుండా బలవంతంగా బంధిస్తే అదికూడా పనికిమాలినవస్తువైపోతుంది. పనీ, విశ్రాంతీ రెండూ అవసరమే. ఏ స్థితి ధర్మం ఆ స్థితిదే. ఒక స్థితిలోని ధర్మం మరోస్థితిలో వుండదు. కాబట్టి, అంతా అస్థిరం, అనిత్యం, అసత్యం అని త్రోసివేసి, పరమ స్థితిగా బ్రహ్మాన్ని కల్పించుకొన్నందువల్ల జీవిత సమస్యలుతీరవు. జీవికి సమస్యలుండకమానవు. జీవితం కష్టసుఖాల మయం, కష్టంలేని సుఖంతెలియదు. కష్టం తగ్గించుకొని సుఖాన్ని పెంచుకోవడం మానవ లక్ష్యం కావాలి. కష్టం లేని సుఖాన్ని పొందాలనే దురాశతో బ్రహ్మాన్వేషణలో కష్టం తెచ్చుకొని, అనంతరం "రాని

సుఖాన్ని" మోక్షంగా భ్రమించడం వేదాంత సుఖరోగం. అది వాస్తవిక సుఖరోగంకాదు, కల్పిత సుఖరోగం, వాస్తవికానుభవానికి దూరమై తెచ్చుకొన్న మానసిక సుఖరోగం. శంకరుడి అద్వైతాన్ని సర్వరోగ నివారిణిగా భావించే వారంతా ఈ రోగాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

## "శ్రుతత్వాశ్చ" అంటే ఖండన అవుతుందా?

ఉపనిషత్తుల్లో ప్రకృతి జ్ఞానానికి సంబంధించిన దోషాలనేకం వున్నాయి. అంతకంటే అధికజ్ఞానం ఆనాటి వారికుండడం సాధ్యంకాదు కాబట్టి, అధునికశాస్త్ర విజ్ఞానమంతా వాటిలో లేదని మనం ఆక్షేపించలేము. ఐతే, ఉపనిషత్తులకాలం తర్వాత పది పదిహేను వందల సంవత్సరాలకు వచ్చిన శంకరుడు ఆ అజ్ఞానాన్నే మూసపోసి దించాడు. పిసరంత కలిపింది లేకపోగా, ఆ అజ్ఞానాన్ని ప్రశ్నించగలిగిందీ లేదు. అయితే, తమాషా యేమంటే, యీనాటి శంకర మతస్థులు ఆనాటి 'శంకర సిద్ధాంతం'లో ఆధునికవిజ్ఞానాన్ని మాత్రమేకాదు, అనంతవిజ్ఞానాన్ని, పరమసత్యాన్నీ చూడగల్గుతున్నారు. అది వింతల్లోవింత. అంతేకాదు, షణ్మతాలను ఖండించగల్గిన పరమాచార్యుడుగా శంకరుణ్ణి వాళ్ళు కొనియాడతారు. శంకరుడి ఖండనాధ్యాయంలో ప్రాచీన భారతీయ భౌతికవాద సిద్ధాంతాలైన సాంఖ్య వైశేషిక చార్వాకాలు కూడా వున్నాయని లోగా చెప్పుకున్నాం. శంకరుణ్ణి భౌతికవాదిగా చూపదలుచుకొన్న నయాలు ఈ విషయాన్ని గమనించడంలేదు.

సాంఖ్య వైశేషిక, చార్వాకాలు మతాలు కావు. అవి చేసిన తాత్విక ప్రతి పాదనలు వాస్తవిక సత్యాన్వేషణలో సోపానాలు. వాటిలో లోపాలు లేవనికానీ, అవి సార్వకాలిక సత్యాన్ని ప్రతిపాదించాయనికానీ దీని అర్థంకాదు. అలా చేయనందువల్లనే అవి మతాలస్థాయికి దిగజారిపోలేదు. వాస్తవికమార్గంలో అవి స్వతంత్ర ప్రతిపాదనలు చేసినై. ఈ ప్రపంచానికి మూలాన్ని ఈ ప్రపంచంలోనే చూచినై. నిజానికి పూర్వోత్తర మీమాంసలు చేసిన స్వతంత్ర ప్రతిపాదనలేమీ లేవు అవి వేదోపనిషదంశాల సూత్రీకరణలే. కొద్ది తేడాతో ఉపనిషత్తులన్నీ బ్రహ్మవాదాన్నే పోషించాయి. అందుకు భిన్నమైన సాంఖ్యవైశేషిక చార్వాకాలకు భారతీయ తాత్విక చరిత్రలో విశిష్ట స్థానమున్నది.

సత్యాన్వేషణాపథంలో స్వతంత్ర ప్రతిపాదనలు చేసిన చార్వాక, జైన బౌద్ధాలు వైదికమార్గాన్ని మొదలంట తిరస్కరించినై. మతరూపు సంతరించుకున్న జైన, బౌద్ధసామాజిక జీవన విధానాల్లో మనకు ఆమోదయోగ్యంకాని విషయాలుకూడా చాలా వున్నాయి. పూర్తినాస్తిక భౌతికవాద దృక్పథంతో చార్వాకం స్వతంత్ర జిజ్ఞాస

చేసింది. వైదిక సామాజిక జీవన విధానాన్ని దురుసుగా ఖండించింది. అయినప్పటికీ, అది యీనాడు మనకు యథాతథంగా ఆమోదయోగ్యంకాదు. కాని, ఈ ఆలోచనా విధానాలన్నీ బాదరాయణుడి కాలానికి వైదికపద్ధతికంటె మెరుగైనవనడానికి సందేహంలేదు. మెరుగైనవాటిని వదలి, తరుగైనదాన్ని పట్టుకొని వ్రేలాడిన శంకరుడి విచక్షణాజ్ఞానం ప్రశ్నార్థకం.

అయితే బ్రహ్మసూత్రాలు సాంఖ్య వైశేషిక చార్వాకాలనూ, బౌద్ధ, జైనాలనూ మొత్తంగా ఖండించినై. వాటిని ఖండించడం కోసమే ఆ సూత్రాలనుకూర్చినట్లు వాటి అధ్యయనంవల్ల స్పష్టమవుతుంది. కాని, ఆ సూత్రాలకు భాష్యాలు వ్రాసిన వారిలో ఒకడైన శంకరుడే ఆయా ఆలోచనా విధానాలనూ, మతాలనూ ఖండించిన మేధావిగా, తాత్వికుడుగా, తార్కికుడుగా ఎనలేని ప్రచారంజరిగింది. నిజానికి శంకరుడు చేసిన ఖండన అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు, శంకరుడు స్వతంత్రంగా ప్రతి పాదించిన తత్వంకూడా ఏమీ లేదని యింతకుముందే చూచాం. ఏ ఆలోచనా విధానాన్ని ఖండించినా, ఆయన అవలంబించిన సూత్రం ఒక్కటే. “మీ సిద్ధాంతాలను శ్రుతులు ఆమోదించవు” అని. శ్రుతులను ఆమోదించిన వారివాదాలను ఖండించే టపుడు మరోకుంటి పద్ధతి అవలంబించేవాడు. “ ఆ శ్రుతుల అర్థం మీరు చెపుతున్నది కాదు” అని. కాగా, బ్రహ్మసూత్రాలు, వేదాంతసూత్రాలు, శారీరక సూత్రాలు, ఉత్తర మీమాంసగా పిలువబడే ఆసూత్ర సముచ్ఛయం నుంచి జాలువారుతున్న సిద్ధాంతసారం వివిధ భాష్యకారులకు వివిధ వైఖరుల్లో అర్థమైంది. దాన్ని శంకరుడు అద్వైతం పరంగానూ, రామానుజుడు విశిష్టాద్వైతం పరంగానూ, మధ్వాచార్యుడు ద్వైతం పరంగానూ, వల్లభాచార్యుడు శుద్ధాద్వైతంపరంగానూ, రకరకాలుగా వ్యాఖ్యానించారు. దానికి మూలమైన తిక్క ఆ సూత్రాల్లోనే వుందో, సంస్కృత భాషలోవుందో, లేక అభాష్యకారుల పుర్రెల్లోనే వుందో? ఏదియేమైనా, విచిత్రంగా వాళ్ళందరికీ ఆసూత్రాలే ప్రమాణాలైనై.

## సాంఖ్య భౌతికవాదంపైన అస్త్రాలు

బ్రహ్మ సూత్రాలు మొత్తం శంకరుడి ప్రకారం 555. రామానుజుడు వాటిని 540 కి కుదించాడు, ప్రస్తుతానికి సంబంధించినంత వరకు ఆ ఖండన పర్వం ఎలా సాగిందో శంకర భాష్యం క్రమంలోనే చూద్దాం.

బ్రహ్మ జిజ్ఞాస చేద్దామని (అథాతో బ్రహ్మజిజ్ఞాసా) మొదటి సూత్రంలో ప్రారంభించి, దేని మూలంగా ఇదంతా వున్నదో అదే బ్రహ్మమని,

(జన్మాద్యస్యయతః) రెండో సూత్రంలో చెప్పి, పరస్పర భిన్నంగా వున్న శ్రుతి వాక్యాలను సమన్వయం చేయవలసి వుంటుందని (తత్తుసమన్వయాత్) నాలుగో సూత్రంలో చెప్పి, ఇక ఐదో సూత్రంలో సాంఖ్య దర్శన ఖండన ప్రారంభమైంది.

అనాది వస్తువేమిటి? అనేది ప్రశ్న

చైతన్యవంతమైన బ్రహ్మం అనాదివస్తువన్నాయి ఉపనిషత్తులు. ఆ బ్రహ్మం నుంచే ఇదంతా ఆవిర్భవించిదన్నాయి. బ్రహ్మానికి వేరే మూలం లేదనీ, బ్రహ్మమే అన్నిటికీ మూలమనీ అన్నాయి. వాటి సూత్రీకరణకు, ఇతర సిద్ధాంతాల ఖండనను కలిపి సూత్రీకరించిన గ్రంథమే బ్రహ్మ సూత్రాలు. భాష్యం వ్రాయడంలో సూత్రాల్లోని వైరుధ్యాలను సైతం సమన్వయం చేయడానికి అర్థాంతరాలు సాధించి, తన కనుగుణమైన శ్రుతిస్మృతి వాక్యాలను ప్రమాణించడమే శంకరుడు చేసిన ఘన కార్యం.

అనాది వస్తువు ప్రధానం (పదార్థం) అన్నది కపిలుడి సాంఖ్యం. దానితోపాటు పురుషను ప్రతిపాదించినా, పురషకెలాంటి కర్తృత్వమూ యివ్వలేదు. కాబట్టి, ఈ కన్పించే సర్వానికి ప్రధాన (ప్రకృతి) పరిణామమే కారణమన్నది సాంఖ్యం. ఆ పరిణామం కార్యకారణ బద్ధంగా జరుగుతున్నదన్నది. లేని దానినుంచి ఏదీ రాదనీ (నావస్తు నో వస్తు సిద్ధిః), అనాదికి (ప్రధానానికి) వేరే మూలం వుండదనీ (మూలే మూలా భావ ద మూలం మూలమ్) అన్నది. ఇది ఏ శ్రుతిస్మృత్యాదుల్లోనూ లేని భౌతిక వాదం.

కాబట్టి బ్రహ్మవాదం, ప్రధాన వాదం – రెండూ ఒకదానికొకటి భిన్నాలు, పరస్పర వైరుధ్యాలు. ప్రపంచానికి మూలం భావం (చైతన్యం) అనేది బ్రహ్మవాదం కాగా, ప్రపంచానికి మూలం పదార్థం అనేది సాంఖ్య భౌతికవాదం. బ్రహ్మాద్వైతంలో అంతర్నిహితంగా ద్వైతం వుంది. కాగా, సాంఖ్యం ద్వైతం లాగా బయటికి కన్పించినా, అది వస్తుతః అద్వైతం.

వాస్తవిక జగత్తును విడిచి ఉహాజగత్తులో సాము గరిడీలు చేసే భావవాదం అనేక భ్రమ ప్రమాదాలతో కూడుకొని వుంది. ఆధునిక విజ్ఞానశాస్త్రావతరణకు పూర్వదశలో అది బయలు దేరింది. భౌతికవాద దర్శనాలు కూడా అప్పుడే బయలు దేరినా, వాటి మూలం భ్రమకాదు. ఆధునిక విజ్ఞానం బహుముఖంగా పురోగమించిన ఈ రోజుల్లో భౌతికవాదాన్ని దాటి మరో ఆలోచన చేసే పరిస్థితి లేదు. ఈ నాడు భౌతికవాదానికి ప్రత్యామ్నాయం లేదు. మరేవాదమూ ప్రాపంచిక సంఘటనలను సక్రమంగా వివరించ లేదు. అంతమాత్రాన ప్రాచీన భౌతికవాద శాఖలైన చార్వాక,

సాంఖ్య, వైశేషికాదు లను యథాతథంగా అమోదించడమనే అర్థం రాదు. మౌలికంగా సరైన చోట నుండి సరైన మార్గంలో ఆ వాదాలు బయలుదేరాయన్నంత వరకే, వాటిని మనం ఆమోదిస్తాం. విజ్ఞానం పెరిగే కొలది భౌతికవాదం పెరుగుతూనే వుంటుంది. కాబట్టి భౌతికవాదదృక్పథం సజీవ తాత్విక విధానం. కాగా, అధునిక విజ్ఞానం వెలుగులో మనం భౌతిక వాస్తవిక వాదాన్ని ఆమోదించవలసి వుంది. అది అధునిక తత్వానికి, జీవన తత్వానికి ప్రాతిపదిక కావలసి వుంది.

రెండువేల సంవత్సరాలకు పూర్వమే కపిలుని సాంఖ్యం భౌతికవాదానికి దార్శనిక స్థాయి కల్పించింది. నామకః పురుషను ప్రతిపాదించడంలో ద్వైతభావం ధ్వనించినా, పురుషకు నిష్క్రియత్వం అంటగట్టి ఏకత్వవాదరూపంలో ప్రధాన పరిణామాన్ని కార్యకారణబద్ధంగా చర్చించింది. ఆ సాంఖ్యాన్ని ఖండించడం బ్రహ్మ సూత్రాల్లో ప్రధాన భాగం. ప్రథమాధ్యాయం, ప్రధమ పాదం 5వ సూత్రంలోనే ఆ ఖండన ప్రారంభమైందటే–భౌతిక వాదానికి అది ఎంతగా బద్ధ శత్రువో బోధపడుతుంది. ఆ ఖండనసారం ఇలావుంది:

"ప్రధానాన్ని శ్రుతులు ఆమోదించవు: జగత్కారణంగా శ్రుతులు బ్రహ్మాన్నే పేర్కొన్నాయి కాని, ప్రధానాన్ని కాదు; ప్రధానోపాసన కాక బ్రహ్మోపాసనమే మోక్షమార్గమని శ్రుతులన్నాయి: అచేతనమైన ప్రధానం నుంచి చైతన్యం రాదు. కాన, అది జగత్కారణంకాదు; చేతనం కల బ్రహ్మమే అనాది వస్తువని శ్రుతులన్నీ చెప్పాయి. కాబట్టి ప్రధానం జగత్కారణం కాదు. (5. ఈ క్షతేర్నాశబ్దమ్. 6. గౌణశ్చేన్నాత్మ శబ్దాత్. 7 తన్నిష్ఠస్యమోక్షోపదేశాత్. 8. హేయత్వావనాశ్చ. 9. స్వాప్యయాత్. 10. గతి నామాన్యాత్ 11. శ్రుతత్వాశ్చ.)

"వేదాలు ప్రధానాన్ని ఆమోదించడం లేదు కాబట్టి సాంఖ్యం తప్పు" అనేది ఒక్కటే ఈ ఖండనలోని ప్రధానాంశం. ఇందులో బాదరాయణుడి తెలివీ, శంకరుడి తెలివీ, యేమీ లేదు. "నీవు చెప్పిన విషయం మాతాత ముత్తాతల తాటాకుల దస్తరాల్లో లేదు కాబట్టి చెల్లదు" అనడంలో ఖండన యేముంది?

ఇక రెండోది అచేతనమైన ప్రధానం నుంచి చైతన్యం ఎలా వస్తుంది? అని. అలా రావడానికి వీలు లేకపోతే, సచేతనమైన బ్రహ్మంనుంచి అచేతనమైన జగత్తు ఎలా రాగల్గుతుంది? మాయను ప్రక్కకు నెడితే బ్రహ్మ సూత్రాలు మొత్తంలోనూ – ఆమాటకు వస్తే ఉపనిషత్తుల మొత్తంలోనూ–ఈ ప్రశ్నకు సమాధానం లేదు. ఏమిటి ఈ స్థితి అని అడిగితే శ్రుతులు అలాగే చెప్పినై అని సమాధానం. అందుకే "శ్రుతత్వాశ్చ" అని తేల్చి వేసింది, పైన పేర్కొన్న వాటిలో చివరిసూత్రం. "అలా చెప్పబడింది

కాబట్టి" అని దాని అర్థం.

అదే అధ్యాయం, నాలుగోపాదంలో – శ్రుతుల్లో పేర్కొనబడ్డ అవ్యక్తమూ, సాంఖ్యుల ప్రధానమూ ఒకటి కాదనీ (1–7); శ్రుతుల్లోని అజాశబ్దమూ, సాంఖ్యుల ప్రధానమూ ఒకటి కాదనీ (8–10); శ్రుతుల్లోని పంచవింశతిశబ్దమూ, సాంఖ్యుల పంచవింశతీ (ప్రధానం1+మహదాదులు7+పంచభూతాలు5+దశేంద్రియాలు 10+ మనస్సు 1+పురుష 1=25) ఒకటి కాదనీ (11–13); చెప్పడమే సాంఖ్యం ఖండన; అంటే సాంఖ్య శబ్దావళికి శ్రుతుల్లో ఆ అర్థాలు లేవని చెప్పడం తప్ప, సాంఖ్యంయెలా తప్పో రుజువు చేయడానికి ఒక్క కారణాన్నికూడా శంకరభాష్యం చూపలేకపోయింది.

అంతేకాదు, కపిలుడు రుషిహోదా సంపాదించుకున్నవాడు. కాబట్టి రుషి వచనాన్ని కాదనడమెలా? అనేది ప్రశ్న. ప్రధాన కారణవాది అయిన కపిలుణ్ణి అంగీక రిస్తే, బ్రహ్మకారణ వాదులైన మన్వాదిరుషుల్ని తిరస్కరించవలసి వస్తుందికదా అని శంకరుడి సమాధానం. మరి మనువు అయనకు ముఖ్యుడు కదా? వర్ణాశ్రమాచార బంధువు కదా? అయన్నెలా వదలుకుంటాడు? ఎవరినో ఒకరిని తిరస్కరించాలికదా అని ధ్వని. పైగా సగరపుత్రుల్ని దహించిన మరోకపిలుడున్నాడు–వాసుదేవుడు. అతన్ని అడ్డం తోశాడు సాంఖ్య కపిలుడికి. ఏకపిలుణ్ణి అమోదించేటట్లు? అని రెండో అధ్యాయం ప్రారంభంలోనే అంకె వేశాడు.

శంకరుడి పద్ధతి యేమంటే. ఇతరుల వాదాలను తానే చెప్పడం, వారి ప్రశ్నలను తానే వేయడం, అవి శ్రుతులకు ఆమోదయోగ్యాలు కావు కాబట్టి చెల్లవని తనకు అనువైన కొటేషన్లను శ్రుతులనుంచి ప్రమాణించి తీర్పు చెప్పడం. శ్రుతులు చెల్లుతాయా, చెల్లవా? అనే ప్రశ్న అతనికి రానేలేదు. అంతదాకా ఆయన వివేకం పెరగలేదు.

ఆతర్వాత ఖండన యిలాసాగింది; ప్రధానం (పదార్థం) తనకు తానే వస్తువులను తయారుచేయలేదు కాబట్టీ; అలాచేసే ప్రవృత్తి దానిలో లేదు కాబట్టీ; ఆవుపాలు దూడకు స్రవించాలన్నా, నీరు పల్లానికి ప్రవహించాలన్నా ఈశ్వరుడి ప్రమేయం కావాలి కాబట్టీ; సత్వరజస్తమో గుణాత్మకమైన ప్రధానాన్ని ఉత్తేజపరచడానికైనా, స్తంభింపజేయడానికైనా నిష్క్రియాత్మకమైన పురుష చాలదు కాబట్టీ; ఆవు కడుపులోని గడ్డి పాలుగా మారినట్లు ప్రధానం మారజాలదు కాబట్టీ; స్వచ్ఛందంగా మారగలదనుకున్నా అది మూలకారణం కాజాలదు కాబట్టీ; ప్రధానానికి జ్ఞానశక్తిలేదు కాబట్టీ; అది జగత్కారణం కాదంటాడు (2అ, 2పా,1–11)

ఇందులో తిప్పితిప్పి చెప్పింది ఒక్కటే; చేతనంలేని ప్రధానం చేతనాత్మకమైన జీవాదుల్ని సృష్టించలేదు కాబట్టి ప్రధానం జగత్కారణం కాదు అని. దీన్ని వెనక్కు తిప్పితే, చేతనంకూడా అచేతనానికి కారణం కాదనే విషయాన్ని యింతకు ముందే చూచాం. ఆధునిక విజ్ఞానంముందు యీ ప్రశ్నలేమీ నిలవవు. చేతనాచేతనాలు భిన్నదశల్లోని పదార్థం ప్రకటించే ధర్మాలు. అచేతనం నుండి చేతనం రావడమనేది ఈ రోజుల్లో ప్రయోగశాలల్లో రుజువవుతూనే వుంది. అయినా, ఇంత దీర్ఘంగా ఎందుకు వుదాహరించుకున్నామంటే–శంకరభాష్యం బృహద్గ్రంథమే కాని, అందులో సరుకేమీలేదని చూపడానికే. అది చాల బరువైనదనే భ్రమతో మోయలేక నెత్తినెత్తుకున్న భారవాహులు ఇకనైనా దాన్ని దించుకోడానికి ప్రయత్నిస్తారేమో చూద్దామని – అందులోనూ, ముఖ్యంగా నయశాంకరులు.

## వైశేషికంపై విద్వేషం

వైశేషికంపై, చార్వాకంపైకూడా శంకరుడు చేసిన ఖండనలను పరిశీలిస్తే. శంకరుడి అసమర్థత మరికొంత బయట పడుతుంది.

కణాదుని వైశేషికం ప్రకారం పరమాణువుల సమ్మేళనమే జగత్కారణం – అన్యంయేమీలేదు. పరమాణువులే జగన్మూలం-అంటే, వైశేషికం నిరీశ్వరదర్శనం. రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుకంగానూ, మూడు ద్వ్యణుకాలు కలిసి త్ర్యణుకం గానూ, అలా కేవలం అణువుల సంఘటన ద్వారానే ప్రకృతిలో యీ వైవిధ్యం కన్పిస్తున్నదని వైశేషికం వాదం. పదార్థమే జగత్కారణమని సాంఖ్యం అనగా, వైశేషికం మరో అడుగు ముందుకు వేసి పదార్థాణువుల సమ్మేళనమే జగత్కారణమని ఆధునిక భౌతికవాద దృక్పథానికి దగ్గరగా జరిగింది.

అయితే, అవిభాజ్యమైన అనంతసూక్ష్మ పరమాణువులు దృశ్యమానమైన జగత్తును నిర్మించడం సాధ్యం కాదనేది శంకరుడి మొదటి అభ్యంతరం (2–2–11). చేతనాత్మకమైన కారణం లేకుండా అణువులు వాటంతట అవి కలియడం సాధ్యం కాదనేది మరో అభ్యంతరం (2–2–12). అంతర్గత (సమవాయ) కారణమే కలయికకు కారణమైతే, దానికి మరో కారణం వుండాలి కాబట్టి, అది అనవస్థా దోషానికి దారితీస్తుందనేది ఇంకో అభ్యంతరం (2–2–13). అంతర్గతకారణం నిత్య సత్యమైతే, ఇక వినాశనమే వుండదని–అంటే సృష్టిలయాలుండవని వేరొక అభ్యంతరం (2–2–14). పరమాణువులు త్రిగుణాత్మకాలనడంవల్ల గుణంకల దేదీ శాశ్వతంకాదని మరో అభ్యంతరం (2–2–15,16). వీటన్నిటికీమించిన అభ్యంతరం మరొకటివుంది:

అదేమంటే, మనువు మొదలైన వేదపండితులు సాంఖ్యానికైనా చోటిచ్చారు కాని, వైశేషికాన్ని మొత్తం మొత్తంగా తిరస్కరించారని(2-2-17). చివరకు వైశేషికం మీద శంకరుడి ద్వేషం యేస్థాయికి చేరిందంటే "ఉత్తమ లక్ష్యాలను ఆశించే వారెవ్వరూ వైశేషికాన్ని పట్టించుకోకూడదని 17వ సూత్రానికి సూత్రకారుడే కలిపి వుండవలసిం" దని వ్యాఖ్యానించాడు.

వైశేషికంలో లోపాలుండవచ్చు. కాని, పరమాణు ప్రతిపాదన స్వతంత్రమైనదేకాక, సరికొత్తది-వాస్తవికతకు అతి సన్నిహితమైనదికూడా. దాన్ని మెచ్చుకోగల వైజ్ఞానిక అసంగస్థాయి శంకరుడిలో లేదు. ప్రకృతికి బాహ్యంగా కారణాన్ని వూహించడానికి ఏ అభ్యంతరాలున్నవో వాటిని వైశేషికానికి అభ్యంతరాలుగా చూపెట్టాడు. ఆ అభ్యంతరాలన్నీ బ్రహ్మవాదానికి పెట్టవలసినవే కాని, వైశేషికానికి కాదు. అందుకే, ఆయన వైశేషికంపై శాపనార్థాలు పెట్టాడు. అలాంటివాణ్ణి భౌతికవాదిగా ప్రదర్శించడం శోచనీయం.

## చార్వాకం పై కుతర్కం

సాంఖ్య వైశేషికాలిప్పటికీ కల్తీరూపంలోనైనా మనకు లభిస్తున్నాయి. కాబట్టి, వాటి దార్శనికస్థాయి మనకు తెలుస్తుంది. కాని, చార్వాకుల గ్రంథాలేమీ మనకు లభ్యంకావు. వాటిమీద అన్యమతస్థులు వేసిన అభాండాలను, చేసిన ఖండనలనుబట్టి మాత్రమే వారి తత్వాన్ని మనం అర్థం చేసుకోవలసివస్తుంది. ప్రధాన వాదాన్నీ, పరమాణువాదాన్నీ ఖండించడంలో (1) వాటిలో చైతన్యం ప్రస్తావన లేదనీ, (2) వాటిని వేదాలు ఆమోదించవనీ – రెండు కారణాలు శంకరుడు చూపాడు. ఆ రెండు ఖండనలు చార్వాకానికి కూడా వర్తిసాయి. అయితే, చార్వాకం విషయంలో దేహాత్మవాదానికి సంబంధించిన మరో అంశాన్ని కలిపాడు.

దేహానికి అతిరిక్తంగా ఆత్మలేదనేది చార్వాకవాదంలో ముఖ్యాంశం. దేహం లేకుండా, దానికి అన్యంగా, విడిగా ఆత్మ వున్నట్లు యెక్కడా దాఖలా లేదు. దాని ఉనికి దేహంమీద ఆధారపడివుంది. అంటే, ఆత్మ అనేది దేహలక్షణమేకాని, అన్యంకాదని చార్వాకులంటారు. తమలపాకుతో వక్క, సున్నం కలిపినప్పుడు అంతకు ముందు ఆ మూడింటిలోనూ లేని ఎరుపురంగు నిష్పన్నమైనట్లుగా వివిధ భూతాలకలయికవల్ల ఆత్మలక్షణం నిష్పన్నమవుతుందని చార్వాకులంటారు. (వివరాలకోసం నేను వ్రాసిన "చార్వాకుల కథలు" చూడండి).

చార్వాకుల యీ వాదాన్ని ఖండించడానికి శంకరుడికి చేతకాలేదు. కాకపోగా,

"శవానికి కూడా దేహంవుంది కదా? ఆత్మ ప్రత్యేక వస్తువుకాక, కేవలం దేహాన్ని ఆశ్రయించే లక్షణమైతే, అది శవంలో యెందుకు లేదు?" అని అర్థరహితమైన ప్రశ్న వేశాడు (బ్ర.సూ.భా. 3-3-54). ఆ ప్రశ్నకు చార్వాకులు సమాధానం చెప్పగలరు కాని, అదే ప్రశ్న తిరగదిప్పి వేస్తే బ్రహ్మవాదుల సమాధాన మేమిటి? వివిధ ద్రవ్యాల కలయికవల్ల కొత్త లక్షణాలు వుత్పన్న మవుతాయనే చార్వాక వాదాన్ని ఇముడ్చుకోడానికి శంకరుడి బుర్రలో చోటులేదు.

సాంఖ్యవైశేషిక చార్వాకాలపై శంకరుడు లేవదీసిన అభ్యంతరాల స్వభావాన్ని బట్టి, ఆయన వాదంలో హేతువాదం, భౌతికవాదం, పదార్థ వాదం, నాస్తికవాదం వున్నవో, లేవో సామాన్యుడికైనా తెలుస్తుంది. ఆ మాటలకు అర్థాలు తెలిపినవారు వాటిని శంకరుడిలో దేవులాడరు; విప్లవ ప్రతీఘాతుకత్వానికి 'ఆధ్యాత్మిక' నాయకుడైన శంకరుడిలో అడుగడుగునా కన్పించే విప్లవవిధ్వంసక స్వభావాన్ని కప్పిపెట్టే వృథా ప్రయత్నాలు భౌతికవాదులు చేయరు. కల్లబొల్లి కల్పనలతో శంకరుణ్ణి సమర్థించడం హేతువాదుల కర్తవ్యం కాదు.

పైన చూచిన శంకరవాదంలో పదార్థంనుంచి వేరుగా చైతన్యం వుంటుందని తప్ప, పదార్థమేలేదన్న వాదం కన్పించదు. ఖండనోద్వేగంలో శంకరుడా విషయాన్ని మరిచాడు. అయితే, పదార్థమొక్కటే జగత్కారణమనే వాదాన్ని ఆయన అంగీకరించలేదు కాబట్టి, పదార్థాన్నే శంకరుడు బ్రహ్మమన్నాడని నయాలు చెపుతున్న వక్రభాష్యం అజ్ఞానపూరితమని స్పష్టమవుతుంది. శంకరుడిలో వివేకం పనిచేసివుంటే, శ్రుతిస్మృతి పురాణాదుల్ని ప్రశ్నించి, ప్రాచీన భౌతికవాదరీతుల్ని సమన్వయంచేసి, అభ్యుదయకరతత్వాన్ని ప్రతిపాదించి వుండవలసింది. అతనిలో ఆ వివేకం పనిచేయలేదని తెలుసుకోగల వివేకం లోపించినందువల్లనే నయాలు విచిత్రభాష్యాలు చెపుతున్నారు. ఉద్దేశపూర్వకమైన ఈ అద్దె మనస్తత్వం హానికరమైనది. అవైదికశాఖలను ఖండించి, వైదికతత్వానికి కొత్తరంగు పులిమి, కూలిపోబోయిన వర్ణవ్యవస్థను పునరుద్ధరించడంద్వారా నయావైదికాన్ని స్థాపించడమే శంకరుడి లక్ష్యం. ఆ లక్ష్యం అతని వివేకానికి అడ్డువచ్చింది. మరి నయాల లక్ష్యమేమిటో....?

# 8. అద్వైతం: శంకరుడిదా, గౌడపాదుడిదా?

లైట్ మూడ్‌లో వ్రాస్తున్నాననుకోకపోతే, ఒక ప్రస్తావన తెస్తాను.

ఒకసారి ఓ సంస్కరణవాద ప్రియుల సభలో ఓ వెంకయ్య ప్రసంగం చేస్తున్నాడు. అది వింటున్న మా మిత్రులొకరు "వెంకటాద్రిగారూ, ఈయన సమర్థిస్తున్నది భౌతికవాదాన్నా, లేక భావవాదాన్నా ?" అని అడిగారు. "భౌతిక వాదాన్ని సమర్థిస్తున్నాననుకొంటూ ఆయన మాట్లాడుతున్నారు. కాని, జరుగుతున్నది మాత్రం భావవాద సమర్థనే" అని నేనన్నాను. "అందుకే కావాలి, ఈయన్ని అందరూ అద్వైతం వెంకయ్య అంటారు" అన్నారా మిత్రులు. ఇది జరిగి పది సంవత్సరాలు దాటింది. అద్వైతుల్ని అలా అంటారన్న భావం నాలో నిలదొక్కుకున్నది అప్పుడే.

ఈ ప్రస్తావన ఎందుకు తెస్తున్నానంటే – ఒకలక్ష్యం, అర్థం, విషయసమన్వయం లేకుండా మాటలు దొర్లించడాన్ని అద్వైతం అనడం జాతీయవాచకం (Idiom) గా మారిపోయింది. – ముఖ్యంగా తెలుగుభాషా సంప్రదాయంలో.

కాని, అసలు అద్వైతమంటే "రెండు కానిది" అని అర్థం.
అలా "కానిదాన్ని" చెప్పడమే హిందూ 'తాత్విక' సంప్రదాయం.

ఏది అవునో తెలియక, "ఇదికాదు – ఇదికాదు" అని చెప్పుకుంటూ పోయే ప్రక్రియనే నేతి (న+ఇతి – ఇదికాదు) వాదమంటాం (Elimination process)

బ్రహ్మమంటే ఏమిటి అని ప్రశ్నిస్తే "బల్లకాదు, పుల్లకాదు, బెల్లంకాదు, చింతపండుకాదు" అని చెప్పుకుంటూ పోతారు తప్ప, అసలా బ్రహ్మమనేది ఏమిటో చెప్పరు. అదంటే ఏమిటో తమకు తెలియదని నిజాయితీగానే చెపుతారుకూడా. అలా తమకు తెలియనిదానిని డొంకతిరుగుడుగా చెప్పడానికి ప్రయత్నించడంవల్ల అద్వైతులేమి చెపుతున్నదీ అర్థంకాదు. చెప్పేవాడికి తెలియనిది వినేవాడికి ఎలా అర్థమవుతుంది ? అయినా, తమకు తెలియనిదాన్నిగురించి అద్వైతులు శతాబ్దాలుగా చెపుతూనేవున్నారు. అందుకే "చెప్పేవాడికీ, వినేవాడికీ ఇద్దరికీ అర్థంకానిదే అద్వైతం" అని 'విప్రనారాయణ' నాటకంలో దేవదేవి పాత్ర అన్నట్లు గుర్తు.

తాము చెప్పే అద్వైతం ఉపనిషత్తుల్లోనే వుందని అద్వైతుల వాదన. ఉపనిషత్తులు వేదాల తోకలు కాబట్టి, అవి చెపుతున్నదంటున్న వాదాన్ని వేదాంతమంటారు. వారి ప్రకారం వేదాంతమంతా అద్వైతం కావాలి. కాని, వేదాంతంలో ద్వైత, విశిష్టాద్వైత,

శుద్ధాద్వైతాది శాఖలు కూడా వున్నాయి. కాబట్టి, ఉపనిషత్తులు అద్వైతాన్ని ప్రతిపాదించాయనే వాదాన్ని వేదాంతులే అంగీకరించడంలేదని తేలుతుంది. అందుకే, ఉపనిషత్తుల సూత్రీకరణగా చెప్పబడుతున్న 'బ్రహ్మసూత్రాలకు' ఆయా వేదాంతశాఖల వారు తమతమ వాదాలకు అనుగుణంగా భాష్యాలు వ్రాసుకున్నారు. కాబట్టి, ఉపనిషత్తులు అద్వైతాన్ని ప్రతిపాదించాయనే వాదం నిలవదు. అందువల్ల, బ్రహ్మసూత్రాలుకూడా అద్వైతాన్ని ప్రతిపాదించాయని చెప్పడానికి వీలులేదు. ఏప్రతిపాదనలయినా భాష్యకారులవే.

మాండూక్యోపనిషత్తుకు వ్రాసిన కారికల్లో తొలిసారిగా అద్వైతాన్ని ప్రతిపాదించిన గౌడపాదుడు బ్రహ్మసూత్రాల ప్రస్తావన యెక్కడా యెత్తలేదు. అందువల్ల బ్రహ్మసూత్రాలు అద్వైత గ్రంథం కాదనిపిస్తుంది. అంతేకాదు, గౌడపాద కారికలకు భాష్యం వ్రాసిన శంకరుడు అందులోని అద్వైతాన్ని బ్రహ్మసూత్ర భాష్యంలో యిరికించాడు తప్ప, శంకరుడికి ముందుకాని, తరువాతకాని బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాసిన ఆచార్యులెవ్వరూ దాన్ని అద్వైతంపరంగా వ్యాఖ్యానించలేదు. బ్రహ్మసూత్రాలను ప్రస్తావించిన భగవద్గీత సైతం అద్వైత గ్రంథం కాదు. సరికదా, అది ఏకాంతి వైష్ణవ గ్రంథం. కాబట్టి, బ్రహ్మ సూత్రాలకు (గీతకు, ఉపనిషత్తులకు కూడా) శంకరుడు కావాలని అద్వైతంపరంగా కృత్రిమ భాష్యం వ్రాశాడని తేలుతుంది. అయినా అద్వైతసిద్ధాంత ప్రవక్తగా చెప్పుకోవాలంటే, గౌడపాదుణ్ణే చెప్పుకోవాలి కాని, శంకరుణ్ణి కాదనేది నిర్వివాదం. **"దేవతలకు సైతం దుర్లభమైన అద్వైతామృతాన్ని వేదమహా సముద్రాన్ని చిలికి బయటకు తీసిన పరమ గురుడికి పాదాభివందనం చేస్తున్నా"నని కారికాభాష్యం చివర శంకరుడే చెప్పుకున్నాడు. (అమ్నోంతరస్థ...అమృతమిదమమర్తైర్దుల్లభం భూతహేతోర్యస్తం పూజ్యాభి పూజ్యం పరమగురుమముం పాదపాతైర్నితోఽస్మి).**

గౌడపాదుడు శంకరుడి గురువైన గోవిందపాదుడికి గురువంటారు. మాండూక్యోపనిషత్తుకు ఆయన వ్రాసిన కారికల్లో మొదటి (ఆగమ) ప్రకరణంలో తురీయావస్థనీ, రెండో (వైతథ్య) ప్రకరణంలో మిథ్యావాదాన్నీ, మూడో(అద్వైత) ప్రకరణంలో ఆత్మాద్వైతాన్నీ ప్రతిపాదించాడు. మనో విజ్ఞాన పరిచయంలేని వారికి, ఆధునిక శాస్త్రీయ భౌతికవాద దృక్పథం కరువయిన వారికి ఆ భావ వాద మార్మిక ధోరణి "అందని లోతుల్లో" ఉన్నట్లనిపిస్తుంది. నాలుగో (అలాతశాంతి)ప్రకరణంలో గౌడపాదుడు సృష్టివాదుల్ని ఖండించినా, అందలి భావాలు, పారిభాషిక పదాలు, వాదనారీతి అంతా నాగార్జునుడి శూన్యవాద బౌద్ధాన్ని ప్రతిబింబిస్తున్నది. అందుకే దానికి శంకరుడు వ్రాసిన భాష్యంలో "అది బౌద్ధానికి సంబంధించిన వస్తువు కాదని"

ఎంతగానో మొత్తుకోవలసి వచ్చింది. అయినా, అతనికి ప్రచ్ఛన్న బౌద్ధుడన్న బిరుదూ, నాస్తికుడన్న నిందా తప్పలేదు. ఏదిఏమైనా, ప్రస్థానత్రయ భాష్యాల్లో శంకరుడు చొప్పించిన అద్వైతమాయా వాదం గౌడపాదుడిదే అనడంలో ఆవంత సందేహంలేదు. గౌడపాదుడి కృషిలో దార్శనిక లక్ష్యం కన్పిస్తుంది. కాని, శంకరుడిలో అది మృగ్యం. పాండిత్య ప్రకర్షతో మాయావాదాన్నిపరాకాష్టకు చేర్చడంలోనే ఆయన ప్రత్యేకతప్రదర్శితమవుతుంది.

"రెండులేవు" అని చెప్పే అద్వైతం "ఒక్కటే వున్నది" అని ఎందుకు అనడంలేదు? ఇది అసలైన ప్రశ్న.

లేనిదాన్ని (బ్రహ్మం) ఉన్నదని చెప్పడం కోసం ఉన్నదాన్ని (ప్రపంచం) లేదని రుజువు చేయాలి కాబట్టి, 'రెండోది లేదు' అని చెప్పడానికి 'మాయ' అనే "మూడోదాన్ని" తీసుకురావలసి వచ్చింది. "రెండులేవు" అనే దానికి వారి భాషలో ప్రపంచం లేదు అని అర్థం. అందువల్ల అద్వైతం అవశ్యంగా ప్రపంచ మిథ్యావాదాన్ని ఆశ్రయించక తప్పలేదు. అందుకే గౌడపాదుడు తన కారికల్లో మొదటి ప్రకరణంలోనే మిథ్యావాదాన్ని ప్రారంభించి, రెండో ప్రకరణంలో మాయా వాదాన్ని ప్రసిద్ధం చేసి, మూడో ప్రకరణంలో అద్వైతాన్ని చేపట్టాడు.

వైతథ్యంలో గౌడపాదుడేమి చెప్పిందీ లోగా మనం కొంత చూచాం. ఆ కారికలకు భాష్యం వ్రాసిన శంకరుడు అయా సందర్భాల్లో బ్రహ్మాన్నీ, వర్ణాశ్రమాచార ధర్మాలనూ దూర్చడంతప్ప కొత్తగా చేసిందేమీ లేదని గమనించాం. అయినా మాయావాదాన్ని, అద్వైతాన్ని గురించి గౌడపాదుడేమి చెప్పిందీ మరోసారి మననం చేసుకుంటే, అద్వైతం చాటున దాగిన నయాశాంకరుల నిజస్వరూపం బయట పడుతుంది.

జాగ్రదవస్థ, నిద్రావస్థ, స్వప్నావస్థ–ఈ మూడూ మిథ్య అని మొదటి ప్రకరణంలో (3.4.5)గౌడపాదుడు చెప్పాడు. నాల్గవది తురీయావస్థ, అదే సత్యమయిందన్నాడు. అది అదృష్టం, అవ్యవహార్యం, అగ్రాహ్యం, అలక్షణం, అచింత్యం, అవ్యపదేశ్యం, ఏకాత్మప్రత్యయ సారం, ప్రపంచోపశమం, శాంతం, శివం, అద్వైతం అన్నాడు. అదే ఆత్మ అనికూడా అన్నాడు.

అంటే అది కనపడదు, అనుభవానికి అందదు, అర్థంకాదు, దానికి లక్షణాలు లేవు, ఊహకు అందదు, అది ఫలానా అని చెప్పడానికి వీలులేనిది, ఆత్మసారం తప్ప వేరుకానిది, ప్రపంచం కానిది, శాంతినిచ్చేది, శుభం చేకూర్చేది, రెండూకానిది–అని భావం. ఆ మైకమే బ్రహ్మైక్యమని అద్వైతభావం. అంటే, మనిషి తెలివిగా వున్నప్పుడు తెలుసుకొనేది అసత్యమనీ, తెలివి కోల్పోయిన తరువాత మాత్రమే సత్యాన్ని చేరతాడనీ

పైవర్ణన తాత్పర్యం. అంతేకాదు, ఈ ప్రపంచంలో వాడుతున్న ఏ భాషలోనూ దాన్ని వ్యక్తీకరించడానికి శబ్దాలు దొరకవు. ఏ ప్రక్రియల వల్లనూ అది గ్రాహ్యం కాదు.

రెండో ప్రకరణంలో గౌడపాదుడు మాయావాదాన్ని నగ్నంగా బయట పెట్టాడు. మనకు కలలో కన్పించే వస్తువులన్నీ ఎలా భ్రమలో, అలానే మెలకువలో కన్పించే వాస్తవ ప్రపంచమంతా భ్రమేననీ ; ఏవస్తువులైనా మనం చూచేటప్పుడు ఉంటాయి కాని–చూడకముందు, చూడడం ఆపిన తరువాత ఉండవు కాబట్టి–మనం చూచేటప్పుడు"ఉన్నట్లు" మనకు కన్పించేదంతా భ్రమఅనీ; ఆద్యంతాల్లో లేని వస్తువులు మధ్యలోకూడా వుండవనీ అంటాడు.

మరి ఈ వస్తువులన్నీ ఏమిటీ అని అడిగితే, అవి వస్తువులు కావు భావాలనీ, మాయ ప్రభావం వల్ల ఆత్మ భావాలనుఊహిస్తుందనీ; ఇంద్రియ జ్ఞానం ఊహేకాని వాస్తవంకాదనీ; త్రాడును చూచి పాము అని ఎలా భ్రమచెందుతామో అలానే మాయ ప్రభావం వల్ల భావాలనే వస్తువులుగా ఆత్మ ఊహిస్తుందనీ అంటాడు.

మాయవల్లనే విశ్వం ఉన్నదని భ్రమకల్గుతున్నది కాని, నిజానికి విశ్వం లేదనీ; చావు పుట్టుకలు, బంధమోక్షాలు లేవనీ; ఈ అంశాన్ని తెలుసుకోవడమే పరమార్ధమనీ అంటాడు.

త్రాడులో పాముని, ఎండమావుల్లో నీటిని చూపించే అద్వయాత్మను బహుత్వభ్రమ బంధించిందనీ, దాన్ని తెలుసుకొని, దొరికింది తింటూ తాపత్రయం లేకుండా, స్తుతి–నిందలకు, శ్రాద్ధాది సంస్కారాలకు అతీతంగా, జడవత్తుగా ఉండటమే సత్యంతో తాదాత్మ్యం చెందడమనీ అంటాడు.

అద్వైతంలో మాయావాద భాగం ఇదే. అద్వైతులు ప్రపంచంలేదంటున్నారనేది ఒక్కటే ఇందులో మనకు అర్ధమవుతుంది. కాని, అలా ఎందుకు అంటున్నారో మనకు అర్ధంకాదు.

కలలోని అనుభవం భ్రమ అయితే, ఇలలోని అనుభవం ఎలా భ్రమ అవుతుందో మనకు అర్ధంకాదు. మెలకువలో కనే పగటి కలలు, నిద్రలో అసంకల్పితంగా జరిగే చర్యలు (పొర్లటం, గోకుకోవడం వగైరా) అద్వైతం ప్రకారం ఏ కేటగిరీకి చెందుతాయో అర్ధంకాదు.

చూస్తున్నప్పుడు కన్పించే వస్తువు చూడకముందు, చూడడం ఆపిన తర్వాత ఎందుకు, ఎలా కన్పించాలో -అది కన్పించకపోతే లేనట్లు ఎందుకు, ఎలా అవుతుందో మనకు అర్ధంకాదు.

ఆద్యంతాల్లోనే కాక మధ్యలో కూడా లేని బ్రహ్మాన్ని వున్నదని ఎలా భావించాలో; మధ్యలో వున్నదాన్ని అద్యంతాల్లో వున్నదానిగా ఎందుకు భావించరాదో; ఇప్పుడున్న భూమిని ఇంతకు ముందు, ఇటుతర్వాత లేదని ఎలా భావించాలో; ఆదిలో లేనిదాన్ని (విమానం, రాకెట్టు వగైరా) ఉనికిలోకి తెచ్చినప్పుడు అది లేదని ఎలా అనాలో; మా తాత ఇప్పుడు లేడు కాబట్టి ఇంతకుముందెన్నడూ లేడని ఎలా తీర్మానించుకోవాలో, అయినప్పుడు "నేను ఉన్నాను" "నేనే బ్రహ్మాను" అనేవి ఎలా మిధ్య కాదో మనకు అర్థం కాదు. (ఇది వ్యావహారిక విషయమని పలాయనం చిత్తగించడం వల్ల ప్రయోజనం వుండదు. వ్యావహారికంతో పరమార్థాన్ని చర్చించేటప్పుడు ఇవి రెండూ సంబంధంలేనివనడం గౌడపాదీయం ప్రకారమే కుదరదు.)

వస్తువులు వస్తువులు కాకుండా భావాలు ఎలా అవతాయో, ఒకవేళ అవతాయనుకున్నా, అవి వేటిని గురించిన భావాలో, వస్తువులు లేకుండా, వస్తుసంబంధం లేకుండా, వస్తువుల మధ్య సంబంధాలకు సంబంధించకుండా, వివిధ వస్తువులుగా భావాలను ఊహించడం ఎలా సాధ్యమో మనకు అర్థం కాదు.

లేనిదాన్ని సృష్టించడం మాయకైనా సాధ్యంకాదని గొడ్రాలి బిడ్డను పోలికగా చూపిన గౌడపాదుడు లేని భావాలను మాయ ఎలా సృష్టించగల్గుతున్నదని సమర్థించగలడో మనకు అర్థంకాదు.

ఒకచోట భావాలను వస్తువులుగా పేర్కొన్న గౌడపాదుడు మరొకచోట వస్తువులు వస్తువులు కావనీ, భావాలనీ అనడంలోని ఔచిత్యం ఏమిటో మనకు అర్థంకాదు.

మాయప్రభావం వల్ల ఆత్మ(బ్రహ్మం) భావాలను ఊహిస్తున్నదంటే, బ్రహ్మకంటే మాయ బలాధిక్యత కలదనే అభిప్రాయాన్ని అద్వైతులంగీకరిస్తారో లేదో తెలియదు. మాయ ఒక సత్తా (entity) కాదు, 'అవిద్య' అని వ్యాఖ్యానించినా, ఆ అవిద్య బ్రహ్మాన్ని ఎలా ఆక్రమించిందో, లేక ఆశ్రయించిందో వారు చెపితే తప్ప, మనకు అర్థం కాదు. మాయ చేస్తున్న గారడీలో బ్రహ్మం పడిపోవడమంటే ఏమిటో మనకు అర్థం కాదు.

త్రాడులో పామును చూచినపుడు పాము వుండకపోవచ్చు కాని, పాములో పామును చూచినపుడు పాము భ్రమ ఎలా అవుతుందో అర్థంకాదు. ప్రపంచంలో ప్రపంచాన్ని చూచేవారికి ప్రపంచం భ్రమకాదు. ప్రపంచం భ్రమ అయితే దాన్ని భ్రమిస్తున్నవారెవరో, దేన్ని ప్రపంచంగా భ్రమిస్తున్నారో, అది దేనికి ప్రతిభాసో, ఎందులో ప్రతిభాసిస్తున్నదో అర్థంకాదు. లేని బ్రహ్మం ఉన్న ప్రపంచం మీద బయలుదేరిన అపోహ ఎలా కాదో, జ్ఞానేంద్రియాలకూ, మనసుకూ అందేదాన్ని వదలి, అందని

దాన్ని వున్నదని ఎలా అనుకోవాలో అర్థం కాదు.

బైబిలులో సాతాను ఆదామును ప్రలోభపెట్టి, మోసగించి, దైవాజ్ఞను అతిక్రమించి, ఆదాము ప్రపంచజ్ఞానం పొందేటట్లు చేశాడని ఒక కథ వుంది. మాయ కూడా బ్రహ్మాన్ని ప్రలోభపెట్టి, మోసగించి, ప్రపంచ జ్ఞానాన్ని కల్గిస్తున్నదని అద్వైతుల భావమేమో మనకు అర్థం కాదు. ప్రపంచ జ్ఞానానికి బైబిలులో కారకుడు యెహోవాకాక సాతాను అయితే, అద్వైతంలో ప్రపంచ జ్ఞానానికి కారకుడు బ్రహ్మంకాక మాయ అవుతుందని వారు అంగీకరించగలరేమో మనకు అర్థం కాదు. అయితే, ప్రపంచం వున్నదని బైబిలు ఒప్పుకుంటున్నది, అద్వైతం ఒప్పుకోవడంలేదు. ఉన్న ప్రపంచాన్ని గురించిన జ్ఞానం వద్దని బైబిలు చెపుతుంటే, అదంతా ఆభాసేనని అద్వైతం అంటున్నది. ఈ రెంటిమధ్య వ్యత్యాసం వారెలా చూపుతారో మనకు అర్థం కాదు.

ఇంద్రియాల ద్వారా మన అనుభూతిలోకి వస్తున్న ప్రపంచాన్ని ఎందుకు, ఎలా మనం మిధ్య అనుకోవాలో అర్థంకాదు.

ఇంద్రియాలతో సంబంధంలేకుండా, ఇంద్రియజ్ఞానంతో సంబంధం లేకుండా 'అనింద్రియ' జ్ఞానం ఎలా సాధ్యమవుతుందో మనకు అర్థంకాదు.

మెదడు అత్యంత సంక్లిష్టమైన విధానవ్యవస్థ. దాన్ని గురించి ఆధునిక విజ్ఞానం ఎంతో పరిశోధన చేసింది, కొంత తెలుసుకొంది. ఇంకా పరిశోధన చేయవలసిందీ, తెలుసుకోవలసిందీ మరెంతో వున్నది. జ్ఞానేంద్రియాల నుంచి సందేశాలు అందకుండా అది జ్ఞానాన్ని ఆర్జించడమనే సమస్యేలేదు. సందేశాలను మోసుకువెళ్ళే నాడీమండలంతో మెదడుకు సంబంధాలను త్రెంచడం ద్వారా మనసుకు వాటిని చేరనీయకుండా ఆపవచ్చు. అప్పుడు ప్రపంచమే కాదు, బ్రహ్మంతోసహా సర్వమూ అంతర్ధానమవుతాయి. ప్రపంచం వున్నా, అది వున్నదన్న స్పృహ బండకులేనట్లే, మనసు+జ్ఞానేంద్రియాలు లేనిదానికి దేనికయినా సర్వమూ మిధ్యే. అసలు మిధ్యేమిటి–ఏమీవుండదు. ఉండదన్న స్పృహే వుండదు.

మనషుల్ని మనం హిప్నాటైజు చేయవచ్చు. చీకట్లోకాక వెలుతురులోనే త్రాడును పాముగా భ్రమింపచేయవచ్చు; పామునే పూలమాలగా భ్రమించి మెడలో వేసుకొనేట్టు చేయవచ్చు; చేదును తీపిగా, తీపిని చేదుగా, వేడిని చలిగా అనుభూతి పొందేటట్లు చేయవచ్చు; ఈ ప్రక్రియల్లో యిలా ఎందుకు జరుగుతున్నదో ఈనాటి మనోవిజ్ఞాన శాస్త్రం వివరించగల్గుతుంది. బ్రహ్మాన్ని ఆశ్రయించి వుంటుందని అద్వైతులంటున్న 'మాయను' ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈనాటి హిప్నాటిష్టు

మిత్రులు సృష్టించ గల్గుతున్నారు. ఇది ఎలా సాధ్యమవుతున్నదని అద్వైతులంటారో మనకు అర్థం కాదు.

ఆత్మ అనేది ఒకటి వున్నదని రుజువు చేయజాలని అద్వైతులు దానికి జనన మరణాలు లేవని ఇతరులకు పాఠాలు చెప్పబూనడంలోని రహస్యమేమిటో మనకు అర్థంకాదు.

శ్రోతల మనసుల్ని నిద్రమత్తుతో ముంచే వాగాడంబరంతో మార్మిక భావగానం ఎంత చేసినా, అది వారికి అర్థం అవుతుందనుకోవడంలో అర్థం లేదు. చెప్పేవాడికే అర్థంకాని అద్వైతం-వినేవాడికెలా అర్థమవుతుంది ?

మా-యా అంటే అది అదికాదని అర్థం అంటూ నయాలు నిగ్గదీస్తున్నారు. వున్న వస్తువులు లేనివిగా, లేని వస్తువులున్నవిగా, ఒక వస్తువు మరో వస్తువుగా, అనని మాటలు అన్నట్లుగా, అన్నమాటలు అననట్లుగా, సువాసన దుర్వాసనగా, దుర్వాసన సువాసనగా, రుచిని అరుచిగా, అరుచిని రుచిగా, అలా విరుద్ధ అనుభూతులు పొందే మతి భ్రష్టుల్ని, పిచ్చివాళ్ళను మనం యెరుగుదుము. వారికి అవి అవికాని మాట నిజమేకాని, మనసు ఆరోగ్యవంతమై, సక్రమంగా పనిచేసేవారి అనుభూతిలో అవి అవి అవుతాయా, కావా ? ఈ ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పుకోవలసిన వారు అద్వైతమాయావాదులే. అలాంటి భ్రమలు, భ్రాంతులు అనుభూతి పొందే పిచ్చి వాళ్ళకు ఆరోగ్యాన్ని కుదిర్చే మానసిక వైద్యం (సైకోథెరపీ, సైకియాట్రీ) ఈ రోజుల్లో చాలా అభివృద్ధి చెందింది. అలాంటి అనేక రకాల మానసిక వ్యాధుల్ని ఈనాటి మనో విజ్ఞానం గుర్తించి వర్గీకరించింది. మాయా వాదులకున్నది కృతకమానసిక వ్యాధి.

గౌడపాద కారికల్లో మాయ అనే దాని భావం 'అది అదికాదు' అనే విధంగా లేదు. మాయ అనే శక్తి ప్రత్యేకంగా వుండి ఆత్మను భ్రమపెడుతున్నదనే భావం గౌడపాద కారికల్లో నాల్గుప్రకరణాల్లోనూ అనేక సందర్భాల్లో వ్యక్తమవుతుంది. అది అచల బ్రహ్మాన్ని ఎలా ప్రభావితం చేయగల్గుతున్నది ? అనేది ముఖ్యమయిన ప్రశ్న. అందుకే గౌడపాదుడు మాటిమాటికీ 'రెండు కాదు, రెండు కాదు' అన్నాడు తప్ప, 'ఒకే ఒక్కటి' ఉన్నది అనలేకపోయాడు.

ఇక అద్వైత ప్రకరణం బ్రహ్మసాధకుల్ని అల్పజ్ఞులుగా చిత్రించడంతో ప్రారంభమవుతుంది, ఎందుకంటే అద్వైతుల దృష్టిలో బ్రహ్మం నిరవధికం, నిత్యం, అజాతం, అగ్రాహ్యం-కుండలోని ఆకాశం ఎలాంటిదో జీవిలోని ఆత్మ అలాంటిదేననీ, కుండ పగిలినపుడు ఘటాకాశం మహాకాశంలో లీనమయినట్లు దేహనాశనంతో జీవాత్మ

పరమాత్మలో లీనమవుతుందనీ; ఒక ఘటాకాశంలోని మలినం మరో ఘటాకాశాన్ని మలినం చేయనవసరం లేనట్లే, ఒక జీవి సుఖఃదుఖాలు మరొక జీవిని బాధించవనీ అంటారు.

ఆత్మకు జననమరణాలు, రాకపోకలు లేవనీ; వస్తువులన్నీ ఆత్మయొక్క భ్రమలనీ; జీవ, బ్రహ్మలు వేర్వేరుకాదనీ; వేర్వేరని చెప్పిన ఉపనిషద్భాగాలను అలంకారికంగా అన్వయం చేసుకోవాలనీ అంటారు.

అద్వైతమే అంతిమసత్యమనీ; ఆత్మకు మార్పులేదనీ; మార్పున్నదంతా మరణించేదేననీ, ఆత్మ అంటే ఏమిటో మనకు తెలియదు కాబట్టే, "ఇదికాదు, ఇదికాదు" అంటూ నేతి క్రమాన్ని అనుసరించవలసి వస్తోందనీ అంటారు.

కాబట్టి, అనంతవస్తు ప్రపంచంలో ప్రతిదాన్నీ ఇదికాదు, ఇదికాదు అని తొలగద్రోసుకొని పోగల్గినప్పుడు ఆత్మకు చేరువవుతామన్నమాట.

పుడుతున్నట్లు భ్రమ కల్పించేది మాయ అనీ; గొడ్రాలుకు బిడ్డలు పుట్టనట్లే, లేనిది మాయవల్లకూడా పుట్టదనీ; (ఉన్నదానికి పుట్టే సమస్యేలేదు). అద్వయమైన మనస్సుకు జాగ్రదవస్థలో కూడా స్వప్నావస్థలో వలెనే ద్వయిభావం కల్గుతుందనీ అంటారు.

చరాచరాలన్నీ మనస్సుకు గోచరమవుతున్నాయంటే, ఆ చరాచరాలన్నీ మనసేనని అర్థం చేసుకోవాలనీ (31); మనస్సు లేనప్పుడు ద్వైతం వుండదనీ; మనస్సు పని మానాలంటే, ఆత్మజ్ఞానం పొందాలనీ; అప్పుడే దానికి జ్ఞాన ప్రవృత్తి నుంచి విముక్తి కల్గుతుందనీ; అసలైన జ్ఞానం బ్రహ్మజ్ఞానమేననీ; అది లభించినవారు అమరులవుతారనీ అంటారు.

బ్రహ్మనికి నిద్రలేదు, కలలేదు, జన్మలేదు. బాహ్యప్రపంచ స్పృహ ఆత్మైక్యానికి అవరోధం. సర్వాన్నీ విస్మరించినపుడు మనసే బ్రహ్మమవుతుంది. ఏదీ ఎన్నడూ పుట్ట లేదనేదే అత్యున్నత సత్యం అంటారు చివరకు-ఇదీ అద్వైత ప్రకరణ సారాంశం.

ఇందులో ఆత్మ. బ్రహ్మ-ఒకదానికొకటి పర్యాయపదాలు. బ్రహ్మవాదం పలాయనవాదం కాన, మన ప్రశ్నలకు అది యిచ్చే సమాధానం పలాయనమే. అయినా, మనకు ఆ వాదంపై వచ్చే ప్రశ్నలను యేకరువు పెట్టక తప్పదు.

లక్షణాలు లేనిదాన్ని గ్రహించడానికి వీలులేదు కాన, అలక్షణమైన బ్రహ్మం అగ్రాహ్యమనవచ్చు. ఐతే, అగ్రాహ్యమైన బ్రహ్మం వున్నదన్న విషయం మనకెలా గ్రాహ్యమవుతుంది ?

అంతా ఆకాశమైనట్లు, అంతా బ్రహ్మమేననేది అద్వైతులవాదం. అయితే ఇక ఆ బ్రహ్మాన్ని గురించి తెలుసుకొనేదెవరు ? బ్రహ్మం తనను గురించి తానేతెలుసుకొంటుందా? అలా తెలుసుకొనే లక్షణం వున్న బ్రహ్మం అలక్షణమెలా అవుతుంది.

తనకూ, తనను తాను తెలుసుకోవడానికీ మధ్య అవధి వుండగా బ్రహ్మం నిరవధికమెలా అవుతుంది ?

నిత్యమైన బ్రహ్మం నిశ్చలమైనపుడు గ్రాహ్యాగ్రాహ్యాల ప్రశ్న ఎలా ఉదయిస్తుంది? చలనంవుంటే మార్పు వున్నట్లే కాన, మార్పు ఉన్న దానికి జననమరణాలుంటాయి కాన, అది అజాతమెలా అవుతుంది ?

వస్తులున్నవన్న భ్రమకు లోనయ్యే ఆత్మ మార్పుకు లోనుకాకపోవడమేమిటి ? నిశ్చలబ్రహ్మకు భ్రమ ప్రమాదాలెలా కలుగుతాయి ?

జీవుడు, బ్రహ్మ వేర్వేరని చెప్పిన ఉపనిషద్భాగాలు సత్యాన్ని అలంకారబద్ధంగా చెప్పడంలో అసత్యాన్ని చెప్పాయనుకోవలెనా ? అసత్యాన్ని చెప్పినప్పుడల్లా అలంకార బద్ధంగా అన్వయం చేసుకోవలెనా ?

ఆత్మ అంటే ఏమిటో తెలియక "నేతి"క్రమాన్ని ఆశ్రయిస్తున్నప్పుడు, లక్షణాలు కాని ఆయా లక్షణాలు అది కల్గివుందని గుర్తించడం ఎలా జరిగింది ?

ఏ విధంగానూ వూహించరానిదాన్ని ఉన్నదని భావించడం ఎలా జరిగింది ?

భావాలుకూడా మిధ్య అయినపుడు, బ్రహ్మభావం ఎందుకు మిధ్య కాదు ? అది ఏల అభాసకాదు ? కలకంటే హీనమైన వూహాకల్పిత బ్రహ్మాన్ని అసత్యమని ఏల అనుకోరాదు ? అది వున్నదనుకోడానికి దాఖలా యేమిటి ?

బ్రహ్మజ్ఞానాన్ని పొందేదెవరు ? ఆ పొందేది మనసయితే, ఆ మనసూ, బ్రహ్మమూ వేర్వేరా, కాదా ?

బ్రహ్మజ్ఞానమంటే ఏమిటి ? బ్రహ్మమంటే ఏమిటో తెలియనప్పుడు, దాన్ని గురించిన జ్ఞానమంటే ఏమిటి ? బ్రహ్మమూ, దాన్ని గురించిన జ్ఞానమూ ఒక్కటేనా? వేర్వేరా ? బ్రహ్మజ్ఞానమనేది విషయజ్ఞానమా, లేక నిర్విషయజ్ఞానమా ?

బ్రహ్మజ్ఞానం పొంది అమరులైన వారెవరైనా మనకు దర్శనమిస్తారా ? లేక, కుండల్లో, చట్లలో పుట్టినట్లు చెప్పబడినవారే మనకు దాఖలాగా వర్తిస్తారా ?

స్వయం సమ్మోహనస్థితి(Self hypnotic)వంటి సమాధి స్థితికి చేరినపుడు మనస్సే బ్రహ్మమవుతుందా ? మనస్సుయొక్క నిర్వికల్పదశ అంటే అదేనా ? అదేనా ఆత్మజ్ఞాన స్థితి ?

చరాచరాలన్నీ మనస్సు అయినపుడు, మనస్సు బ్రహ్మమైనపుడు, చరాచర వస్తువులేల బ్రహ్మంకావు ? అవి మిధ్య ఎలా అవతాయి ? వస్తువులు లేకపోతే మనస్సు, మనస్సు లేకపోతే బ్రహ్మం కూడా లేనట్లేనా ? లేక బ్రహ్మం లేకపోతే మనస్సు, మనస్సు లేకపోతే వస్తువులు లేనట్లేనా ?

అద్వైత ప్రతిపాదన మీదినుంచి మనకు ఇలాంటి ప్రశ్నలెన్నో వస్తాయి. కాని, అద్వైతాన్ని పరిశీలించడం ఈ వ్యాస లక్ష్యం కాదని ఇంతకుముందే చెప్పుకున్నాం. అద్వైతమూ, భౌతికవాదమూ ఒక్కటేననే నయాశాంకరుల వాదాన్ని పరిశీలించడమే మన లక్ష్యపరిధి. అద్వైతాన్ని పరిశీలించకుండా మనం ఎందుకు వదలివేశామా అన్న శంక అభినయ శాంకరుల మధ్య మొలుచుకొచ్చిందట. అందువల్ల, అద్వైత ప్రతిపాదన అసలు ఎలా వుంటుందో చూపడానికే స్థూలంగా మాయావాదాన్ని,అద్వైతాన్ని మనం స్పృశించాం.

ఇంతవరకు మనం చూచిన దాన్నిబట్టి బుద్ధివున్న వాడెవ్వడూ అద్వైత మాయావాదాన్ని భౌతికవాదం దరిదాపులకైనా చేరనీయడని తేలుతుంది. అంతేకాదు, మతి భ్రష్టుడికి తప్ప, సాదామనిషి కెవరికయినా అది ప్రపంచమిధ్యా వాదంగా, అభౌతిక బ్రహ్మవాదంగా గుర్తించ వీలవుతుంది.

ఇంతకూ అద్వైతాన్నీ, మాయావాదాన్నీ అసలు ప్రతిపాదించినవాడు శంకరుడు కాదు, గౌడపాదుడేనన్న విషయం నయాశాంకరులిప్పటికయినా గుర్తించాలి. అది గుర్తించకుండా "శంకరాద్వైతం, శంకరాద్వైతం" అంటూ భజన చేసినందువల్ల అద్వైతం శంకరుడిది కాజాలదు. మాయావాద ప్రచారాన్ని ముమ్మరం చేయడమే శంకరుడు చేసిన ఘనకార్యం. ఈ నిర్ణయంలో మనం సురేంద్రనాథ దాస్‌గుప్తాతో ఏకీభవస్తాం.

A History of Indian Philosophy (Vol. 1) లో దాస్‌గుప్తా యిలా వాఖ్యానించాడు :

Gaudapada asserts clearly and probably for the first time among Hindu th'nkers, that the world does not exist in reality, that it is maya, and not rea ity. Sankara expounded this doctrine in his elaborate commentar es on the Upanishads and the Brahma Sutra, but he seems to me to have done little more than mak'ng explicit the doctrine of maya.'

అందులోనే మరొకచోట కూడా యిలా అంటాడు.

'Reason with Sankara never occupied the premier position, its value was considered only secondary, only so far as it helped one to the right understanding of the revealed scriptures, the Upanishads....Sankara accepted Gaudapada's conclusions, but did not develop his dialectic for a positive proof of his thesis.....(He) never tr'es to prove that the world is maya, but accepts it as Ind sputab e.'

కాబట్టి గౌడపాదుడు చెప్పనిది,శంకరుడు కొత్తగా చెప్పింది ఏమీలేదు.మాయావాద జపం మాటిమాటికీ చేయడమే శంకరుడు చేసిన ఘనకార్యం. అదివినా, ఆయన ప్రపంచం మాయ అనే సూత్రాన్ని రుజువు చేయడానికి ప్రయత్నం కూడా చేయలేదు.

అద్వైతం (non dualism) ఏకత్వవాదం (monism) కాదు. అద్వైతుల బ్రహ్మం పదార్థంకాదు. అద్వైత మాయావాదం ప్రకారం పదార్థం మిధ్య. అందువల్ల, అద్వైతాన్ని భౌతికవాదంగా, వాస్తవికవాదంగా పరిగణించడానికి వీలులేదు.

## ప్రచ్ఛన్న బౌద్ధం

శంకరుడు ప్రచ్ఛన్న బౌద్ధుడని కొందరూ, నాస్తికుడని కొందరూ ముద్రలు వేశారు. వారంతా వేద వేదాంత శాఖల్లో శంకరుడి ప్రత్యర్థి వర్గాలకు చెందినవారు-పూర్వ మీమాంసికులూ, శైవ, వైష్ణవ హిందూ శాఖీయులూ, ద్వైతాద్వైతులూ అందులో వున్నారు. వారి దృష్టిలో ప్రచ్ఛన్నబౌద్ధం నిందావాచకం. క్రిప్టోబుద్ధిష్టు అనేది గౌరవ వాచకంకాదు. ఏ బౌద్ధుడూ, ఏ నాస్తికుడూ, ఎన్నడూ శంకరుణ్ణి బౌద్ధుడుగా, నాస్తికుడుగా వాసన కూడా పట్టినట్లు లేదు.

పద్మపురాణాన్ని వ్యాసుడు వ్రాశాడో, మరొకరు వ్రాశారో, అది మన చర్చ పరిధి లోకి రాదు. వ్యాసుడెప్పటివాడు, శంకరుడెప్పటివాడు అనే ప్రశ్నలుకూడా మనం తేల్చవలసినవికావు. "మాయావాదమసచ్ఛాస్త్రం ప్రచ్ఛన్నం బౌద్ధమేవచ, మాయైవకథితం దేవీకలౌ బ్రాహ్మణరూపిణా" అని శివుడు పార్వతితో చెప్పినట్లు పద్మపురాణంలో (ఉ.కాం. 236)వుంది. అంటే, మాయావాదం దుష్టసిద్ధాంతమనీ, ముసుగులో వున్న బౌద్ధమనీ, కలియుగంలో తానే బ్రాహ్మణరూపంలో వచ్చి దాన్ని ప్రతిపాదించాననీ శివుడే అన్నాడుట. ఆ తర్వాత "వేదార్థవాఙ్మహాశాస్త్రం, మాయావాదం అవైదికం" అనికూడా శివుడే అన్నాడు.అంటే, వేదసత్యాలు కొన్ని మాయావాదంలో దొర్లినా, అది వేదసమ్మతం కాదన్నమాట !

జీవబ్రహ్మల విషయంలో భేదాభేదవాది అయిన భట్టభాస్కరుడు బ్రహ్మసూత్రాలకు వ్రాసిన భాష్యంలో "మాహాయానిక బౌద్ధగాథికం మాయావాదం" అన్నాడు(1-4-25). అంటే, మాయావాదం మహాయాన బౌద్ధశాఖకుచెందిందని భాస్కరుడినింద. యామునాచార్యుడు, అయన శిష్యుడు రామానుజాచార్యుడు, విజ్ఞాన భిక్షువు మొదలయినవారుకూడా శంకరుడి మాయావాదాన్ని బౌద్ధుల శూన్యవాదానికి వికారంగా వర్ణించారు. కాకపోతే,బౌద్ధులబుద్ధి స్థానంలో శంకరుడు మాయను యిరికించాడన్నారు. నిజానికి, మాయశబ్దం వైదికులదేకాని, బౌద్ధులదికాదు. శంకరుణ్ణి తిట్టిపోయటానికే అతని వ్యతిరేకులు అతన్ని ప్రచ్ఛన్న బౌద్ధుడన్నారు తప్ప, శంకరుడెక్కడా తాను బౌద్ధుణ్ణనికాని, నాస్తికుణ్ణనికాని చెప్పుకోలేదు సరికదా, ఆ రెంటిలో దేనిపట్లకాని సానుభూతివున్నట్లు ఎక్కడా బయట పడలేదు. పోగా, ఈశ్వరుడి స్థానంలో బ్రహ్మాన్ని అంగీకరించి, ఆ భావంలోనే తరచు బ్రహ్మశబ్దాన్ని వాడాడు తప్ప, బ్రహ్మమంటే ఏమిటో, అది ఈశ్వరుడికంటె ఎలా భిన్నమోకూడా ఎక్కడా వివరించలేదు. పైగా, గౌడపాద కారికల్లోని బుద్ధ శబ్దానికీ, బౌద్ధవాదానికీ బౌద్ధేతరమైన వ్యాఖ్యానంచేశాడు. కాబట్టి, శంకరుణ్ణి ప్రత్యేకించి ప్రచ్ఛన్న బౌద్ధ శబ్దంతోనైనా గౌరవించవలసిన పని మనకు లేదు.

వైదిక మతమూ, ఆచారాలూ, సంస్కృతీ అన్నీ ప్రాకృతమైనవి. అతి స్వల్పంగా మాత్రమే వేదాల్లో దార్శనిక అంశాల ప్రస్తావన కన్పిస్తుంది. వేదాలను తిరస్కరించిన చార్వాక, జైన, బౌద్ధ భావోద్యమాలతో దార్శనిక చింతనకు విస్పష్టమైనరూపం వచ్చింది. వాటి దెబ్బను తట్టుకోడానికి వేదాంతంగా ఉపనిషత్తులు బయలుదేరినై. వాటిలో బ్రహ్మవాదం పేరుతో తలక్రిందుల తత్వానికి బీజాలు పడినై. బౌద్ధుల క్షణికవాదంస్థానంలో జీవితం అశాశ్వతం అనే నిరర్థక నిరాశావాదానికీ, శూన్యవాదం స్థానంలో మాయావాదానికీ ఉపనిషత్తులు తావిచ్చినాయి. బౌద్ధం తన సంఘీయులకు భిక్షుక సన్యాసం ప్రతిపాదించగా, ఆర్యర్షులు భార్యలతో సంసారం చేస్తూనే, వందలాది పిల్లల్ని కంటూనే, సన్యాసులుగా చలామణి అయినారు.నిజానికి రుషుల్లో అవివాహితులు కానీ, అస్ఖలిత బ్రహ్మచారులు కానీ, ఒక్కరైనా లేరు. నరమేధంతో సహా, హింసాత్మక క్రతు సంస్కృతిని వేదం పోషించగా, హింసలోపుట్టి పెరిగిన భగవద్గీత అహింసా వాదాన్ని తనదైనట్లు మాట్లాడింది. (మహాత్మాగాంధీగారి వ్యాఖ్యానం ప్రకారం). హిట్లర్ నేషనల్ సోషలిజం ఎలాంటి సోషలిజమో, గీత అహింస అలాంటి అహింసే.

జాతి విద్వేషం వేదాల సొత్తుకాగా, బౌద్ధుల మానవ సమతావాదం స్థానంలో 'అంతా బ్రహ్మమే'ననే వితండవికార వాదాన్ని ఉనిషత్తులు ప్రవేశపెట్టినై. ఆ బ్రహ్మంలోపల

రుషులు వర్ణ వ్యత్యాసాలను పోషించారు తప్ప తిరస్కరించలేదు. వేదకాలంలోని వైదికుల నిత్యవృత్తి ప్రవృత్తులు యజ్ఞయాగాదులుకాగా, ఉపనిషత్తుల ప్రవేశంతో ఆ రంగు మారింది. వారి వారసులు యజ్ఞయాగాదులకే స్వస్తి చెప్పారు. అదంతా బౌద్ధ ప్రభావ ఫలితమే. అయితేగియితే నయా వైదికంగా బయలుదేరిన హైందవమే ప్రచ్ఛన్న బౌద్ధం కావాలి. ఐనా, వేషభాషలే బౌద్ధానివికాని, లక్ష్యం బౌద్ధం వ్యతిరేకమే. ఎందుకంటే, ఇంత జరిగినా, వర్ణవిభేదాన్ని మాత్రం వైదికం విడువలేదు. మూడు వర్ణాలు నాలుగై, ఐదై, చివరకు అనేకంగా వున్న ఆర్యేతరజాతులు హైందవీకరించబడి, వందలు- వేల కులాలుగా తీరికూర్చున్నాయి. ఇందులో ఒక్క బ్రాహ్మణ్యం మాత్రమే అఖిల భారత కులం కావడం, మిగతావేవీ అఖిల భారత కులాలుకాకపోడం ఇక్కడి భిన్నత్వంలో ఏకత్వం ! బౌద్ధుల సమ్యగ్దర్శననీ, నైతిక శీలాన్నీ వక్రీకరించి, జాతి నీతుల్ని, కులనీతుల్ని నింపుకొని, వాటిని సమర్ధించే కల్పనా గ్రంధాలు స్మృతులుగా అవతరించినై. వేదాలలో వున్నట్టి, లేనట్టి దేవుళ్ళు, దేవతలు కుప్పతెప్పలుగా రంగంలోకి దిగారు. అలాంటి అనేక దేవతల విగ్రహాలను అద్వైతవేదాంతి అని చెప్పబడుతున్న శంకరుడు ప్రతిష్టించాడు. వాటిముందు మోకరిల్లాడు. సందర్భం వచ్చినపుడల్లా శ్రుతిస్మృతులను, గీతోపనిషత్తులను, పురాణేతిహాసాలను ప్రమాణించాడు. వర్ణాశ్రమాచార ధర్మాలను బలపరిచాడు. పాటించాడు. మాట వరుసకు అంతా బ్రహ్మమయమన్నాడు. కాని, ఆ బ్రహ్మంలో ఈశ్వరుణ్ణి, ఆత్మను కలగా పులగం చేశాడు. బౌద్ధులకు ఈశ్వరుడులేడు, బ్రహ్మం లేదు, ఆత్మలేదు. **బుద్ధుడేమి చెప్పినా, తాను దేవుణ్ణనికాని, దేవదూతనని కాని, దేవుడు తనకు చెప్పిన వాటిని తాను చెపుతున్నాననికాని చెప్పలేదు. ఆయన మనిషిగా చెప్పాడు. మనుషులు మనుషులుగా తమకోసం ఈ లోకంలో ఆచరించడానికి మానవ ధర్మంగా చెప్పాడు.**

బౌద్ధ సూత్రాల్లో కొన్నిటిని హైందవం కేవలం కాపీకొట్టడంతో సరిపుచ్చుకోక, వాటిని భ్రష్టంచేసి తన వాదాలుగా ప్రదర్శనకు పెట్టుకుంది. అంతటితోఆగక, బుద్ధుణ్ణి హిందువుల దేవుడైన విష్ణువుయొక్క తొమ్మిదవ అవతారంగా చిత్రీకరిస్తూ దశావతార కథలు కల్పించి నమ్మించింది. (ఆ ప్రయత్నాన్ని తొలిసారిగా భారీయెత్తునచేసిన గ్రంధం క్షేమేంద్రుడి దశావతార చరిత్ర-11వ శతాబ్ది). అందుచేత శంకరాచార్యుణ్ణి ఒకడినే ప్రత్యేకించి ప్రచ్ఛన్న బౌద్ధుడని వేలెత్తి చూపడానికి వీలులేదు. అలా అన్నప్పుడు హిందువులంతా ప్రచ్ఛన్నబౌద్ధులే. అనిత్యత, అహింస, శీలం అనేవి అచ్చంగా బౌద్ధభావాలు. ఆ మాటలు వాడని హిందువుకానీ, వాటిని ఆ అర్థంలో ఆచరించే హిందువుకానీ మృగ్యం. అది హిందూ చారిత్రక వారసత్వం.

ఎక్కడెక్కడి సిద్ధాంతాలనూ అలా కబళించడం వల్లనే హైందవానికి అజీర్ణంచేసి పరస్పర విరుద్ధ సిద్ధాంతాలను ఒకే మతంగా, విశ్వమతంగా, ప్రదర్శనకు పెట్టే రోగం పట్టుకుంది. ఈ రోగం పురాణాల్లో దైవాంశ సంభూతుల ఆచరణలో స్పష్టంగా చిత్రితమైంది. ఈ లోకంలో పాతివ్రత్యాన్నీ, స్వర్గలోకంలో వ్యభిచారాన్నీ పురాణాలు ప్రోత్సహించినై. రాముడి ఏకపత్నీవ్రతాన్నీ, కృష్ణుడి బహుస్త్రీలోలత్వాన్నీ వేనోళ్ళ కొనియాడినై. తపస్సు చేసుకుంటున్న శంబుకుడిని శూద్రుడన్న విచక్షణతో తలనరికిన రాముణ్ణీ, వర్ణ విచక్షణకే వ్యతిరేకి అయిన బుద్ధుణ్ణీ ఒకే దేవుడియొక్క రెండు అవతారాలుగా వర్ణించినై. పురాణాంశంగా పుట్టిన భగవద్గీత హింసనూ-అహింసనూ, ద్వైతాన్నీ-అద్వైతాన్నీ, కర్మనూ-నిష్క్రియాపర్వతాన్నీ, వర్ణవ్యవస్థనూ సమానంగా పోషించింది.

బుద్ధుడు వేదాలను తిరస్కరించాడుకాని, ఉపనిషత్తుల వూసే యెత్తలేదు. అంటే, అప్పటికి ఉపనిషత్తులది పుట్టీపుట్టని దశేనన్నమాట. కాగా, శంకరుడు మాట మాట్లాడితే శ్రుతుల పేరుతో ఉపనిషద్వాక్యాలనూ, స్మృతి పురాణేతిహాసాలనూ ప్రమాణించేవాడు. అలాంటివాడ్ని ప్రచ్ఛన్నంగానైనా బౌద్ధుడనడం వివేకవంతంకాదు. శంకరుడేమి చెప్పినా, వైదిక హిందువుగానే చెప్పాడు. తన పూర్వ హిందువులు చెప్పిందే చెప్పాడు. అందులో ప్రచ్ఛన్న మేముంది ? అంతా ప్రత్యక్షంగానే, పచ్చిపచ్చిగానే చెప్పాడు. నిజానికి, అద్వైతమేకాదు-ద్వైతమూ, విశిష్టాద్వైతమూ, శుద్ధాద్వైతమూ, మరో అధ్వాన్నమూ-అన్నీ బ్రహ్మవాదాలే, అన్నీ పలాయన వాదాలే, అన్నీ బౌద్ధులకు శత్రువులే. కాకపోతే, అద్వైతంలో మాయావాదం, మిగతా వాటిలో భక్తివాదం బలంగా వున్నాయి. వారిది దాయాదుల మధ్యతగాదా. ఒకరు శైవ వేదాంతులైతే, మరొకరు వైష్ణవ వేదాంతులు. బౌద్ధాదుల తాకిడికి వేదాలు అంతమైన తర్వాత వీరంతా కొత్తదారులు తొక్కారు. అదే వేదాంతమార్గం. వీరిలో వీరు ఒకరినొకరు తీవ్రంగా దూషించుకున్నారు. ఒకరి కుత్తుకలొకరు ఉత్తరించుకున్నారు. బౌద్ధం ప్రాభవంకోల్పోయిన చివరి దశలో బయలుదేరిన వైష్ణవ వేదాంతులు తమనుతాము యాంటీ బౌద్ధులుగానూ, శంకరుణ్ణి క్రిప్టో బుద్ధిష్టుగానూ వర్ణించారు. ప్రజల మెప్పుపొందటంకోసం శంకరుణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడని నిందించారు. దాన్ని పట్టుకొని వేలాడే వివేక శూన్యత హేతువాదుల్లో వుండరాదు. సైన్సును అడ్డం పెట్టుకొని మత పునరుజ్జీవన వాదాన్ని పోషించడమెలా వుంటుందో, బౌద్ధాన్ని అడ్డంపెట్టుకొని శంకరాద్వైతాన్ని పోషించడం అలా వుంటుంది.

శంకరుడు ప్రత్యక్షంగానే బౌద్ధాన్ని ఖండించాడు. అలాంటివాడు ప్రచ్ఛన్న బౌద్ధుడు కావడమేమిటి ?

అన్ని శాఖల బౌద్ధాన్ని అనేక విధాలుగా ఖండించడానికి శంకరుడు బ్రహ్మసూత్ర భాష్యంలో ప్రయత్నించాడు. అయితే, ఏ సిద్ధాంత ప్రతిపాదనలూ శంకరుడి సొంతం కానట్లే, ఆయా సిద్ధాంతాల ఖండనలూ అతని సొంతాలు కావు. ఆ ఖండనలు అంతకుముందే ఆయా సూత్రాల్లో, కారికాదుల్లో వున్నాయి. శంకరుడు ప్రచ్ఛన్న బౌద్ధుడై వుంటే, సూత్రభాష్యాల్లో బౌద్ధంపట్ల అభిమానం వ్యక్తమై వుండేది. అలా జరగలేదు. జరగకపోగా, గౌడపాదుడు మాండ్యూక్యకారికల్లో బుద్ధుణ్ణీ, బౌద్ధాన్నీ అభిమానిస్తూ వ్రాసిన భాగాలకు శంకరుడి భాష్యంలో కావాలని బౌద్ధవ్యతిరేక అన్వయం తెచ్చిపెట్టినట్లు స్పష్టమవుతుంది. అలాంటి శంకరుడు ప్రచ్ఛన్నంగానైనా బౌద్ధుడెలా కాగలడు ?

మాండూక్య కారికలకు భాష్యం వ్రాస్తూ శంకరుడు మనకు కన్పించే రథతుర గాదులన్నీ సత్యంకావనీ (2-3,4), కలలోని వస్తువులెలాగో అలాగే మెలకువలో కన్పించే వస్తువులన్నీ అబద్ధాలేననీ (2-9,10), లేని వస్తువుల్ని వున్నట్లుగా తన మాయద్వారా ఆత్మ మనకు భ్రమ కల్పిస్తున్నదనీ (2-12) అన్నాడు. ఇంకా యితర కారికల భాష్యాల్లో ఆ వాదాన్ని కొనసాగిస్తూ, మనకు కన్పించేవన్నీ మిధ్యేనన్నాడు. కాని, బ్రహ్మసూత్రాల్లో "నాభావ ఉపలబ్ధే"(2-2-28) అనే సూత్రానికి భాష్యం వ్రాస్తూ "కనిపించే స్తంభం, గోడ మొదలైనవి లేవనే వాడిమాటలు నమ్మడం ఎలా ? తిండి తింటూనే, తృప్తిచెందుతూనే 'నేను తినడంలేదు, తృప్తిచెందడమూలేదు' అనేవాడి మాటల్ని నమ్మడం ఎలా ?" అని విజ్ఞానవాద బౌద్ధఖండన ప్రారంభించాడు. గౌడపాద కారికాభాష్యాల్లో(2-9, 10) చెప్పిన దానికి విరుద్ధంగా కలలోని అనుభూతికీ, మెలకువలోని అనుభూతికీ వ్యత్యాసమున్నదని కూడా బ్రహ్మసూత్ర భాష్యంలో అన్నాడు. (2-2-29,30). కారికల వైతథ్య ప్రకరణంలోని భాష్యానికి విరుద్ధంగా బ్రహ్మసూత్ర భాష్యంలో బౌద్ధవాద ఖండన సాగించాడు. ఒకచోట ఏ వాదాన్ని సమర్థించాడో, మరోచోట ఆ వాదాన్నే ఖండించడం శంకరుడి అవకాశవాదాన్ని, నిజాయతీ లోపాన్ని రుజువుచేస్తుంది. ప్రచ్ఛన్న బౌద్ధుడు బౌద్ధాన్ని విమర్శించేతీరు అదేనా అనేది అతని శీలంపై రావలసిన ప్రశ్న. అసలు ప్రచ్ఛన్నతే శీలరాహిత్యం. బౌద్ధుల అనిత్యతావాదాన్ని మిధ్యావాదంగా భ్రష్టుచేసి, అద్వైతం పేరుతోతనదిగా ప్రచారం చేసుకొన్నంత మాత్రాన శంకరుణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడనడానికి వీలులేదు. తార్కికంగా వైతండికం, సామాజికంగా హైందవం అతని సొత్తులు. హిందూ ధర్మశాస్త్రాలు ఆధారంగా హిందూ సామాజిక వ్యవస్థలోని దురంతాలన్నింటినీ సమర్థించడం ఆయన చరమలక్ష్యం.

బౌద్ధం చెప్పిన ఏ భాగాన్ని ఆమోదించాడని శంకరుణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడనాలి ?

క్రియవల్లనే అన్నీ పుడుతున్నాయి, ప్రతిదీ మారుతున్నది (కర్మజాంలోకవైచిత్ర్యం) అని బౌద్ధం అన్నది. కర్మ, కర్మిష్టులు అన్నీ మిథ్యేనని శంకరుడు వాదించాడు.

జగత్తును గురించి చెబుతూ బౌద్ధం " సృష్టిలేదు, వినాశనంలేదు, ఆదిలేదు, తుదిలేదు " ( నచనిరోధోస్తి నచ భావోస్తి సర్వదా, అజాతం అనిరుద్ధం చ తస్మాత్సర్వమిదంజగత్ ) అని అన్నది. ఆ స్వభావాలు లేనిది బ్రహ్మానికనీ, జగత్తు మిథ్య అనీ శంకరుదన్నాడు.

అయినా, కారణం లేకుండా ఏమీ జరగదు (విచారేణ నాస్తికించి ద హేతుః) అని బౌద్ధం అన్నది. కార్యకారణాలు రెండూ మిథ్యేననీ, జరగడం అంటూ ఏమీ లేదనీ శంకరుడి వాదం.

ఏదీ స్వతంత్రంగా లేదు. ప్రతిదీ మరోదానిమీద ఆధారపడి వుంది. (స్వతంత్రం న విద్యతే ఏవం పరవశం సర్వం యద్వశం సోపిచా వశః)అని బౌద్ధం అన్నది. రెండు లేవనే శాంకరానికి అన్యోన్యాశ్రయత అనేది గిట్టదు.

పరస్పరాశ్రయత మూలంగావున్న కారణబంధమే బౌద్ధం ప్రధానంగా చెప్పే ప్రతీత్యసముత్పాదవాదం. దాన్నే "ప్రతీత్య సముత్పాదం పశ్యంతి తేధర్మం పశ్యంతి, యోధర్మం పశ్యంతి సబుద్ధం పశ్యంతి"అంటుంది. అంటే, ఈ కార్యకారణభావాన్ని అర్థం చేసుకున్నవాడికి ధర్మం అవగాహన అవుతుంది; ధర్మాన్ని అవగాహన చేసుకున్నవాడు బౌద్ధసారాన్ని గ్రహిస్తాడని భావం. దీన్ని శంకరుడేనాడూ ఆమోదించలేదు.

"ఏ వస్తువూ స్వతంత్రంగాలేదు, ప్రతిదీ పరస్పరాశ్రయం, ప్రతిదాన్నీ సాపేక్షంగా చూడాలి" అన్న నాగార్జునుడి శూన్యవాదాన్ని 'ఏ వస్తువూ అసలేలేదు' అని కారికల్లో గౌడపాదుడు వికృతీకరించగా, దాన్ని శంకరుడు తన భాష్యంలో అంతా మిథ్య అనే మాయా వాదంగా ప్రసిద్ధం చేసిపెట్టాడు.

ప్రపంచంలో ప్రతిదీ నిత్యం మారుతున్నదనీ, ఆ అనిత్యతా ప్రవృత్తి సత్యమే కాని మిథ్యకాదనీ బౌద్ధం చెప్పగా, మారేదేదీ సత్యం కాదనీ, బౌద్ధంలేదని చెప్పిన బ్రహ్మం ఒక్కటే మారని సత్యమనీ శంకరుడన్నాడు.

శంకరుడు చెప్పినవేవీ అతని సొంతం కాకపోయినా, మరొకరు చెప్పినదాన్నే మళ్ళీ చెప్పినా, ఆ చెప్పినదానిలో మళ్ళీ బౌద్ధం ప్రచ్ఛన్నంగానైనా ఎక్కడవుంది ? ఆత్మవాది అయిన శంకరుడు అనాత్మవాది అయిన బౌద్ధుడెలా కాగలడు ? ఐనపుడు శంకరుణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడిగా గుర్తించడమెలా ?

## తాత్వికక్షయ

భారతీయతత్వంలో బ్రహ్మం ప్రవేశించడంతోనే తాత్వికక్షయ ప్రారంభమైంది. దాన్ని పునాది చేసుకొని వర్ణవ్యవస్థ వుత్పన్నం కావడంవల్ల, ఆ రోగానికి శాశ్వతత్వం యేర్పడింది. వేదాధికారాన్ని త్రోసివేయజాలని శాఖలకు ఆ బ్రహ్మజ్ఞాన రోగం వారసత్వంగా సంక్రమించింది. ద్వైతాద్వైతాల పేరుతో ఎన్ని ఆస్తికభావవాదశాఖలు బయలుదేరినా, ఏ శాఖకూడా ఆ జాడ్యంనుంచి తప్పించుకోలేకపోయింది. తాకడానికీ, చదువుకోడానికీ, జ్ఞానం ఆర్జించడానికీ అర్హతలేని మనుషుల్ని 'సృష్టించిన' గబ్బుమతం ఎన్ని వేషాలు వేసినా, ఎన్ని తత్వాలు చెప్పినా, దాని గబ్బు పోలేదు. అదీ, వేదాదుల వారసత్వం. వాటిని ఆధారం చేసుకున్న దొంగవేదాంతుల్లో ప్రథమ శ్రేణికి చెందినవారిలో ప్రథముడు శంకరుడు.

శంకరుడు మౌలికచింతన చేయకపోగా, అలా చేసినవారినందరినీ ఖండించాడు. ఉపనిషత్తుల్లో ఏదైనా మౌలికచింతన జరిగివుంటే, అది దోషభూయిష్టమైన భావవాద మార్గంలో జరిగింది. మతవాద-భావవాద వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్న పాశ్చాత్యులు కొందరు శంకరుణ్ణి మహాతాత్వికుడిగా పొగడి యోగ్యతాపత్రాలిచ్చిన మాట నిజమే. కాని, యోగ్యతాపత్రాలయితే యిచ్చారుకాని, వారు శంకరాద్వైతులు కాలేకపోయారనే సత్యాన్ని మనం విస్మరించరాదు.

మరో ముఖ్యాంశమేమంటే, శంకరుని అనంతరం వచ్చిన భారతీయ మతాచార్యులెవ్వరూ, సంస్కర్తలెవ్వరూ అతనికలాంటి యోగ్యతాపత్రాలివ్వలేకపోయారు. పైగా ఆ మతాచార్యులంతా శంకరుణ్ణి తిరస్కరించినవారే. అతన్ని రామానుజాదులు ఖండించగా, మధ్వాచార్యుడు తీవ్రంగా దూషించాడుకూడా.

సంస్కర్తలు శంకరుడి వూసే యెత్తుకోలేదు.

ఈ విషయాలను మరచి, పాశ్చాత్యుల సర్టిఫికెట్లద్వారా శంకరుడి ఘనతకు మదింపువేయడం అసమంజసం. భావవాదానికి పట్టం కట్టదలిస్తే, అందులో ఉన్నత జిజ్ఞాస చేసినవారు బౌద్ధదార్శనికుల్లో వున్నారని గ్రహించడం అవసరం.

బౌద్ధుల నిరీశ్వరతత్వాన్ని పూర్తిగా జీర్ణం చేసుకోనూలేక, వైదికుల ఈశ్వరతత్వాన్ని వదలుకోనూలేక, బౌద్ధుల సమతావాదాన్ని ఆమోదించనూలేక, వైదికుల కులతత్వాన్ని విడవనూలేక, రెండు తత్వాల్లోని బురదను కలగాపులగం చేసి, గౌడపాదుణ్ణి కాపీకొట్టి, అద్వైత కషాయాన్ని వడ్డించిన శంకరుణ్ణి ఆధునిక విజ్ఞానశాస్త్రం సహాయంతో

సమర్థించబూనడం మతిస్థిమితం వున్నవారు చేసే సాహసం కాదు.

ఈ సందర్భంగా శంకరుణ్ణి గురించి ప్రసిద్ధభౌతికవాస్తవికవాది ఎం.ఎన్. రాయ్ అంచనాను ప్రస్తావించుకోవడం సముచితమనిపిస్తుంది.

Sankara was one of the greatest theo ogians of all time. But, socially, he was a calam'ty. He was the ideolog'st of the counter - revolut'on which was the blackest chapter and misfortune of Ind an H story. He celebrated the Sraddha of Buddhism and since that funeral ceremony the history of India has been such a stunted growth as stultified and prevented the generation of revolutionary force for a long time to come' (Scient fic Po itics)

దీన్నిప్రమాణంగా నేనుఉదహరించడంలేదు. కాని,ఈఅంచనాను ముందుంచుకొని, శంకరుని అనంతరం వచ్చిన మతాచార్యుల వ్యాఖ్యానాలను దృష్టిలో వుంచుకొని శంకరుడికి విదేశీయులిచ్చిన సర్టిఫికెట్ల విలువ నిర్ణయించవలసి వుంది. రాయ్ చెప్పినట్లు శంకరుడు గొప్ప ఆస్తికుడు కావచ్చు. కాని, గొప్ప తాత్వికుడు మాత్రం కాదు. సాంఘికంగా అతను గొప్ప ప్రమాదకారుడైనాడు.భారతదేశ చరిత్రలో అంధయుగానికి, విప్లవ ప్రతీఘాతకతకు ఆయన సైద్ధాంతిక నాయకుడు. బౌద్ధానికి శ్రాద్ధం పెట్టినవాడు ఆయనే. ఆ క్షణం నుంచి భారత చరిత్ర కుంటినడక నడిచింది. ఆ కారణంగానే ఈ దేశంలో చాలా కాలందాకా విప్లవ శక్తులు ప్రాదుర్భవించలేదు.

# 9. చరిత్రలో మొదటి భావవిప్లవం

ప్రపంచంలో మొట్టమొదటి భావవిప్లవం 2500 సంవత్సరాలకు పూర్వం భారత దేశంలోనే జరిగింది.

ఆనాడు ఈ దేశంలో బయలుదేరిన చార్వాక, జైన, బౌద్ధతత్వాలు భావ విప్లవోద్యమాలే కాని, భావపునర్వికాసోద్యమాలు (రినైజాన్స్) కావు. అవి ప్రాకృత వైదిక సమాజంలో నాటి వరకు చలామణిలో వున్న భావజాలాన్ని, ఉచ్చనీచ తార తమ్యాలతో కూడిన సామాజికవ్యవస్థను వ్యతిరేకించి నూతన విధానాలను ప్రతి పాదించినై. అందుకు ఏ పూర్వస్థితినుంచీ ఆ ఉద్యమకారులు ఉత్తేజాన్ని పొందలేదు. తమ తత్వాలకు బాసటగా వారు ఏ పూర్వులనూ ప్రమాణించ లేదు. భావవివేచనే వారి విప్లవాలకు మూలం. అందులో, బహుశ అన్నిటికంటే పూర్వం బయలుదేరిన చార్వాకం పూర్తిగా నాస్తిక భౌతికవాదం కాగా, జైన బౌద్ధాలు నిరీశ్వర సామాజిక విధానాలు. బౌద్ధం ప్రపంచంలో మొట్టమొదటి మిషనరీమతం కూడా. అది బోధకుల్ని తయారుచేసి, ధార్మికసంస్థల్ని స్థాపించి, సంఘారామాలు నెలకొల్పి, విస్తృత సాంఘికోద్యమంగా దేశమంతటా తన ధర్మాన్ని పరచి, ఆసియాఖండమంతటావ్యాపించి దాదాపు వెయ్యి సంవత్సరాలు బలమైన జీవనతత్వంగా వెలుగొందింది.

సిద్ధాంత పూర్వకంగా వైదికం అవైదికాలను ఏమీ చేయలేక పోయింది. కాని, అనంతరం వైదికం చాటున బయలుదేరిన విప్లవ ప్రతీఘాతక హైందవం (బ్రాహ్మణమతం) అవైదికశాఖలన్నిటినీ చావు దెబ్బ కొట్టింది. ఫలితంగా, బౌద్ధుల కాలంలో పెంపొందిన తత్వజ్ఞానం, వైద్యవిజ్ఞానం, ఇతర శాస్త్రాలు, అన్నీ మరుగున పడి పోయాయి. పౌరాణిక సాహిత్యం, నడమంత్రపు వేదాంతం, భక్తిఉద్యమాలు భారత సమాజాన్ని చైతన్యరహితం చేసి, మౌఢ్యంలో కూరివేశాయి. ఆ అధోగతి నుంచి భారతప్రజ ఇంతవరకు తేరుకోలేదు.

ఇక్కడ అజ్ఞాన స్థాపన జరిగిన తరుణంలో యూరపులో రినై జాన్స్ బయలు దేరింది. అది ఆధునిక విజ్ఞానశాస్త్రాన్నీ, దార్శనిక విజ్ఞానాన్నీ ప్రోత్సహించింది. ప్రపంచ సాహిత్యంలోని అన్ని వైఖరులనూ అధ్యయనంచేసి నూతన మానవ విలువలను మన ముందుంచింది. ఈ నాడు మనం తిరిగి వెనక్కుచూచి స్ఫూర్తి పొందడానికి మన పూర్వులు మన కోసం దాచివుంచిన కాణాచి యేమీలేదు. కాబట్టి, మనం యీనాటి ప్రపంచంలో అత్యున్నత విజ్ఞానం యెక్కడవుందో, ఆ స్థాయినుంచి ముందుకు సాగవలసి వుంది. రినై జాన్స్ పేరుతో వెనక్కు చూడవలసిన అవసరమూ,

ఆ వంకతో పాతశ్లోకాలకు కొత్త అర్థాలు వెదకవలసిన అవసరమూ మనకు లేదు. మనం ఆ అర్థాలను వెదకేలోపల ఆధునిక విజ్ఞానం తిరిగి మనకు అందనంత దూరం ముందుకు దూసుకుపోతుంది.

## రివైవలిస్టు పన్నాగాలు

మాటలకున్న అసలు అర్థాలను వదలి, ఏవో కొత్త అర్థాలు కల్పించి, సనాతనాన్ని అధునాతనంగా నిరూపించడానికి చేసే ప్రయత్నాల్లో నిజాయితీలోపం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. హిందూ జాతీయ వాదాన్ని, మత పునరుజ్జీవన వాదాన్ని భారత జాతీయవాదంగా ప్రదర్శించడానికి ప్రయత్నించే వారిలో ఆ స్వరూపం నగ్నంగా దర్శన మిస్తుంది.

నిజానికి, జైమిని పూర్వమీమాంస (2621 సూత్రాలు) శ్రుతుల (వేదాలు) సూత్రీకరణే నన్నారు. బాదరాయణుడి ఉత్తరమీమాంస (555 సూత్రాలు) శ్రుతుల (ఉపనిషత్తుల) సూత్రీకరణే నన్నారు. "శ్రుతేశ్చ, శ్రుతత్వాశ్చ" అని కొట్టుకున్న బాదరాయణుడు జైమినుల వారి పూర్వమీమాంసను తిరస్కరించాడు. దైవంతో నిమిత్తంలేకుండా యజ్ఞయాగాదికర్మలద్వారా అన్నిటినీ సాధించగలమంటుంది కాబట్టి, పూర్వమీమాంస నాస్తికమని వైదాంతికుల అభిప్రాయం. ఉత్తరమీమాంస ఆస్తికమని చాలమంది అంటారుకాని, దానిపై శంకరుడి భాష్యం నాస్తికమని ద్వైతులంటారు.

మతాచార్యులంతా భాష్యాలు వ్రాసిన భగవద్గీత అహింసను సుగుణంగా చెప్పడంలో బౌద్ధాన్ని కాపీకొట్టినా, గీతధ్యేయం హింస అనేది నిర్వివాదం. దానిపరమావధి జనసంహారమని దాని ఆముఖం చూచిన ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది.

ఆ గీత ఒకప్రక్క నిష్కామకర్మను బోధించినా, "చస్తే స్వర్గభోగాలు చంపితే రాజ్యభోగాలు లభిస్తాయని" (హతోవాప్రాప్స్యపి స్వర్గం జిత్వా, నాభోక్ష్యసే మహీమ్, 2-33) మరోప్రక్క కర్మఫలాన్ని ఆశపెట్టింది.

ఇలాంటి వైరుధ్యాలను గీతనుంచి మరెన్నయినా పేర్కొనవచ్చు, వైరుధ్యాలు కోకొల్లలుగా వుండడం వల్లనే శంకర, రామానుజ, మధ్వాదులు ఎవరి సిద్ధాంతాలకు అనుగుణంగా వారు గీత భాష్యాన్ని వ్రాసుకోగలిగారు.

నయాలచేత భౌతికవాదిగా, నాస్తికుడుగా, విప్లవకారుడుగా కీర్తించబడ్డ శంకరుడు భగవద్గీతలోని వైరుధ్యాలను సమన్వయం చేయడానికి వ్యర్థప్రయత్నం చేశాడు. శంకరుడిలోనూ అవకాశవాద వైరుధ్యాలు అనేకం వున్నాయి. సాంఖ్య,

వైశేషిక, చార్వాకాదులను ఖండించడానికి భావవాదాన్ని ఆశ్రయించిన శంకరుడు బౌద్ధుల విజ్ఞాన (భావ) వాదాన్ని ఖండించడం కోసం తన ఆభాససూత్రాన్నికూడా వదలుకొని, ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆశ్రయించాడు. (బ్ర.సూ.భా, 2-2-28). అంతమాత్రాన ఆయన సాంఖ్య. వైశేషిక, చార్వాకాదుల ప్రత్యక్ష ప్రమాణవాదాన్ని ఆమోదించాడని కాదు. వీరి వాదాన్ని అడ్డం పెట్టుకొని వారి వాదాన్నీ, వారి వాదాన్ని అడ్డం పెట్టుకొని వీరి వాదాన్నీ ఖండించడం శంకరుడి విమర్శనా విన్యాస లక్షణం. బ్రహ్మసూత్రాల్లోనూ, దాని భాష్యంలోనూ సాంఖ్య వైశేషికాదుల్నీ, వాటి ప్రత్యక్ష ప్రమాణ వాదాన్నీ, నిరాకరించడమే ప్రధానభాగం. ఆరంభంలోనే "ఈక్షతేర్నాశబ్దం" (1-15) సూత్రానికి భాష్యం చెపుతూ, అక్కడ 'ఈక్షతి'కి ప్రత్యక్షం (Seeing) అనికాక, ఆలోచించడం (thinking) అని అర్థంచెప్పి "ప్రధానం (పదార్థం) విశ్వానికి కారణ మని ఉపనిషత్తులు అమోదించలేదు" అని వ్యాఖ్యానించాడు.

సాంఖ్యాదుల పేర్లెత్తి శంకరుడు చేసిన ఖండన కొంత లోగా చూచాం. వ్యాసవిస్తరభీతివల్ల మరికొంత చేయలేకపోయాం. సాంఖ్యం పదార్థం (ప్రధానం) నుంచి ప్రారంభం కాగా, శంకరాద్వైతం బ్రహ్మం నుంచి ప్రారంభమైంది. సాంఖ్యం బ్రహ్మాన్ని తిరస్కరించగా, శంకరాద్వైతం (బ్రహ్మసూత్రాలున్నూ) ప్రధానాన్ని తిరస్కరించింది. ఈ విషయాలను విస్మరించి, "కపిలుని సాంఖ్యదర్శనాన్ని తీసుకొని శంకరుడు తన అద్వైతాన్ని అభివృద్ధి చేసుకొన్నా" డనడం అజ్ఞానమవుతుంది.

" ప్రధానమల్లుణి చిత్తుచేస్తే పిల్లవస్తాదులు కకావికలైనట్లు-సాంఖ్యాన్ని పూర్వపక్షం చేస్తే మిగతా వాదాలన్నీ దాసోహమంటా" యన్న శంకరుడు సాంఖ్యాన్ని తీసుకున్నాడనడం హాస్యాస్పదమే కాక, అవకాశవాదంకూడా. ఎందుకంటే, అధునికులంతా సాంఖ్యాన్ని భౌతికవాదదర్శనంగా ప్రస్తుతిస్తున్నారు. అందుకని శంకరుడు సాంఖ్యాన్ని తీసుకున్నాడంటున్నారు నయాలు. శంకరుడు చెడదిట్టి పడగొట్టిన బౌద్ధాన్ని సామాజిక విప్లవసిద్ధాంతంగా లోకులంతా యీనాడు గౌరవిస్తున్నారు. అందుకని శంకరుడిలో ప్రచ్ఛన్నంగా బౌద్ధం వుందనే ద్వైతుల పాతవాదాన్ని నయాలు కొత్త రేపుతున్నారు. అంటే, భావచౌర్యానికి ప్రచ్ఛన్నతను మలామా వేస్తున్నారన్నమాట !

అంతేకాదు, ఇతర సిద్ధాంతాలను ఖండించడానికి సైతం సొంత ఆలోచన చేయని శంకరుడు " ప్రతి వ్యక్తినీ ఆలోచించమన్నా"డని కొత్తవార్త పట్టుకొచ్చారు. ఇలాంటి అబద్ధాలన్నిటినీ బొంతగా కుట్టి, శంకరుడి మూపుమీద పెట్టి అయన్ని గంగి రెద్దుగా మార్చివేస్తున్నారు. ఈ వికారమంతా రివైవలిస్టు కార్యక్రమంలో భాగమే.

ఇంతకుముందు రివైవలిజం సంస్కరణవాదం పేరుతో ప్రచారం కాగా, ఇప్పుడది హేతువాదం, భౌతికవాదం ముసుగులో తలెత్తడానికి తాబేదార్లను కూడగట్టుకొంటున్నది. ఈ ప్రయత్నాన్ని నిరోధించవలసిన బాధ్యత హేతువాదులమీద వున్నది. శంకరుణ్ణి ఆమోదించడమంటే ఉపనిషత్తుల్ని, బ్రహ్మసూత్రాలను, కిచిడీ భగవద్గీతను ఆమోదించడమే. భాష్యాలను ఆమోదించినపుడు, వాటి మూలాలను ఆమోదించడంలో విడ్డూరమేముంది? వాటిని ఆమోదించే దుర్గతి హేతువాదులకు, భౌతికవాదులకు పట్టదు. శంకరుణ్ణి భౌతికవాదిగా నిలబెట్టాలనుకొనే నయాలు ఆ మూలాలను అమోదిస్తున్నట్లేనా?

## అభినయ శాంకరం

"అహంబ్రహ్మాస్మి" అనే వాక్యాన్ని రూపొందించినవాడు శంకరుడు కాకపోయినా, "నేనే బ్రహ్మం" అనే అహంకార వాదానికి అతన్ని ప్రతీకగా తీసుకుంటారు. ఈ మధ్య కొందరు అవధూతలు బయలు దేరి శంకరపాత్రను అభినయిస్తున్నారు. శంకరుడు భౌతిక భావవాదాలమధ్య సమన్వయం కుదిర్చాడని వాదిస్తున్నారు. తామా సమన్వయాన్ని కట్టముడిదాక కొనసాగించడానికి అవతరించామని అహంకరిస్తున్నారు.

వైరుధ్యాలను సమన్వయం చేయడంలో తిరిగి వైరుధ్యాలు తలెత్తాయంటే, అది సమన్వయం కాదనే అర్థం. నిజానికి వైరుధ్యాల మధ్య సమన్వయం కుదరదు. సమన్వయ సాధ్యమైనవి వైరుధ్యాలు కావు, వైరుధ్యాలతో సమన్వయ గారడీచేసే వారిలో అనుకోని వైరుధ్యాలు దొర్లుకొస్తాయి, ఒక ప్రక్క "శంకరుడు చెప్పిన దానికంటె పైన చెప్పవలసిందేమీ లేదనీ, అంతా శంకరుడే చెప్పాడనీ" అంటూనే, మరోప్రక్క "ఆయన మిగిల్చిపోయిన తాత్విక విషయాన్ని సమాజానికి అన్వయించి ప్రచారం చేసి, ఆయన ఆశయాన్ని పూర్తి చేయడానికి" తా మవతరించామంటారు అభినయ శాంకరులు. అలానే, "దేవుడిని శంకరుడు నిరాకరించాడ"దని ఒకవైపు. "దైవం నిరాకారమని, నిర్గుణమని తన తర్కంతో శంకరుడు నిరూపించా" దని మరోవైపు వాదిస్తున్నారు.

అంతటితోవూరుకోక, "అందరిలోనూ వున్నది ఒకే జీవన తత్వమనే సాంఘిక సమానత్వ సూత్రాన్ని శంకరుడు అంగీకరించాడనీ; అందువల్ల బుద్ధుని తాత్విక సూత్రాన్ని శంకరుడు మరో రూపంలో చెప్పినట్లయిందనీ; సృష్టికర్తను, తద్వారా సృష్టివాదాన్ని వ్యతిరేకించిన శంకరుడు పరోక్షంగా యథార్థమైన పరిణామవాదాన్ని

అంగీకరించినట్లయిందనీ; సృష్టించే సృష్టికర్త లేనప్పుడు జగత్తుకు కారణం పదార్థమవుతుంది గనుక ఆకాశాది పంచభూత పరిణామ ఫలితమే ఈ జగత్తనీ చెప్పి, పరిణామంలో అంతా మారిపోతూ వున్నది గనుక జగత్తు అసత్యమని (మిధ్య) చెప్పి; మారనిది (కారణబ్రహ్మము) వున్నదని, అది సత్యమని శంకరుడు చెప్పాడనీ" శంకరుడి తత్వంగా యేకరువు పెట్టారు.

చివరకు "బ్రహ్మం స్థానంలో పదార్థం అనే పదాన్ని మార్చి చెప్పుకుంటే సమన్వయం సరిపోతుందనీ, అద్వైతంలో చెప్పబడిన విషయాలను భౌతికశాస్త్ర విషయాలతో సమన్వయం చేసి శంకరాద్వైతాన్ని వుద్ధరించాలనీ" అసలు విషయం బయట పెట్టారు.

ఇలా అద్వైత బ్రహ్మపంకిలంలో పడి గిలగిల తన్నుకుంటే, అంటుకునేది బ్రహ్మ బురదేకాని, భౌతికవాదం కాదు.

ఆ వాక్యాల్లోని గుడ్డితర్కమంతా అసంబద్ధమైనది. తీర్పులన్నీ అబద్ధాలు. మాటలకు అర్థాలు తెలిసినవారు శంకరుడికి సాంఘిక సమానత్వ సూత్రధారణ చేయరు. సృష్టివాదాన్ని కాదన్నట్లే కాదని, బ్రహ్మవాదాన్ని చేపట్టిన శంకరుణ్ణి పరిణామవాది, పదార్థవాది అనడం అవివేకం.

సృష్టివాదం గురించి చెపుతూ బ్రహ్మసూత్ర (2-3-13) భాష్యంలో శంకరుడు బృహదారణ్యకాన్ని (3-7-3),తైత్తరీయాన్ని (2-6-1), చాందోగ్యాన్ని (6-2-3) ప్రమాణించి సృష్టికి దైవసంకల్పం కారణమన్న వాదాన్ని సమర్థించాడు. బైబిలులో దైవం సృష్టిఅగుగాక అని "అంటే", ఉపనిషత్తుల్లో బ్రహ్మం సృష్టి అగుగాక అని "అనుకొన్నందువల్ల" సృష్టి జరిగింది. అంతేతేడా. ఒకచోట అన్నారు, మరొకచోట అనుకొన్నారు.

నిజం చెప్పాలంటే పదార్థం (ప్రధానం) అనాదిఅనీ, దానికి మరోమూలం వుండదనీ (మూలేమూలాభావదమూలంమూలమ్, 1-67), లేనిదాని నుంచి యేమీ రాదనీ (నావస్తునోవస్తుసిద్ధిః, 1-78) అన్న సాంఖ్యమూ-కారణంలేనిది కావడం వల్ల ప్రకృతి నిత్యమైందనీ (సదకారణవన్నిత్యమ్) (4-1-1), దాని వ్యక్తీకరణమే కార్యమనీ (తస్యకార్యంలింగం, (4-1-2) అన్న వైశేషికమూ భౌతికవాదాలు కావాలి కాని, వున్నది మిధ్య, లేనిది సత్యం అంటూ సాంఖ్యవైశేషికాలను ఖండించిన శాంకరం భౌతికవాదమెలా అవుతుంది?

పదార్థ దశలను వివిధవస్తువులుగా మనం గుర్తిస్తున్నంత మాత్రాన, వాటికి

నిత్యానిత్యతలను అంటగట్టటం తలతిక్క పద్ధతి అవుతుంది. వస్తువుకాని పదార్థమూ, పదార్థంకాని వస్తువూ వుంటాయని అనుకోవడం అపోహ. ఏ దశలోని పదార్థం ఆ దశలోని వస్తువుకూడా కాబట్టి- పదార్థం నిత్యం, వస్తువు అనిత్యం అనేది అర్థరహితమైన తికమక. మారని దొకటి వున్నదనుకోవడం, దాన్ని కారణబ్రహ్మమనడం అవివేకం.

అభినయాల నాటుతాత్వికాభినేతృత్వం ఇంకా యెంతదాక పెరిగిందంటే, "బుద్ధుడు, ఎం.ఎన్. రాయ్ పూర్తిగా భౌతిక వాదులనీ; మధ్వ, రామానుజాదులు పూర్తిగా అధ్యాత్మిక వాదులనీ; " పరస్పరవిరుద్ధమైన" ఆ రెండు సిద్ధాంతాలకు మధ్యే మార్గం చెప్పినవాడు శంకరుడనీ" వక్కాణిస్తున్నారు. ఇక్కడ అసందర్భంగా ఎం.ఎన్.రాయ్ పేరు యెందుకు తీసుకువచ్చారో, ఆ గొలుసులో మార్క్స్ పేరు కూడా యెందుకు యిరికించలేదో అర్థంకాదు. కాక, శంకరుడుండగా, ఇంకా మార్క్స్ ఎందుకులే అనుకున్నారో, యేమో! శంకరుడి భావవిప్లవ విద్రోహాన్ని మధ్యేమార్గంగా తేల్చే ప్రయత్నం శుద్ధ అవివేకం.

బ్రహ్మం, పదార్థం ఒక్కటేననుకొనే అవివేకం హేతువాదులవద్ద వుండదు, బ్రహ్మవాదానికీ, భౌతికవాదానికీ వున్న తేడా అంతా ఆ పదాల్లోనూ, వాటి వెనకవున్న అర్థాల్లోనూ వుంది. ఆ తేడా అత్యంత మౌలికమైనదని అభినయమూర్తులకు అర్థం కావడంలేదు. అవి రెండూ పరస్పర విరుద్ధధ్రువాలు - వాటిని సమన్వయం చేయాలనే తాపత్రయం చిత్తచాంచల్యానికి లక్షణం.

భౌతికవాదశాఖలు పరస్పర పూరకాలుగా వుండవచ్చు కాబట్టి, వాటిలో భిన్న తరహాలవాటిని సమన్వయం చేయవచ్చు. అలానే భిన్నతరహాల భావవాదశాఖలనూ సమన్వయం చేసుకోవచ్చు. కానీ, భౌతిక వాదానికీ-భావవాదానికీ మధ్య సమన్వయం ఎలా సాధ్యం? నాస్తికత్వానికీ, ఆస్తికత్వానికీ మధ్య సమన్వయం సాధ్యమా? పాంచ భౌతికవాదాన్ని ఆధునిక భౌతికవాదంగా పరిగణించే వారికీ, శంకరాద్వైతాన్ని ఆధునిక విజ్ఞానంతో సమన్వయం చేయాలనుకొనే వారికీ తాత్విక భ్రమలు హెచ్చు. పదార్థమనేది బ్రహ్మం యొక్క ఆభాస తప్ప వాస్తవం కాదనే శంకరాద్వైతానికీ, పదార్థంయొక్క ఒకానొక దశలో అభివ్యక్తమయ్యే ప్రవృత్తే భావమనే భౌతిక వాదానికీ, సమన్వయ ప్రాతిపదిక ఎక్కడ? భౌతికవాదం వాస్తవికవాదం కాగా, భావవాదం అవాస్తవిక ఆస్తికవాద వికారం. అవి రెండూ కలిసేచోటు లేనేలేక పోగా, శంకరుడి అద్వైతమంతా ఆయనకే అర్థం కాని అయోమయం.

## ప్రపంచంలో తొలి ఫాసిస్టు వ్యవస్థ:

శంకరుడు సర్వజ్ఞుడని నిరూపించడానికి శంకర విజయాలు బూతు కథలను సైతం అల్లినై. వాటి రచయితలు వారికాలధర్మం ప్రకారం ఆ పనిచేసి వుంటారు. అభినయాలు తమ కాలధర్మం ప్రకారం వ్యష్టి సమష్టుల మధ్య యుద్ధం చేయించి శంకరుణ్ణి (మార్క్సు కంటె ముందే అవతరించిన) సమష్టివాదిగా తేల్చడానికి తాపత్రయ పడుతున్నారు. కాని, వారికి అయి చాలడం లేదు. శంకరుడిది సమష్టివాదం కాబట్టి, చాల గొప్పదని చెప్పడం వారి ఉద్దేశం. సమష్టివాదమైన కమ్యూనిజం లాగానే సమష్టి వాదమైన అద్వైతం కూడా ఆదర్శవాదమని చూపాలని అభినయాల పన్నాగం.

నిజానికి, సమష్టితత్వం మంచిదైతే జాతి,మత, కుల, వర్గవాదాలన్నీమంచివే. ఎందుకంటే, మతాలన్నీ సమష్టివాదాలే, కులవాదాలన్నీ సమష్టివాదాలే, జాతి వాదాలన్నీసమష్టి వాదాలే, వర్గవాదాలన్నీ సమష్టివాదాలే, కులకట్టుబాట్లు, వెలులు సమష్టివాద ఫలితాలే. హిందువుల వర్ణవ్యవస్థ సమష్టివాదమే. కానీ, అందులో ఏఒక్కటీ "మానవ సమష్టి వాదం" కాదన్న వాస్తవాన్ని మనం గమనించాలి. కమ్యూనిజం వర్గసమష్టివాదం, ఫాసిజం జాతి సమష్టివాదం, హైందవం అత్యంత సంకుచితమైన కులసమష్టి ఫాసిజం. మరి అద్వైతం ఆత్మ సమష్టివాదం కావాలి, అది మనుషుల్లేని ఆశరీర ఆత్మల సమష్టి వాదం. దాని ప్రకారం ఘటాకాశాలన్నీ మహాకాశంలో భాగాలే. అది ఆకాశాద్వైత వాదం కావాలి. కానీ, శంకరుడు వర్ణ సమష్టివాదాన్ని పునరుద్ధరించాడు. సమర్ధించాడు. దాని స్థిరీకరణకు కట్టుదిట్టాలు చేశాడు. ప్రపంచ చరిత్రలోనే మొదటి ఫాసిజమైన హిందూ వర్ణ వ్యవస్థను పునరుజ్జీవింపజేసి రియాక్షన్‌కు నాయకుడైనాడు. గీతాభాష్యం ద్వారా వర్ణసాంకర్యాన్ని తిరస్కరించి, శుద్ధ రక్తవాదాన్ని పునఃస్థాపించాడు. ఆధునిక యుగంలో అందరూ అసహ్యించు కుంటున్న నాజీ ఫాసిజం కంటె అధమమైనది శుద్ధ వర్ణవాదం, శుద్ధరక్తవాదం. రక్తసాంకర్యం పేరుతో మను స్మృతి లెక్క లేనన్ని కులాలను సృష్టించింది. మన ధర్మ శాస్త్రాల ప్రకారం తొలుత చండాలురు లేరు. ఇప్పుడున్న చండాలురంతా బ్రాహ్మణ స్త్రీలకు శూద్రుల వల్ల కల్గిన సంతానమని వ్రాయడానికి మన స్మృతుల కర్తలు సిగ్గుపడలేదు. (చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేనయః). ఈ నాడు, ముఖ్యంగా భారతదేశంలో, జాతుల ప్రకారం ఆలోచిస్తే శుద్ధ రక్తమనేదేలేదు. వేలాది సంవత్సరాలుగా అనేకానేక జాతుల రక్తంతో అది సంకరమైంది. ఇంతగా రక్తసాంకర్యం, వర్ణసాంకర్యం, జాతిసాంకర్యం జరిగినా, ఇంకా యిక్కడ కులాలు, వర్ణాలు కొనసాగుతూ వుండడం శంకరుడి పన్నాగ ఫలితమే.

సమష్టి వాదమంటే 'మంద' వాదమే. మనుషుల్లేకుండా మందలుండవు.

ఉన్న మనుషుల్ని మందలుగా మార్చడం, స్వతంత్రాలోచన చేయకుండా వ్యక్తుల్ని అణచి వేయడం, జాతి మత కుల వర్గాది నిషాలకు వ్యక్తి స్వాతంత్ర్యాన్ని బలిచేయడం, స్వతంత్ర వర్తులను అయా మఠాల నుంచి వెలివేయడం, హింసించడం, కొరతవేయడం; అన్ని గుంపు వాదాలూ ఆమోదించే ప్రాధమిక సూత్రం. దాన్ని మెచ్చుకోగల మంద నాయకులు, స్వతంత్ర వ్యక్తిత్వాన్ని స్వార్ధతత్వంగా చిత్రించగల మందబుద్ధులు, ఏ మంద వాదాన్నయినా సమర్ధిస్తారు. మందవాదం నుంచే వీరపూజ పుట్టింది.

గుమ్మడికాయల దొంగల్లా బుజాలు తడవుకొని ప్రయోజనం లేదు. మార్క్సు పేరుమీదుగా మార్క్సిజం వుంది. కాని, రాయ్ పేరుమీదుగా రాయిజం లేదు. రాయ్ ప్రతిపాదించింది న్యూ హ్యూమనిజం. హ్యూమనిజాన్ని పరోక్షంగా నిందించడం కోసం హ్యూమనిస్టుల్ని రాయిస్టులని పిలవడం, రాయిస్టులు రాయ్‌ని వీరపూజ చేస్తున్నారనడం, హ్యూమనిజం కోసం డబ్బు వ్యయం చేయలేని దరిద్రులని వారిని నిందించడం రొచ్చుగుంట మనస్తత్వాన్ని సూచిస్తుంది. వెయ్యి సంవత్సరాలకుపూర్వం తనకు ముందు వెయ్యి సంవత్సరాలనాటి ప్రాకృత హైందవాన్ని వికృతీకరించి ఉద్ధరించిన శంకరుణ్ణి ఆధునిక విజ్ఞానంతో సమన్వయం చేయాలంటున్న నయాభినయాలు హ్యూమనిస్టులకు వ్యక్తి ఆరాధనాతత్వాన్ని అంటగట్టడం వివేకదౌర్భాగ్యానికిచిహ్నం. వ్యష్టి, సమష్టి, సహకారతత్వాల గురించి ఎం.ఎన్.రాయ్ చేసిన విశ్లేషణను అర్థం చేసుకోవడం అద్వైత భక్తుల తాహతుకు మించిన పని. అందునా, దురభిమానవు పొరలు కమ్మినపుడు అది అసలు సాధ్యమే కాదు. వివేకంలో మనిషిస్థాయికి ఎదిగితేకాని, వాటి మధ్య సంబంధం అర్థం కాదు.

మందతత్వం నుంచి వేరు కాగల్గడమే మనిషిలోని ప్రత్యేకత. అది పరిణామదశలో మనిషికి సంక్రమించిన విశిష్ట లక్షణం. జంతు స్వభావ అవశేషాలు కొన్ని మనిషిలో వున్నమాట వాస్తవమే. అందులో మందస్వభావం ఒకటి. మానవత వైపుగా మరికొంత పూర్ణత సాధించుకోడానికి మనిషి ఆ మంద స్వభావాన్ని అధిగమించవలసి వుంది. బందెలదొడ్డి వాదం నుంచి విముక్తి చేయడమంటే, స్వైరాన్ని సమర్ధించినట్లు కాదు. స్వైరాన్ని ప్రోత్సహించేది సమష్టితత్వమే. సమష్టితత్వం నాయకుల్లో స్వైరాన్ని పోషిస్తుంది. అందుకే నాయకులు దాన్ని పోషిస్తారు. బలవంతులు బలహీనుల్ని బానిసలుగా మార్చడానికి సమష్టివాదం సులువైన మార్గం.

వ్యష్టితత్వం వ్యక్తులమధ్య సహకారపూర్వక సంబంధాలను ప్రతిపాదించడం ద్వారా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, భద్రతను, అభివృద్ధిని ఆకాంక్షిస్తుంది. స్వయం నిర్ణయావకాశం ఇచ్చి. స్వావలంబనను ప్రోత్సహిస్తుంది. అది స్వైరం కాదు. స్వైరానికి

విరుద్ధం. స్వతంత్ర వ్యక్తుల అభివృద్ధిగా తప్ప, సమష్టి అభివృద్ధి అనే దానికి వేరే అర్థం లేదు. సమష్టివాదాన్ని వ్యాపారంగా మార్చుకొనేవారికి--అధికారం, ధనం, హోదా సంపాదించుకోడానికి నిచ్చెనగా దాన్ని వినియోగించుకొనేవారికి –వ్యక్తి స్వాతంత్ర్యవాదంలోని మానవత్వం, సహకారవాదంలోని ఔచిత్యం, మానవ సమతా ప్రతిపత్తి ఎలా అర్థమవుతాయి? సమష్టితత్వంలో సామ్రాట్ తత్వం యిమిడివుందనీ, అన్నిరాజ్యాలూ ఒక రాజ్యానికి లోబడివున్నట్లు అందరి వ్యక్తిత్వాలు ఒకరి వ్యక్తిత్వానికి లోబడి వుండడమే సమష్టితత్వంలోని రహస్యమనీ ఎలా తెలుస్తుంది? మంద తత్వాన్ని అధిగమించడానికే ఎం.ఎన్.రాయ్. సహకారపూర్వక సామాజిక సంబంధాలను ప్రతిపాదించాడు.

ఉన్న ప్రపంచాన్ని చూడలేని శంకరుడు బ్రహ్మాంధుడు. కాగా, అతనినుంచి అంధత్వాన్ని వారసత్వంగా పొందిన నయాశాంకరులకు జాతి, మత, కుల, వర్గ తత్వాల్లోని సమష్టి దుష్ఫలితాలు కనిపించవు. శంకరాద్వైతంలో భౌతికవాదాన్ని చూచేవారికి సమష్టివాదంలో స్వేచ్ఛ కనిపించడంలో అబ్బురమేముంది? అందుకే, భారతదేశంలో అభివృద్ధి నిరోధకపాత్రను విజయవంతంగా నిర్వహించి, ఇండియన్ రినైజాన్స్‌ను వెనక్కునెట్టిన శంకరాచార్యుడి కోపు అంత కష్టపడి మోస్తున్నారు.

స్వేచ్ఛను మతవాదుల మోక్షంతో యీక్వేట్(సమానం) చేయడం సరికాదు. “స్వేచ్ఛ ఉత్తమమైనది, వ్యక్తి స్వేచ్ఛ అధమమైనది” అని సూత్రం పేనేవారికి స్వేచ్ఛ అంటే యేమిటో బొత్తుగా తెలియదనే చెప్పాలి.

స్వేచ్ఛ నిరుక్త బ్రహ్మపదార్థం కాదు, అది ఐహికమేకాని, పారలౌకికంకాదు.

స్వేచ్ఛ అంటే వ్యక్తిస్వేచ్ఛే; అది వాస్తవంగా వ్యక్తుల అనుభవంలోకి వచ్చేదే. అజ్ఞానంనుంచి, అసత్యంనుంచి, ఆకలినుంచి, నిర్బంధంనుంచి, అభావుకతనుంచి, అవినీతినుంచి వాస్తవంగా వ్యక్తులుగా పొందే స్వేచ్ఛే.

అది యీ లోకంలో స్వేచ్ఛేకాని, ఈ లోకంనుంచి స్వేచ్ఛ కాదు.

వ్యక్తి స్వేచ్ఛకాకుండా వేరే స్వేచ్ఛ లేదు. దానికి అతిరిక్తంగా స్వేచ్ఛ వున్నదని భావించడం అర్థరహితం.

బానిస సమాజాలన్నీ సమష్టి సమాజాలే. వాటిలోవున్న స్వేచ్ఛ బానిస యజమానులకే పరిమితం. సమాజంలోని వ్యక్తులంతా స్వేచ్ఛాపరులైతే, దాన్ని స్వేచ్ఛా సమాజమంటాం. వ్యక్తుల అనుభవంలోకి రాకుండా వుండే సమాజస్వేచ్ఛ అనేదిలేదు.

వ్యక్తిస్వేచ్ఛావాదం సమాజస్వేచ్ఛావాదం కాగా, సమష్టివాదం మూకానియంతృత్వ వాదం.

సమష్టివాదంకాని మతవాదం లేదు. జాతి, మత, కుల, వర్గ వాదాలన్నీ మూకా సమష్టివాదాలే. మతాన్ని నిరాకరించే మూకా సమష్టివాదం మరో మతమవుతుంది. అది ఒక మతం మరో మతాన్ని నిరాకరించినట్లవుతుంది. మత సూత్రాలను దాగి స్వతంత్రంగా ఆలోచించే హక్కును అంగీకరించే మతమే లేదు. సమష్టి వాదాలన్నీ స్వతంత్రయోచనను అనుమతించవు.

మతం ప్రకారం స్వతంత్ర వివేచన పాపం. సమష్టి రాజకీయవాదం ప్రకారం స్వతంత్ర వివేచన నేరం.

సమష్టి పేరుతో నాయకులు ప్రజలమీద పెత్తనం చేసినవన్నీ బానిస సమాజాలు. ప్రజా శ్రేయస్సు పేరుతో ఇప్పుడు సమష్టివాదం కొనసాగించేవారు కొత్తతరహా దోపిడి దారులు – వాళ్ళు ప్రజల స్వేచ్ఛను దోపిడి చేస్తారు. ఈ కొత్తరకం దోపిడివాదం ఇప్పుడు స్వేచ్ఛావాదంగా ప్రచారంలో వుంది.

పూర్వం మతాధిపతులు, రాజులుకూడా ఆనాటికి ప్రజానాయకులే. ప్రజలు భద్రత నెపంతో ఐచ్ఛిక బానిసత్వంలో ప్రవేశించారు. ఈ నాడు ఆర్థిక భద్రత నెపంతో ఐచ్ఛిక బానిసత్వాన్ని వరిస్తున్నవారు కూడా వున్నారు. వారు దాన్ని భద్రతగా భ్రమిస్తున్నారు. దాన్ని ఆవశ్యకమైన చెడ్డగా సమర్థించేవారున్నారు. చెడుయెన్నడూ ఆవశ్యకం కాదు. చెడును నిరోధించి, మంచివైపు కదలడమే మన కర్తవ్యం. ఈ సమష్టివాదం ఆధునిక బ్రహ్మావాదం.

## వదలని పీడ

చరిత్రలో శంకరాచార్యుడు నిర్వహించిన పాత్ర గురించి ఎం. ఎన్. రాయ్ ఇలా అన్నాడు :

'Brahminical react on, reasserting itself in the scholasticism of Sankaracharya, choked all spiritual progress so successfully that a renaissance of the ancient liberat ng thought was delayed until it was too late'. (Materialism,P.103)

ప్రాచీన భౌతికవాదశాఖలు, విముక్తితత్వాలు చాల గొప్పవయిన మాట నిజమే. కాని, అవసరమైనప్పుడు అవి భారత సమాజానికి అందకుండా పోయినై.

ఇప్పుడు వాటిని త్రవ్వి తెచ్చుకున్నందువల్ల ప్రయోజనం శూన్యం. వాటికి కాలదోషం పట్టింది. కాలదోషం పట్టిందాక వాటిని వూపిరి సల్పకుండ అణచిపెట్టి వుంచింది శంకరుడితో ప్రారంభమైన యాంటీరినైజాన్స్ సంప్రదాయం. ఆ దశలన్నిటినీ దాటివచ్చిన విజ్ఞానం యీనాడు మనకు లభిస్తుంది. దాన్ని పట్టుకోవడమే ఈ నాటి రినైజాన్స్‌కు అర్థం.

శంకరుడు పునరుద్ధరించిన బ్రాహ్మణమతతత్వం యిప్పటికీ తన విప్లవ ప్రతీఘాతక దుష్టపాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూనే వున్నది. దాన్ని నిర్మూలించడంతో ఈ నాటి భావవిప్లవం ప్రారంభం కావాలి. అదే నేటి రినైజాన్స్.

శంకరుడు నాశనం చేసిన తాత్వికశాఖలను పునరుద్ధరించుకుంటూ కూర్చోవడం ఈ నాడు రినైజాన్స్ అనిపించుకోదు. కాగా, శంకరుడి రియాక్షన్‌ని తలచుకొనే పనే లేదు. రినైజాన్స్ పేరుతో ప్రాచీనతను పునరుద్ధరించడం ప్రారంభిస్తే, అది చివరకు విప్లవవిద్రోహశక్తుల పునరుద్ధరణకే దారితీస్తుంది. ఆ వైఖరి అత్యంత ప్రమాదకరం. ఇప్పుడు నయాశాంకరులు, అభినయశాంకరులు పునరుజ్జీవింపజేయాలంటున్నది విప్లవ ప్రతి ఘాతకతత్వాన్నే. ఈ విషయం మనం గమనించాలి.

## వీడని నీడలు

ఈ దేశంలో తాత్విక విప్లవాన్ని నిరోధించిన రియాక్షనరీ శక్తులకు "మహా మేధావు"లని సర్టిఫికెట్లిచ్చిన పాశ్చాత్య మతవాదులున్నమాట నిజం. మనవారా పాశ్చాత్యుల్ని నిందిస్తూనే వారిచ్చే సర్టిఫికెట్లకు ఎనలేని గౌరవం యిస్తారు. ఈ దేశంలో వివేకానందుణ్ణి హీరోని చేసినవికూడా అలాంటి సర్టిఫికెట్లే. ఇండియన్ రినైజాన్స్‌ను వెనక్కు నెట్టడంలో వెయ్యి సంవత్సరాలకు పూర్వం శంకరుడు ప్రారంభించిన వుద్యమాన్ని దాదాపు 100 సంవత్సరాల క్రితం వివేకానందుడు తిరిగి కొత్త రేపాడు. విదేశీపాలన క్రిందవున్న భారతజాతీయవాదులకు ఆనాడది ఇంపుగానే వుంది. కారణం అందులో పాశ్చాత్య వ్యతిరేక మసాలా కూడా వుంది. ఐతే, కులతత్వం భారతదేశ ఐక్యతను కాపాడిందన్న ఘనుడీ వివేకానందుడన్న విషయాన్ని మనం విస్మరించడానికి వీలులేదు. వర్ణవ్యవస్థ పునఃస్థాపన ద్వారా జాతీయైక్యత సాధించాడన్న బిరుదు శంకరుడికి వుండనే వుంది. నిజంగానే ఇక్కడ ఐక్యత వుంటే, అనేకకోట్ల జనాభావున్న యీ దేశాన్ని కొద్ది వందలమంది అరబ్‌సైనికులు ఎలా జయించ గలిగారు? దాదాపు 700 యేళ్ళపాటు భారతీయుల్ని ఎలా పరిపాలించ గలిగారు? ఆ తర్వాత కొద్దివందల మంది

యూరోపియనులు-పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు జాతీయులు-వేలాది మైళ్ళ దూరం నుంచి వచ్చి, మార్చుకొని మార్చుకొని, తలా ఒకతన్ను ఎలా తన్నగలిగారు? ఇంత విశాల దేశాన్ని ఎలా స్వాధీనం చేసుకోగలిగారు? దాదాపు ఒకటిన్నర శతాబ్ది కాలంపాటు ఎలా పరిపాలించగలిగారు? అంతేకాదు, పరదేశాల నుంచి వచ్చిన కొద్దివందల మంది మ్లేచ్ఛులు కోట్లాదిగా యిక్కడి ప్రజల్ని ఇస్లాం, క్రైస్తవ విశ్వాసాలలోకి మారిస్తే-అప్పుడీ దేశంలోని సాంఘిక ఐక్యత యేమైంది? బౌద్ధం యీ దేశం [illegible] విదేశాలకు సైతం ఎగుమతికాగా, విదేశీ మతాలు యీ దేశంలోకి [illegible]తుంటే, ఈ పుణ్యభూమికి దేవుడిచ్చిన హైందవం ఏమి చేస్తూవుంది? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. సిగ్గుతో తలవంచుకోవలసిన యీ స్థితికి ఏ భారతీయ మతవాది వద్దనూ సమాధానం లేదు. మన ప్రతాపాన్ని గురించి కథలు, కావ్యాలు వ్రాసుకొని ప్రయోజనం లేదు.

బ్రాహ్మణాధిక్యత, వర్ణవ్యత్యాసం, కులతత్వం, ఇప్పటికీ ఏదో ఒక రూపంలో బ్రతికివున్నదన్న దుష్టభావం నుంచి నీచ సంతృప్తి పొందడం ఒక్కటే భారతీయుల ఐక్యతను అవి కాపాడాయన్న ఆలోచనకు హిందూమతవాదుల్ని ప్రలోభపెడుతున్నది. ఈ సమాజంలోని అనైక్యతకూ, ఈ దేశంలో విదేశీమతాల ప్రవేశానికీ వర్ణవ్యవస్థ మూలమని గ్రహించలేని వాగాడంబర పాండిత్యం వివేకానందుడిలో చాలవుంది. బ్రాహ్మణ మతంలోని ముఖ్య సూత్రాలన్నిటినీ ఆయన సమర్థించాడు. కర్మసిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, బహుదేవతావాదం, విగ్రహారాధన, వర్ణాశ్రమాచార ధర్మాలు, మనుస్మృతి శాసనాలు- ఒకటేమిటి? - హైందవంలోవున్న మురికినంతా సమర్థించడం కోసం దేశమంతటా 84 మతాలు, కేంద్రాలు, విదేశాల్లో 31 సంఘాలు స్థాపించి హిందూ రివైవలిజానికి ప్రాణప్రతిష్ట చేసాడు. ఆయన భావాల్లో ఒకదానికీ మరొక దానికీ పొంతనలేదు. ఆ నోటితో యెవరిని పొగడుతాడో వారినే తెగడడం ఆయనకు పరిపాటి. చాల సందర్భాల్లో ఆయనలో ఉద్వేగం తప్ప, స్పష్టమైన అవగాహన వున్నట్లు కన్పించదు. ఉద్వేగభరితమైన ప్రసంగాల్లో ఆయన బౌద్ధాన్ని ఒకతిట్టూ, నాస్తికత్వాన్ని ఒక తిట్టూ, తిట్టకుండా వుండలేక పోయాడు. భౌతికవాద దర్శనాలకూ యెడా పెడా వడ్డించాడు. ఈ నాటి ఈ దేశ దౌర్భాగ్య స్థితికి బౌద్ధమతం కారణమనే అభాండం వేయడానికి కూడా ఆయన వెనుకాడలేదు, ఒకసారి.

'Today it is the fashion to talk of Buddhisim and Buddhistic agnosticism, especially 'n the south. Little do they dream that this degradation which is with us today has been left by Buddhism'

(The Complete Works of Swami Vivekananda, Vol. III, P.216)

అంటూ ఈనాటి యీ మన పతనానికి కారణం బౌద్ధంమీద నెట్టాడు. కాని, బౌద్ధం ప్రాభవం తగ్గి హైందవం విజృంభించిన తర్వాతనే యీ దేశానికి రాజకీయ, సాంఘిక ధార్మిక, ఆర్థిక దుర్దశ ప్రారంభమైందనే విషయం చరిత్రను అవగాహన చేసుకుంటే తెలుస్తుంది. బౌద్ధులు హిందువుల చేతిలో నానా హింసలను అనుభవించి ఈ దేశం నుంచి అంతర్థానమయ్యే స్థితి దాపురించిన తర్వాతనే, శంకరుడి తర్వాత రెండువందల యేండ్లకు, క్రీ.త. 1025లో మహమ్మద్ గజినీ హిందువుల సోమనాథ దేవాలయాన్ని కొల్లగొట్టి, శివలింగాన్ని పగలగొట్టి, ఆ ముక్కల్ని పట్టుకెళ్ళి గజినీలోని జుమ్మా మసీదు వాకిలిమెట్లకు వేయించాడు. పురోహితులు దేవుడికి చెప్పుకొన్న ప్రార్థనలు, మ్లేచ్ఛులకు పెట్టిన శాపాలు, అన్నీ వమ్మయిపోయినై.

ఈ దేశంలో హైందవం క్రింద యేమేమి జరిగిందో ఇంకా మనం చాలా చెప్పుకోవచ్చు. ఈ దైన్యస్థితిని హిందువులు ఒక్క భారతదేశంలోనేకాదు, హిందువులుగా పరదేశాలు పాలించడానికి వెళ్ళిన ప్రతిచోటా చవిజూచారు. జావా, సుమత్రా, మలయాలలో శైలేంద్ర సామ్రాజ్యం (క్రీ.త. 778-13శ.); చంపాలోపాండురంగ (757-860), భృగు(800-985) వంశపాలన; కంబూజాలో రెండవ జయవర్మ (802-877), ఇంద్రవర్మ (877-1001) వంశపాలన; మధ్యజావాలో సంజయవంశ పాలన (732-928); తూర్పుజావాలో సిందోక్‌రాజ్యం (929-1007) ఇవన్నీ విదేశాల్లోని హిందూరాజ్యాలే. ఇవేకాక తూర్పు ఇండియా దీవుల్లోని మిగతా భాగాలుకూడా భారతీయుల వలసలే. బౌద్ధాన్ని అభిమానించిన శైలేంద్ర సామ్రాజ్యంతో సహా ఆ వలసలన్నిటిలోనూ బ్రాహ్మణమతం బాగా ప్రాచుర్యం పొందింది పాలకులక్కడకు ఈ దేశంనుంచి హిందూమత, సాహిత్య, సాంస్కృతిక సంప్రదాయాలను మోసుకెళ్ళారు కాని, రెండు మూడు వందల యేళ్ళలోనే అవి అక్కడ నామరూపాలులేకుండా మాసిపోయినై. మనుషులంతా సమానమేనన్న మహమ్మదు సందేశం అందడంతోనే అక్కడ హైందవం కుప్పకూలి పోయింది. అక్కడ కొన్ని ప్రాంతాల్లో యిప్పటికీ బౌద్ధమే కొంతగానైనా మిగిలివుంది. హైందవం జాడలేకుండా పోయింది. ఇలా ఎందుకు జరిగింది?

ఈ దేశంలో కూడా బౌద్ధాన్ని నాశనం చేసి హైందవం విజృంభించిన తర్వాత ఒకటి రెండు శతాబ్దాలకు దేశంయావత్తూ రాజకీయంగా ముస్లిముల గుప్పిట్లోకి పోయింది. కోట్లాది జనం ఇస్లామును కౌగలించుకున్నారు. జంగిలి మతంగా ఇంకా హైందవం కొనసాగుతున్నా, పాశ్చాత్యులు వచ్చిన తర్వాత మరికొన్ని కోట్లమంది క్రైస్తవంలోకి మారారు. మంచినీరు త్రాగడానికి ఏ మ్లేచ్ఛులకు మట్టి ముంతను సైతం

యివ్వడానికి హిందువులు నిరాకరించారో, ఆ మ్లేచ్ఛులకు రాజకీయ బానిసలుగా భారతీయులు మసలక తప్పనిదైన్యపరిస్థితిని హైందవం కల్పించింది! ఇలా ఎందుకు జరిగింది?

ఈ విషయాలన్నీ మరచి, బౌద్ధంమీద నిందవేయడానికి తలపడ్డాడు వివేకానందుడు. పైగా బౌద్ధ అజ్ఞేయవాదాన్ని గౌరవించడం దక్షిణాదివారికి ఫాషనైపోయిందని హేళన చేశాడు. బౌద్ధం యీ దేశంలో బలంగా వుండగా దాన్ని విదేశీయులు తమ దేశాలకు దిగుమతిచేసుకున్నారు. ఈ దేశాన్ని రాజకీయంగా స్వాధీనం చేసుకున్న విదేశీపాలకులు సైతం బౌద్ధాన్ని స్వీకరించారు, ప్రోత్సహించారు. ఆ బౌద్ధాన్ని నాశనం చేసిన తర్వాత భారతీయులకు రాజకీయంగానే కాక, ధార్మికంగా కూడా పతనావస్థను తెచ్చిపెట్టింది హైందవమే. అలాంటి హైందవాన్ని పొగడడంకోసం బౌద్ధాన్ని నిందించిన వివేకానందుడి తత్వాన్ని అర్థం చేసుకోవడం కష్టంకాదు.

బౌద్ధంలో ఏమివున్నా ఏమి లేకపోయినా, మనుషులందరినీ మనుషులుగా సమానహోదా కలవారుగా పరిగణించే స్వభావం వుంది. అందుకే, తరతరాలుగా, యుగయుగాలుగా అస్పృశ్యతకు గురిఅవుతూ వచ్చిన దళితుల్ని బౌద్ధంలో చేరమని సలహా యిచ్చాడు డాక్టర్ అంబేద్కర్. హిందూమతం అస్పృశ్యులకు చేసిన అన్యాయం గురించి మాట్లాడుతూ ఆయన 1936లో పూనాలో ఇలా అన్నాడు: "నిన్ను మనిషిగా గుర్తించనిమతాన్ని, తాగడానికి నీకు నీరీయని మతాన్ని, దేవాలయాల్లోకి నిన్నురానీయని మతాన్ని మతమనడానికి వీలులేదు. నిన్ను చదువుకో నీయనిమతం, నీ భౌతిక ప్రగతికి తోడ్పడని మతం మతమనే పేరుకే తగదు. స్వమతస్థులపట్ల మానవత చూపమని అనుయాయులకు బోధించని మతం హింసాత్మకమైనది. 'పశువుల్ని తాకవచ్చు, మనుషుల్ని తాకరాదు' అని అనుయాయులకు బోధించే మతం మతంకాదు. కొన్ని వర్గాలు చదువుకోరాదనీ, ధనం ఆర్జించరాదనీ, ఆయుధాలు ధరించరాదనీ శాసించే మతం హాస్యాస్పదమైనది. అజ్ఞానుల్ని అజ్ఞానులుగా, పేదవారిని పేదవారుగా కొనసాగమనే మతం మతంకాదు".

ఈ హీనస్థితి అంతా మనుస్మృత్యాదులు శాసించిందే. ఆ మనుస్మృతిని శంకరుడు ప్రమాణించగా, వివేకానందుడు పొగిడాడు.

ఈ దేశంలో హిందూమతాధిపత్యం శంకరపీఠాల వారిదే. ఆ పీఠాలు వర్ణాశ్రమాచార ధర్మాలను కాపాడడానికి నెలకొల్పబడ్డవే. వివేకానందుడు స్థాపించిన రామకృష్ణమఠాదులు పైకి వేదాంతం చెప్పినా, పరోక్షంగా వర్ణవ్యవస్థను కాపాడే సంస్థలే.

హిందూమతాన్ని ఏ రూపంలో సమర్థించినా, అది వర్ణవ్యవస్థను సమర్థించినట్లే. వర్ణవ్యవస్థలేని హిందూమతాన్ని వూహించడం అసాధ్యం.

ఊరూరా మూడుమతాలు, 30 కూలాలు వెలసిన యీ దేశంలో, మతపోరాటాలు-కులపోరాటాలు నిత్య కార్యకలాపాలయిన యీ దేశంలో, దేశం పీలికలైన తర్వాతకూడా మిగిలిన భాగంలో సామాజిక ఐక్యత దూరమవుతున్న యీ దేశంలో సర్వఅరిష్టాలకూ మూలకారణం హైందవమే.

బౌద్ధం పతనమై పౌరాణిక హైందవం పుంజుకోవడమే మన పతనానికి కారణం. భారతీయుల దైన్యానికి కారణాన్ని, బుద్ధుడిమీద నెట్టడంకంటె సిగ్గుమాలినపని మరొకటి లేదు. ఈ విషయాన్నే డా॥ అంబేద్కర్ సూటిగా చెప్పాడు.

"It is not Buddha who, as is often alleged, weakened Hindu society by his gospel of non-violence. It is the Brahminic theory of Chaturvarna that has been responsible not on y for the defeat but a so for the decay of Hindu society ....... Is there any society 'n the world which has unapproachables, unshadowables and unseables?

("D.D. Kosambi, Myth and Reality, P.36")

హిందుమత హృదయం ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి. బౌద్ధంపట్లనే కాదు, మిగతా మతేతర తత్వాలపట్ల కూడా వివేకానందుడు కినుకతో అనేక వ్యాఖ్యలు చేశాడు. అవి అన్నీ ఇక్కడ పరిశీలించడం సాధ్యంకాదు కానీ, నాస్తికుల్ని పరోక్షంగా ఉపాలంభించిన ఒక సందర్భాన్ని చూద్దాం. ఆయన ఒకసారి మద్రాసులో మాట్లాడుతూ 'I would rather see everyone of you rank atheists than superstitious fools, for the atheist is a ive and you can make someth'ng out of him' (Vol.IV, p.21) అన్నాడు. ఈ మాటల్ని వివేకానందుడు నాస్తికులకిచ్చిన యోగ్యతాపత్రంగా కోట్‌చేసే ప్రబుద్ధుల్ని చూచినపుడు తెలుగు చాటుపద్యం ఒకటి జ్ఞాపకం వస్తుంది.

"ఆడినమాటను తప్పిన, గాడిదకొడుకంచు తిట్టగా విని అయ్యో,
వీడా నా కొడుకంచును, గాడిదయేడ్చెను గదన్న ఘనసంపన్నా!"

ఆ మధ్య ఒక భజగోవిందం వివేకానందుడి చెణుకును నాస్తికుల కిచ్చిన యోగ్యతాపత్రంగా బహిరంగసభలో కోట్ చేస్తుంటే విని, నేను విస్తుపోయాను. దాన్ని ప్రశంసాపత్రంగా స్వీకరించడానికి హేతువాదులు బ్రహ్మపదార్థాలు కాదు. రినైజాన్స్ శత్రువుల్ని రినైజాన్స్ మిత్రులుగా గుర్తించడానికి వారికి సిగ్గు అడ్డం వస్తుంది.

వివేకానందుడింకా యేమంటాడో చూచారా? నాస్తికులు పూర్వం పరమ దుర్మార్గాన్ని బోధించేవారుట? నాస్తికం నుంచి భారత సమాజాన్ని రక్షించడానికి మొదట బుద్ధుడూ, తర్వాత శంకరుడూ విప్లవాలు తెచ్చారుట! (Vo. ,pp-1114-5) ఇలాంటి మాటలన్న వివేకానందుణ్ణి కొనియాడడానికి హేతువాదులు అవివేకానందులుకారు.

శంకరుడిలాగ వివేకానందుడూ పౌరాణికుడే. ఈ దేవుడు. ఆదేవుడు అనిలేదు. కాశీమాత, కృష్ణుడు, రాముడు, హనుంతుడు – ఒక రేమిటి అందరినీ మడతబెట్టి భజించడం ఆయనకు అలవాటు. తటస్థపడ్డ విటుణ్ణల్లా తృప్తిపరచే స్త్రీని పడుపుకత్తె అంటాం. 'అడ్డం వచ్చిన' దేవుణ్ణల్లా భజించే భక్తుణ్ణి యేమంటాం? సత్యాసత్య విచక్షణాజ్ఞానం కోల్పోయినవారికి 'మనది హైందవం' అనే మైకం కమ్ముతుంది. ఫలితంగా పరస్పర విరుద్ధ సిద్ధాంతాలను, వాటిని ప్రతిపాదించిన గ్రంథాలను, అన్నిటినీ మడతబెట్టి సమర్థిస్తారు "కనబడ్డ దేవుడి" కల్లా మొక్కుతారు. శంకరుడితో పాటు వివేకానందుడూ ఆ శ్రేణిలోనివాడే.

శంకరుడు మొదలుకొని వివేకానందుడిదాక రివైవలిస్టులంతా విచక్షణా రహితంగా పాతను సమర్థించినవారే.

బౌద్ధంలో ఎన్ని లోపాలున్నా, దానికి ప్రత్యామ్నాయం హైందవం కాదు. భౌతికవాదం ఎంత ప్రాథమికస్థాయిలోవున్నా, దానికి ప్రత్యామ్నాయం భావవాదం కాదు.

మౌలికంగా అసంబద్ధమైన భావవాదాన్ని భౌతికవాదంతో సమన్వయం చేయాలనేది అవకాశవాదం ప్రాచీన భౌతికవాదాన్ని పునరుద్ధరించవలసిన మధ్యయుగదశలో పౌరాణిక హైందవాన్ని పెనం మీదకు తీసుకురావడమే ఈ దేశంలోని అనర్థాలన్నిటికీ మూలం. ఇప్పటికైనా శాస్త్రీయ భౌతికవాద మార్గాన్ని మనం ఎన్నుకోకపోతే ఇంకా అధోగతికి పోక తప్పదు. శంకరుడి అయోమయం భౌతికవాదాన్ని నిలబెడుతుందని భ్రమించడం, భ్రమింపజూడడం వృథాప్రయాస. శంకరుడి ఛాయల్లో పెరిగిన వివేకానంద, రామతీర్థలాంటి స్వాముల వేదాంత వ్యాసంగం ఈ దేశంలో హేతువాదాన్నీ, భౌతిక వాదాన్నీ, సెక్యులరిజాన్నీ నిరోధించడానికే పనికి వచ్చింది. విదేశీ సర్టిఫికెట్లు వారికి చాలవరకు వుపయోగపడిన మాట నిజమే. అందుకే యీనాటి మనస్వాములు, బాబాలు అలాంటి సర్టిఫికెట్ల కోసం విదేశాలమీది కెగబడుతున్నారు. వాళ్ళందరి లక్ష్యమూ ఈ దేశంలో భావవిప్లవం రాకుండా

నివారించడం, వస్తే నిరోధించడం.

ప్రాచీన భారతదేశంలో ఉన్నతస్థాయి తాత్వికజిజ్ఞాన సాగిందన్న విషయాన్ని యెవ్వరూ కాదనలేరు కాని, దాని ప్రాధాన్యత చారిత్రకం మాత్రమే. అయినా, పాతలో దేనిమీదనుంచి ఉత్తేజం పొందవలసివుందో దాన్ని యీసడించడమూ, దేన్ని మనం నిరాకరించవలసివుందో దాన్ని నెత్తికెత్తుకోవడమూ భౌతికవాదులు చేయగలిగే పనికాదు. ఆ వైఖరిని తమ జీవిత ధ్యేయంగా మతవాదులెన్నుకున్నారు. అందువల్ల వర్జ్యనీయమైన పాతమీద వారికి ప్రశ్నలు రావడం లేదు

రినైజాన్స్ అంటే పాతను పునరుద్ధరించడం కాదు. ఆ పేరుతో శంకరాది ప్రతీపగామిశక్తుల్ని, జాతిమతకులతత్వవాదుల్ని, భౌతికవాదవిరోధుల్ని, భావవిప్లవ విధ్వంసకుల్ని మతమౌఢ్య ఉద్ధారకుల్ని రంగంమీద ప్రవేశ పెట్టి, అభ్యుదయ శక్తులుగా చిత్రించి ప్రదర్శించడం యాంటీరినైజాన్స్ అవుతుంది. అందుకే, యిప్పుడు పెరుగుతున్న రివైవలిస్టు ఉద్యమం వెనుక దురుద్దేశాలున్నవనీ, అదిచాల ప్రమాద కరమైనశక్తి అనీ ఎం.ఎన్.రాయ్ నాల్గు దశాబ్దాలకు పూర్వమే హెచ్చరించాడు. The recent y grow'ng rev va st movement s tendent ous ndeed, t s a posit ve danger అన్నాడు

రివైవలిజాన్ని రినైజాన్స్‌గా భ్రమపడడం అపాయకరం.

తరతరాలుగా శంకరతత్వంగా ప్రచారమవుతూ వచ్చిన పాపిష్టి ఫాసిస్టుతత్వాన్ని కొత్త అర్థాలతో సోషలిస్టు భౌతికవాదంగా చూపాలని చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదమైనవి.

# 10. రినైజాన్స్

మనం ఒక రినైజాన్స్ యుగాన్ని కోల్పోయాం రెండో రినైజాన్స్ యుగానికి ప్రపంచమేధావులు ప్రయాణం కదుతున్న రోజుల్లో మనం రివైవలిస్టు వూబినుంచి బయటపడలేకుండా వున్నాం.

కాగా, సమాజాన్ని బ్రహ్మబురద లోలోపలకు యీడ్వడానికి బ్రహ్మవాదులు చేసే ప్రయత్నాలు రకరకాల రూపాల్లో సాగుతూనే వున్నాయి. మనం ఎంత వెనక బడిపోయి వున్నామో తెలుసుకోడానికి మరెంత కాలం పడుతుందో తెలియదు. ఔచిత్యాన్ని మించిన జాతీయ దురభిమానం, వైజ్ఞానిక నిజాయితీ లోపం ఇందుకు ముఖ్య కారణాలు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి

మానవజాతి పరిణామ చరిత్రలో వైజ్ఞానికశకం ఏమంత సుదీర్ఘమైనదికాదు. ఆ కొద్దికాలంలోనే జ్ఞానంకోసం, సత్యంకోసం, మానవశ్రేయస్సుకోసం చిత్తశుద్ధితో కృషిచేసిన మేధావులు తక్కువ సంఖ్యలో లేరు. వారి కృషివల్లనే మానవజాతి ఈనాటి ఉన్నతస్థితికి చేరుకోగలిగింది ఆ కృషి చేసినవారిలో భారతీయులు లేరనికాదు గాని, భారతీయులు మాత్రమే అత్యుత్తమ వైజ్ఞానిక కృషి చేశారనే అపోహ ఈ దేశంలో తీవ్రంగా ప్రచారమైంది భారతీయతత్వాన్ని, విజ్ఞానాన్ని గురించి మాట్లాడేవారిలో ఆ పొరపాటు చేసేవారే యెక్కువ మంది వున్నారు. అందునా ప్రాచీన భారతీయ భౌతిక వాద ధోరణులను మైనస్‌చేసి, పోగా మిగిలిన ఆధ్యాత్మిక భావవాదరీతినే భారతీయ తత్వానికి నమూనాగా అవిష్కరించే వారిదే పైచేయిగా వుంది.

మానవ ప్రగతిని నిరోధించే ఆలోచనలు చేసినవారుకూడా ప్రపంచచరిత్రలో కన్పిస్తారు. దానికి కారణాలేమయినా, ఫలితాలేమయినా, వారి ప్రభావం యిప్పటికీ మానవసమాజంమీద ఎంతోకొంత వున్నమాట వాస్తవం మనదేశంలో వారు సాధించిన ఘనవిజయమే ఇక్కడ భావపరిణామాన్ని నిరోధించింది వెనక్కు తిప్పింది దాని వికృతఫలితాలు మన సామాజికవ్యవస్థలపై స్పష్టమైన ముద్రలు వేశాయి.

క్రీస్తుకు పూర్వం ఐదారు శతాబ్దాలు మొదలుకొని, క్రీస్తు తర్వాత ఒకటి రెండు శతాబ్దాలవరకు ప్రపంచంలో కొన్ని దేశాల్లో ఉన్నత జిజ్ఞాస కొనసాగినట్లు మనకు తెలుస్తుంది అంతకుపూర్వం జిజ్ఞాస సాగినా, రికార్డు చేయబడిన రూపంలో మనకు దక్కింది స్వల్పం. ఇది ఒక్క ఈ దేశం విషయంలోనే కాక, చాల దేశాల విషయంలో వాస్తవం

మరో విశేషమేమంటే, గణించదగిన మౌలికజిజ్ఞాన క్రీస్తుశకం ఒకటి రెండు శతాబ్దాల తర్వాత ఇటీవల 16,17 శతాబ్దులదాక ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ మృగ్యమైంది. ఇలా ఎందుకు జరిగింది అనేది ప్రస్తుతం చర్చనీయాంశం కాదు జరిగిన మాట వాస్తవం.

భారత్, చైనా, గ్రీసు మొదలైన దేశాల్లో కొంతకాలంపాటు వైజ్ఞానిక వ్యాసంగం స్తంభించిపోయింది. క్రమంగా యూరపులో క్రైస్తవం బలిసింది. అంతలోనే మధ్యప్రాచ్యంలో ఇస్లాం విజయయాత్ర సాగించింది. ముస్లిం దండయాత్రల కాలంలో గ్రీసు వైజ్ఞానిక సాహిత్యం అరబ్బు దేశాలకు చేరింది అరబ్బీ భాషలోకి అనువాదం పొందిన ఆ సాహిత్యం అరబ్బుదేశాల్లో శాస్త్రీయతాత్వికచర్చకు స్వల్పకాలమైనా తోడ్పడింది. క్రైస్తవ-ముస్లిం మతయుద్ధాల కాలంలో అరబ్బీలోని గ్రీకు సాహిత్యం యూరపు చేరింది. అలా, అక్కడకు చేరిన సాహిత్యం యూరపుదేశాల్లో జిజ్ఞాసను రేకెత్తించింది. క్రైస్తవమత ప్రతిపాదనకు భిన్నంగా సత్యం వున్నదనే అంశాన్ని గ్రీసు సాహిత్యం యూరపియన్ జిజ్ఞాసువుల ముందుంచింది గ్రీకు వైజ్ఞానికులు యెక్కడ ఆగిపోయారో అక్కడ ప్రారంభించి యూరపియనులు ముందుకు సాగారు. వారు చేసింది గ్రీకు విజ్ఞానాన్ని పునరుద్ధరించడం కాదు, ఆగినచోటనుంచి ముందుకు కొనసాగించడం.

కేవలం సత్యాన్వేషణాసక్తితో, చిత్తశుద్ధితో గ్రీకులు స్వతంత్రంగా నిరంతర జిజ్ఞాస చేశారు. దానికి అటు తత్వశాస్త్రజ్ఞులనుంచి కాని, ఇటు సమాజంనుంచికాని, పాలకులనుంచి కాని, జిజ్ఞాన కొనసాగించడానికి వీలుకానితరహాలో ఒత్తిడి జరగలేదు. ఒత్తిళ్లు జరిగిన సందర్భాలున్నా, అవి తాత్విక వైజ్ఞానికాభివృద్ధిని అపలేక పోయినై. అందువల్లనే, అక్కడ ఆరేడు శతాబ్దాలకాలం అవిచ్ఛిన్నంగా, బహుముఖంగా, భిన్నధోరణుల్లో తాత్విక, విజ్ఞానశాస్త్ర సాహిత్యాది రంగాల్లో అభివృద్ధి సాగింది. మానవ సృజనాత్మకతకు, భావస్వాతంత్ర్యానికి, స్వత్వవ్యక్తీకరణకు ఆనాడు అడ్డుగోడలు అంతగా లేవు అదేస్థితి దానికి దాదాపు సమకాలీనంగా వున్న భారతీయ వైజ్ఞానికాభివృద్ధిలోనూ లేకపోలేదు.

గ్రీకు విజ్ఞానం యూరపులో అడుగుపెట్టి తర్వాత, యూరపులో అప్పటివరకు మతభావ నియంతృత్వంలో అణగి మణగివున్న మేధావులు తిరిగి తమ స్వత్వాన్ని సాధించుకోవడానికి పోరాటం ప్రారంభించారు భావస్వాతంత్ర్యంకోసం బలికావడానికి వెనుకాడలేదు. అనేక రంగాల్లో సృజనాత్మక విలువల సాధనకోసం కృషిచేశారు. ఆకృషి ఫలితంగా వాస్తవిక సత్యాన్ని అవిష్కరించగల ఆధునిక విజ్ఞానం అవతరించింది.

ఈ కృషినే రినైజాన్స్ అన్నారు అది మానవ అస్తిత్వసారాన్ని పునరుద్ఘాటించింది.

రినైజాన్స్ అనేది స్వతంత్ర భావోద్యమం. రినైజాన్స్ అంటే భావపునర్వికాసోద్యమం అని అనువదించి, ముప్పాత భావాలను పెనం మీదకు తెచ్చే పద్ధతి రివైవలిజం మానవుడి భావస్వాతంత్ర్యం పునరుజ్జీవించి, పునర్విజృంభించడమే రినైజాన్స్ లక్షణం కాని, పాత భావాలను తిరగదోడడం రినైజాన్స్ కాదు. అంతకు ముందు వికాసముంటే కదా, పునర్వికాసమనేదానికి అర్థం? అనేది తప్పుడు ప్రశ్న. వికాసం వుండదు, ముమ్ముందుకు సాగుతుంది ఆగిన గమనాన్ని తిరిగి సాగించాలనేదే రినైజాన్స్ భావం. మాటల్ని ముక్కలుచేసి, విచిత్రార్థాల్ని కనిపెట్టే వక్రీకరణ పాండిత్యం రినైజాన్స్ లక్షణంకాదు యూరపియన్ రినైజాన్స్‌లో ప్రాచీన గ్రీకుల భావాలకు యెదురీదడమే జరిగింది కాని, వాటి పునరుద్ధరణ జరగలేదు. రినైజాన్స్ అంటే ప్రాచీన భావాలను తిరిగి తీసుకోవాలనే బాణీలో అభిప్రాయపడడం తప్పు పాత అంతా బంగారమనికానీ, రోత అని కానీ అనుకోవడం తప్పు అనే వాదం చాల పాతవాదం మాత్రమే కాదు, తప్పుడు వాదం కూడా. తప్పుడు సూత్రాలకు దొడ్డి దారి తెరవడానికి అనువుగా ఈ సూత్రాన్ని బాహాటంగా వాడుతున్న వారంతా నవీన ఛాందసులు. తమ పబ్బం గడుపుకోడానికే నయవంచకులీ సూత్రాన్ని అడ్డం పెట్టుకుంటున్నారు. 'వికాసం భాష'లో పాత కొత్తలుండవు

రినైజాన్స్ అంటే రిస్టొరేషన్ (పునరుద్ధరణ) కాదు. రిఫార్మేషన్ (సంస్కరణ) కాదు. రివైవలిజం (పునరుజ్జీవనం) కాదు. రినైజాన్స్ అంటే, ఒకప్పుడు ప్రపంచంలో చాలా దేశాల్లో నిర్నిరోధంగా సాగిన స్వేచ్ఛా జిజ్ఞాసను తిరిగి కొనసాగించడం, అందుకు అవరోధంగావున్న కుడ్యాలన్నిటినీ కూల్చివేయడం. అదే రినైజాన్స్. ప్లేటో, అరిస్టాటిల్ ప్రభృతుల్ని వల్లించడం, కోట్ చేయడం రినైజాన్స్ కాదు. అసలి యూరపియన్ రినైజాన్స్‌లో జరగలేదు, అక్కడ వారిని తిరస్కరించటమే జరిగింది ప్లేటోను ఆమోదిస్తే, ఆధునికతత్వశాస్త్రం లేదు అరిస్టాటిల్‌ని ఆమోదిస్తే, ఆధునిక భౌతిక విజ్ఞానం (ఫిజిక్స్) లేదు టోలేమీని ఆమోదిస్తే ఆధునిక ఖగోళ విజ్ఞానంలేదు. డెమోక్రటస్‌ను ఆమోదిస్తే, ఆధునిక అణువిజ్ఞానం లేదు ఈ దేశంలో కూడా రినైజాన్స్ వచ్చివుంటే, మతవాద భావవాద ఆలోచనారీతిని మొదలంటా తిరస్కరించడం జరిగేది. భౌతికవాద ధోరణిని ఆమోదించినా, ప్రాచీన భౌతికవాదసిద్ధాంతాలను యథాతథంగా ఆమోదించడం జరిగేదికాదు. ప్రాచీనత పేరుతో ప్రమాణించే పద్ధతిని విధ్వంసం చేయడం రినైజాన్స్‌కు నాంది

ఈ దేశంలో రినైజాన్స్ రాలేదు అందువల్లనే దాని ప్రభావం మనకు

కన్పించడం లేదు. రినైజాన్స్ రానందువల్లనే ఈ దేశంలో భావగమన చరిత్ర ఆగిపోయింది. రాజుల్లో రాజులు, మతాల్లో మతాలు తన్నుకుచచ్చిన చరిత్ర భావగమన చరిత్ర కాదు. అది భావ ప్రతిష్టంభన చరిత్ర కూడా కాదు. అది భావతిరోగమన చరిత్రలో భాగం; భావ విప్లవ నిరోధక చరిత్రలో భాగం. సాంఖ్యవైశేషిక న్యాయ దర్శనాల తర్వాత ఈ దేశంలో మౌలిక చింతన జరగలేదు. వర్జ్యనీయమైన పాతను తిరగదోడినవారు తప్ప, వాంఛనీయమైన క్రొత్తను ప్రతిపాదించినవారు లేరు. భౌతికవాద ఆలోచనారీతిని తిరిగి రంగంలోకి తీసుకు రావడమే రినైజాన్స్‌కాగా, ఇక్కడ దాన్ని తలెత్తకుండా చేసి, భావవాదధోరణి పునర్విజృంభించడం జరిగింది.

శంకరాదులు అభ్యుదయ భావాలను దారుణంగా దెబ్బతీశారు. రియాక్షన్‌కి (భావ విప్లవ ప్రతిఘాతకత్వానికి) ప్రాతినిధ్యం వహించారు. చేయరాని బ్రహ్మాన్ని రిస్టోర్ చేసి పోయారు. అక్కడక్కడ బయలుదేరిన మతసంస్కరణవాదులు మౌలికంగా ఏమీ చేయలేక పోయారు. సంస్కరణ వాదం ఈ దేశంలో ఉద్యమ స్వరూపం ధరించలేదు. వికాసయుగం (ఎన్‌లైటెన్ మెంట్) ఈ దేశంలో అసలే మొలకెత్తలేదు. భౌతికవాదం తిరిగి తలెత్తలేదు. హేతువాద ధోరణి బయలుదేరలేదు. దయానంద, వివేకానందులు పాతను పునరుజ్జీవన మార్గంలో పెట్టిపోయారు. దయానందుడు వేదాల దగ్గరకు వెనక్కుపోవాలంటే, వివేకానందుడు ఉపనిషత్తుల వరకు లిమిట్ చేశాడు. ఇద్దరూ, చెరోరకమైన ఫండమెంటలిజానికి పోవాలన్నారు. వారిని సంఘోద్ధారకులుగా పరిగణించే దౌర్భాగ్య స్థితికి మన సాంఘిక చరిత్రకారుల అవగాహన దిగిపోయింది. అలాంటివారి వల్ల ఈ దేశంలో భావ వికాసానికి జరిగిన ద్రోహాన్ని సాంఘిక విప్లవకారులు సైతం గ్రహించలేనంత ఉధృతంగా వారిని గురించి అబద్ధ ప్రచారం జరిగింది. ఇప్పుడీ దేశంలో రివైవలిజం బలంగా పేరుకొనివుంది. ఈ స్థితిలో, ఈ దేశంలో రినైజాన్స్ అంటే పాతదాన్నంతా జల్లెడపట్టి నిగ్గు తేల్చడం కాదు. అది పాతను బలపరచడానికే తోడ్పడుతుంది.

## రెండవ రినైజాన్స్

ఇప్పుడు ప్రపంచంలోని మేధావులలో చాలమంది 20వ శతాబ్దపు రినైజాన్స్ గురించిన ఆలోచనలో తలమునకలై వున్నారు. దాని అర్థం 20 శతాబ్దాలు వెనక్కు వెళ్ళి మత మూలసూత్రాలను త్రవ్వి తలకెత్తుకోవాలని కాదు.

ఈ దౌష్ట్యాలకు బలికాకుండా, రినైజాన్స్ యుగంలో మానవుడు సాధించిన భావస్వాతంత్ర్యంవైపుకు మానవుడి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ఎలా మలపాలి అనే

విషయాన్ని ఈ 20 వ శతాబ్దపు రినైజాన్స్‌వాదులు చాల తీవ్రంగా ఆలోచిస్తున్నారు. కాబట్టి, రినైజాన్స్ అంటే వెనక్కు వెళ్ళడం కాదు. ముందుకు పోవడానికి అవరోధాలుగావున్న కుడ్యాలను బ్రద్దలుకొట్టి మున్ముందుకు సాగడమే రినైజాన్స్. ఈ రినైజాన్స్ కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతం దగ్గరకో, డాల్టన్ పరమాణు సిద్ధాంతం వద్దకో, డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం దగ్గరకో, మెండెల్ జన్యుసిద్ధాంతం వద్దకో, వారాసిద్ధాంతాలను ప్రతిపాదించిన దశకో వెళ్లి తిష్టవేయడం కాదు.

అలానే తాత్విక, రాజకీయ, ఆర్థిక విషయాల్లోనూ, ఇతర విషయాల్లోనూ కూడా ఏదో ఒక మాధ్యమిక ఫండమెంటలిజం వద్దకు మనం తిరిగిపోవాలనడం రినైజాన్స్‌కాదు. ప్రాచీనకాలంలో సాఫీగా సాగుతున్న వైజ్ఞానికాభివృద్ధిని అభివృద్ధి నిరోధకశక్తులు ఆపివేసినై, తప్పుదారి చూపినై. ఆ తప్పుదారిని తప్పించి, సరైన దారికి మరలించింది యూరపియన్ రినైజాన్స్. తిరిగి ప్రపంచం తప్పుదారిలో పడిందని ప్రపంచ మేధావులు భయపడుతున్నారు. నియంతృత్వాల “కబంధ” హస్తాల నుంచి మానవుణ్ణి తిరిగి విముక్తి చేయాలని ఆరాటపడుతున్నారు. ఇదే 20వ శతాబ్దపు రినైజాన్స్ – రెండవ రినైజాన్స్–న్యూ రినైజాన్స్.

## శంకరైజాన్స్

యూరపులో మధ్యయుగాల అనంతరం నాటి రినైజాన్స్ ప్రారంభమైంది. అనాడు భారతదేశంలో రియాక్షన్ బయలుదేరింది. అక్కడక్కడ బ్రతికివున్న ప్రగతి గామిశక్తుల్ని, స్వతంత్రజిజ్ఞాస ప్రోత్సహించే తత్వాలను చంపడానికి ఆనాడీ దేశంలో భావతిరోగమన శక్తులు అహరహం కృషి చేశాయి. అక్కడి రినైజాన్స్. ఇక్కడి రియాక్షన్ దాదాపు ఒకే కాలానికి చెందినవి. దీనికి చారిత్రక కారణాలుండవచ్చుకాని, వాటి ఫలితంగా అక్కడ మతం బలహీనపడింది, ఇక్కడ బలిసింది. అక్కడ ఆధునిక విజ్ఞానశాస్త్రం బయలుదేరింది. ఇక్కడ మంత్రతంత్ర క్షుద్రవిద్యలు వ్యాపించినై. అక్కడ అంతర్జాతీయవాదం మొలకెత్తింది. ఇక్కడ జాతీయవాదమే మరీ సంకుచితమైపోయింది. అక్కడ మానవవాదం బయలుదేరింది, ఇక్కడ మాయావాదం పెచ్చరిల్లింది.

గ్రీకుల తాత్విక సంప్రదాయంలో సెక్యులరిస్టు ధోరణివుంది. అక్కడి భావవాదరీతుల్లో సైతం అలౌకికధోరణి తక్కువ, ఐహికధోరణి ఎక్కువ. ఇక్కడి వైదిక సంప్రదాయం లౌకికమైకూడా, పారలౌకిక ధోరణిలో కూరుకుపోయి ఇహంమీద విరక్తిని పెంచింది. వికృతరూపాలు దాల్చిన వైదిక కర్మకాండ పురోహితవర్గాధి పత్యాన్ని సమాజంపై రుద్దింది. చార్వాక బౌద్ధాది సామాజికతాత్విక ధోరణుల దాడివల్ల

బీటలువారిన వైదిక మత దుర్గానికి మరమ్మత్తు చేపట్టిన ఉపనిషత్తులు భావవాదవూబిలో కూరుకుపోయినై. సాంఖ్య వైశేషిక న్యాయదర్శనాలు తాత్వికంగా కొత్తపోకడలు పోయినా, వాటికి ప్రాచుర్యం లభించలేదు. సత్యాన్వేషణ పథాన్ని కంటకావృతంచేస్తూ పురాణవాఙ్మయం విజృంభించింది. కల్లబొల్లి కథలతో హిందూమతదుర్గం నిర్మాణమైంది. దాన్ని పడగొట్టే ప్రయత్నాలు నిన్న మొన్నటిదాక ప్రారంభం కానే లేదు. శంకరుడు వచ్చేనాటికి కాస్తోకూస్తో బలంగా వున్న చార్వాక, జైన, బౌద్ధ, సాంఖ్య వైశేషికాలను శంకరుడు పూర్తిగా కూల్చివేశాడు. పౌరాణిక హైందవానికి మార్గం సుగమంచేశాడు. ఆ తర్వాత వచ్చిన రామానుజ మధ్వాదులు రియాక్షన్‌ని స్థిరతరం చేశారు.

ఈ శంకరైజాన్స్ వల్ల ఇక్కడ మానవ స్వతంత్ర జిజ్ఞాస చచ్చిపోయింది. ఉపనిషత్తులను దాటి కొత్త ఆలోచన బయలుదేరలేదు. కారికలు, సూత్రాలు, భాష్యాలు అన్నీ ఉపనిషత్తులమీద నుంచి వచ్చినవే. ఆ భావవాదవూబినుంచి బయటపడడానికి వీలైన మౌలికయోచన చేసినవారు ఈ దేశంలో పుట్టలేదు. దాదాపు అందరూ బ్రహ్మం వుచ్చుల్లో చిక్కుకున్నారు. అందువల్ల ఈ దేశంలో స్వతంత్రాలోచన మృగ్యమైంది.

ఫలితంగా ఇక్కడ ఆధునిక విజ్ఞానశాస్త్రం బయలుదేరలేదు. ఆధునిక తత్వ శాస్త్రానికి పునాదులు పడలేదు. పురోహిత వర్గాధిపత్యం సడలలేదు. రాజరిక వ్యవస్థ కూలిపోలేదు. వర్ణవ్యవస్థ పట్టు సడలలేదు. కాగా, విదేశీదండయాత్రలు, విజాతీయుల పరిపాలనలేని తరుణం ఈ దేశ చరిత్రలోలేదు. ముస్లిములు ప్రవేశించినప్పటి నుంచి దాదాపు వెయ్యి సంవత్సరాలు యీ దేశం అన్యమతస్థులైన పరదేశీయులపాలన క్రింద రాజకీయ బానిసత్వం అనుభవిస్తూవచ్చింది. స్వదేశీరాజరికం సైతం కరువుకావడం మన ఘనవారసత్వం, ఈ సిగ్గుమాలిన స్థితి నుంచి ఈ దేశాన్ని ఏ హిందూదైవమూ, లేక ఏ ప్రవక్తా రక్షించలేదు. ద్వైతాద్వైత విశిష్టాద్వైత శుద్ధాద్వైత సన్యాసుల బోడిసిద్ధాంతా లేమీ యీ దేశాన్ని కాపాడలేదు. దేశాన్ని రాజకీయంగా విజాతీయులు పాలిస్తూవుండగా సమాజం యావత్తూ తాత్వికంగా, సాంస్కృతికంగా పురోహితవర్గం చెప్పుచేతల్లో వుండి పోయింది. పౌరాణిక అస్తిత్వమే వారి జీవనతత్వమైంది. విదేశీ రాజకీయాధిపత్యం వదలిపోయిన తర్వాతకూడా ఇక్కడి తాత్వికసాంస్కృతిక పరిస్థితుల్లో వాంఛనీయమైన మార్పురాలేదు. పరిస్థితులు మరీ అధ్వాన్నమైనాయి.

ఈ స్థితిలో ఇప్పుడు వేదమంత్రాలనూ, ఉపనిషత్ సూత్రాలనూ, మతసూత్ర భాష్యాలనూ, అపభ్రంశ పురాణకథలనూ దేవి – చిక్కిన చేదుపక్కెల్ని కుప్పపోయాలనే

అవివేక సంకల్పం రినైజాన్స్ భావలక్షణం కాదు. అందులో ఆధునిక విజ్ఞానం రాపిడికి నిలిచేవాటినే ఆమోదించవచ్చుననే ప్రచ్ఛన్న మతవాదాన్ని దరిచేరనీయడం ప్రమాదకరం. రివైవలిస్టులంతా ఆ మాటలే చెపుతున్నారు. అలా చెప్పేవారికి వేదాదుల్లో రేడియోలు, టెలివిజన్లు, రాకెట్లు, బ్రహ్మాస్త్రాలు, సాపేక్షసిద్ధాంతాలు, పరిణామవాదాలు, ఖగోళవిజ్ఞానం, ఆధునిక మనోవిజ్ఞానం–ఒకటేమిటి, ఆధునిక విజ్ఞానం కనిపెట్టినవీ, కనిపెట్టనివీ అన్నీ కనిపిస్తాయి. శంకరుడి బ్రహ్మావాదంలో పదార్థవాదం, మాయావాదంలో పరిణామవాదంకూడా కన్పిస్తాయి. ఆధునికవిజ్ఞానం ద్వారా ఆ నిర్ణయాలకు రాగల్గినప్పుడు, ఆ నిర్ణయాలను తాటాకుల్లో వెదకి పట్టుకొచ్చి ప్రదర్శించవలసిన అవసరం ఏమి వుంది? అంతా తాటాకుల్లో వుంటే, ఇక ఆధునిక విజ్ఞానాన్ని అధ్యయనం చేయవలసిన అవసరమేమివుంది? కేవలం చారిత్రక పరిశీలన కోసమైతే తప్ప, వాటి బూజు దులపవలసిన అవసరం మనకు లేదు.

ప్రాచీనకాలంలో కొన్ని దేశాల్లో శాస్త్రం–తత్వం బాగా అభివృద్ధిచెందిన మాట వాస్తవమే. 'బాగా' అంటే 'ఆ కాలానికి బాగా' అని అర్థం. పెరిగినంతకాలం అవి క్రమాభివృద్ధిగా పెరిగినై. అంతేకాని, అవి శాశ్వత సత్యాలుగా ఉద్బుద్ధమైనవి (రెవెలేషన్స్)కావు. పెరగగల్గిన మేరకు పెరిగి, ఇక ఆగిపోయినై. తర్వాత భారతీయతత్వం పిలకలు వేయలేదు. చైనీయుల తత్వం పిలకలు వేయలేదు. రెండూ మోదువారిపోయినై. గ్రీకులతత్వం విషయంలో అలా జరగలేదు. అది అరబ్బుదేశాల గుండా యూరపు చేరి, నూరుపూవులు–వేయి కాయలైంది.

భారతీయతత్వంలో తిరోగమనవాదం జిజ్ఞాసను బలితీసుకుంది. వికాసమార్గాన్ని మూసివేసింది. చార్వాక, జైన, బౌద్ధాదులు వినా–మిగతావారంతా, ఉపనిషద్దర్శన సూత్ర భాష్యకారులంతా, మతాచార్యులంతా వేద ప్రామాణ్యాన్ని అంగీకరించిన వారే. ఎవరి అన్వయాన్ని వారు చెప్పారు. చైనాలో మన తరహా రియాక్షన్ బయలు దేరలేదు. కాని, తాత్విక ప్రతిష్టంభన కొనసాగింది.

గ్రీకుతత్వంలోని సుగుణం వల్లనే, అది అరబ్బు దేశాల్లో ప్రవేశించినప్పుడు అక్కడ జిజ్ఞాసను ప్రేరేపించింది. అక్కడనుంచి యూరపు దేశాల్లో ప్రవేశించినప్పుడు అక్కడకూడా జిజ్ఞాసను వరవళ్ళు త్రొక్కించింది. ఆ సుగుణం ఆ వస్తువులోనే వుంది. ప్రాయికంగా అది లౌకిక మార్గానుయాయి. లోకం వున్నదని అంగీకరించడం ఆ మార్గంలోని విశిష్టత. ఉన్నదాన్ని మెరుగుపరచుకోడానికి జరిగిన కృషి కొంతలో కొంత సఫలమైంది.

పూర్వం మనకూ వాస్తవికవాద ధోరణులు లేకపోలేదు. కానీ, వాటన్నిటినీ భావవాదమార్గం భూస్థాపితం చేసింది. లేనిబ్రహ్మాన్ని ఉన్నదని భావవాదులు వెదకడం ప్రారంభించారు. లేనిది దొరకనూ లేదు, వున్నది మెరుగుపడనూ లేదు. శుద్ధ చైతన్యం అనాది వస్తువుగా భావవాదుల పరిశోధన అంతా సాగింది. అది ప్రత్యేకమైన వస్తువు కాదనే ఆలోచన వారికెన్నడూ రాలేదు. ఉన్న వస్తువుల ధర్మాల్లో, వ్యాపారాల్లో చైతన్యం కూడా ఒకానొక్కటి మాత్రమేనన్న వూహ వారికి రాలేదు. భౌతికవాదులు వివరించినా, వారు వినిపించుకొనే స్థితిలో లేరు. అలాంటి ఆలోచనలు చేసిన కొన్ని భారతీయ దర్శనాలు ఆనాడు దర్శనాలుగా తగినంతగా ఎన్నికకెక్కలేదు. దార్శనికులు తప్ప,వాటి తాత్విక భూమికలను గురించి పట్టించుకొనేవారు యీనాడూ లేరు. దర్శనాలైనా, ఆ నాటికే అవి గొప్పవికాని, ఈనాడవి ఆమోదయోగ్యాలు కావు. వాటి ప్రాధాన్యం చారిత్రకం మాత్రమే. తత్వశాస్త్ర చరిత్ర అధ్యయనంలో మాత్రమే వాటి సమున్నత స్థానం గురించి మనం ఆలోచించగలం.

మన పూర్వుల ఆలోచనలను చారిత్రకంగా పరిశీలించినపుడు వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, చార్వాక జైన బౌద్ధాది తత్వాలు, ఇతర మతశాఖల వాదాలు, ఇంకా అవసరమనుకొంటే పురాణాదులు, అన్నీ మనం చూడవచ్చు. అలానే ప్రాచీన భారతీయ ఖగోళ విజ్ఞాన దరిత్రను, దాని పరిణామాన్ని తెలుసుకోడానికి అర్యభట్టు, వరహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు, భాస్కరుడు వగైరాల నందరినీ మనం అధ్యయనం చేయవచ్చు. కాని అలాచేయడం చారిత్రక విలువలు నిర్ణయించడానికి తప్ప, వారిని అనుసరించడానికి కాదు. ఈ నాటి శాస్త్రం వారినుంచి నేర్చుకోవలసిన హీన దశలో మనల్ని వుంచలేదు. అలానే, గ్రీకు ఆలోచనా స్రపంతిని అధ్యయనం చేయడం కూడా చారిత్రక అవగాహన కొరకేకాని, వారి తత్వాలను, ప్రతిపాదనలను అమోదించడానికి కాదు. అ అధ్యయనం భావగమన చరిత్రను అవగాహన చేసుకోడానికి వుపకరిస్తుంది. కాబట్టి, రినైజాన్స్ అంటే పాతను వుద్ధరించడం కానీ, సంస్కరించడం కానీ కాదు.

భారతీయతత్వాన్ని అధ్యయనం చేయాలంటే, అసాధ్యమైన యిబ్బందులు కొన్ని వున్నాయి. సామాన్యుల విషయం అటుంచి, భాషా పండితుల పరిస్థితే డోలాయమానంగా వుంది. వేదాల్లోని ప్రాకృత భాషకు అందరూ ఆమోదించిన అర్థం యిప్పటికీ లేదు. వేదాలకు కనీసం అరడజను భాష్యాలున్నవంటున్నారు. మక్కీకి మక్కి పదానువాదం చేసిన సాయనభాష్యం వేదార్థాన్ని వికృత పరిచిందని సనాతన వేద పండితులంటున్నారు. అది తప్ప, పూర్తిగా దొరికే వేదభాష్యం

లేదంటున్నారు, దాన్ని యిప్పటికీ పగలగొట్టినవారు లేరు. ఇప్పటికీ ఆ భాష్యాలు తెలుగులోకి పూర్తిగా రాలేదు. దయానంద భాష్యం వేదాల్లో విమానాలనుకూడా కనిపెట్టింది! ఉపనిషత్తులకు కూడా ఎవరికి తోచిన అర్థాలు వాళ్ళు చెపుతున్నారు. వాటిని అనేకమంది సూత్రీకరణ చేశారు. అయినా, మనకిప్పుడు దొరికేవి బాదరాయణుడి బ్రహ్మసూత్రాలే. ఆ సూత్రాలకు భాష్యాలు వ్రాసినవారు చాలమంది వున్నారు. బ్రహ్మమంటే ఏమిటి అనే దానిదగ్గర ఉపనిషత్కారులంతా సిగపట్లు పట్టారు. ఏకీభావానికి రాలేదు. భాష్యకారులూ తన్నుకున్నారు, ఒకే అర్థానికి చేరలేగ ప్రాథమిక విషయాల్లోనే విభేదించి బ్రహ్మ సూత్రాలు అధారంగానే ద్వైతాద్వైత విశిష్టశుద్ధాద్వైత సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఇప్పటికీ వేదాదులకు ఎవరి అర్థాలు వారివే, శాంకరుల వ్యాఖ్యానాలను దయానందులు త్రోసివేస్తారు. వేదార్థం ఏమిటనే విషయంలో శంకరుడి కాలంలోనే మడతపడి తన్నుకున్నారు.

అందువల్ల వేదాదుల్లో చెప్పిందేమిటి? అనే ముఖ్య విషయంలోనే తగాదాలు ఉన్నప్పుడు, వాటినుంచి యేరికోరుకునే సమస్యే వుత్పన్నం కాదు. ప్రపంచంలో మరే భాషలోనూ, మరే తత్వంలోనూ యీ అర్థ భేదాల చిక్కులేదు. గ్రీకు తాత్వికులు, వైజ్ఞానికులు ఎన్నెన్నో విషయాలు చెపితే, వారసలు చెప్పిందేమిటి అనే సమస్యలో తగాదాలు లేవు. ఏవరేమి చెప్పారో స్పష్టంగానే వుంది. అలాగే చైనీయుల విషయంలోనూ. వైదిక ప్రాకృతానికి అలా అర్థం చెప్పడానికి వీలులేదు. 'ఇదీ' అని అర్థం చెప్పడానికి సంస్కృత భాష సందర్భంలోనే గందరగోళం వుంది. చిలకమర్తివారు "శుక్లాంబరధరం విష్ణుం" అనే శ్లోకానికి గాడిదపరంగా అర్థం చెప్పినట్లు, దయానందులవారు "అయంగౌఃపృశ్నిరక్రమీత్" అనే మంత్రానికి సూర్యకేంద్ర సిద్ధాంతం పరంగా అర్థం చెప్పారు. ఇతరులేమి చెప్పినా, అది మన వేదాల్లోనో, మరోచోటనో వుందని పాత మంత్రాలకు కొత్త అన్వయం చెప్పే జబ్బు మన రివైవలిస్టులకు ప్రత్యేకం. పెరవారు కనుక్కునేదాక వారికిక్కడ అది కనిపించదు. ఉంటేగదా, కన్పించడానికి?

ఎవరు, ఎలాంటి అర్థాన్ని లాగడానికైనా అవకాశమిచ్చే రబ్బరు భాష సంస్కృతం. మనుషుల వాడుకలో లేకపోవడం వల్ల అది చచ్చిపోయింది. అందువల్ల ఎవరెలాంటి అర్థాన్ని చెప్పినా, అది తిరుగుబాటు చేయదు. సంధులు, సమాసాలు, విగ్రహాలు, లింగాలు, వ్యుత్పత్తి అర్థాలు, ఎలా పడితే అలా మార్చుకోవచ్చు. కాకి 'కా' అని అరిస్తే దాని అర్థాన్ని కట్టల కట్టల కావ్యాల్లో బంధించగల ప్రజ్ఞాధురీణులు మనకున్నారు. వాడుకలో లేని పాత ఇంగ్లీషు పదాలకు కూడా, ఒక్కో దానికి నూరు అర్థాలు చెప్పుకోవచ్చు. అది ఆ భాష సమర్థతకు, పరిపక్వతకు కాక–అసమర్థతకు,

అపరిపక్వతకు గీటురాయి. మూగవాడి భాషకు ఏ అర్థమైనా చెప్పవచ్చు. అందువల్ల భాషను వంకరలు తిప్పి, ఆధునిక భావాలను అతి ప్రాచీనులకు అంటగట్టడం వైజ్ఞానిక నిజాయితీ లోపానికి తార్కాణం. కేవలం "సర్వం బ్రహ్మమయం" అని వాగి ప్రయోజనంలేదు. పాత శ్లోకాలకు కొత్త అర్థాలు చెప్పుకొనే సర్వారాయుళ్ళు "అంతా మనవాళ్ళే చెప్పారు" అని అనడం జాతిదురభిమానానికి తప్ప, ఇండియన్ రినైజాన్స్‌కు లక్షణంకాదు. ఇండియన్ రివైజాన్స్ అంటే ఇండియాలో రినైజాన్స్ రావాలనేకాని, ప్రాచీన భారతీయతను పునరుద్ధరించమని కాదు.

## రినైజాన్స్ అంటే ....

రినైజాన్స్ స్వరూప స్వభావాలను గురించి సరైన అంచనా వేసిన వారిలో అత్యంత ముఖ్యుడు ప్రఖ్యాత భౌతికవాస్తవిక వాది ఎం.ఎన్.రాయ్. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన భావాలను గమనించడం అవసరం.

"రివైజాన్స్" అనేది మానవుడి పునర్జన్మ. సమాజంలో వున్నదంతా మానవుడు సృష్టించుకొన్నదే. మానవజాతి ప్రగతి కోసం, సుఖంకోసం సృష్టించుకొన్నదే. ఈ విషయాన్ని మానవుడు జ్ఞాపకం వుంచుకోవాలి. మానవ ప్రగతికి వ్యతిరేకమైన సామాజిక వ్యవస్థలు, రాజకీయ సంస్థలు వున్నమాట నిజం అవి మనిషిని స్వేచ్ఛాపరుణ్ణి చేయడానికి బదులుగా నిర్బంధిస్తున్నమాట నిజం. అందుకే, ఇతోధిక అభ్యుదయాన్ని సాధించాలంటే, మానవుడా బంధాలను త్రెంచి వేసుకోవలసిన అవసరాన్ని గుర్తించాలి. తాను ఆ పని చేయగలననే ఆత్మనిశ్వాసం కల్గడానికి మనిషి తననుతాను గుర్తించుకోవాలి. అదే, మనిషి మనిషిగా పునర్జన్మ యెత్తడమంటే ...

" ప్రగతి శక్తుల పెరుగుదల కుంటుపడని దేశాల్లో సంక్షోభం ఎంతో కాలం వుండదు. కొత్తశక్తులు ముందుకు వచ్చి, సమాజం ముందు కొత్త భావాలను, ఆదర్శాలను వుంచి ప్రజలకు స్ఫూర్తిని ఇస్తాయి. చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమవుతుంది. ఆ విధంగా సంక్షోభాన్ని అంతం చేయడాన్నే రినైజాన్స్ అంటాం. రినైజాన్స్ అంటే పునర్జన్మ. (జ్ఞాన పునర్వికాసం). అది చారిత్రక పదం. మధ్య యుగాల అంధకారం నుంచి బయట పడడానికి యూరపు సతమతమవుతున్న రోజుల్లో ఆ పదం వాడుకలోకి వచ్చింది.

మన దేశంలో రివైవలిస్టు (మత పునరుజ్జీవన) ఉద్యమంవుంది. ఈ దేశంలో మానసిక వాతావరణాన్ని మొత్తాన్నీ అది పాలిస్తూ వుంది. ఇటీవల పెరుగుతూవున్న రివైవలిస్టు ఉద్యమం దురుద్దేశ పూరితమైనది. అది అత్యంత ప్రమాదకరమైనది.

సామాజిక సాంస్కృతిక వెనుకబడిన తనం ఒక మురికి గుంట. అందులో పుట్టిన విప్లవ ప్రతీఘాతక భావాలకు, ఆదర్శాలకు నైతిక బలాన్ని చేకూర్చుకోవడమే రివైవలిస్టు లక్ష్యం. స్వర్ణయుగం గురించిన కట్టుకథలు, ఐక్యత, సామాజిక సామరస్యత గురించిన గొప్పలు చెప్పుకోవడం జాతీయవాద నియంతృత్వానికి అవసరం. కాని, యూరోపియన్ రినైజాన్స్ ఉద్యమాన్ని అధ్యయనం చేస్తే, మనకు మరొక విషయం స్పష్టమవుతుంది. యూరోపియన్ రినైజాన్స్‌లో వారు వెనక్కు చూచినట్లు కన్పించారంటే, ఖచ్చితంగా దానికి వ్యతిరేకమైన దిశలో మానవాళి ముందు నూతనదృక్పథాన్ని అవిష్కరించడానికే. భారతదేశంలో మనం కూడా అలానే ప్రవర్తించవలసి వుంటుంది. ప్రాచీన విజ్ఞానంలో ఏదిమేలైనదో, ఏది చిరంతనమైనదో, దాన్ని మనం తీసుకోవలసి వుంటుంది. ఏది భారతీయ నాగరికతగా, సంప్రదాయంగా మన ముందుకు వచ్చిందో, దాన్ని మనం తిరస్కరించవలసి వుంటుంది. మన సంప్రదాయంగా ఈనాడు మన ముందున్నదంతా మత ఆలోచనల పంచకూళ్ళ కషాయం. ఈనాడు భారతీయ తత్వశాస్త్రంగా చలామణిలో వున్నదేదైతే వున్నదో, అది తత్వశాస్త్రం కాదు – ఆస్తికత్వం.

"భారతదేశంలో రినైజాన్స్ ఉద్యమం రాలేదు. రినైజాన్స్ అనబడే తాత్విక విప్లవం ఇక్కడ జరిగి వుండవలసింది. కానీ, దాని ప్రాచీన వారసత్వంలోని అనివార్య దుర్లక్షణం వల్ల ఆ పని జరగలేదు".

"గతస్మృతుల మీద ఆధారపడి మనం బ్రతకలేము. గత వైభవాన్ని తలచుకొని వుబ్బి తబ్బిబ్బయి పోయే ధోరణి నుంచి మనం విముక్తులం కావాలి. గతం మృతం. దాన్ని పూడ్చిపెట్టగలిగే ధైర్యం, ఇంగితం మనకు కావాలి. గతానికి బందీలైనవారు భవిష్యత్తుకు అధికారులు కాజాలరు".

"ప్రాచీన భారతీయ విజ్ఞానం, ప్రాచీన దార్శనికుల బోధలు మనకు చేరేటప్పటికి విచిత్రమైన ప్రక్షిప్తాలతో భారీగా కలుషితమై పోయాయి. తప్పుడు భాష్యాల ద్వారా మాత్రమే వాటి గురించి మనకు తెలుస్తున్నది. ఆ స్తికవాద వంచనల నుంచి, మత ఛాందసం నుంచి వాటిని విముక్తం చేయాలంటే, చరిత్రను విమర్శాత్మకంగా అధ్యయనం చేసి, శాస్త్రీయంగా వునర్నిర్మించవలసి వుంటుంది. విప్లవోత్సాహం, సత్యాన్వేషణాసక్తి, పాండిత్యం, అధునిక శాస్త్రీయపద్ధతులు అధారంగా పరిశోధన చేయాలనే అసక్తికల మేధావులు సౌభ్రాతృత్వంతో కృషి చేసినప్పుడే అదిసాధ్యమవుతుంది. చచ్చిన గతాన్ని తిరిగి మనం బ్రతికించలేము. రినైజాన్స్ అంటే రివైవల్ కాదు. అది వినూత్న జీవిత వికాసం. ఇప్పటి పరిస్థితినిబట్టి అంచనా వేస్తే, గతం దోషరహితమైనది కాదని తేలుతుంది. ఆ అంశమే మన చారిత్రక దృక్పథాన్ని నడపాలి. అదీ రినైజాన్స్ భావం".

# అనుబంధాలు

[ఒక్కమాట :

రాజమండ్రిలో విక్రమ్ హాలులో 1981 జనవరి చివరి వారంలో హేతువాద బహిరంగసభ జరిగింది. నా ప్రసంగంలో హిందూ వర్ణ వ్యవస్థను గురించి ప్రస్తావిస్తూ మనీషాపంచకం ద్వారా శంకరుడు వర్ణవ్యవస్థకు వ్యతిరేకమయిన భావాలు వెల్లడించిన వెంటనే ఆయన శిష్యవర్గమే ఆయన్ని హత్యచేశారని నేను పేర్కొన్నాను. ప్రసంగాంతంలో శ్రోతల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం హేతువాదసభల్లో ఆనవాయితీ. ఆ ప్రకారమే ప్రసంగానంతరం వచ్చిన సుమారు 50 ప్రశ్నలకూ నేను సమాధానాలు చెప్పాను. శంకరాచార్యుడి హత్య ప్రస్తావనను గురించి ఆ సభలో నా ముందుకు యెలాంటి ప్రశ్నకూడా రాలేదు.

కానీ, 14-2-81 న స్థానిక "సమాచారమ్" పత్రికలో "శంకరాచార్యుడు హత్య చేయబడ్డాడా?" అని ఒక లేఖ వెలువడింది. శంకరుడు హత్యచేయ బడ్డాడనడానికి గ్రంథప్రమాణం కావాలని తాను ప్రశ్నించినట్లూ-వారికి సమాధానం చెప్పకుండానేను దాటవేసినట్లూ "విశాఖ" అనేవారు ఆ లేఖలో ఆరోపించారు. మతవారసత్వ దోషంవల్లనే 'విశాఖలూ', 'జ్యేష్ఠలూ' అభాండాల్ని వార్తలుగా మారుస్తుంటారు. వెంటనే "సమాచారమ్" పత్రికకు నేను సమాధానం పంపాను. ఆ లేఖారచయిత తన పొరపాటుకు విచారం వెలిబుచ్చారన్న కారణం చూపి, పత్రికవారు సమాధానాన్ని ప్రచురించలేదని మిత్రుల భోగట్టా.

అనంతరం 16-4-81 న రాజమండ్రిలో లయన్ దుర్గా వెంకటరమణారావు కళ్యాణమండపంలో మరొక హేతువాద బహిరంగ సభ జరిగింది. (అందులో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ ఆవుల సాంబశివరావు, "ఈనాడు" చీఫ్ ఎడిటర్ చెరుకూరి రామోజీరావుగారలు కూడా పాల్గొన్నారు). నా ప్రసంగంలో శంకరుడు సహజ మరణం పొందలేదనీ, ఆయన శిష్యగణమే ఆయన్ని హత్యచేశారనీ, కాకుంటే యెలా మరణించాడో ఎవరైనా సాధికారంగా చెప్పవచ్చుననీ, అది శంకరపీఠాల వారి ముందున్న సవాల్ అనీ నేను స్పష్టం చేశాను. శంకరుడు హత్య కావించబడ్డాడను కోవటానికి గల కారణాలను నేను వైనంగా వివరించాను. ఆ అంశం మీద ప్రశ్నలు రాలేదు. అనంతరం ఏప్రిల్ "చార్వాక" (నెం. 56) లో "శంకరాచార్యుడి హత్య" అన్న వ్యాసాన్ని విడుదల చేశాను. అదే ఇందులో మొదటి భాగం. ఇప్పటికీ శంకర పీఠాలవారి ముందున్న నాసవాల్‌కి సమాధానం లేదు. "శంకరుడు హత్య చేయబడి వుండకపోతే ఏమైనాడు" ?

ఆ తర్వాత కొన్నాళ్ళకు రాజమండ్రిలో ఒక బహిరంగ మతోపన్యాసం జరిగిందట! అందులో "చూచారా, శంకర భగవత్పాదులంతటి వారిని 'లంజ కొడుకు' అని హేతువాదులు దూషిస్తూ వ్రాస్తున్నారు?' అని ముక్కు మీద వేలేసుకున్నారట 'గాలి' వారు. ' ఎవరు వ్రాశారు? ఎక్కడ వ్రాశారు?" అని అక్కడి హేతువాద మిత్రులు నిగ్గదీస్తే, "చార్వాక" మీదకు పోయిందట ఆయన చూపుడు వేలు. చార్వాకలో శంకరాచార్యుడి... లంజ కొడుకు తనాన్ని గురించి ప్రస్తావించిన వ్యాసం నాదే. అయితే శంకరుణ్ణి ' .....లంజ కొడుకు' అని నేను అనలేదు. పురోహిత పండితవర్గమే అలా వ్రాశారని వారు వ్రాసిన శ్లోకాలనే నేను ఉదహరించాను. ఆ చార్వాక సంచిక ప్రతిని ఆయనముందు పడేసి "హేతువాదులు శంకరుణ్ణి నిందించిందెక్కడ? చూప" మని మా మిత్రులు పట్టుబడితే, ఆయన గుడ్లు తేల వేశారట. నిజమనేదానికి మతవాదులు బద్ధశత్రువులు అందుచేత అబద్ధాలను ఆశ్రయించకపోతే, వారికి మనుగడే లేదనడానికి ఇవి ఉదాహరణలు. అలాంటి చౌకబారు విమర్శలకు సమాధానంగానే శంకరాచార్యుడి శీలాన్ని గురించి రెండో భాగంలో పరిశీలించవలసి వచ్చింది. ఇక చదవండి.]

( ఈ వ్యాసాలు పుస్తకరూపంపొందిన తొలిముద్రణ 1983లోను, మలిముద్రణ 1991 లోను జరిగింది. మూడోముద్రణగా ఈ పునర్ముద్రణలో చోటుచేసుకుంటున్నాయి.)

# 1. శంకరాచార్యుడి హత్య

It was we  sa'd that the Chr'stia'n Church never ceased to burn heret'cs because 't fe t ıt was the wrong th'ng to do. It gave up that po icy when heretics made it pla'n that they were strong enough to resist the roasting.

*- Chapmen Cohen*

ఏసుక్రీస్తు కథకీ–శంకరాచార్యుడి కథకీ కొంత తేడా వున్నా, కొన్ని పోలికలు కూడా లేకపోలేదు. కథల ప్రకారమైతే ఒకరు అధవకీ–మరొకరు విధవకీ పుట్టారు. ఇద్దరూ మహత్యాలు చేసినట్లు కథలున్నై. కన్యకకు పుట్టినట్లు చెప్పబడ్డ ఏసు శిలువ (కొరత) వేయబడి మూడవరోజు లేచాడన్నారు. వితంతువుకు పుట్టినట్లు చెప్పబడ్డ శంకరుడు హత్యచేయబడ్డట్లు జనశ్రుతి వుంది. నేరుగా బొందితో కైలాసానికి వెళ్ళినట్లు కూడా కథలు లేకపోలేదు.

అసలు ఏసుక్రీస్తు అనేవ్యక్తి పుట్టలేదు అనే వాదం కూడా వుంది. ఐనా ప్రపంచం నాల్గు చెరగులా క్రైస్తవం వ్యాపించింది. ఏసును రక్షకుడిగా, దేవుని బిడ్డగా కొలుస్తూనే వున్నారు.

శంకరుడి కథ అంతగా జనానికి తెలియదు. భజన చేసే వారికే యేమంత తెలియదు. ఆయన మహత్యాలను గురించి వందించడం తప్ప, ఆలోచన చేయరు. శంకరాచార్యుడి పుట్టుక విషయంలో, చావు విషయంలో శంకర మఠాలకు వెలుపల యీ దేశంలో యింతవరకు వివాదం లేదు. పీఠాలవారు మాత్రం "ఇక్కడంటే యిక్కడ" అని తన్నుకొంటూనే వున్నారు. సాక్షాత్తు పరమ శివుడే శంకరుడుగా అవతరించాడని ఎంత ప్రచారం జరిగినా, ఆయన మతం మఠాల పొలిమేరలు దాట లేదు. ఆయన భజన సాగలేదు. ఆయన దేవుడు కాలేదు. ఆయన హత్య వెలుగులోకి రాలేదు. హంతకులు ఆంతరంగికులు కావడమే యీ విపర్యయానికి కారణం.

క్రీస్తును సాంఘిక విప్లవకారుడుగా వర్ణించే వారున్నారు, కారుణ్యమూర్తిగా కొనియాడేవారున్నారు. కారుణ్యంతో కూడిన ఎన్నో కథలు, గాథలు, సూక్తులు క్రీస్తు పేరుతో ముడిపడివున్నై. అయినా క్రైస్తవం పేరు మీదుగా ఎన్నో యుద్ధాలు జరిగినై. ఎంతో విధ్వంసం, హింసా కాండ, జన సంహారం జరిగింది. క్రీస్తు చరిత్ర అబద్ధమైతే కావచ్చుకాని, క్రైస్తవం పేరిట జరిగిన మారణహోమం మాత్రం చారిత్రక సత్యం.

శంకరుడు సాంఘిక విప్లవ విరోధి మాత్రమే కాదు-నిరోధికూడా. అలాగే తాత్విక విప్లవ విధ్వంసి కూడా. ఆయన భాష్యకారుడే కాని, తాత్వికుడు కాదు. ఆయనలో యుక్తివాదం తప్ప, వైజ్ఞానిక నిజాయితీ కన్పించదు. కారుణ్యం అతని గాథల్లో మచ్చుకైనా దొరకదు. వస్తుతః హింసాత్మకమైన వర్ణవ్యవస్థను దృఢతరం చేయడంకోసం ఆయన స్వయంగా దారుణమైన హింసాత్మక పద్ధతుల్ని అవలంబించాడు. ఆయన లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం ఆయన వర్గం అన్యమత శాఖీయులపట్ల కిరాతకంగా ప్రవర్తించినట్లు బోలెడు చరిత్ర సాక్ష్యం పలుకుతున్నది.

హిందూమతం హింసా దౌర్జన్యాలకు తోబుట్టువనే విషయాన్ని నోరులేని రాళ్ళు నోరు తెరచుకొని చెపుతున్నాయి. ఎందుకంటే, భారతదేశంలో రాళ్ళు రప్పలమీద నుంచి వచ్చిందిగా తప్ప, చరిత్ర లేదు. తాటాకుల దస్తరాల్లోవున్న దంతా పురాణమేకాని, చరిత్రకాదు, చరిత్రను పురాణంగా వ్రాయడంలో మన పండితులు సిద్ధహస్తులు. వాస్తవాన్ని మిధ్యగానూ, మిధ్యను వాస్తవంగానూ చిత్రించడంలో అందెవేసిన చేతులు. మన ప్రాచీన గ్రంధాల్లోని పాత్రధారులంతా దేవతలూ, రాక్షసులేకాని-మనుషులు కారు. ఎక్కడైనా మనుషులుంటే, వాళ్ళు దైవాంశ సంభూతులు. మనుషులకు మామూలు పద్ధతిలో పిల్లల్ని పుట్టించే వ్యవహారం మన పురాణ కర్తలకు నచ్చదు. పిల్లలేక ఏడుస్తున్న దేవుళ్ళకే వాళ్ళు మనుషుల్లాంటి వాళ్ళను పుట్టించారు. నిజానికి హిందూ దేవుళ్ళకు పెళ్లాలయితే ఉన్నారుకాని, వాళ్ళవల్ల సహజంగా, అందరకూ పుట్టే విధంగా పుట్టిన పిల్లలు లేరు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకే గతి లేదు. అయినా, అలాంటి వాళ్ళ దయవల్ల పుట్టినవారే ప్రసిద్ధ పురాణ పురుషులంతా. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం ఆ పురాణ పురుషులంతా ఏ కులాలకు చెందుతారో మరి?

## జనన సమాచారం

క్రైస్తవుల దేవుడైన యెహోవాకు పెండ్లాం లేదు. ఆయన బిడ్డ అయిన ఏసుకు పెండ్లే కాలేదు. ఇక అల్లాకు పెండ్లామే లేదు పొమ్మన్నాడు మహమ్మదు. ఎంత మంది పెళ్లాలతో ఎన్ని తంటాలుపడ్డా, మహమ్మదు ప్రవక్తకు బ్రతికి బట్టకట్టే ప్రయోజకుడే పుట్టలేదు. అద్వైత మతాచార్యుడైన ఆది శంకరుడి చరిత్రకు సంబంధించిన విచిత్రమేమంటే, ఆయన తన అబ్బ అమ్మలకు పుట్టినట్లుగా ఏ శంకర పురాణంలోనూ లేదు. సంతానం లేని ఆర్యాంబ(?) నానాపాట్లు పడితే, చివరకు సాక్షాత్తు పరమ శివుడే ఆమె గర్భంలో (ఎటునుంచో) దూరి, (ఎటునుంచో) బయటకు వచ్చాడంటాయి చాల శంకర పురాణాలు. అద్వైతులు కూడా ఆయన్ని పరమ శివుడి అవతారంగానే

ప్రచారం చేస్తుంటారు. ఈయనకు పెండ్లి కాలేదు. కాని, బ్రహ్మచారిగా నిలబడలేక పోయాడు. పరాయి ఆడవాళ్ళ కోసం ఆయన పరకాయ ప్రవేశ విద్యకూడా నేర్చుకున్నాడు. ఇతరుల శరీరాల్లో దూరి (?) వ్యభిచారం చేస్తే సన్యాసానికి భంగం కల్గదేమో, అద్వైత సన్యాసులే చెప్పాలి!

నిజమెంతో మనం నిక్కచ్చిగా చెప్పలేము కాని, శంకరాచార్యుడి జన్మ విధానాన్ని గురించి కొన్ని గాధలున్నాయి. వాటిని కూడా ప్రసిద్ధ సంస్కృత గ్రంథాలే క్రోడీకరించి వుంచాయి. ఆ కాలంలో ఈ దేశంలో ఏమి వ్రాయగల్గినా-చేయగల్గినా, అవకాశం-అధికారం పురోహిత పండితవర్గం చేతుల్లోనే వుండిపోయింది. సంస్కృతం వారి కులభాష. నాటినుండి మనకు దిగుమతి అయిన గ్రంథాలన్నీ సంస్కృతంలోనే వుండిపోయినాయి. ఆ గ్రంథాలను (గురు) వంశపారంపర్యంగాకాపాడుకొంటూ వచ్చినవారు పురోహిత కుటుంబాల వారే. కాబట్టి, శంకరుడి కథల్ని క్రోడీకరణ చేసినవారంతా ఆ వర్గ సంప్రదాయానికి చెందినవారే అయివుండాలి. లేకుంటే, అద్వైత శంకరుణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడని ఎవరు తిట్టగల్గి వుంటారు? ఆ తిట్టే అవసరం – "అలా" తిట్టే అవసరం మరొక వర్గానికి యెందుకుంటుంది? ఉంటే మాత్రం, అవి గ్రంథాల్లో దాక్కొని మనదాకా రావడం యెలా సంభవం?

మణి మంజరి అనే గ్రంథం ప్రకారం శంకరుడు సంకరుడు. బ్రాహ్మణ జారిణికి పుట్టినవాడు. ప్రసిద్ధమైన రండా గర్భాలన్నింటికీ దైవాంశం అతికించినట్లుగానే శంకరుడికీ ఆ పనే చేశారు.

**తమేవ సమయందైత్యో, మణిమానప్య జాయత**
**మనోరథేన మహతా, బ్రాహ్మణ్యాం జాతః ఖలాత్**
**ఉత్పన్నస్సంకరాత్మాయం, సర్వకర్మ బహిష్కృతః**
**ఇత్యుక్తస్స జసైర్మాతా,శంకరేత్యాజు హోవతం.**

వైదిక సంస్కృతి తలకెక్కిన చాదస్తులు శంకరుడు...ంజ కొడుకు అనేందుకు ప్రమాణమేమిటి అని ప్రశ్నిస్తారు. ప్రమాణమంటే గ్రంథ ప్రమాణమని వారి తాత్పర్యం. గ్రంథమంటే సంస్కృత శ్లోకాలున్నదేనని వారి విశ్వాసం. అందుకే "మణిమంజరి" ప్రమాణం ప్రకారం శంకరుడు సంకరుడనీ, సర్వకర్మ బహిష్కృతుడనీ వైదికఛాందసు లంగీకరించాలి. ఎందుకంటే, గ్రంథ ప్రమాణాలమీద వారికి వల్ల మాలిన అభిమానం.

"స్కాంధం" కూడా మణిమంజరి కథనాన్నే బలపరుస్తున్నది?

సమయాశ్చ పథాచార: కాలసిద్ధాంత సంవిదః

తేషాం మధ్యే సంకరస్తు, పూర్వ యో మణిమాస్థలః

కాలడి గ్రామజోరుద్ర, వరాల్లోకాన్ వి మోహయన్.

కాబట్టి స్కాంధం ప్రకారం కూడా కాలడీగ్రామజుడైన శంకరాచార్యుడు జాతి ఛాందసుల దృష్టిలో జాతిభ్రష్టుడే. అందువల్ల "శంకరుణ్ణి అగ్రవర్ణస్థులు" హత్య చేశారని ఏగ్రంథంలో వున్నది?" అని ప్రశ్నించే వాళ్ళు గ్రంథాలన్నిటిలోనూ పరస్పర విరుద్ధంగా వున్న అసత్యాలను సమన్వయం చేయాలి. గ్రంథస్థం చేయబడని సత్యాలను బయటకు లాగాలి. అమరావతీ స్థూపాన్ని చదునుచేసి, దానిమీద శివాలయం కట్టించినట్లు ఏ గ్రంథాల్లో నమోదై వున్నది? ఏ గ్రంథాల్లోనూ లేకపోయినా అది వాస్తవం కదా? గ్రంథప్రమాణాలను డిమాండు చేసేవారు ఆ గ్రంథాలు ప్రమాణంగానే శంకరుడు జారిణీపుత్రుడని అంగీకరించాలి.

ఇక్కడ శంకరుడు రండాగర్భాన పుట్టాడా? 'ప్రతివ్రత' కడుపున పుట్టాడా? అనేవి ప్రధానాంశాలు కావు. ఏ తండ్రికి పుట్టినా, ఏదో ఒక తల్లికే పుట్టాడనడంలో తగాదా లేదు. కాని, సాక్షాత్తు పరమేశ్వరుడే అమె గర్భంలోదూరితే, హిందువులే అపభ్రంశంగా పరిగణించే ఇలాంటి చరిత్ర అతనికెలా ఆపాదించబడింది? అనేది ప్రశ్న. 'తా దూర సందులేదుకాని, మెడకొక డోలా?' అన్నట్లు, తమ పెండ్లాలకు పిల్లల్ని పుట్టించలేని దేవుళ్లు ఏరండలకో పిల్లల్ని పుట్టించడమేమిటి? అనేది ప్రశ్న.

ఇంతకూ శంకరాచార్యుడి తల్లితండ్రు లెవ్వరన్న ప్రశ్నకు శంకరచరిత్రలు ఏకముఖంగా సమాధానం చెప్పడంలేదు. శంకరుడి తల్లి ఆర్యాంబ అని కొన్ని గ్రంథాలు, సతీదేవి అని మరికొన్ని గ్రంథాలు, విశిష్ట అని ఒకచోట, శ్రీ మహాదేవి అని మరొకచోట! ఇందులో ఏది శంకరుని తల్లిపేరు? అలాగే శంకరుని 'తండ్రి' పేరుకూడా రకరకాలుగా పేర్కొనబడివుంది. శివగురువని కొన్ని గ్రంథాలు, (శివశర్మ అనికొన్ని), విశ్వజిత్తు అని అనంతానందగిరి శంకర విజయం, భైరవదత్తు అని భవిష్యపురాణం. శంకరుడి తల్లితండ్రుల పేర్లు ఇలా రకరకాలుగా ఎందుకున్నై? అనేది యిప్పటికీ తెలియని సమస్యే.

పోతే, శంకరాచార్య డెక్కడ జన్మించాడు? కేరళలోని శశలగ్రామంలో అని శివ రహస్యం, మాణిక్యవిజయం అనే గ్రంథాలు చెపుతున్నాయి. కానీ, గురు పరంపరాది గ్రంథాల్లో శంకరుడి జన్మస్థానం కాలటి గ్రామం అని వుంది. అనంతా

నందగిరి శంకర విజయంలో శంకరుడి జన్మస్థలం చిదంబరం అని వుంటే, శృంగగిరి (శృంగేరి) పేరుకూడా యిచ్చాడు వీరేశలింగపంతులు.

మరొకప్రశ్న యేమంటే శంకరుడెప్పుడు పుట్టాడు? అనేది. విభవనామ సంవత్సరంలో అని ఒకచోట, నందన అని ఒకచోట, సర్వజిత్తు అని ఇంకొకచోట, విళంబి అని మరొకచోట వుంది. అయితే యీ నాల్గు 'నామ' సంవత్సరాలూ ప్రతి 60 సంవత్సరాల కొకసారి తిరిగివస్తుంటై. అందులో ఏ విభవ, ఏ నందన, లేక ఏ సర్వజిత్తు, ఏ విళంబి? చరిత్ర పరిశోధకులు శంకరుడి కాలాన్ని 8వ శతాబ్దానికి తెచ్చారు. శంకరుడు జీవించిన కాలం 32 సంవత్సరాలు మాత్రమే అనేది నిజమైతే, ఆయన జననం క్రీ.త. 788, మరణం 820 అని వారి అంచనా. అయితే శంకరుడు బ్రతికినకాలం 32 సంవత్సరాలని ఒకచోట, సన్యాసం పుచ్చుకొన్న తర్వాత 32 ఏళ్ళని ఒకచోట వుంది. కాదు, 30 సంవత్సరాలని, 38 సంవత్సరాలనీ కూడా వున్నచోట్లు వున్నై. విచిత్రమేమంటే పీఠాలవారు శంకరాచార్యుడి జననకాలాన్ని క్రీ.పూ. 509 నుంచి క్రీ.త. 8వ శతాబ్దం వరకు రకరకాలుగా నిర్ణయిస్తున్నారు. కంచివారు క్రీ.పూ. 509 దగ్గరే కూర్చున్నారు. శృంగేరివారు క్రీ.త. 684 వరకు చేరారు. వీరి ప్రకారం సురేశ్వరాచార్యులు శృంగేరి పీఠాన్ని 800 సంవత్సరాలు యేలారు. క్రీ.శ. 805 వరకు చేరినవారుకూడా వున్నారు. ఈ 1300 సంవత్సరాల మధ్య శంకరాచార్యుడింకా పుడుతూనే వుంటాడు. దీన్ని పురాణమందామా? చరిత్ర అందామా?

ఇందులోనే శంకరుడి జనన ముహూర్తం ఒక ఉపప్రశ్న. వైశాఖ శుద్ధదశమి నాడని ఒకచోట, పంచమినాడని మరొకచోట వుంది. గురువంశకావ్యం ప్రకారం కర్కాటకంలో, చంద్రుడు లగ్నంలో, గురు-శని-రవి-కుజులు ఉచ్చలో వుండగా శంకరుడు పుట్టాడట! పరంపరా చరిత్రప్రకారం ఆయన పుట్టినపుడు శుభకేంద్రంలో గురుడు, ఉచ్చలో మూడు గ్రహాలు ఉన్నాయి. మాధవీయ శంకరవిజయం ప్రకారం గురుడు కేంద్రంలో, రవి-కుజ-శనులు ఉచ్చలో వుండగా పుట్టాడు. దీన్నంతటినిబట్టి ఆయా రచయితలు శంకరుడి వ్యక్తిత్వాన్ని తమకు తెలిసిన జ్యోతిష విధానానికి అన్వయించి శంకరుడి జన్మ నక్షత్రాలు తేల్చారేమోననిపిస్తుంది. శంకరుడి పేరవున్న

అథ్వాష్ట మీత్యథ్య చతుర్థశీతి జ్యోతిష్క వాచోపవసంతీ భక్త్యా
అహోత్రశుతే స్తత్వ మశీవి వాక్యం న విశ్వసం త్యద్భుత మేతదేవ

అనే శ్లోకాన్నిబట్టి శంకరుడికే గ్రహఫలాలమీద నమ్మకం లేదని తెలుస్తుంది. అయినా శంకర శిష్యులకు అది లెక్కేముంది? పరస్పర వైరుధ్యాలను ఏకకాలంలో నమ్మడానకి

వారు తమ వివేచనకు తర్ఫీదు యిచ్చుకున్నవారుకదా? అందుచేత తాము వ్రాసిన శంకరపురాణాల్లో ఎవరి ముక్కుకు సూటిగా వారు వ్రాసుకున్నారు. అందుచేత ఒక్కొక్కదానిలో ఒక్కొక్కవిధంగా వున్నది. అసలు గ్రహజ్యోతిష్యమే వైరుధ్యాల పుట్టకదా!

## మరణ సమాచారం

శంకరుడు పుట్టాడో లేదో, గిట్టాడో లేదో, ఇదమిద్ధమని తేల్చవలసిన బాధ్యత మనమీద లేదు. అలాంటి వాడొకడున్నాడన్నా, లేడన్నా మనకు పోయేదేమీ లేదు. ఆయన ఎవరికి పుట్టాడో, ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, ఎలా పుట్టాడో, ఎన్నాళ్ళు బ్రతికాడో అనే విషయాల్లో మాత్రమేకాక-ఎప్పుడు మరణించాడో, ఎక్కడ మరణించాడో, ఎలా మరణించాడో, ఆయన శవాన్ని యెక్కడ పూడ్చి పెట్టారో, లేక యేమిచేశారో-అనే విషయాల్లో కూడా శంకరపీఠాల మధ్య తగాదా వుంది. శంకరచరిత్రను తెలిపే గ్రంథాలమధ్య కూడా ఆ విషయంలో ఏకీభావం లేదు.

శంకరాచార్యుడి సమాధి ఎక్కడ ఉన్నదో ఏ శంకరపీఠంవారూ 'ఫలానచోట' అని యీనాటికీ నిర్ధారణగా చూపలేకపోతున్నారు. ఎప్పుడైనా యెవరికివారు యేదో ఒక శవాన్ని పూడ్చిపెట్టి 'ఇవిగో శంకరుని అస్తులు' అని తగాదా పెట్టారేమో తెలియదు. కాని, శంకరుడింకా చావలేదని పిడివాదం చేసేవారు సైతం వున్నారు. మనది చిరంజీవుల దేశం కదా! అయినా కనీసం పీఠాధిపతుల తగాదా తీర్చడానికైనా ఆ చిరంజీవి తొంగిచూడలేదు.

బదరిలో కేదారనాథ మందిరం వెనుకభాగంలో 150 గజాల దూరంలో ఒక దిబ్బమీద 12 అడుగుల చదరంవున్న రేకు ఒకటి వున్నదట. అదే శంకరుడి సమాధి అని అక్కడివారు చూపుతారట. అది జీవసమాధో, లేక శవ సమాధో.

కాని, అన్ని పీఠాలుకాని, శంకరచరిత్రను తెలిపే గ్రంథాలన్నీకాని, ఈ విషయాన్ని అమోదించవు. బ్రహ్మాండ పురాణ సారంగా చెప్పబడే మాణిక్య విజయంలో:

**సూత్ర గీతోపనిషదాం బాష్యాణిసు మహాన్యపి**

**అబ్దా త్రింశద్వర్ష మర్వ్యాం స్థిత్వాఽ_గాద్గిరిశీ లయం**

అంటూ 30 సంవత్సరాలు బ్రతికిన శంకరుడు నేరుగా కైలాసానికి వెళ్ళిపోయినట్లుంది. బొందితో కైలాసానికి పంపించడం మనవాళ్ళకు మంచినీళ్ళ ప్రాయం కదా! చిద్విలాసుడి

శంకర విజయం ఆ వాదానికి కొంచెం మలువు యిచ్చింది:

దత్తాత్రేయ గుహద్వారాత్ కైలాస గమనం గురోః

అంటూ శంకరుడు బదరికాశ్రమంలోని దత్తాత్రేయ గుహద్వారం ప్రవేశించి, అక్కడ నుంచి కైలాసానికి వెళ్ళాడంటుంది. సదానందుని శంకరవిజయం ప్రకారం :

అరు హ్యోక్షాణమగ్ర్యకం సన్ నైజంధామ పరంమయౌ
బ్రహ్మాదీన్ హర్షయన్ దేవాన్ కైలాసస్థాంచ పార్వతీం

శంకరుడు శివుడి ఎద్దును ఎక్కి తన స్వగృహమైన కైలాసానికి వెళ్ళిపోయాడట! అప్పటిదాక పార్వతి ఎలా బాధపడిపోతూ వుందో యేమో, శంకరుడు పరకాయ ప్రవేశం చేసినపుడు అమె ఏకాయ ప్రవేశం చేసిందో, మరొక శంకరుడు బయలుదేరి మరొక అమరుకమో, శృంగారలహరిలో వ్రాసేదాకా మనకు తెలియదు.

మాధవుడి శంకర విజయం ప్రకారం శంకరుడు శిష్యులతో పాటు బదరీ వెళ్ళి, అక్కడ నుంచి 80 మైళ్ళ దూరంలో వున్న కేదారక్షేత్రం పోయి, ఆ పిదప కైలాసం చేరాడు.

శృంగేరి గురుపరంపరను గురించి చెప్పే, గురువంశ కావ్యం, పై కథలకు భిన్నంగా మరొక కథనం యిస్తుంది. చివరి రోజుల్లో శంకరాచార్యుడు నేపాల్ లోని సిద్ధేశ్వరం నుంచి దత్తాత్రేయాశ్రమానికి వెళ్ళి, అక్కడ దండ-కమండలాలు త్యజించగా దండం చెట్టుగాను, కమండలం చెరువుగానూ మారిపోయినవట! ఆయన మరాట్వాడాలోని మాహురీ పురిలో దత్తాత్రేయా శ్రమంలో దత్తాత్రేయుడితో చర్చిస్తూ కూర్చుండి పోయాడట! అంటే శంకరుడింకా చావలేదన్నమాట!

గోవిందనాధుడి కేరళీయ శంకర విజయం ఇంకొకతమాషా కథ చెపుతుంది. శంకరుడు తిరుచూరులోని వృషాచలం మీది దేవాలయ గర్భం నుంచి కప్పుకు తూటు పొడిచి, సూర్యమండలంలోకి వెళ్ళిపోయాడట! ఆ దేవాలయ గర్భగుడిపైన యిప్పటికీ బొక్క వుందేమో మనకు తెలియదు.

శంకరుణ్ణి గురించి శ్రీనివాస అళయ వ్రాసిన సంస్కృత కావ్యంలో శంకరుడు చివరిసారిగా కాశ్మీరులో కన్పించాడంటారు. "కొందరాచార్యుల వారు మత వ్యాపనం నిమిత్తం యవన(గ్రీసు) దేశానికి పోయి అక్కడ సిద్ధి పొందాడని చెపుతారు" అని వీరేశలింగం పంతులు వ్రాసారు.

ఇక, కంచి కామ కోటి పీఠంవారు ఉత్తరాది వారిదంతా మోసమనీ, వారి కథలన్నీ ఫోర్జరీలనీ అంటున్నారు. శంకరుడి సమాధి కంచిలోనే వుందని రుజువుచేయడానికి గ్రంధాలు వ్రాయిస్తున్నారు. ఆ పని అన్ని పీఠాలవారూ చేసినప్పటికీ, కంచి వారు మరింత ఒడుపుగా చేస్తున్నట్లున్నారు. తమది ఆది పీఠమని కంచివారి వాదన. మఠామ్నాయం ప్రకారం అది పీఠమే కాదు. వారికి మహావాక్యంకూడా లేదు. చాలా విషయాల్లో శృంగేరీపీఠం వీరికి ప్రత్యర్థిగా కన్పిస్తుంది.

శంకరుని మరణం విషయంలో కంచిపీఠంవారు అనందగిరి శంకరవిజయాన్ని ప్రమాణంగా తీసుకోవాలంటారు. దానిప్రకారం శంకరుడు కంచిలోనే విదేహవిముక్తి పొందాడు. దానికి ప్రమాణంగా వారు కంచి కామాక్షి దేవాలయంలోని శంకరుడి నిలువెత్తు రాతి విగ్రహాన్ని చూపెడతారు. అది పద్మాసనంలోవున్న మూర్తి కాబట్టి, బుద్ధుడి విగ్రహమనీ, శంకరుడి విగ్రహమైతే యోగపద్మాసన స్థితిలో వుండేదనీ, కాబట్టి అది శంకరుడి విగ్రహం కాదు పొమ్మనీ అన్నారు మిగతా పీఠాలవారు.

అక్కడి దేవాలయ ప్రాంగణంలో యింకా చాలా బుద్ధ విగ్రహాలు దొరికాయట. అంటే, అక్కడ వున్న బౌద్ధస్థూపాన్ని ధ్వంసంచేసి, దానిమీద దేవాలయం నిర్మించారన్నమాట! శంకరుడి అత్యాచారాలకు గురికాకముందు కంచి ప్రసిద్ధిపొందిన బౌద్ధక్షేత్రం.

## *శంకరుడేమైనట్లు?*

ఇంతకీ శంకరుడు మరణించాడా, లేదా? మరణిస్తే, ఎక్కడ మరణించాడు? ఎక్కడ పూడ్చిపెట్టారు? - ఇప్పటికీ ఆ అంశాలమీద తమ నిర్ణయమే సరైనదని మిగతా పీఠాలవారిని ఒప్పించడానికి ప్రతి పీఠమూ తంటాలు పడుతున్నది. వారిది అంతుతేలని కుమ్ములాటగానే మిగిలిపోయింది. ఎవరిప్రచారం వారు చేసుకుంటున్నారు.

నిజానికి శంకరాచార్యుడు మామూలు చావు చావలేదు. అతన్ని హత్య చేసి వుండాలి. హంతకులెప్పుడైనా తాము హత్య చేశామని ఒప్పుకుంటారా? శంకర పీఠాలను యేర్పాటు చేసినవాడు శంకరుడేనని పీఠ నాయకులంతా అంటున్నారు. వాటికి తొలి పీఠాధిపతుల్ని కూడా ఆయనే యేర్పాటు చేశాడంటున్నారు. శంకరుడి నాటినుంచి యీనాటివరకూ శంకరమఠాలూ, పీఠాలూ పనిచేస్తూనే వున్నాయంటున్నారు. పారంపర్యంగా పీఠాధిపతుల నియామకం జరుగుతూనే వస్తున్నదంటున్నారు. ఇదంతా నిజమైతే ఆయన ఎక్కడ మరణించిందీ, ఎప్పుడు

మరణించిందీ, చావకుంటే ఏమైందీ చెప్పడంలో ఇంత వైరుధ్యం యెందుకు కన్పిస్తుంది? సత్యాన్ని సంప్రదాయం ఇన్ని విధాలుగా ప్రచారం చేసిందా? సత్యం ఇన్ని విధాలుగా గ్రంధస్థం చేయబడుతుందా? అలా చేయబడితే, అది చరిత్ర అవుతుందా? ఇందులో యెంత నిజం వుందో, అంత నిజమేకదా ఆయన దిగ్విజయకథల్లో కూడా వుండేది?

బ్రతికి ఉన్న కాలంలో శంకరుడు చేసిన లోకోద్ధరణ యేమిటి? చార్వాక బౌద్ధాది భావవిప్లవోద్యమాలను రూపుమాపాడు. సనాతనవైదిక మత వ్యతిరేకుల్ని ఎందరినో సర్వనాశనం చేశాడు. బౌద్ధారామాలను ధ్వంసం చేయించాడు. బౌద్ధస్థూపాలను నేలమట్టం చేయించాడు. ఆ దిబ్బలమీద హిందూ శివాలయాలనూ నిర్మింపజేశాడు. దీనికంతటికీ ఆనాటి పాలకుల అండదండలు చేకూర్చుకున్నాడు. శిధిలమైపోతున్న వైదిక వర్ణ వ్యవస్థని భావోద్యమాల శిధిలాలమీద పునర్నిర్మించాడు. బౌద్ధుల్ని క్రూరంగా హింసించిన సుధన్వాదులు బౌద్ధాన్ని, బౌద్ధుల్ని నాశనం చేయడానికీ, పాపిష్టి హిందూవర్ణ వ్యవస్థను పునరుద్ధరించడానికీ శంకరుడికి సహాయంగా నడుంకట్టి నిలబడ్డారు. ఆయారాజులు ఏయే కాలాలకు చెందినవారైనా, శంకర పీఠాలన్నీ వారి అండదండల్నీ, వారి వారసుల ప్రాపకాన్నీ పొందినవే. అన్య మతస్థుల పట్ల శాంకరులు ఘోరకలి జరిపినట్లు శంకరుడి సంకర చరిత్రలన్నీ సాక్ష్యమిస్తున్నాయి. అయితే హిందూ వర్ణవ్యవస్థకి యింతగా కాళ్ళు తెచ్చిన శంకరుణ్ణి ఆ వర్ణవ్యవస్థ వల్ల లాభాలుపొందే అగ్రవర్ణస్థులే హత్యచేసి వుండాలి. వాళ్ళే ఎందుకు చేశారింతపని? అని ప్రశ్నరావడం సహజమే. కాని, అందుకు కారణమైన ఒక గాధకూడా హత్యవిషయాన్ని కప్పిపుచ్చిన శంకర విజయాలన్నిటిలోనూ వుంది.

## మనీషా పంచకం కథ

అదేమంటే – కాశీలో వుండగా ఒకరోజు శంకరుడు గంగాస్నానం చేసితిరిగి వస్తున్నాడట. నాలుగు కుక్కల్ని వెంటబెట్టుకొని చండాలుడొకడు ఆయనకు యెదురుపడ్డాడట. ఆ చండాలుడెవరో కాదు, సాక్షాత్తు పరమేశ్వరుడేనట. కుక్కలు నాలుగూ నాలుగు వేదాలట. అంటే శివుడికి చండాల వేషమే నచ్చిందన్న మాట! అయితే, సాక్షాత్తు పరమశివుడే శంకరాచార్యుడుగా అవతరించినపుడు, అతడికెదురుపడడానికి మరొక పరమశివ చండాలుడు ఎక్కడ నుంచి వచ్చాడు? తర్కాద్వైతులైన శాంకరులు కవిత్వంలో మునిగి తర్కంతోపాటు, ఇంగిత జ్ఞానాన్ని కూడా వదిలేశారు.

ఆ చండాలుణ్ణి చూచి శంకరుడు "తొలగిపొందు, తొలగిపొందు" అన్నాడట. అప్పుడు చండాలుడు ఇలా ప్రశ్నించాడట:

1) అన్నమయాదన్నమయ మథవా చైతన్యమేవ చైతన్యాత్
ద్విజవరదూరీకర్తుం వాంఛసి కిం బ్రూహి గచ్ఛగచ్ఛేతి ॥

2) కిం గంగాబుని బింబితోఽంబురమణౌ చండాలవాటీ పయః
పూరే చాంతరమస్తి కాంచన ఘటీ మృత్కుంభయోర్వాఽంబరే॥

3) ప్రత్యగ్వస్తుని నిస్తరంగ సహజా నందావ బోధాంబుధౌ
విప్రోఽయంశ్వపచోఽయమిత్యపిమహాన్ కోఽయం విభేదభ్రమః॥

అంటే-ఓద్విజవరా, "పొందు పొం"దంటూ నీవు అన్నమయ శరీరం నుంచి అన్నమయ శరీరాన్ని దూరం చేయాలనుకుంటున్నావా! లేక చైతన్యం నుంచి చైతన్యాన్ని దూరం చేయాలనుకుంటున్నావా? గంగాజలంలోను, చండాలవాటిక నీటిలోను సూర్య ప్రతిబింబం వేరువేరుగా వుంటుందా? బంగారు కుండలోను, మట్టికుండలోను వుండే ఖాళీప్రదేశం వేర్వేరుగా వుంటుందా? నిస్తరంగమూ, సహజానంద రూపమూ, జ్ఞాన సాగరమూ అయిన ప్రత్యగాత్మలో 'ఇతడు విప్రుడు, ఇతడు చండాలుడు' అనే భేదవిభ్రమ నీకు ఎలా కలిగింది? - అని ప్రశ్నించాడట.

దీనితో శంకరుడు గింగిరాలు తిరిగాడట. అప్పటిదాకా తాను బోధిస్తున్న అద్వైతం తనకు అర్థంకాని శంకరుడికి ఆ ప్రశ్న మెదడులో గుచ్చుకొంది. అద్వైత సిద్ధాంత బోధకూ, వర్ణవ్యవస్థ ఆచరణకూ మధ్యవున్న వైరుధ్యం శంకరుడికి అప్పుడు బోధపడింది. అప్పుడాయన చండాలుడి కాళ్ళమీద పడి "మనీషాపంచకం"గా ప్రసిద్ధి పొందిన ఐదు శ్లోకాలు చెప్పాడట. వాటికి పాఠాంతరాలు వున్నాయంటున్నారు. అందులో ఒక పాఠం ఇలావుంది:

1) జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరాయా సంవిదుజ్జృంభతే
యా బ్రహ్మాది పిపీలికాంత తనుషు ప్రోతాజగత్సాక్షిణి
సైవాహం నచ దృశ్యవస్తితి దృఢప్రతిజ్ఞాపిఽపి యస్యాస్తిచేత్
చండాలోఽస్తు సతుద్విజోఽస్తు గురురిత్యేషా మనీషామమ॥

2) బ్రహ్మైవాహ మిదం జగచ్ఛ సకలం చిన్మాత్ర విస్తారితం
సర్వంచైత దవిద్యయాత్రిగుణయాఽశేషం మయాకల్పితం

ఇత్థం యస్య దృఢామతిః సుఖతరే విత్యేపరే నిర్మలే
చండాలోస్తు సతుద్విజోస్తు గురురిత్యేషా మనీషామమ॥

3) శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చత్య వాచాగురో
ర్నిత్యం బ్రహ్మనిరంతరం విమృశతా నిర్వ్యాజ శాంతాత్మనా
భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సం విన్మయేపావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపురిత్యేషా మనీషామమ॥

4) యా తిర్యఙ్నరదేవతాభి రహమన్తః తఃస్ఫుటాగృహ్యాతే
యక్భాసా హృదయాక్ష దేహవిషయా భాన్తిస్వతో-చేతనాః
తాం భాస్యైః పిహితార్కమండలనిభాం స్ఫూర్తిం సదాభావయన్
యోగీ నిర్వృతమానసో హి గురురిత్యేషా మనీషామమ॥

5) యత్సౌఖ్యాంబుది లేశలేశత ఇమే శక్రాదయా నిర్వృతాః
యచ్చిత్తే నితరాం ప్రశాంత కలనే లబ్ధ్వాముని ర్నిర్వృతః
యస్మిన్నిత్య సుధాంబుధౌ గలితదీర్ఘ్రహ్మై వ న బ్రహ్మావిద్
యఃకశ్చిత్ న సురేంద్ర వందితపదో నూనం మనీషామమ॥

దీని స్థూలభావమేమంటే-సర్వత్రా వ్యాపించిన చైతన్యస్వరూపం తానే అని ఎవడు భావిస్తాడో, వాడు చండాలుడైనా, ద్విజుడైనా నాకు గురువే. ఈ జగత్తంతా చిన్మాత్రంచేత విస్తరిస్తుందనే విశ్వాసం కలవాడు చండాలుడైనా ద్విజుడైనా నాకుగురువే. విశ్వం అనిత్యం, బ్రహ్మసత్యం అని యెరిగి చిదగ్నిలో యీ శరీరాన్ని హోమం చేయడం నా దృఢనిశ్చయం. అహం అనేదాన్ని యెవ్వడెరుగునో వాడే నా గురువు. అనందబ్రహ్మకు దేవేంద్రుడు సహితం నమస్కరిస్తాడు - అని నమస్కరించాడట శంకరుడు.

అనంతరం గుణ, జాతి, వర్ణాది అహంకారాలను, విభేదవ్యామోహాలను మాయ కారణంగా వర్ణిస్తూ "మాయాపంచకం" అనే పంచశ్లోకిని రచించాడట;

అవగత గుణజాతి వర్ణభేదే సుఖచిత విప్ర విద్యహం కృతించ।
స్ఫుటయతి సుతదార గేహం త్వఘటిత ఘటనా పటీయసీమాయా॥

ఈ స్థితికి చేరుకున్న శంకరుణ్ణి చూచి పురోహితవర్గం ఎలా

సహించగల్గుతుంది? అందుకే అతణ్ణి ప్రచ్ఛన్న బౌద్ధుడనీ, నాస్తికుడనీ నిందించారు. "మాయావాద మసచ్ఛాస్త్రం, ప్రచ్ఛన్నం బౌద్ధమేవచ" అన్నారు. నిజానికి ఎం.ఎన్.రాయ్ అన్నట్లు శంకరుడి అద్వైతమాయావాదం తిరగదిప్పిన భౌతికవాదమే. శంకరుడిలో వివేకోదయాన్ని గురించి తెల్పే యీ చివరిఘట్టాన్ని బట్టి, అంతకుముందు అతని దిగ్విజయాలని చెప్పబడినవన్నీ అపజయాలేనని తేలుతుంది. కాని, యీ ఘట్టం అతని ప్రాణానికే ప్రమాదం తెచ్చిపెట్టింది. పండితుడైన శంకరుడు బౌద్ధాదుల్ని అదిరించో, బెదిరించో వర్ణవ్యవస్థను గట్టి పునాదులమీద నిలబెడితే, – జ్ఞానోదయమైన శంకరుడు తిరిగి ఆ వ్యవస్థను సమూలంగా నాశనం చేయలేడా? ఈ సంశయం ఆ మఠాలోని అధిష్టానవర్గానికి వచ్చింది. శంకరుడి సత్తా యెరిగిన ఆ మఠా గుట్టుచప్పుడు కాకుండా అతని తల తప్పించారు. శవాన్ని అయిపులేకుండా చేశారు. శంకరుడు ఏమైపోయిందీ ఎవ్వరికీ తెలియకుండా చేయడానికే కైలాసం చేరుకున్నాడనీ, సూర్యమండలం చేరుకున్నాడనీ, దత్తాత్రేయుడితో చర్చిస్తూ కూర్చున్నాడనీ ఏమేమో కట్టుకథలల్లారు. శంకరుణ్ణి యెక్కడ పూడ్చిపెట్టిందీ ఇదమిద్ధమని యేనాడూ చెప్పలేకపోయారు. చేయరానిపని చేసినందుకు సిగ్గుపడి శంకరుడికి మహత్యాలంటగట్టారు. అద్వైతానికి విరుద్ధంగా వర్ణవ్యవస్థను పోషించడానికి పీఠాలను అజ్ఞాన ప్రసార కేంద్రాలుగా మలిచారు.

## చెప్పేవాడికే అర్థంకాని అద్వైతం

అద్వైతమంతా అయోమయం. అందుకే అద్వైతం యేమి చెపుతుందో అద్వైతులకే అర్థంకాదు.

తాను చెప్పేదానికీ, చేసేదానికీ పొంతనలేదని శంకరచార్యుడికే అర్థంకాలేదాయె! ఇక తర్వాత వచ్చిన అల్లాటప్పగాళ్ళకేమి అర్థమవుతుంది?

నీలోనిదీ (?) నాలోనిదీ(?) వేర్వేరు కావనే అద్వైతానికీ, ఉన్నట్లు కనిపించే దంతా హుళక్కి అనే మాయావాదానికీ కులంపట్టింపు ఎలా వుంటుంది?

అయినా, ఇప్పటికీ శంకరపీఠాలు చేస్తున్నదేమిటి? వర్ణవ్యవస్థను కాపాడటమే!

శంకరపీఠాలు కులవ్యవస్థను చెదరకుండా కాపాడాలనే ధ్యేయంతో నిన్న మొన్నటిదాక "వెలిచీటీల" పద్ధతిని అనుసరించాయి. ఆ వృత్తిని యిప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నవేమో తెలియదు.

ఈ ఫాసిస్టు వర్ణవ్యవస్థను ఏలుబడి చేయడానికి శంకరపీఠాలు దేశాన్ని ప్రాక్పశ్చిమ దక్షిణోత్తరమండలాలుగా విభజించి పంచుకున్నాయి! కులతత్వాన్ని సమర్థించే స్వార్థపురోహిత వర్గమంతా యీనాడు అద్వైతం పేరుతో వర్ణవ్యవస్థను నిలదొక్కడానికి ప్రచ్ఛన్న ప్రయత్నాలు చేస్తున్నది. అందుకోసంవేదాంతం పేరుతో మత మౌఢ్యాన్ని వ్యాప్తిచేస్తున్నది. చెప్పేవి శ్రీరంగనీతులు, దూరేవి.. అన్నట్లు అద్వైతులు పైకి చెప్పేది వేదాంతం - లోపల పోషించేది కులతత్వం. కాబట్టి శంకరపీఠాల లక్ష్యం రహస్యం కాదు. ఈ లక్ష్యసాధనకు శంకరుడు అవరోధం కాగలడన్న భీతితోనే ఆనాటి పీఠ రాజకీయవర్గాలు శంకరుణ్ణి హత్యచేసి వుంటారని నిర్ణయించుకోవడంలో అసంబద్ధత లేదు.

భారతదేశంలోని మనుషులంతా ఒక జాతికి చెందినవారు కాదనేది శంకరమతం. మనుషుల్ని నాలుగు జాతులుగా, వర్ణాలుగా విభజించి ఒక వర్ణంకంటె మరొకవర్ణం జన్మతః అధికులు అనే జాత్యహంకార భావం శంకరుల సిద్ధాంతం.

ఇలా భారతీయుల్ని నాలుగు జాతుల మనుషులుగా విభజించిన ఫాసిస్టు జాత్యహంకార తత్వాన్ని పెంచి పోషించడానికి శంకరుడు తన బ్రతుకునంతా ధారపోస్తే, ఆ శంకరుడు భారతజాతీయైక్యతను సాధించాడని వంకరకూతలు కూసే జ్ఞానభ్రష్టులు బయలుదేరారీనాడు. బౌద్ధుల్నీ, జైనుల్నీ భౌతికంగా నిర్మూలించిన శంకరుడు జాతీయైక్యత కోసమే ఆ పని చేశాడందామా? ఎన్ని దుర్మార్గాలు చేసినా హిట్లరు జర్మన్ జాతీయైక్యత సాధించాడు. (కనీసం అలాంటివాళ్ళతో పోల్చడానికైనా శంకరుడుతగడు). మహమ్మదు అరబ్‌జాతినే నిర్మించాడు. శంకరుడు భారతజాతిని విభజించి భారత జాతీయ భావానికే ద్రోహం చేశాడు.

ఆసేతు హిమాచల పర్యంతం వుండే బ్రాహ్మలందర్నీ ఒకటిచేసి, సమాజం మీద పడి దోచుకోడానికి మార్గాలు వేయడం భారతజాతీయత అవుతుందా? శంకరుడు పునాదులు వేసింది జాతీయైక్యతకు కాదు-జాతీయ అనైక్యతకు. దానికి అడ్డుగా నిలిచి నందుకే మానవ ఐక్యతకు కంకణం కట్టుకొన్న బౌద్ధాన్ని నిర్మూలించడానికి జీవితాంతం కృషిచేశాడు. నేటికీ భారతీయుల కులగోత్రాలకు కాపలాకాస్తున్న శంకరపీఠాలు జాతీయ ఐక్యతకే పాటుపడుతున్నాయా? ఈ నాడొక ముస్లిం హిందూమతాన్ని స్వీకరిస్తే, వాడికి లభించేది శూద్రవర్ణమేనని శంకర పీఠాధిపతులు నొక్కిచెపుతున్నారు. అదేనా భారతజాతీయైక్యతఅంటే?

భారతీయ సంస్కృతి పేరుతో యీనాడు ప్రచారమవుతున్నదంతా హిందూ మత సంస్కృతి. అంటే,వర్ణంపైన వర్ణాన్ని యెక్కించే ఫాసిస్టు వ్యవస్థా సంస్కృతి. చార్వాకాన్నీ,బౌద్ధాన్నీ, భారతదేశీయ సంస్కృతిలో భాగాలుగా గమనించలేని దివాంధులకు వైదిక వాఙ్మయంలో తప్ప, భారతీయత కన్పించదు. భారత జాతీయతను గురించి వారు మాట్లాడడం పెద్ద వింత! భారతీయులకు జాతీయభావాన్ని లేకుండా చేసిందే వారు. సాంఘిక అన్యాయాన్ని ఎదిరించే ఆలోచనాతత్వాలన్నీ వారి దృష్టిలో అప్రాచ్యాలు. ఐనా,తమ అపరిశుద్ధ పాండిత్యాన్ని సమర్థించుకోడానికి ఆ "అప్రాచ్య" విజ్ఞానాన్నే ఆశ్రయిస్తారు. రిలెటివిటీ సిద్ధాంతం, క్వాంటం సిద్ధాంతం అంటూ సిద్ధాంత నామసంగ్రహాలు కూరుస్తారు. అవన్నీ మన తాటాకుల దస్తరాల్లో వున్నవి చూడమంటారు-ఇక ఈ తరహా "అద్వైతానికి" తిరుగేలేదు.

త్రాగడానికి గంజినీళ్ళు దొరకని ఈ నాటి భారతదేశంలో యజ్ఞాలపేరిట, క్రతువులపేరిట, ప్రతిష్టలపేరిట నేతిని నిప్పుల్లో పారపోసే సంప్రదాయం నాలుకలు కోరుతూ వుంది. దాన్ని పోషిస్తున్న వారిలో పీఠాధిపతులు, మహేషులు, సాయిబాబాలు, అమ్మలు వున్నారు. వారికి గొడుగులుపట్టే ప్రభుత్వాధినేతలకు వాటిని నిరోధించడం చేతగానిపని. ఆ అవినీతిని నిరోధించడానికి సామాజికులే నడుంకట్టాలి. మనకోసం వాటిని యెవరో చేసిపెడతారని ఆశించే పరాధీనతాభావం మనలో పని చేస్తున్నంతకాలం మన నాయకులు తమకోసం కావలసిన వాటి నన్నిటినీ సర్దుబాటు చేసుకుంటారు. అందుచేత మనుషులు హేతుబద్ధంగా వివేచింప గలిగినప్పుడే సర్వత్రాజరిగే మానసిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడీని నిర్మూలించడానికి కార్యోన్ముఖులు కాగలరు. శంకరపీఠాల్నీ, వంకర పీఠాల్ని వదలించుకోడానికి అదే మార్గం. పాత పీఠాలు పోవడమే కాదు-కొత్త పీఠాలు తలెత్తకుండా వుండడానికి కూడా అదే మార్గం.

# 2. శంకరాచార్యుడి శీలం

శంకరుడు "బ్రాహ్మణ జారిణీ పుత్రుడు, సంకరుడు, సర్వకర్మ బహిష్కృతుడు" అని మణిమంజరిలో, స్కాంధంలో, కేరళోత్పత్తి గ్రంధాదుల్లో జుగుప్సాకరమైన కథలల్లి శ్లోకాలు వ్రాసినవారు ఈ నాటి హేతువాదులు కారు. ఆనాటి సనాతన ఛాందసులే ఆపని చేశారు. అవన్నీ సంస్కృత భాషలోనే వున్నై. ఆనాడు సంస్కృత భాషాధ్యయనార్హత గల అగ్రవర్ణాల వారే ఆ రచనలు చేసివుండాలి. వారు వ్రాసిన శ్లోకాలనే నేను తొలివ్యాసంలో ఉదహరించాను. దాని లక్ష్యం శంకరుణ్ణి నిందించడం కాదు. వాస్తవానికి అద్వైతం బ్రాహ్మణ మతానికి వ్యతిరేకం. సిసలైన అద్వైతం ఆస్తికత్వానికి కూడా వ్యతిరేకం. శంకరుని భౌతిక నాస్తివాదం (Physical N'hil'sm) తిరగదిప్పిన భౌతికవాదమే (Inverted Materia ism). శంకరుడి అద్వైతంలో వున్న ఆ వాసనల్ని నాటి ఛాందస హిందువులు పసికట్టారు. అందుకే అతని పుట్టుకను గురించి సైతం అపభ్రంశ కథలు ప్రచారం చేశారు. ఆ విషయాన్ని చూపడానికే ఆ శ్లోకాలను వుదహరించాను. కందుకూరి వీరేశలింగం పంతులు సైతం ఆ విషయాన్ని ఎన్నడో వ్రాసిన "శంకరాచార్యులు" అన్న వ్యాసంలో విశదంగా ఉదహరించారు. వారి కొటేషన్లను వ్యావహారిక భాషలో యిస్తున్నాను.

"శంకరుడు పుట్టకముందే తండ్రి మృతుడయ్యాడనీ, వితంతువుకు వ్యభిచారం వల్ల పుట్టాడని కులంవారు తల్లిని జాతి నుండి బహిష్కారం చేశారనీ, ఆమె మృతి నొందినప్పుడు బంధువులూ, బ్రాహ్మణులూ దహనంచేయడానికి చోటివ్వక అగ్ని హోత్రాన్ని సహితం యివ్వకుండిరనీ, కేరళోత్పత్తి అనే గ్రంథంలో దూషణగా వ్రాయబడివుంది . ఆచార్యుల వారి తల్లి మరణం చెందినప్పుడు కుల బ్రాహ్మణులు దహన సంస్కారానికి స్థలాన్ని గాని, నిప్పును గాని యివ్వనందుకు కోపించి, శంకరులవారు తమ భుజాన్ని మథించి, అగ్నిహోత్రాన్ని పుట్టించి, తమ యింటి దొడ్డిలోనే ప్రేతాన్ని దహనం చేసి, ఆ బ్రాహ్మణులు వేదబాహ్యులగునట్లూ, వారిలో సన్యాసులకు భిక్ష దొరకకుండునట్లూ, వారి యిండ్లు శ్మశానాలగునట్లూ శపించారని వ్రాశారు. శంకర శాపభయంచేత మళయాళ దేశంలోని నంబూద్రి బ్రాహ్మణులు ఇప్పటికిని తమదొడ్లల్లోనే శవాలకు దహన సంస్కారం చేస్తున్నారు".

కాబట్టి, శంకరుడి తల్లి శీలాన్ని గురించి వీరేశలింగం పంతులు గాని, నేనుకాని కథలు చెప్పడంలేదు. అది నిజమైనా, అబద్ధమైనా, దాన్నిబట్టి శంకరాచార్యుడి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం హేతువాదుల పద్ధతికాదు. గిట్టని వారిమీద

బూతుపరమైన అభాండాలు వేసి దుష్ప్రచారం చేయడం మతస్థుల పద్ధతి. అందుకు వారి రచనలే తార్కాణం. భార్యల్ని తార్చే భర్తలూ, భర్తలను తార్చే భార్యలూ, పతివ్రతలూ, పతివ్రతల్ని రేప్ చేసే దేవుళ్లూ పిలిస్తే పలుకుతారు పురాణాల్లో. అణగారిన లైంగిక వాంఛల్ని పౌరాణికులు తాటాకులమీద తీర్చుకున్నారు అది వారి కాల ధర్మం. బూతుల్ని బట్టి నీతుల్ని తేల్చడం, వ్యక్తులకు విలువకట్టడం హేతువాదుల ప్రవృత్తి కాదు. బూతుల్ని చీదరించుకొన్నట్లు నటించే ఛాందసులే బూతులు వ్రాశారు, చేశారు. అవసరమైనప్పుడు సమర్థించారు. గిట్టనప్పుడు భ్రష్టంగా చిత్రించారు. వారే శంకరుడి తల్లిని రండని చేశారు, వ్యభిచారిణిని చేశారు. శంకరుణ్ణి రండ కొడుకుని చేశారు. సన్యాసిని చేశారు. పరకాయప్రవేశం చేయించారు. వ్యభిచారం చేయించారు. ఆ కథలు నిజమా, అబద్ధమా అనేది ప్రస్తుతాంశం కాదు. పరకాయ ప్రవేశ విద్య అనేది వున్నదని హేతువాదులు అమోదించరు. శంకరుడిలాగా ముసుగేసుకుని, మోసంచేసి, ఇతరుల భార్యల్ని చెరిస్తే, యీనాటి ధర్మశాస్త్రం గుంజకు కట్టి చర్మం వొలుస్తుంది. శంకరుడు చేశాడని చెపుతున్నది వ్యభిచారం కాదు – రేప్–అత్యాచారం.

## వీరేశలింగం చెప్పిన కథ

శంకరుడి పరకాయ ప్రవేశం కథని వీరేశలింగం పంతులు ఇలా వివరించాడు:

"మండన మిశ్రుడికీ, శంకరాచార్యుడికీ మధ్య శాస్త్ర ప్రసంగం జరిగింది. ఆ వాదంలో మండన మిశ్రుడు ఓడిపోయాడు. అతని భార్య సరసవాణి వచ్చి తనను కూడా గెలిస్తే తప్ప, అది సంపూర్ణమైన గెలుపు కానేరదని–కళాశాస్త్రంలో తనతో వాదించమని కోరిందట! తనకు ఆరు నెలలు గడువిస్తే, నేర్చుకొని వచ్చి వాదిస్తానని అడుగగా ఆమె అంగీకరించి గడువిచ్చిందట! అంతట శంకరాచార్యులవారు బయలుదేరి ఒక పట్టణానికి పోయి–ఆ పట్టణ రాజైన అమరుకుడనే వాడు అప్పుడే మృతుడై నందున వాని బంధువులు అతని శవాన్ని దహన సంస్కారార్థం శ్మశాన వాటికకు తీసుకొనిరాగా, పరకాయ ప్రవేశ విద్యచేత తాను అతని దేహంలో ప్రవేశించి పరివారంతోకూడా రాచనగరు ప్రవేశించాడట! ఆచార్యులవారు రాజకళేబరంలో ప్రవేశించక మునుపు తనదేహాన్ని ఒక దేవాలయంలో విడిచి, భద్రంగా కాచియుండి తన శరీరాని కేదైనా అపాయం వచ్చు పక్షాన ఉచ్చరించవలసినదని ఒక మంత్రాన్ని చెప్పి శిష్యులకు ఒప్పగించాడట! శంకరాచార్యులవారు రాచకార్యాలు చక్కబెడుతూ, రాత్రులు రాజు భార్యలతో సంభోగిస్తూ, కామశాస్త్ర రహస్యాల్ని గ్రహిస్తూ, కొంతకాలం గడిపాడట! ఆ రాజుకు నూర్గురు భార్యలు కలరనీ, అతడు నిత్యం ఒక్కొక్కదానితో

సంభోగిస్తూ పట్టమహిషివద్దకు రాగా, చేష్టా వికారాల్నిబట్టి ఆమె సందేహపడి, మంత్రులతో ఆలోచించి ఆ పట్టణంలోవున్న శవాలన్నిటిని వెదకి దహనం చేయడానికి ఉత్తర్వులిచ్చిందట! అపుడు రాజభటులు వచ్చి ఊరంతా వెదకి, కనపడ్డ శవాలన్నిటినీ కాలుస్తూ దేవాలయంలో వున్న ఆ శవాన్ని సహితం కనుగొని, శిష్యుల్ని అక్కడనుంచి పారద్రోలి, శవాన్ని చితిమీద వుంచి నిప్పంటించారట! అంతట శిష్యులు రోదనం చేస్తూ గురువు వుపదేశించిన తత్వమసీత్యాది వాక్యాల్ని బిగ్గరగా పలుకసాగారట! అప్పుడు ఆచార్యుల వారు విని రాజు శరీరాన్ని విడిచి, మరల చితిమీద వున్న శరీరంలో ప్రవేశించాడట! అప్పటికే కాళ్ళూ, చేతులూ కాలిపోగా శంకరాచార్యులవారు లక్ష్మీనృసింహాష్టకాన్ని చెప్పినందున మరలా మొలిచినవట! శంకరాస్వాములవారు అమరుకుని శరీరంలో ప్రవేశించివున్న కాలంలో అతని భార్యయొక్క చక్కదనానికి అశ్చర్యపడి, ఆమె సౌందర్య విశేషాన్ని వర్ణిస్తూ "అమరుకమ్" అనే శృంగార శతకాన్ని రచించాడట! అతడు వెంటనే శిష్యబృందంతోకూడా మండన మిశ్రుని యింటికి పోయి అతని భార్యతో కామశాస్త్ర ప్రసంగంచేసి ఆమెను వోడించాడట".

ఈ కథ దాదాపు యిదేవిధంగా జగద్గురు శంకరాచార్య సినిమాలోకూడా వుంది. ఇది శంకరపీఠాలు ఆమోదించిన గాథే.

ఈ కథలోని లైంగిక నీతికి శంకర పీఠాలవారు ఏమి సమాధానం చెపుతారో! కామ కళలో ప్రాక్టికల్ నాలెడ్జి కోసం శంకరుడు ఇలా వేషాలు వేసుకొని, ఇళ్ళలో జొరబడి కామకండూతిని, లైంగిక కుతిని తీర్చుకోవడాన్ని శంకరాద్వైత నీతి సమర్థిస్తుందన్న మాట! ఇలాంటి పిచ్చి పిచ్చి కథలతో మనిషిని మానసిక శైశవ దశలో అట్టిపెట్టడం మత లక్ష్యం. వ్యభిచారం నేర్చుకోవడానికి రాజుగారి మృతదేహాన్ని అశ్రయించిన శంకరుడి ఆత్మకి-తిరిగి 'తన' తుచ్ఛ దేహంలోనే ప్రవేశించాలనే కోరిక ఎందుకు కలిగింది? రాజుగారి దేహం కంటే తన దేహం ఉత్తమమైంది గనుకనా? ఈ దేహాపేక్షలో ప్రాపంచిక వాస్తవం లేదా? ఆత్మలకు అద్వయీభావాన్ని సూచించే పక్షపాతాన్ని, మోహాన్ని ఏమంటారు? కామ తృప్తికోసం వ్యభిచారం చేయడం అద్వైత ధర్మమేనా? హిందూధర్మశాస్త్ర బద్ధమేనా? రాజుగారి నూరుమంది భార్యల్ని వారికి అనుమానం వచ్చేదాక శంకరుడు అలుపు లేకుండా అనుభవించాడు కదా? వారికి అనుమానం రాకుండావుంటే, ఆ వ్యాపారం ఇంకా ఎన్నాళ్ళు సాగించేవాడో?

భగందర వ్యాధికూడా సుఖరోగమే నంటారు. ఆచార్యుల వారికి ఆ వ్యాధి వస్తే, పద్మపాదుడు చేసిన ఉపచారాల వల్ల అది నయమయినదట. 'శంకరుడు'

'తన' (తుచ్ఛ) ఆత్మను తప్ప, పవిత్ర దేహాన్ని రాణులతో సంపర్కంలో పాల్గొననీయలేదు. మరి ఆయన దేహానికి భగందరరోగం ఎలావచ్చిందో? (కాపాలికుడు క్షుద్రశక్తిప్రయోగంచేస్తే శంకరుడికి భగందర రోగం వచ్చిందనేది అభూతకల్పన. అది కాపాలికుల్ని సంహరించడానికి కల్పించబడ్డ తప్పుడు ఆరోపణ). ఎన్నో మహత్యాలు చేసిన పరకాయప్రవేశ మూర్తికి ఆరోగాన్ని కుదుర్చుకొనే మహత్తు ఎందుకు కరువైందో! దేవతాస్తోత్రాల మహత్తు ఏమయిందో? ఇది కేవలం కథ అయితే, మనకీ ప్రశ్నలు రాకపోను. శంకర పురాణాలన్నిటిలోనూ వున్న ఈ కథ శంకరపీఠాలవారి దృష్టిలో కల్పన కాదు, వాస్తవం. శంకరుడి భగవాన్‌తనాన్ని ఇబ్బడి ముబ్బడి చేయడం కోసం ఇలాంటి పిచ్చిపిచ్చి కథలకు శాంకరులు విశేష ప్రచారమిచ్చారు. శంకరుడు కామకళ నేర్చుకున్నది ముండమోపుల వద్దనే. అయినా ఆ ముండమోపులు తల వెంట్రుకలు తీయకపోతే కులం నుంచి వెలివేస్తాయి శంకర పీఠాలు. మొగుడులేని వాళ్ళ గుండ్లు చూస్తే తప్ప, వారికి సంతృప్తి కలగదేమో! పెళ్ళాలు మాత్రంలేని ఈ అద్వైతులు కూడా గుండ్లు చేయించుకుంటారెందుకో!

మతసిద్ధాంతాలూ, మతనీతులూ హేతుబద్ధాలు కావు, తర్కానికి నిలవవు. అన్నీ స్వవచోవ్యాఘాతాలు. అవి ఆటవికమైనవి. ఆటవిక దశనుంచీ మానవుడేర్పరచు కొంటూ వచ్చిన భావాల్ని వేటినీ వదలకుండా, ఎప్పుడేది అవసరమైతే అప్పుడు దానికనుకూలంగా ఒక శ్లోకాన్ని వల్లించి ప్రమాణించుకుంటూ, భాష్యాలు చెప్పుకుంటూ పోవడమే మత విధానం.

ఆటవిక జాతీయవాద దశలోని తెగల మనస్తత్వానికి మతోన్మాదంకూడా తోడైతే, అది మానవత్వాన్నే, మంట కలుపుతుంది. ఆ పాశవికతత్వాన్ని పోషించడం కోసం మతాలు ఇహం మీద విరక్తినీ, పరంమీద అనురక్తినీ నూరిపోస్తాయి. మనిషి బ్రతికి వున్నప్పటి జీవితాన్ని కాక, మరణానంతర జీవితాన్ని కొలమానంగా తీసుకుంటాయి. బ్రతికివున్న మనిషికి ఎలానూ స్వేచ్ఛలేదు కాబట్టి, చస్తే రాగల మోక్షం కోసమే ప్రతివాడూ ప్రాకులాడాలంటాయి.

అందుచేత బ్రతుకు విలువ తెలియని మతోన్మాది మతరక్షణ పేరుతో చావనైనా చస్తాడు, చంపనైనా చంపుతాడు. అది ధర్మం కాబట్టి, చచ్చినా మోక్షమే, చంపినా మోక్షమే. ఇందరినీ చావమనీ, చంపమనీ బోధించే మతాధిపతి మాత్రం శంకరుడిలాగా అన్ని భోగాలూ అనుభవిస్తాడు.

## సామూహిక హత్యలు

ఇలాంటి రాబట్స్‌ని తయారుచేయడంలోనే అన్ని మతాలూ మనుగడ సాగిస్తున్నాయి కాబట్టి, చరిత్రలో మతం ఆధ్వర్యాన ఎన్ని హత్యలు, అత్యాచారాలు, దారుణాలు జరిగినవో చెప్పడానికి సాధ్యంకాదు. అన్ని మతాలూ ఆ పని చేసినవే. కుడి చెంపన కొడితే, ఎడమ చెంప చూపమన్నాడట ఏసు. అలా అని బైబిలు సాక్ష్యం పలుకుతుంది. కానీ, క్రైస్తవులు శాఖాభేదాన్నే సహించలేదని క్రైస్తవమత చరిత్ర ఘోషిస్తున్నది. శాఖాభేదం కారణంగానే క్రీ.శ. 1211-15 మధ్యకాలంలో స్త్రీ పురుష విచక్షణ లేకుండా, పాలుతాగే పసిబిడ్డలతో సహా కనీసం లక్షమంది అల్బిజెన్సియన్లను దారుణంగా చంపించాడు పోప్ 3వ ఇన్నోసెంట్. క్రైస్తవ మత చరిత్రలోని ఇలాంటి ఘోరాలన్నిటినీ పేర్కొంటూపోతే, అవి బైబిలు ఘాతుకాలసంఖ్యను మించిపోతై. మక్కా ముట్టడిలో కానీ, ఇతర దండయాత్రల్లో కానీ, మహమ్మదు నరికించిన ముస్లిమేతరుల సంఖ్య స్వల్పం కాదు.

హిందువుల్లో శైవులు వైష్ణవుల్నీ, వైష్ణవులు శైవుల్నీ, వారిద్దరూ కలిసి చార్వాకుల్నీ, బౌద్ధుల్నీ, జైనుల్నీ దారుణంగా వధించిన గాధలు పురాణాల నుంచీ, శిలాశాసనాల నుంచీ నిక్కిచూస్తున్నాయి. ఇందులో సన్యాసి శంకరుడి అమానుష పాత్ర సామాన్యం కాదు. ఆయన ఆధ్వర్యాన బౌద్ధమత నిర్మూలన కోసం జరిగిన ఘోరకలిని 'శంకరాచార్యులు' అనే వ్యాసంలో వీరేశలింగం పంతులు ఉదహరించిన తీరు చూడండి:

"శంకరాచార్యులవారు కాంచీపురానికి పోయి, అక్కడ బౌద్ధులతో వాదంచేసి, వారిని జయించి, వారి రాజైన హిమశీతల మహారాజుగారి యెదుట తమలో అదివరకు ఇరుకక్షలవారు యేర్పరచుకొన్న యేర్పాటును బట్టి, బౌద్ధమతస్థుల నందరినీ గానుగలలో పెట్టి ఆడించి చంపించాడు. ఈ సంగతి శివకంచిలో శ్మశానేశ్వర స్వామివారి ఆలయములో రాతిమీద చెక్కబడి వున్నది.. అతడు పాదచారియై భరతఖండమంతా సంచారం చేసి, వెళ్ళినచోట నెల్లా బౌద్ధులు,జైనులు, చార్వాకులు మొదలైనవారితో వాదాలు చేసి, వారి మతాల్ని ఖండించి, తన అద్వైతాన్ని స్థాపిస్తూ, రాజుల్ని స్వాధీనపరచుకొని బౌద్ధాదుల్ని శిక్షిస్తూ వచ్చాడు... ఆ వరకే కుమారిల భట్టు మొదలైనవారి కృషిచేతను, బలిష్ఠులైన రాజపుత్రుల హింసల చేతను హిందూదేశంలో క్షీణతపొందుతున్న బౌద్ధమతానికి ఆగర్భశత్రువై ఆచార్యులవారు దాన్ని రూపుమాపారు".

కాబట్టి, శంకరుడు వేషానికే సన్యాసికాని, బుద్ధికీ -చేష్టలకూ సన్యాసి కాడు. రాగ ద్వేషాలూ, మాత్సర్యక్రౌర్యాలూ, విషయభోగాలూ అతని వెన్నంటే వున్నై.

చరిత్రలో మనుషుల్ని అనేక రకాలుగా చంపడం విన్నాం కాని, గానుగల్లోవేసి రుబ్బించడమన్నది యీ సన్యాసి కథల్లోనే మనకు కన్పిస్తున్నది.

ఇది కేవలం జనశ్రుతి కూడాకాదు–శివకంచి లోని శ్మశానేశ్వరస్వామి ఆలయంలో శిలాశాసన మొకటి అద్వైత శంకరుడి ఘాతుక కృత్యాలకు అక్షరరూపంలో సాక్ష్యమిస్తున్నదట! ఆ శ్మశానేశ్వరం బౌద్ధులకు శ్మశానమేనేమో? అది అనేక సహస్ర శిరచ్ఛేద అపూర్వ శంకరుడి చేష్టల ఫలితమేనేమో! ఇంతటి క్రూరమైన నేరాన్ని చేసి కూడా స్వాములవారుగా చలామణీ అయిన నేరస్తులు ప్రపంచ చరిత్రలోనే అరుదు.

## శంకరుడి దండయాత్రలు

శంకర విజయాల పేరుతో డజన్ల కొద్ది గ్రంధాలు వెలసినై. అన్యమత పండితుల మీద శంకరుడు సాధించినట్లుగా చెప్పబడ్డ విజయాలను అవి క్రోడీకరించినై శంకరుణ్ణి మహా పండితుడుగా మనకు దిగుమతి చేసినై. అంతమాత్రాన అతడిపేరుతో చెప్పబడ్డ విజయాలన్నిటినీ పాండిత్య విజయాలుగా అంగీకరించడానికి వీలులేదు. అవన్నీ గూండా గిరీ విజయాలుగా కన్పిస్తాయి. గూండాల పటాలాన్ని వెంటబెట్టుకొని శంకరుడు పాండిత్య దండయాత్రకు బయలుదేరేవాడు. అతని పీఠాలన్నీ అర్గనైజుడు గూండాలగుంపులు. ఇప్పటికీ పీఠాధిపతులు సంచారయాత్రల్లో గజాశ్వాందోళనాదులు, పల్లకులు మొదలైన రాజచిహ్నాలతో, దండుతో బయలుదేరతారు. శంకరుడికి హిందూ రాజుల ప్రాపకం వుంది. వాదంలో వీలుకానప్పుడు సేనా నాయకుల అండతో రాజు రక్షణ లేని బౌద్ధ పండితుల్నీ, వారి శిష్యుల్నీ పైశాచికంగా సంహరించాడు. బౌద్ధులు తత్వచర్చ చేయగలరు కానీ, హింసాప్రవృత్తి అవలంబించడం వారి నైజం కాదు. అసలు శ్రుతి ప్రమాణం తప్ప, బుద్ధి ప్రమాణం లేని శంకరాచార్యుడికీ, శ్రుతి ప్రమాణాన్ని పూర్తిగా నిరాకరించి బుద్ధిని ప్రమాణంగా తీసుకొనే బౌద్ధులకీ మధ్య చర్చఏమిటి? ఏ ప్రాతిపదిక మీద? అందువల్ల, శంకరుడి దండయాత్రల్ని బ్రాహ్మణసంప్రదాయం బౌద్ధులమీద చేసిన దాడిగా భావించాలి.

యూరపులో గెలీలియో ప్రభృతులు కన్ఫెషన్స్ చేస్తే, దాని అర్థం మత గూండాలు విజయం పొందినట్లు కాదు కదా? శంకర విజయాలూ అలాంటివే. హిందూ రాజైన సుధన్వుడు శంకరుణ్ణి అంటిపెట్టుకొని వుండి బౌద్ధులపట్ల పైశాచిక అత్యాచారాలు సాగించాడు. అందుకే శంకరుడు మహానుశాసనంలో 15 వ శ్లోకంలో,

> "సుధన్వనః సమౌత్సుక్య నిర్వృత్యైధర్మహేతవే
> దేవరాజ్యోపచారంశ్చ యథావ దనుపాలయేత్"

అంటూ "ధర్మరక్షణలో సుధన్వరాజుకు గల ఔత్సుక్యాన్ని గమనించి అతని వాక్యాన్ని ఇంద్రాజ్ఞల్లాగా ప్రజలు పాలించాలి", అని శాసించాడు. శంకరుడి వంటి వాడిచేత అంతటి యోగ్యతా పత్రం, అధికారం పొందిన సుధన్వుడెంతటి దుర్మార్గుడో! అంతేకాదు "హిందూరాజైన పుష్యమిత్రుని అత్యాచార వివరణం 'దివ్యవదానం'లోవుంది. హూణరాజైన మిహిరగులుడు బ్రాహ్మణ పక్షపాతి. ఇతడు శైవుడు. శ్రీనగర్‌లో మిహిరేశ్వరుని పేర శివుణ్ణి స్థాపించాడు (రాజతరంగణి). ఇతడు కూడా బౌద్ధుల్ని హింసించాడని ప్రసిద్ధి, కర్ణ సువర్ణరాజైన శశాంకుడి వర్ణన కూడా ఇలాంటిదే" నంటున్నాడు శ్రీ గోపినాధ్ కవిరాజ్ (జగద్గురు శంకరాచార్యులు). శాంకరులు పంచారామాలను ధ్వంసం చేసి, ఆ దిబ్బలమీద శివాలయాలను నిర్మించారు. ఇలా దిబ్బల క్రింద బౌద్ధారామాలూ, దిబ్బలమీద హిందూ దేవాలయాలూ తెలుగుదేశమంతటా వున్నట్లుంది. భారతదేశమంతటా వున్నప్పటికీ అశ్చర్యపోనవసరం లేదు. సింహళంలో ఉన్నాయని యిటీవలి వార్తలు తెలుపుతున్నాయి.

ముస్లిం దండయాత్రికులు హిందూ దేవాలయాలను విధ్వంసం చేశారని వాపోయేవారు బౌద్ధారామాలూ, స్థూపాలూ యెలా నామరూపాలు లేకుండా పోయాయో ఎందుకాలోచించరు? మత మనస్తత్వమే అలాంటిదని వారెన్నడు గ్రహిస్తారో మరి!

బౌద్ధ నిర్మూలనకు కంకణం కట్టుకొన్న శంకరుడే వారిమీద అత్యాచారాలకు ప్రధాన బాధ్యుడు. అతన్ని ప్రచ్ఛన్న బౌద్ధుడనడం సరికాదు. అతను ప్రత్యక్షశైవుడు. అతను సన్యాసీకాదు-అద్వైతీకాదు.

## అజీర్ణం చేసిన అరువుసిద్ధాంతం

స్తవాలతో కలిపి శంకరుడు చాలా రచనలు చేశాడంటారు. అందులో బ్రహ్మ సూత్రాలకూ, భగవద్గీతకూ, ఉపనిషత్తులకూ (ప్రస్థానత్రయం) వ్రాసిన భాష్యాలు ప్రధానమైనవంటారు. ఒక్క బాదరాయణుడి బ్రహ్మసూత్రాలకు వ్రాసిన భాష్యం విషయంలో తప్ప, మిగతా రచనలన్నిటిపై కర్తృత్వ విషయంలో, అవన్నీ శంకరుడిని కావనే తగాదా యిప్పటికీ కొనసాగుతున్నది. నాటినుంచి నేటిదాక యెందరు శంకరులు వచ్చారో, ఏ శంకరుడేది వ్రాశాడో?

ఉపనిషత్తత్వాన్ని సూత్రీకరించడమే బాదరాయణుడు చేసినపని. బాదరాయణుడికి ముందు వేదాంత సూత్రాలూ, శంకరుడికి ముందు సూత్రభాష్యాలూ వ్రాసినవారు చాలామంది వున్నారట, ఇతర గ్రంథాల్లో వారి ప్రస్తావనే మనకి

కన్పిస్తుందికాని, వారు వ్రాసిన సూత్రగ్రంధాలు కాని, భాష్య గ్రంధాలుకాని దొరకవు. చివరకు ఈనాటికి లభించినవి బాదరాయణుడి సూత్రాలూ (ఉత్తరమీమాంస), శంకరుడి (శారీరక) భాష్యాలూ మాత్రమే. గౌడపాదుడి కారికల్లో చెప్పిన అద్వైతాన్ని, మాయావాదాన్ని ఉపమానాలతో సహా శంకరుడు తన భాష్య రచనలో కాపీ కొట్టినట్లు త్రిపురనేని వెంకటేశ్వరరావు చూపారు (చూడండి: గౌడపాద కారికలు, ııı–3నుంచి 7 వరకు: శంకరా ద్వైతం). "ఉపనిషత్తుల్లోకాని, వేదాంత సూత్రాల్లోకాని లభించే అద్వైతంకన్నా విలక్షణమైనదానికి గౌడపాదుడు ఆచార్యు" డనీ. "మనకందిన అద్వైతానికి స్వరూపసిద్ధి ఆయన చేతిలోను, దాని సుస్థిర ప్రతిస్థాపన శంకరుని పరంగాను జరిగిందని" కూడా అంటారు త్రిపురనేని. నిజానికి పీఠాల పేరుతో పటిష్టమైన సంస్థల్ని నిర్మించుకొన్న శాంకరులు పారంపర్యంగా చేస్తూవచ్చిన ప్రచారమే శంకరుణ్ణి తన పూర్వుల కంటె గొప్పవాడుగా చిత్రించింది. ఇస్లాం కాలిఫైట్ వ్యవస్థలాగా శంకర పీఠాలు పారంపర్యతను సంపాదించుకొన్నై. ఇస్లాం లౌకికరాజ్యవ్యవస్థలో అడుగు పెట్టినందువల్ల, ఆ సంప్రదాయం అధికార పోరాటాల వల్ల అడుగంటింది- ఇది ఆధ్యాత్మిక సమాజంలో నిలబడి పోయినందువల్ల ఇంకా నిలబడివుంది.

శంకరుడు చెప్పిన దాంట్లో శంకరుడి సొంతమెంతో తేలితే తప్ప, ఆయన పాండిత్యం ప్రశంసార్హంకాదు. పోగా, శంకరుడు సాధించిన దుష్టచారిత్రక విజయాలు రెండు కన్పిస్తున్నై, స్పష్టంగా: ఒకటి విధ్వంసకం, రెండోది నిర్మాణాత్మకం. బౌద్ధమత నిర్మూలన కోసం రాజుల, సేనానాయకుల పూర్తి తోడ్పాటు తీసికొన్నాడు. హిందూ, ధర్మ పునరుద్ధరణ కోసం పీఠాలు స్థాపించాడు. ఆ పీఠాలకు మహానుశాసనం (గ్రేట్‌కాన్ స్టిట్యూషన్) ఇచ్చాడు. అయితే ఇంత దుర్మార్గం చేసిన శంకరుడికి జ్ఞానోదయ దశ కూడా త్వరపడింది. "అద్వైతమూర్తికి అంటు ఎక్కడిది?" అని "చండాలుడు" ప్రశ్నిస్తే, దానికి సమాధానం శంకరుడికి తన పాండిత్యంలో దొరకలేదు! అప్పుడు కామన్‌సెన్స్ పనిచేయడం మూలంగా పశ్చాత్తాపం చెంది "మనీషా పంచకం" చెప్పాడట! ఆ సందర్భంలోనే గుణ జాతి భేద రహితమైన ఆత్మలో మాయ అనేది బ్రాహ్మణ క్షత్రియాది రూపమైన అహంకారాన్ని కలిగిస్తున్నదని "మాయాపంచకం" చెప్పాడట. కాగా, మాయా వాదం ప్రకారం కూడా వర్ణవ్యత్యాసభావం మాయవల్ల కల్పించబడిందేకాని వాస్తవంకాదు. ఇలా పరివర్తనచెందిన ఈ శంకరుడు సనాతన ఛాందసుల దృష్టిలో క్షంతవ్యుడుకాడు. ఇతణ్ణి బ్రతకనిస్తే తిరిగి వర్ణవ్యవస్థకే ఎసరు పెడతాడని వారు భయపడ్డారు. అందువల్ల శంకర పీఠంలోని ఫస్ట్‌సర్కిల్ వారే అతన్ని హత్యచేసి ఉంటారనడంలో ఆశ్చర్యమేముంది?

గాంధీజీ హిందువుకాడా? గాంధీజీని చంపినవాడు హిందువుకాడా? అన్నేళ్ళు స్వాతంత్ర్యపోరాటం జరిగినా, ఏ తెల్లవాడూ గాంధీజీని చంపడానికి సాహసించలేక పోయాడు. ఈ బ్రహ్మజ్ఞానుల దేశంలో గాంధీజీ హత్య 'మనవాళ్ళ' సత్వరజస్తమో గుణాల్లో దేనికి ఫలితమనుకుందాం? అందువల్ల, ప్రధాన పీఠంలోని అధిష్ఠానవర్గమే హిందూధర్మ సంరక్షణార్థం(!) శంకరుణ్ని హత్యచేసి వుండడంలో వింతలేదు. ఇలాంటిదాన్నే ఇప్పుడు తీవ్రవాద రాజకీయాల్లో అంతశ్శత్రు నిర్మూలనగా సిద్ధాంతీ కరిస్తున్నారు.

అయితే శంకరుని హత్య ఏ గ్రంథంలోనైనా రికార్డయివుఁదా? అనేది ప్రశ్న. గ్రంథాల్లోవున్న ప్రతిదీ నిజంకానవసరం లేదని శంకర చరిత్రలే రుజువు చేస్తున్నై. అన్నింటికీ గ్రంథాధారాలు దొరకడంకూడా సాధ్యంకాదు. గ్రంథాల్లోలేని నిజాలుండడం అసాధ్యమూకాదు. శంకరుణ్ణి ఆయన శిష్యులే హత్యచేశారన్న వార్త కొత్తదేమీకాదు. అది పారంపర్యంగా వస్తున్న జనశ్రుతి అని చాలామంది అద్వైతులకీ తెలుసు. అయినా, గ్రంథాధారాలకోసం పరిశీలన జరపాలి. నిప్పు లేనిదే పొగ రాదంటారు. ఈ పొగ నిప్పు నుంచే పుట్టిందేమో నిదానంగా చూద్దాం.

## అభూతకల్పనలు:

ఒక చారిత్రక సమాచారంలోని నిజానిజాలు కేవలం గ్రంథ ప్రమాణాన్నిబట్టి తేల్చం. శంకరవిజయాలన్నిటిలోనూ ఎన్నో అవకతవకలున్నై. వైరుధ్యాలున్నై. ఆ కథల విషయంలో శంకరపీఠాలమధ్యనే ఏకీభావం లేదు. అన్నిటికంటె ముఖ్యంగా శంకరుడేమైనాడన్న విషయంలో శంకరచరిత్రలమధ్యకానీ, పీఠాలమధ్యకానీ ఏకీభావం లేదు. శంకరుడు మరణించాడా, లేదా? మరణిస్తే ఎలా మరణించాడు? ఎప్పుడు మరణించాడు? ఎక్కడ మరణించాడు? ఎక్కడ పూడ్చారు? సమక్షంలో ఎవరున్నారు? శ్రాద్ధసంస్కారం యెలా జరిగింది? – ఇందులో ఏ ప్రశ్నకీ శంకరపీఠాలవారివద్ద ఒకే సమాధానం లేదు. హత్యచేసినవారు హత్యారహస్యాన్ని దాచడానికి వేయి ప్రయత్నాలు చేస్తారు. అనేక వదంతులు పుట్టిస్తారు. అందుకే ఆయన యెలా "విదేహవిముక్తి" పొందారో, ఎలా కైవల్యం చేరారో స్పష్టంగా అప్పటికీ, యిప్పటికీ వారు చెప్పలేకపోతున్నారు.ఐనప్పుడు, ఆ సందిగ్ధతలో గూడుపుఠాణి వున్నదనీ, శంకరుని హంతకులే ఈ కైవల్య కథలు కల్పించారనీ తీర్మానించుకోవడంలో అసంబద్ధతలేదు.

శంకర పురాణాల్లో చరిత్రకంటే అచరిత్ర యెక్కువవుంది. చరిత్రను పురాణంగా వ్రాయడం మనవారికి అలవాటు. దానికి మతోన్మాదం తోడైతే, అందులోని

చరిత్ర గుర్తులే చెరిగిపోతై. అలా చెరిగిపోయిన శంకరచరిత్రే మనకు దొరికింది. స్తోత్రాలతో బంగారు ఉసిరికాయలు కురిపించడం, భుజాన్ని మథించి నిప్పు పుట్టించడం, కరిగించిన సీసం త్రాగడం, బంగారంచేసే విద్యను నేర్వడం కొబ్బరిచెట్లను వంచే విద్యను నేర్వడం, పరకాయప్రవేశం చేయడం, నర్మదానదిని మట్టిముంతలోపట్టేయడం వంటి మహత్యాల కథలు ఎన్నో చొప్పించారు. వీటికితోడు ఎన్నో అత్యుక్తులు! ఎందుకంటే, నమ్మడం-నమ్మించడం మతవాదుల ధ్యేయాలు. అందువల్ల వారికి సత్యాలను సత్యాలుగా గ్రంథస్థం చేయడం చేతకాదు. ఇందుకు పురాణాలే నిదర్శనం. శైవులు వ్రాసిన పురాణాల్లో శివుణ్ణి అధికుడుగాను, విష్ణువును అధముడుగాను వర్ణించారు. అలాగే వైష్ణవులున్నూ తమ పురాణాల్లో విష్ణువును ఉత్తముడుగాను, శివుణ్ణి భ్రష్టుడుగాను చిత్రించారు. "మీ దేవుడు కపాలాల్లో అడుక్కుతింటాడురా" అని వైష్ణవులు శైవుల్ని హేళనచేస్తే, "మీ దేవుడు పంది అవతారం ఎత్తి నప్పుడు ఏమి తిన్నాడురా" అని శైవులు వైష్ణవుల్ని ఎక్కిరించేవారని ఎక్కడో చదివినట్లు గుర్తు. అంటే మతవాదులు తమలో తాము కలహించుకొంటే, ఏ స్థాయికి దిగిపోతారో ఆ రచనలు అద్దంపడతై. ఆ పురాణాలు చరిత్రలు కావని మనకు తెలుసు. పురాణ పురుషులంతా కాల్పనిక పాత్రలని మనకు తెలుసు. అయినా వాటిని ప్రాతిపదికగా తీసుకొని మతస్థులు ఎన్నో యుద్ధాలు చేశారు. ఎంతో మారణహోమంకల్పించారు.

ఆటవిక జాతీయవాద దశలో మతాలు పుట్టినై. వాటి ఉన్మాదస్థాయిలో అవి పాషండత్వాన్ని (heresy) సహించవు. మాటల్లో సంయమనం, సౌమనస్యం వుండటం వేరు, ఆచరణలో అది ప్రతిబింబించడం వేరు. సాంఘికన్యాయం కోసం కన్నీరు కారుస్తూ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని బోధించే ఆధునిక రాజకీయమతాలే అంతశ్శత్రు నిర్మూలన పేరుతో నిప్పులు కక్కుతూ తమలోని భిన్నశాఖలవారినే నిర్మూలించబూనడం మనం యెరుగుదుం. అందుచేత జ్ఞానోదయం కలిగిన శంకరుణ్ణి అడ్డం తొలగించుకోడానికి వెయ్యి సంవత్సరాలనాటి మత ఛాందసులు అతన్ని హత్యచేయడం అబ్బురం కాదు.

ఇంతకూ శంకరుణ్ణి నాటి శంకరపీఠవాసులే చంపారా, లేదా, అనేది పెద్ద ప్రశ్న కాదు. "శంకరుడు మనీషాపంచకం చెప్పడానికి దారితీసిన కథనం ప్రకారం వర్ణవ్యవస్థ, అస్పృశ్యత దుర్మార్గమైన అంటురోగాలు కావా? అయినప్పుడు, ఇప్పటికీ శంకరపీఠాలు ఆవర్ణవ్యత్యాసాలను ఎందుకు కాపాడు కొంటూ వస్తున్నాయి? అందులోని పరమార్థం యేమిటి" అనేవి ప్రశ్నలు. అలా చేయడం తప్పు అని చెప్పడమే శంకరుడి హత్యను ప్రస్తావించడంలోని తాత్పర్యం. శంకరుణ్ణి హత్య చేశారన్న జనశ్రుతి అబద్ధం

కావడంకంటె, నిజం కావడానికే యెక్కువ అవకాశం వుంది.

## వ్రాతలు-చేతలు

శంకరుడి సిద్ధాంతంకూడా సంకరమైనదే. నిజానికి ఆయన హిందూమత పునర్నిర్మాతేకాని, నవీన సిద్ధాంత కర్తకాదు. మత నిర్మాణానికి హింసే అతని సాధనం కాని, పాండిత్యంకాదు. అతని భాష్యాలు సొంతాలు కావు. అతను మాయావాదంతో పాటు భక్తితత్వాన్నీ, కులతత్వాన్నీ ఒకే సమయంలో సమర్థించుకుంటూ వచ్చినట్లు తెలుస్తుంది. అతని అద్వైతానికీ, మాయావాదానికీ ఉపనిషత్తుల్లోనూ, బౌద్ధంలోనూ, నాగార్జునాదుల శూన్యవాదంలోనూ మాతృకలున్నై. అంతేకాక ఆయన్ని గురించిన కథల్లోనూ, ఆయన రచనల్లోనూ శృంగారపరమైనవీ, వైరాగ్యపరమైనవీ చోటుచేసుకొన్నై. ముందు ఆయన విరాగి(సన్యాసి). అటు తర్వాత భోగి. వ్యభిచారానికి వజ్రోలీయోగాన్ని అడ్డం పెట్టుకొన్న శృంగారయోగి.

మండన మిశ్రుని భార్య సరసవాణిని శారదాస్వరూపమన్నారు. సరస్వతిఅన్నారు. ఆమే శంకరుణ్ణి కామకళాచర్చకు ఆహ్వానించడమేమిటి? అందుకు తయారు కావడానికి ఆమె అతనికి ఆరు నెలలు గడువీయట మేమిటి? శంకరుడామెను వనదుర్గామంత్రంతో బంధించి, శ్రీచక్రంలో ప్రతిష్టించి, కల్పాంతందాకా తన ఆశ్రమంలో వుంచుకోవడమేమిటి? దాన్ని ఇలోప్‌మెంట్ అంటామా, లేక కీపింగ్ అంటామా? ఇలాంటి వాటినే సామాన్యుడు చేస్తే తగులుకెళ్ళాడు, లేపుకెళ్ళాడు అంటాం. రాజు భార్యల్ని రేప్ చేసిన మహానుభావుడు శారదను మరేమి చేశాడనుకుందాం? వీటన్నిటిని బట్టి శారదా శంకరుల సంబంధానికి ఎలా అర్థం చెప్పుకోవాలి? అయితే, వేదాంతజిజ్ఞాసలో ఒకానొక మెట్టు ఎక్కిన తరువాత ఇలాంటివాటి నన్నిటినీ 'ఆ' దృష్టితో చూడకూడదంటారు! అద్వైత ప్రజ్ఞాన స్థాయిలో స్వపర భేదాలు వుండవు! ఒకసారి త్రిపురనేని గోపీచంద్ తాను అరవిందాశ్రమానికి వెళ్ళి వచ్చిన సందర్భాన్ని నాతో ప్రస్తావించినప్పుడు అరవిందుడికీ, ఫ్రెంచ్‌మదర్‌కీ మధ్య వున్న సంబంధం గురించి వారిని నేను ఆరా తీశాను. "మనవంటి వాళ్ళ స్థాయిలో అలాంటి వాటిని పట్టించుకొంటే యెలాగనండి" అన్నారాయన. నిజమే, శంకరుడి విషయంలోకూడా మనం అలానే తీర్మానించుకోవచ్చు. ఆయన్ని గురించి సీరియస్‌గా తీసుకోవలసింది అద్వైతమాయా వాదమే. అది మరొకసారి చూద్దాం.

ఇక శంకరపీఠాలనండి, మఠాలనండి-వాటి సంగతికి వస్తే, అందులోనూ తగాదాలున్నై. "కంచి కామకోటి పీఠం కామకళా విలసితమైన శాక్త పీఠమేకాని, శంకర స్వరజ్ఞపీఠంకాదు" అంటారు మిగతావారు. పోగా మిగిలిన శంకర పీఠాలు నాలుగు; 1) జగన్నాధం(పూరి) 2) శృంగేరి 3) ద్వారక 4) బదరి. వీటికి నాలుగింటికీ వేదాల నుంచి మహావాక్యాల పంపిణీ జరిగిందట. అవి: 1.ఋగ్వేదానికి చెందిన ఐతరేయోపనిషత్తునుంచి"ప్రజ్ఞానంబ్రహ్మ". 2. యజుర్వేదీయమైన బృహదారణ్యకోపనిషత్తు నుంచి " అహం బ్రహ్మాస్మి". 3. సామ వేదాంగమైన చాందోగ్యోపనిషత్తు నుంచి "తత్వమసి". 4. అధర్వణికమైన మాండూక్యోపనిషత్తు నుంచి"అయమాత్మా బ్రహ్మ". కాబట్టి శంకర పీఠాల జపసూత్రాలు కూడా 'వేదాంగాల' నుంచి అరువు తెచ్చుకొన్నవేకాని, శంకరుడి సొంతాలు కావు. ఆయన సొంతమనేది పరమత పండిత సంహరణోద్యమమే. అంతకు ముందటి తాత్విక సంప్రదాయంలో అలాంటి మూకుమ్మడి హత్యలు, మాస్‌మర్డర్స్ వున్నట్లు లేదు.

అద్వైతులు అంతగా గొంతు చించుకొని ఉటంకించే "బ్రహ్మం" కూడా శంకరుడి సొంతం కాదు. ఉపనిషత్ చర్చఅంతా "బ్రహ్మం" మీదుగానే జరిగింది. ఈ బ్రహ్మం కేవలం భారతీయుల సొంత మల్లెకూడా కాదు. చైనావారి "టావో" కూడా మన బ్రహ్మం లాంటిదే. దేన్ని ఎవరుకాపీ కొట్టారనేది ప్రస్తుతాంశం కాదు. గ్రీకులు కూడా ఈ విషయాలు చర్చించారు. కేవలం భాష్యాల సృష్టితో ప్రొద్దుపుచ్చలేదు. పాడిందే పాడటం-గీతాల్లోది కందాల్లోకి, కందాల్లోది వృత్తాల్లోకి మార్చడం మనవాళ్ళ ప్రత్యేకత. మనవాళ్ళు తత్వాన్నీ-శాస్త్రాన్నీ మతంతో కలిపి పిసికి ముద్ద చేశారు. వాటిలో ఒకదాన్నుంచి మరొకదాన్ని విడదీయడం మన వాళ్ళకు యింతవరకు చేతకాలేదు. శంకరుడి తర్కాన్ని, తత్వాన్ని గురించి పొగిడే పండితులకు సమన్వయ జ్ఞానంలేదు. కేవలం భాష్యాలు వ్రాసిన శంకరుడి స్థితే అదయినపుడు, ఆ భాష్యాలకు భాష్యాలు చెప్పుకొనేవారినుంచి అంత కంటే అదనంగా మనమేమి ఆశించగలం?

"ఆది శంకరాచార్య: వ్యక్తిత్వం - తత్వం" పునర్ముద్రణ సందర్భంగా

## మరొక్కమాట :

"అను బంధాలు" లోని రెండు వ్యాసాలు ఏ పరిస్థితుల్లో నేను వ్రాయ వలసి వచ్చిందో వాటికి ముందు 139వ పేజీలో ఒక్కమాట లో సూచించాను. 1981 ఏప్రియల్‌లో "చార్వాక" మాస పత్రికలో "శంకరాచార్యుడి హత్య", 1983 అక్టోబరులో "హేతువాది" మాసపత్రికలో "శంకరాచార్యుడి శీలం" వెలువడ్డాయి.ఆ రెండు వ్యాసాలను కలిపి "శంకరాచార్యుడి హత్య" శీర్షికతో 40 పేజీల చిన్న పుస్తకంగా "హేతువాది వ్యాసవాణి" సీరీస్‌లో 1983 డిశంబరులో ప్రచురించాను. శంకర కథలూ గాథల్లోని కొన్ని వాస్తవాలను, డాంబికాలను, అభూత కల్పనలను గ్రహించడానికి ఆ ప్రచురణ హేతువాద మిత్రులకు సహాయపడింది.

అయితే, దానిపై తీవ్రంగా ప్రతిస్పందించిన శంకర భక్తులు కూడ లేకపోలేదు. అందులో ఒక అచల వేదాంతి నా రచనను తీవ్రంగా నిరసిస్తూ "ఔను, శంకరుడు పరకాయ ప్రవేశం చేసిన మాట నిజమే. రాజు భార్యలతో కామ కార్యకలాపాల్లో మునిగి తేలినమాట నిజమే. అయితే ఏమిటట? ఇప్పుడా విషయాన్ని వెంకటాద్రిగారు తడవడమెందుకట?" అన్నాడని మా మిత్రుల భోగట్టా.

అలాగే గుంటూరునుంచి ఓ అడ్వకేట్ నాకు లేఖ వ్రాస్తూ శంకరుణ్ణి నెత్తికెత్తుకొని మోయడానికి విఫల ప్రయత్నంచేశాడు. ఆ లేఖకు నేను వ్రాసిన సమాధానంతో ఆయన సద్దుమణిగాడు. చాలామంది శంకర భక్తులు తమలో తాము గొణుక్కున్నారు తప్ప, నా వ్యాసాలపై విమర్శ వ్రాయడినికి సాహసించినవారులేరు.

కాగా, 1987లో "జగత్ సత్యం - బ్రహ్మ మిధ్య"అనే గ్రంధమొకటి వెలువడింది. రచయిత గుత్తారాధాకృష్ణమూర్తి, పరిచయకర్త ఎన్.వి. బ్రహ్మం. అందులో వారు శంకరుడిపై నావిమర్శలను ఎత్తిపొడుస్తూ, "ఓ కొత్త శంకరాచార్యుణ్ని" కనుగోడానికి ప్రయత్నించారు. శంకరుడిలో ఇతరులకెవ్వరికీ అందని గుణాలను ఇన్వెంట్ చేయడానికి రచయితలు విఫల ప్రయత్నంచేశారు. ఆ ఇన్వెన్షన్ యత్నంలో వారు ఎలాంటి భ్రమ ప్రమాదాలకు గురైనారో చూపడానికే ఆనాడు నేను "ఆది శంకరాచార్య-వ్యక్తిత్వం-తత్వం" ఏ పాటిదో చర్చించవలసి వచ్చింది.

శంకరుడి అనంతరమతాచార్యులతన్ని ప్రచ్ఛన్న బౌద్ధుడనీ, నాస్తికుడనీ నిందించారు. హేతువాదులుగా బయలుదేరిన పై గ్రంధ రచయితలు ఆ మతాచార్యుల వరవడినే అనుసరించి శంకరుడిలో ప్రత్యక్ష నాస్తికత్వాన్ని చూపడానికి ప్రయత్నించడం దారుణం.

అందునా, శంకరాచార్యుడు పదార్థవాది, భౌతికవాది, నాస్తికుడు అని రుజువుచేయడానికి యత్నించడమే కాక, అతనికి సర్వసమతావాది, సాంఘిక విప్లవకారుడు అనే బిరుదులుతగిలించి వందించడం మరింత దారుణం. శంకరుడు "బ్రహ్మసత్యం – జగన్మిథ్య" అంటే, దాన్ని తలక్రిందులుచేసి రచయిత తన పుస్తక శీర్షికను "జగత్తు సత్యం–బ్రహ్మమిథ్య" అని మార్చారు. అంతమాత్రాన శంకరతత్వం రంగుమారుతుందా? అతను జగత్ సత్యవాది అవుతాడా?

గుత్తావారు తాను నాస్తికుడినన్నారు. అంతేకాదు, తాను భౌతికవాదిననడానికి గుర్తుగా తనపేరుకుముందు "భౌతికహిత అనే బిరుదును అతికించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం (IRA & RA ) నుంచి చీలిన హేతువాద సంఘానికి 1987 నుంచి 2002 వరకు అధ్యక్షులుగా కూడా ఆయన వ్యవహరించారు. ఐనా, ఆ సంఘంలోని ఏ ఒక్కరూ ఆయన శంకరవాదానికి అభ్యంతరం చెప్పినట్లు దాఖలాలేదు. "వెంకటాద్రిగారికి శంకరాచార్యుడి అద్వైత నాస్తికం అర్థంకాలేదని తమతరగతుల్లో ఆయన మాట్లాడుతుంటే, అదేమని నిలదీసినవారు "ఆ హేతువాద సంఘంలో" లేనట్లున్నారు. ఉంటే గింటే, "ఆది శంకరాచార్య : వ్యక్తిత్వం – తత్వం"లో నేను పట్టి చూపినదానికి సమాధానంగా ఆ సంఘంనుంచి బయటపడేవారు. కానీ, అలా జరగలేదు. మార్క్సిజాన్ని, గతితార్కిక భౌతికవాదాన్ని ప్రాతిపదికగా చేసుకొని భారత హేతువాద సంఘంనుంచి చీలామన్నవారు శంకరుడు ప్రచారంచేసిన అద్వైతాన్ని, గతితార్కిక భౌతికవాదంగా, నాస్తికత్వంగా గుర్తించారేమో! అందుకే, శంకరుడి చరిత్రనీ, తత్వాన్నీ కొంతలో కొంతయినా సమగ్రంగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఫలితమే ఈ రచన.

ఈ రచనను చాలామంది ఆహ్వానించారు, అభినందించారుకాని, విమర్శలింతవరకు ఎదురు కాలేదు. తమాషా ఏమిటంటే, మెచ్చుకున్నవారిలో ఒక అద్వైతపండితులు కూడా ఉన్నారు. ఆయన గుడివాడలో ఒక సీనియర్ అడ్వకేట్. ఆయన నాకొక పెద్ద సుహృల్లేఖ వ్రాస్తూ 'ఆది శంకరాచార్య వ్యక్తిత్వం, తత్వం' గురించి లోతుగా పరిశీలించినందుకు నన్ను అభినందించారు. నన్ను చూడాలనీ, నాతో మాట్లాడాలనీ అభిలషించారు. అదే ఆకాంక్షను మా మిత్రులు అర్జునరావుగారి ద్వారా నాలుగైదుసార్లు నాకు తెలియజేశారు. చివరకు 1999లో గుడివాడ కవిరాజు కళామందిరంలో నాకు సన్మానం జరిగినప్పుడు ఆ సభకు ఆయన కూడా హాజరయ్యారు. అప్పుడాయన వయస్సు 92 యేళ్ళు. సభానంతరం ఆయన కోరిక మేరకు మేమొక గదిలో కలిశాం. సంభాషణను వారేముందు ప్రారంభిస్తూ "భావం ముందా, పదార్థం ముందా? ఏదిముందంటారు?" అని ప్రశ్నించారు.

"మీరు పెద్దవారు. బాగా చదువుకున్నవారు. పరిణామ వాదాన్ని మీరు ఆమోదిస్తారు కదా?" అన్న నా ప్రశ్నకు సమాధానంగా ఆయన "ఆమోదిస్తా"మన్నారు. దానిపై నేనిలా వివరించాను!

"ఆద్యంతాలులేని ఈ జగత్తంతా నిత్య పరిణామంలో వుందికదా? ఆ పరిణామంలో ఒకానొకదశలో భూమి అనే ఈ చిన్ని గ్రహంమీద జీవం ఉత్పన్నమైంది. ఇంత విశాల విశ్వంలో మరెక్కడా జీవం వున్నట్లు ఇంతవరకు దాఖలాలేదు. కాగా, జీవపరిణామంలో ఒకానొకదశలో మానవుడవతరించాడు. మెదడులేని జీవులున్నప్పటికీ, ఉన్నతస్థాయికి ఎదిగినమెదడు మనిషికి లభించింది. మెదడు పదార్థమే. ఆ మెదడుయొక్క ఆవేశమే (CHARGE) మనస్సు. పరిసరాల స్పర్శవల్ల మానవుడి జ్ఞానేంద్రియాలు స్పందిస్తాయి. ఆ స్పందన మెదడుకు చేరడంవల్ల జ్ఞానంవస్తుంది. ఆ జ్ఞానం భావాలను అల్లికవేస్తుంది. ఇదంతా ఒక క్రమంలో జరుగుతున్నట్లు ఆధునిక విజ్ఞానం చెపుతుంది. కాగా, మనిషి అవతరణ తరవాత బయలుదేరిన భావాలు పదార్థానికి ముందెలా వుంటాయి? ఈ విశాల జగత్తంతా ద్రవ్యమయం. విశ్వంతో పోలిస్తే భూమి క్షుద్రరేణువు. దీనిమీద అవతరించిన జీవులూ పదార్థమే. పదార్థరహితంగా జీవమెక్కడాలేదు. మనిషీ, అతని మెదడూ పదార్థమే. మెదడు లేకుండా భావోత్పత్తి జరగదు. అంటే, పదార్థం ముందు, ఆ తరువాత భావాలు. అయితే, ఇక్కడ ఒక విశేషముంది. పదార్థ లక్షణాలు, స్వభావాలు, ప్రవృత్తులు పదార్థానికి విడిగా వుండవు. భావాలు మెదడు అనే పదార్థంయొక్క ప్రవృత్తి (FUNCTION). భావాలను పదార్థంనుంచి విడదీయడానికి వీలులేదు. అందువల్ల భావంముదా, పదార్థంముందా? అనే ప్రశ్న తలెత్తదు. ఒకానొకప్పుడు జిజ్ఞాసువులనండి, తాత్వికులనండి, వారు పదార్థంనుంచి చైతన్యాన్ని విడదీసి, "సత్తుముందా, చిత్తుముందా"? అని చర్చించినమాట నిజమే. ఈనాడు చిత్తును సత్తునుంచి వేరుచేసి చూడవలసిన అవసరంలేదు. ఇది అద్వైతంకాదు-ఏకత్వవాదం. ఉన్నదంతా పదార్థమే. మనకు కనిపించే వైవిధ్యమంతా దాన్నే ఆశ్రయించివుంది."

ఆ పెద్దాయన మరి మాటాడలేదు. నామాటలవల్ల ఆయన అద్వైతం సందిగ్ధంలో పడినట్లనిపించింది.

ఒకప్పటికి, ఇప్పటికి మానవ సమాజమెంతో మారుతూవచ్చింది. అనేక వ్యవస్థలు, సంస్థలు, సమస్యలు పుట్టుకొచ్చాయి. హేతుబద్ధ అన్వయంతో, నైతిక దృక్పథంతో, మానవతాస్పందనతో వాటినన్నిటిని సరిదిద్దుకోవలసివుంది. ఇన్నేళ్ళుగానూ ఆపని కొంతలోకొంత జరుగుతున్నా, అది సక్రమంగాజరగలేదు. నాగరికత మారుతోందికాని, సంస్కృతి తగినంతగా మారడంలేదు.

నిజానికి, ఈ దేశంలో రెండు వందలయేండ్లకు పూర్వమే హేతువాద మౌలిక సిద్ధాంత పునాదులు, తాత్విక పునాదులు పడ్డాయి.అవి ఆనాడే భౌతికవాద చింతనకు రూపుతొడిగాయి. వైదికాన్ని ఎదిరించిన చార్వాకజైన బౌద్ధాది శాఖలను మినహాయించినా, వైదికంపట్ల ఉదాసీనవైఖరి అవలంబించిన న్యాయవైశేషిక సాంఖ్యదర్శనాలలోసైతం భౌతికవాద వాసనలను మనం గమనించవచ్చు. అయితే, వాటిలోనూ శంకరుడు దేన్నీవదలలేదు. వాటన్నిటిని మడతబెట్టి ఖండించాడు. "స్వప్నమాయేయ థాదృష్టే.........తథా విశ్వమిదం దృష్టం" అన్నాడు. ఈ వాస్తవిక విశ్వమంతా స్వప్నంలాంటిదని, మాయఅని వాదించిన శంకరుణ్ణి భౌతికవాదిగానో, నాస్తికుడిగానో, హేతువాదిగానో ఎలా పరిగణించగలం?.

ఇలలోని వస్తువులు మాత్రమే కలలో కూడా దర్శనమిస్తాయని తెలియని శంకరుడు మిథ్యావాది కాదనడం ఎలాకుదురుతుంది? ఇలలోని వస్తువులకు ప్రతి బింబాలే కలలోని వస్తువులు. కాకపోతే, అవి తరచు వికారంగా వస్తాయి.

హేతువాదమంటే, ఒకమట్టంలో కార్యకారణవాదమే. "కారణమతిద్రవ్యే కార్యసమవాయాత్" అన్నది వైశేషికం. కారణ కార్యాలు ద్రవ్యాశ్రితాలు. అవి ద్రవ్య పరిణామంలోని దశభేదాలే తప్ప అన్యంకావు. కాన, అవి ద్రవ్యంలోపలివే కాని, వెలుపలివికావు. వాటికి మూలం ద్రవ్య అంతర్గత పరిణామం. కారణ కార్యాలు ద్రవ్యపరిణామంలోనిపూర్వోత్తర దశలే. అవి ద్రవ్యానికి, ఈ లోకానికి సంబధించినవే. ఇదే కార్యకారణతకు విజ్ఞులు అర్థంచేసుకోదగినభాష్యం. కాగా, పదార్థ ఉనికిని గుర్తించని శంకరాచార్యుడు కార్యకారణవాది(హేతువాది) ఎలాకాగలడు? అతన్ని ఆమోదించేవారు హేతువాదులెలాకాగలరు? పదార్థమున్నదనే భ్రమను మాయా కల్పితమైన భావమే కల్పిస్తున్నదన్న శంకరుడు భౌతికవాది ఎలాకాగలడు? అతన్ని నెత్తికెత్తుకొని మోసేవారు భౌతికవాదులెలాకాగలరు?

ఉనికి- పరిణతులు అభిన్నం. ఉనికి లేని పరిణతీ, పరిణతిలేని ఉనికీ అచింత్యాలు, అనూహ్యాలు. చిత్తు ఒక్కటే సత్యమూ, నిత్యమూ అనీ, సత్తు మిధ్య అనీ వాదించిన శంకరుడు నాస్తికుడెలా కాగలడు? ఆవాదాన్ని ఆమోదించేవారు నాస్తికులెలాకాగలరు? కనిపించేదంతా మిధ్య అని భావించేవాడు ఏనాడైనా నాస్తికుడుగా పరిగణించబడిన చరిత్ర ఉందా?

కార్యకారణాలు భౌతిక జగత్తుకు సంబంధించినవి. సంఘటనల పరోక్షంలో కార్యకారణాలుండవు. అందువల్ల, జగత్సంఘటనలకు మూలం(కారణం) భావం

అనుకోడానికి వీలులేదు. మనిషిలేకున్నా, అతని భావజాలం లేకున్నా, సంఘటనలు అవిరతంగా జరుగుతూనే వుంటాయి. అందువల్ల, పదార్థం ముందా, భావంముందా? అనే సమస్య తలెత్తదు. ఉన్నది పదార్థమొక్కటే. దాని ప్రవృత్తుల్లో భావంకూడా ఒకటి. పరిణామంలో మనిషి అవతరణ తరవాతనే భావాలకు ఉనికి వచ్చింది.

ఈ విషయాలను ఈ విధంగా ఏ ద్వైతీ, ఏ అద్వైతీ, ఏ విశిష్టాద్వైతీ అర్థం చేసుకోలేదు. వారికావిధంగా అర్థంకానూలేదు. దార్శనికుల తరవాత పది పన్నెండు వందలయేళ్ళకు వచ్చిన మతాచార్యులకు దార్శనికులరీతి అర్థంకాకనే వారిని ఖండించారు. వారు వ్యాఖ్యానకారులు తప్ప, మౌలికచింతనాపరులు కాకపోవడమే అందుకు కారణం. అలాంటి వారిలో మొదటి మతాచార్యుడు శంకరుడు. కాగా, ఆ శంకరాచార్యుణ్ణి భౌతికవాదిగా, నాస్తికుడుగా వర్ణించడానికి ప్రయత్నించేవారిలో మత వాసన తప్ప, హేతువాదరీతి ఎలా ఉంటుంది?

నాస్తికతసంగతి అటుంచితే, శంకరుడు అద్వైతికూడాకాదు, అతనిది ద్వంద్వవ్యక్తిత్వం. ఆయన వ్రాసిన భాష్యాల్లో ఎగుడుదిగుళ్ళున్నా, మొత్తంమీద అతను సైద్ధాంతికంగా అద్వైతాన్నే పోషించినట్లు పైకి కనిపిస్తాడు. కాగా, ఆచరణలో మాత్రం కల్తీలేని మతవాదిగా, దేవతారాధకుడుగా, దేవాలయోద్ధారకుడుగా, దేవతా విగ్రహ ప్రతిష్టాపకుడుగా, వర్ణ వ్యవస్థ పోషకుడుగా, భౌతికవాద విధ్వంసకుడుగా నగ్నంగా దర్శనమిస్తాడు. అగ్రవర్ణపక్షపాతం, శూద్రనింద అతని భాష్యాల్లో నిర్ద్వంద్వంగా చోటు చేసుకుంది. ఈ రెండు నాలుకల ధోరణి హిందూమత వారసత్వమే.

ఈ నాటి మఠాధిపతులు, పీఠాధిపతులు, సనాతనఛాందసులు, భగవతీ భగవాన్ల వేషగాళ్ళు– అందరూ ఆ బాణీనే అనుసరిస్తారు. వారిలో వారికి ఎన్నితేడాలున్నా, హిందూ వర్ణవ్యవస్థపట్ల, కులవ్యవస్థ పట్ల వారివారి అంతరంగాల్లో ఏకీభావంవుంది. ఆత్మవంచనతో పైపై మెరుగులు పూసి ఎన్నిధర్మోపన్యాసాలు చేసినా, మనుషుల మధ్య ఉచ్చనీచ తారతమ్యాలను పరిగణించని హిందూమత గురువులుండరు. ఆ తారతమ్యాలను సమర్థించని హిందూమత గ్రంథమేదీలేదు. ఈ వైఖరే హిందూమత సంస్కృతీ, వారసత్వమూ. ఇదే హిందువుల ఆధ్యాత్మికత. ఫలితంగా, హిందూ సమాజం మనుషుల సమాజంగాకాక, కుల సంఘాలబందెలదొడ్డిగా తీరి కూర్చుంది. విదేశాలకు వెళ్ళి స్థిరనివాసంయేర్పరచుకున్న హిందువుల్లోసైతం ఈ కులమతాల జాడ్యం అంతర్నిహితంగా పనిచేస్తూనేవుంది.

ఈ దేశంలో ఇంతకు ముందెన్నడూ కులవ్యతిరేకోద్యమాలు ప్రారంభం కాలేదు,

పాదుకోనూలేదు. హిందూమత వ్యతిరేకోద్యమాలు మొదలుకాలేదు. కుదురుకోనూలేదు. జ్ఞానవికాసోద్యమాలు నాంది పలకలేదు, కొనసాగనూలేదు. ఫలితంగా, స్వరాజ్యానంతర భారతదేశంలో రాజకీయాలు హిందూ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని, కులాల పరమైనాయి, మతశాఖల పరమైనాయి. అవి మనుషులపరంకావలసిన దిశలో స్వరాజ్యపోరాటం సాగలేదు. అప్పుడప్పుడే తలెత్తుతున్న హిందూమత సంస్కరణోద్యమాలనుసైతం స్వరాజ్యపోరాటం మ్రింగివేసింది. ఫలితంగా, స్వరాజ్యలబ్ధి అనంతరం హిందూమతోద్ధరణోద్యమాలు, కుల సంఘాల ఉద్యమాలు కదనుత్రొక్కడం ఆరంభించాయి. మతపీఠాలు వీధులకెక్కి నంగనాచి బోధలు చేస్తున్నాయి. ప్రధమాచార్యుడు శంకరుడు స్థాపించిన నాలుగు మఠాల్లో ఒక్కటయినా వర్ణవ్యవస్థను తిరస్కరించగలదా? మానవ సమతను సమర్థించగలదా? లేదు. ఎందుకంటే, శంకరమఠాలన్నీ వర్ణవ్యవస్థకు కాపలాకుక్కలు.

శంకరుడు ప్రస్థానత్రయానికి భాష్యాలు వ్రాశాడని ప్రతీతి. ప్రస్థానత్రయమంటే బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీత. శంకరుణ్ని నెత్తినెత్తుకొని మోస్తున్న ప్రచ్ఛన్న శాంకరులు ఆమూడు భాష్యాలను, వాటి మూలగ్రంధాలను హేతువాద, నాస్తిక, భౌతిక వాదాల పరమైనవిగా నిజంగానే నమ్ముతున్నారా? నమ్మితే, వారు హిందూ మతవాదులవతారుకాని, నాస్తికులలెలా కాగలరు? కావాలని చేసే కృతక విమర్శలు–సమర్ధనలు హేతువాదుల లక్ష్యాలుకావు.

అలాంటి సాహసాలుచేసి, తప్పు నడక నడిచి, ఇతరుల్ని తప్పుదుదారులకు మళ్లించేవారికి గుణపాఠంగా ఉండగలందులకే ఈ గ్రంధంవ్రాయవలసి వచ్చింది. చాలాకాలంగా ఈ పుస్తకం పునర్ముద్రణకాలేదు. ఆసక్తిపరులు దీని ప్రతులు కావాలని కోరుతున్నా, ఇతర ప్రచురణల ఒత్తిడిలో నేటివరకు దీని పునర్ముద్రణ చేపట్టలేకపోయాం. ఇప్పుడు “రావిపూడి రచనలు : సంపుటం –9” గా వెలువడుతోంది.

20–12–2004 **రావిపూడి వెంకటాద్రి,**

చీరాల ఛైర్మన్, భారతహేతువాద సంఘం.

## ఈ పుస్తకంలోని ఇంగ్లీషు కొటేషన్లకు ఛాయానువాదం:

1. (పేజి 33) : శంకరుడికి వర్ణవ్యవస్థ సామర్థ్యం అంతముఖ్యం కాకపోయినా, దాని పట్లనమ్మకానికి అతను చోటిస్తాడు. సంప్రదాయ సిద్ధాంతంప్రకారం ఒకానొక వర్ణంలో పుట్టడం పూర్వజన్మ కర్మఫలితమేకాని, యాదృచ్ఛికంకాదు. అందువల్ల, వేదాధ్యయన ప్రత్యేకహక్కు అగ్రవర్ణాలకు, దేవతలకు, రుషులకు మాత్రమే పరిమితమని శంకరుడు ఆమోదించాడు. ఒకప్రక్క, బ్రాహ్మణీయ జీవన సూత్రాలను అనుసరించేవారంతా వర్ణవ్యవస్థనియమాలను పాటించాలని శంకరుడంటాడు. (డా॥ యస్. రాధాకృష్ణన్)

2. (పేజి 33) : జాతి ఉన్నతమనస్తత్వాన్ని వెలువరించే వర్ణాశ్రమనియమాలను హిందువు అనుసరించితీరాలి. (డా॥ యస్. రాధాకృష్ణన్)

3. (పేజి 56) : క్రీ.శ. 600 ప్రాంతంలో మదురైలో తిరుజ్ఞాన సంబంధియార్ అనే తమిళ బ్రాహ్మడు ఒక్కరోజులో 8000 మంది జైనుల్ని చంపించాడు. ఈ సంఘటనకు గుర్తుగా ఏడాదికొకసారి మధుర మీనాక్షి దేవాలయంలోను, ఇతర దేవాలయాల్లోను ఇప్పటికీ ఉత్సవాలు జరుపుకొంటున్నారు. అవి హిందూమతానికి సంబంధించినవి కావు ( వివేకానంద ), డా రాధాకృష్ణన్ కొట్టిపారేస్తారు. తమిళ బౌద్ధుల్ని, జైనుల్ని హత్యచేసిన ప్రక్రియలు, హింసించిన ప్రక్రియలు కంచిలోని వైకుంఠ పెరుమాళ్ దేవాలయంలోని ఉబ్బెత్తుకుడ్యచిత్రాల్లో ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. (ప్రేమనాథ్ బజాజ్)

4. (పేజి 57-58) . శంకరుడి భాష్యాలను అధ్యయనంచేసేటపుడు ఒక విషయాన్ని విస్మరించరాదు : ఆనాటికి బౌద్ధం బాగా తగ్గిపోయినా, మొత్తం మొత్తంగా అది భారతదేశంనుంచి అదృశ్యం కాలేదు. అందువల్ల, పోరాడదగిన బలవచ్ఛక్తిగా, కాచుక్కూర్చున్న ప్రమాదంగా దాన్ని పరిగణించిన బ్రాహ్మలు పూర్తిగా దాన్ని నిర్మూలించాలని గుర్తించారు. అందుకు శంకరుడి వ్రాతలు ప్రముఖంగా తోహదపడ్డాయి. బౌద్ధాన్ని దాని జన్మభూమినుంచి పారద్రోలడానికి చివరిదెబ్బతీయడంలో శంకరాచార్యుడు కృతకృత్యుడయ్యాడు. నాలుగు మరాలరూపంలో ప్రారంభమైన బ్రాహ్మణమత సంస్కరణోద్యమం శక్తివంతంగా పెరిగి, 820లో శంకరుడు మరణించిన తరవాత కూడా కొనసాగి, ఈనాటికీ బ్రతికి ఉంది. (ప్రేమనాథ్ బజాజ్)

5. (పేజి 59) : బౌద్ధం భారతదేశం నుంచి హింసాపూర్వకంగా నిర్మూలించబడిందనేది కట్టుకథ. (డా। రాధాకృష్ణన్)

6. (పేజి 73) : వేలాదిసంపుటాల్లో ఏమి బోధించబడిందో నేను ఒక్క పాదంలో చెపుతాను: " బ్రహ్మం సత్యం, ప్రపంచం మిధ్య, ఆత్మే బ్రహ్మం,అన్యంనాస్తి." "పొందేదేమీలేదు, భోగించేదేమీలేదు, బ్రహ్మంతప్ప తెలుసుకొనేదేమీలేదు, బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడే బ్రహ్మం" (మాక్సుముల్లర్).

7.(పేజి 101) :ప్రపంచ ఉనికి నిజంకాదనీ, అదిమాయేకాని, వాస్తవంకాదనీ,హిందూ జిజ్ఞాసువుల్లో స్పష్టంగా, బహుశా మొదటి సారిగా, చెప్పినవాడు గౌడపాదుడు. ఉపనిషత్తులపై, బ్రహ్మసూత్రాలపై విస్తృత భాష్యాలు వ్రాసిన శంకరుడు దాన్ని విపులీకరించాడు.

అలాచేయడంలో మాయావాదాన్ని విశదీకరించడం తప్ప, ఆయన మరేమీచేయలేదు. (దాస్ గుప్తా).

8.(పేజి 102) : శంకరుడిలో హేతుత్వానికి (వివేకానికి) ఏనాడూ ప్రధానస్థానంలేదు. శ్రుతుల్ని ఉపనిషత్తుల్ని సరిగా అర్థంచేసుకోడానికి ద్వితీయ సాధనంగా మాత్రమే దాన్ని ఆయన పరిగణించాడు. శంకరుడు గౌడపాదుడి నిర్ణయాలను ఆమోదించాడు కాని, ఆయన సిద్ధాంతాలను రుజువు చేయడానికి తగిన తర్కాన్ని వృద్ధిచేయలేకపోయాడు. "ప్రపంచం మాయ" అని రుజువుచేయడానికి ఆయన ప్రయత్నించలేదు. దాన్ని అవివాదస్పదమైనదిగా ఆమోదించాడు. (దాస్ గుప్తా).

9.(పేజి 109) : సార్వకాలిక, సర్వోన్నత ఆస్తికుల్లో శంకరుడు కూడా లెక్కలోకి వస్తాడు. కాని, సామాజికంగా అతను అత్యంత విపత్కరమైనవాడు. భారత చరిత్రలో చీకటి అధ్యాయానికీ, దౌర్భాగ్యానికీ మూలమైన విప్లవ ప్రతీఘాతకు అతను సిద్ధాంత కర్త. ఆయన బౌద్ధానికి శ్రాద్ధం పెట్టాడు. ఆ శ్రాద్ధక్రతువు అనంతరం భారత చరిత్ర గిడసబారి పోయి,అనంతరం చాలాకాలం వరకు విప్లవశక్తి ఆవిర్భావాన్ని అడ్డుకొంది.(ఎం.ఎన్.రాయ్)

10.(పేజి119) :శంకరుడి పాండిత్యంతో బ్రాహ్మణీయ ప్రతీఘాతకత్వం మరోసారి నిలదొక్కుకొని మానసిక చైతన్య ప్రగతిని జయప్రదంగా అణచివేసింది. ఫలితంగా, ఇక పునరుజ్జీవింపజేయువలసిన అవసరంలేనంతగా, ప్రాచీన విముక్తికరయోజన అలస్యమైంది.(ఎం.ఎన్.రాయ్).

11.(పేజి124) : ఈ రోజుల్లో బౌద్ధాన్ని గురించీ, బౌద్ధ అజ్ఞేయవాదాన్ని గురించీ మాట్లాడటం, ముఖ్యంగా దక్షిణాదిన, ఫ్యాషనైంది. ఈనాడు మనం అనుభవిస్తున్న దుర్గతికి మూలం బౌద్ధమేనన్న విషయాన్ని వారు కలలోనైనా పట్టించుకోరు.(వివేకానంద),

12.(పేజి124) : అహింసా బోధద్వారా బుద్ధుడు హిందూసమాజాన్ని బలహీనపరచాడనే ఆరోపణ తరుచు వినిపిస్తుంది. అదితప్పు. హిందూసమాజ ఓటమికీ, క్షీణతకూ బాధ్యత వహించవలసింది బ్రాహ్మణీయచతుర్వర్ణ సిద్ధాంతమే. అంటరానివారుగా, నీడపారరాని వారుగా, చూడరాని వారుగా మనుషుల్ని పరిగణించిన సమాజం ఒక్క భారతదేశంలో తప్ప, ప్రపంచంలో మరెక్కడయినా వుందా?(డి.డి.కోశాంబి).

13.(పేజి124) : మీరంతా మూఢనమ్మకాల బరిలో అవివేకులయ్యే దాని కంటె, నాస్తికులు కావడం మేలు, ఎందుకంటె నాస్తికుడికి విషయాలు తెలుసు, అతని నుంచి ఏదోకొంత నేర్చుకోవచ్చు.(వివేకానంద).

14.(పేజి 126) : ఇటీవల పెరుగుతున్న మతపునరుజ్జీవనోద్యమం దురుద్దేశపూరితం. నిజానికది చాల ప్రమాదకరమైంది.(ఎం.ఎన్.రాయ్).

15 (పేజి139) : పాషండుల్ని దహించడం క్రైస్తవం మానుకున్నది అది తప్పు అనే ఉద్దేశంతోకాదు. ఆ విధంగా మాడ్చి మసిచేయడాన్ని ఎదుర్కోగలిగినంత బలంగా తామున్నామని పాషండులు తెలియజేయడం వల్లనే ఆ విధానానికి అదిస్వస్తి చెప్పింది.(చాప్‌మన్ కోహెన్).

...రయ్య
A/C. 93446.....
...బౌలి, హైదరాబాద్-500032



## రావిపూడి వెంకటాద్రి

జననం 9 ఫిబ్రవరి 1922, ప్రకాశం జిల్లా, ఇంకొల్లు మండలం, నాగండ్ల గ్రామంలో; అక్కడే మిత్రులతో కలసి 5 ఏప్రియల్ 1943న కవిరాజాశ్రమం స్థాపించి, హేతువాద భావవ్యాప్తికోసం కృషి చేశారు. 1945లో ఎమ్.ఎన్.రాయ్ భావాలతో ప్రభావితమై, రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో చేరారు. 1948 నుండి రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమంలో కొనసాగుతున్నారు. 1949లో భారత హేతువాదసంఘ స్థాపన నాటి నుండి దానితో సంబంధ బాంధవ్యాలు కలిగివున్నారు. 1979లో ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘ స్థాపననాటినుంచి 1989వరకు ఆ సంఘ అధ్యక్షపదవిలో పనిచేశారు. 1985నుంచి భారతహేతువాదసంఘ ఉపాధ్యక్షులుగాను, 1989నుంచి 2002వరకు అధ్యక్షులుగాను కొనసాగారు. 1993-94లో, మరల 1996నుంచి ఆంధ్రప్రదేశ్ రాడికల్ హ్యూమనిస్టు సంఘ అధ్యక్షులుగా వున్నారు. 1946నుండి శాస్త్రీయ తాత్విక విషయాలపై అధ్యయనం, గ్రంథరచన, వ్యాసరచన ప్రారంభించి శాస్త్రం - మతం, హేతువాదం - నాస్తికత్వం, మార్క్సిజం - హ్యూమనిజం సంబంధిత విషయాలపై ఆలోచన ప్రేరేపించగల గ్రంథాలు 70 దాకా రచించి, కవిరాజాశ్రమం నుంచీ, హేమా పబ్లికేషన్స్ నుంచీ ప్రచురించారు. ఆరు దశాబ్దాల పైకాలం నుంచి రాజీయెరుగని హేతువాదిగా, భౌతికవాదిగా, మానవవాదిగా సాహిత్యం ద్వారా, ప్రసంగాల ద్వారా, అధ్యయన శిబిరాలద్వారా అవిరామకృషి చేస్తున్నారు. సాహిత్యం ద్వారా హేతువాద వ్యాప్తికి కృషిచేసినందుకు 1988లో కవిరాజు త్రిపురనేని అవార్డు, 1992లో తాపీధర్మారావు అవార్డు హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు. 1993లో వివిధ సాంస్కృతిక సంస్థల ఆహ్వానంపై రెండు నెలలపాటు అమెరికాలో పర్యటించారు. 1996 జనవరిలో చీరాలలో అన్నం సత్యనారాయణట్రస్టునుండి "మంచి హ్యూమనిస్టు" అవార్డునూ, హేతువాద,మానవవాదాల అభివృద్ధికి జీవితకాల కృషిచేసినందుకు 1996 ఫిబ్రవరిలో కవిరాజు త్రిపురనేని ట్రస్టునుండి ప్రతిష్ఠాత్మకమైన కవిరాజు త్రిపురనేని జాతీయఅవార్డునూ,అనేక సత్కారాలనూ అందుకున్నారు. 1982 నుండి "హేతువాది" మాసపత్రికకు సంపాదకత్వం, యాజమాన్యం వహిస్తూ, హేతువాద తాత్విక పునాదులను పటిష్టంచేస్తున్నారు. జ్ఞానపునర్వికాసోద్యమంద్వారా సమగ్ర భావ విప్లవంకోసం, తద్వారా నవ్యమానవ సమాజ నిర్మాణంకోసం కృషి చేయడం జీవితలక్ష్యం.